


మనసులో

# మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక






ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 193: గురువారం 12 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు25:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్




# సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

## క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యల ఆకళింపు

- 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు
- ఉగాదికి 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు
- రానున్న కాలంలో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గించేలా చర్యలు
- సౌర వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి

**కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**




**అమరావతి, మార్చి 11:** సంక్షేమం, అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. అధికారులు-ప్రజాప్రతినిధుల కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా 10 సూత్రాల అమలు తీసుకొచ్చాం. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా అమలు చేయాలన్నారు.


మిగతా 2 లో


# స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం



- లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్
- పార్లమెంటరీ రాజకీయాల్లో ఇదో దురదృష్టకరమైన ఘటన అని వ్యాఖ్యలు

లోక్‌సభలో స్పీకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజు వాణి ఓటుతో వీగిపోయింది. అయితే ఈ ఓటింగ్ కు ముందు అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు తీవ్రస్థాయిలో విమర్శ లు గుప్పించుకున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమి త్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో రా హుల్ గాంధీ మోదీని కౌగిలించుకుని, తరువాత కన్ను గీటడం లాంటి చర్యలను గుర్తుచేశారు. హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. లోక్‌సభను జగదాంబికా పాల్ రేపటికి వాయిదా వేశారు.


4




వివేకా హత్య కేసులో

# సుప్రీం విచారణ

### అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్ల తిరస్కరణ

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డితో పాటు ఇతర నిందితుల బెయిల్ రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు బుధవారం తిరస్కరించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం ఈ మేరకు తీర్పునిస్తూ, కేసు దర్యాప్తునకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది.


.. వివరాలు 2లో





అమెరికా ఆర్థిక సంస్థలపై

# దాడులు చేస్తాం

- ఇరాన్ సంచలన హెచ్చరిక
- టెక్ దిగ్గజాలపై దాడులకు సిద్ధమంటూ ప్రకటన
- గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలకు వార్నింగ్
- టెహ్రాన్ బ్యాంకుపై ఇజ్రాయెల్ దాడికి ప్రతికారం
- హోర్ముజ్ జలసంధి మూసివేతతో భారత్‌కు చమురు సెగ


4




పశ్చిమాసియా యుద్ధంపై

# రాజకీయాలా

వామపక్షాల తీరుపై మోదీ మండిపాటు


4




అమరావతిలో భారీ

# అగ్నిప్రమాదం

ఎల్‌అండ్‌టీ స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం

అగ్నిప్రమాదంపై హోంమంత్రి విచారణ

రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్‌అండ్‌టీ స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి.


.. వివరాలు 2లో






2


మహిళా సమస్యల పరిష్కారం కోసం

# జన్ సున్వాయ్

వేగంగా, పారదర్శకంగా సమస్యల పరిష్కారానికి చొరవ

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

తిరుమలపై తాడేపల్లి

# అనకొండలు

**భానుప్రకాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

- మాజీ టీటీడీ ఛైర్మన్ భూమనకు సవాల్..
- కాణిపాకంలో ప్రమాణం చేస్తావా?
- శ్రీవారి హుండీ కానుకలపై కుట్రలు..
- పాత ఘటనలపై దుష్ప్రచారం



తిరుమల శ్రీవారి ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని టీటీడీ పాలకమండలి సభ్యుడు, బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఆంధ్రాను అప్పుల కూపంలో

# ముంచేసారు

- ఆదాయం తగ్గింది.. అప్పులు అమాంతం పెరిగాయి
- పెట్టుబడుల పేరుతో మభ్యపెడుతున్నారు
- వైఎస్ జగన్ తీవ్ర ధ్వజం
- కాగ్ నివేదికతో వాస్తవాలు వెల్లడి



**అమరావతి, మార్చి 11:** చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైందని, రాష్ట్రాన్ని అప్పులకూపంలో ముంచేసారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆదాయం పడిపోయిందని, అదే సమయంలో అప్పులు అమాంతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు.


మిగతా 2 లో

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక




# మహిళా సమస్యల పరిష్కారం కోసం జన్ సున్వాయ్

## రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

**విజయవాడ, మార్చి 11:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. బుధవారం విజయవాడలోని గోపాల్ రెడ్డి రోడ్డు నందుగల జల వనరుల నిర్వహణ, సమగ్ర రైతు శిక్షణ కేంద్రంలో ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వచ్చిన మహిళల ఫిర్యాదుల విచారణతో పాటు కొత్త ఫిర్యాదులను స్వీకరించి విచారించారు. అనంతరం మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 9వ తేదీన నెల్లూరు జిల్లాలో జన్ సున్వాయ్ కార్యక్రమాన్ని మొదలుపెట్టామన్నారు. ఈనెల 13వ తేదీ విశాఖపట్నంతో జన్ సున్వాయ్ కార్యక్రమం మొదటి దశ పూర్తవుతుందన్నారు. ఇప్పటినుంచి ప్రతి జిల్లాలో మహిళా సమస్యలపై జన్ సున్వాయ్ కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉంటామన్నారు. మహిళా సమస్యల పరిష్కారమే అజెండాగా వేగవంతంగా, పారదర్శకంగా సమస్యలను అధికారులతో కలిసి పరిష్కరిస్తామన్నారు. విచారణ అధికారుల పనితీరుపై బాధితులు అసంతృప్తి చెందితే వారి స్థానంలో మరో అధికారిని నియమించాలని జిల్లా ఎస్పీలకు సూచిస్తామన్నారు. జన్ సున్వాయ్ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని పెండింగ్ కేసుల విచారణ తో పాటు కొత్త కంప్లైంట్‌లు కూడా రావడం ఇందుకు నిదర్శనమన్నారు. మహిళా జన్ సున్వాయ్ లో ఎక్కువగా గృహహింస, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, మోసపూరిత వివాహాలు, డొమెస్టిక్ వైలెన్స్, వంటి కేసులు ఎక్కువగా మహిళా కమిషన్ దృష్టికి వచ్చాయన్నారు. మహిళా సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలబడి పోరాటం చేయటానికి మహిళా కమిషన్ సిద్ధమన్నారు. న్యాయవాదులను పెట్టుకోలేని వారికోసం న్యాయవాదులను నియమించి వారికి న్యాయ సహాయం కూడా చేస్తామన్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేసే ఏ ఒక్కరిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ పూజిత, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డిపిఓ జ్యోతి, ఏసీపీలు వెంకటేశ్వరరావు, ప్రసాదరావు,దుర్గారావులు పాల్గొన్నారు

# తిరుమలపై తాడేపల్లి అనకొండలు

## భానుప్రకాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**తిరుపతి, మార్చి 11:** తిరుమల శ్రీవారి ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని టీటీడీ పాలకమండలి సభ్యుడు, బీజేపీ అధికార ప్రతినిధి భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాడేపల్లి ప్యాలెస్ (ముఖ్యమంత్రి జగన్ నివాసం) ఆదేశాలతోనే ఏడుకొండలపైకి 'అనకొండలను' పంపిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు ఎన్ని అనకొండలు వచ్చినా, సాక్షాత్తూ ఆదిశేషుడి స్వరూపమైన వేంకటేశ్వరుని ముందు అవి తోక ఆడించలేవని భానుప్రకాశ్ రెడ్డి మండిపడ్డారు. 11 నెలల క్రితం జరిగిన ఒక చిన్న ఘటనను ఇప్పుడే జరిగినట్లుగా చిత్రించి మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నానా రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. శ్రీవారి హుండీలో కానుకలు పడకుండా చేసేందుకే వైకాపా ఇలాంటి కుట్రలకు తెరలేపిందని ఆరోపించారు. పరకామణిలో చోరీకి యత్నించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్యను తాము వెంటనే పట్టుకుని జైలుకు పంపామని, బంగారం కూడా రికవరీ చేశామని భానుప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయాన్ని సాక్షి పత్రిక కూడా ఆరోజే ప్రచురించిందని గుర్తు చేశారు. అయితే, భూమన కరుణాకర్ రెడ్డి ఛైర్మన్‌గా ఉన్నప్పుడు (2023, జూన్ 13న) పరకామణిలో దొంగతనం చేసిన రవికుమార్ అనే వ్యక్తి నుంచి విజిలెన్స్ అధికారి శివశంకర్ డబ్బులు వసూలు చేసి వదిలేశారని ఆరోపించారు. ఆ సమయంలో దొంగతో 'చెట్టుకింద పంచాయితీ' చేసి వాటాలు పంచుకున్నది ఎవరు? సాక్ష్యాలను మాయం చేసింది ఎవరు? అని భూమనను ప్రశ్నించారు. టీటీడీలో ఎటువంటి అవినీతి జరగలేదని, తాను తడిబట్టలతో కాణిపాకంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని భానుప్రకాశ్ రెడ్డి ప్రకటించారు. భూమన కరుణాకర్ రెడ్డి కూడా తాను టీటీడీలో కమీషన్లు తీసుకోలేదని ప్రమాణం చేయగలరా? అని సవాల్ విసిరారు. నెయ్యి కొరత ఉందంటూ తిరుమలను టార్గెట్ చేసి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైకాపా ప్రభుత్వం ముద్రించిన భగవద్గీత ముందు మాటలో 'మాట తప్పని.. మడమ తిప్పని' అని రాసుకున్నారని, కానీ కంటెంట్ లేని లక్షల పుస్తకాలు గోదాముల్లో పడి ఉన్నాయని భానుప్రకాశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. టీటీడీపై చేసే రాజకీయ ఆరోపణలకు ఈవో సమాధానం చెప్పాల్సిన పని లేదని, తామే తిప్పికొడతామని స్పష్టం చేశారు. టీటీడీకి ఉన్న విశ్వసనీయతను దెబ్బతీయడానికి తాడేపల్లి ప్యాలెస్ కుట్రలు చేస్తోందని, దీనిని భక్తులు గమనిస్తున్నారని ఆయన అన్నారు.

# వివేకా హత్య కేసులో సుప్రీం విచారణ

## అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్లు తిరస్కరించిన సుప్రీం

**న్యూఢిల్లీ, మార్చి 11:** మాజీ మంత్రి వివేకా హత్య కేసులో సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో మూడో సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు కోర్టుకు సీబీఐ తెలిపింది. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరఫు న్యాయవాది చెప్పారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సునీత తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. దీంతో ఈ కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టును ఆశ్రయించ వచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని ఆదేశించింది. కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు మిగతా వారి బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటీషన్లను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. మూడో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసినట్లు న్యాయస్థానానికి సీబీఐ అధికారులు తెలిపారు. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరపు న్యాయవాది వెల్లడించారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సుప్రీంకోర్టుకు సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వివరించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలు, ఆధారాల కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఛార్జిషీట్ దాఖలు పూర్తి అయినందున నిందితుల బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ జరపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. నిందితుల బెయిల్ రద్దు చేయాలని దర్యాప్తు సంస్థ, సునీత దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. ఈ కేసులో ట్రయల్ త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది.

# సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

మొదటి పేజీ తరువాయి

ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తాం. గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ ఛార్జీల భారం వేస్తే.. మేం ట్రూడౌన్ చేశాం. రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం అని తెలిపారు. మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ పెట్టి ప్రభుత్వ విధానాలపై క్లారిటీ ఇస్తున్నామని తెలిపారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్, గుడ్ గవర్నెన్స్ బ్యాలెన్సింగ్ చాలా అవసరమని చెప్పారు. వర్చువల్, ఫిజికల్ వర్కింగ్ ఈరోజు రీయాలిటీగా మారుతోందని సీఎం అన్నారు. 'పర్వాలేదు' అనే ఉదాసీనత కూడా చేయాల్సిన పనులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. గతంలో విజన్ 2020 పెట్టినప్పుడు చాలామంది విమర్శించారని.. ఇప్పుడు అది ఫలితాన్ని ఇవ్వడంతో 2047వైపు అందరూ చూస్తున్నారని సీఎం అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో నిర్దిష్టమైన టార్గెట్‌లను ఫిక్స్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈసారి 15 పాయింట్లను ఈ ఏడాది లక్ష్యాల కింద ఇస్తున్నట్లు చెప్పారు. 20 నెలల్లో సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని అన్నారు. ఏ సంక్షేమ కార్యక్రమం ఎప్పుడు చేస్తామో ముందే చెబుతామని.. దానికి తగ్గ ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. ఈ నెలలో 13వ 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు సీఎం. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్మును జమ చేస్తుందన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులతో కలిసి 'రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్లామని సీఎం తెలిపారు. ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే ప్రిపరేటరీ వర్క్ చేయాలని సీఎం సూచించారు. మే 15న నీటిని విడుదల చేస్తున్నామని, ఈ సీజన్లో ముందుగానే నీరు ఇస్తామన్నారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు చేయిస్తామని చెప్పారు. దివ్యాంగులకు 'ఇంద్రధనస్సు' పేరుతో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. చరిత్రలోనే తొలిసారి విద్యుత్ రంగంలో ట్రూ డౌన్ చార్జీలను ప్రవేశపెట్టామని.. వినియోగ దారులకు




బెనిఫిట్ వచ్చేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ చార్జీలను 39 పైసలు తగ్గిస్తున్నామని.. తద్వారా వినియోగదారులపై భారం భారీగా తగ్గనుందన్నారు. 6 లక్షల సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని నిర్ణయించామని సీఎం అన్నారు. అయితే ఏడాదిలోనే లక్షా 15వేల మందిని తయారు చేశామన్నారు. ఈ ఏడాది 5 లక్షల మందిని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎస్టోనియా, ఇజ్రాయిల్, సింగపూర్‌లు ఎంట్రపెన్యూర్‌లను తీసుకువచ్చారని.. ఏపీలో కూడా ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పినట్టు అగ్రిటెక్ కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా తేవాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పాదన ఓ సంపాదనా మార్గంగా మారాలని సీఎం చంద్రబాబు అన్నారు. వన్ ఫ్యామిలీ, వన్ ఎంటప్రెన్యూర్ కింద 1.12 లక్షల మంది మహిళా మైక్రో ఎంటప్రెన్యూర్‌లు తయారయ్యారని తెలిపారు. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదామని.. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతీ వ్యవసాయదారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. సమర్థ నీటి నిర్వహణ చాలా కీలకమైన అంశమని.. నీటి భద్రత కోసం చేపట్టిన చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 1.82 మీటర్ల మేర భూగర్భజలాలు గడిచిన రెండు నెలల్లో పెరిగాయన్నారు. మార్చి 1 నాటికి 8.10 మీటర్లలో భూగర్భ జలాలు ఉన్నాయని వెల్లడించారు. 90 రోజుల పాటు ఏప్రిల్ 1 నుంచి జూన్ నెలాఖరు వరకూ నీటి సంరక్షణా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. నో సబ్ మె÷-జ్గ÷న్స్ విధానంలో కాలువల పూడికలు, చెరువుల లింకేజి లాంటి కార్యాచరణ చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 614 టీఎంసీల నీళు రిజర్వాయర్లలో ఉన్నాయని సీఎం అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సాగు సీజన్‌ను ముందుకు తీసుకువచ్చేలా ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. భూగర్భ జలాలు పెరిగితే ప్రభుత్వం ఇస్తున్న రూ.14 వేల కోట్ల విద్యుత్ సబ్సిడీలు భారం తగ్గుతుందన్నారు. వెలిగొండను జూలై నాటికి పూర్తి చేసి నీటిని ఇస్తామని... 30 ఏళ్ల క్రితం తానే శంకుస్థాపన చేశానని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టను 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్యం క్రమంలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కడా భూ వివాదాలు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. పిటిషన్ కల్చర్‌ను తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. వాస్తవాలన్నీ పోర్టల్లో పెడితే వివాదాలు తగ్గుతాయన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కారం కావాలని... అకౌంటబిలిటీ ఫిక్స్ చేయాలని తెలిపారు. భూ వివాదాలు లేకపోతే 70 శాతం సమస్యలు తగ్గుతాయని కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, మంత్రులు పాల్గొన్నారు.

# అమరావతిలో భారీ అగ్నిప్రమాదం

## ఎల్‌అండ్‌టీ స్టాక్ పాయింట్‌లో పైపులు దగ్ధం

## సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

**అమరావతి, మార్చి 11:** రాజధాని ప్రాంతంలో అగ్నిప్రమాదం కలకలం రేపింది. వెలగపూడి ఎన్ 9 జంక్షన్ వద్ద ఉన్న ఎల్‌అండ్‌టీ స్టాక్ పాయింట్‌లో బుధవారం మంటలు చెలరేగాయి. అక్కడ నిల్వ ఉంచిన భారీ పైపులు ఒక్కసారిగా మంటలకు ఆహుతయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆ ప్రాంతం మొత్తం పొగతో కమ్ముకుంది. పెద్ద ఎత్తున పొగలు ఎగసిపడటం గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. భారీ మంటలు ఎగసిపడటంతో అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా చర్యలు చేపట్టారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పైపులు, ఇతర సామగ్రి ఉండటంతో మంటలు అదుపు చేయడం కొంత కష్టంగా మారినట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు అగ్నిప్రమాదం కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్రాథమిక సమాచారం. అయితే భారీగా నిల్వ ఉంచిన పైపులు కాలిపోవడంతో ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేస్తున్నారు. మంటలు ఎలా చెలరేగాయన్నదానిపై అధికారులు విచారణ ప్రారంభించారు. షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణాల వల్ల అగ్నిప్రమాదం జరిగిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా పోలీసులు నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే మోహరించి చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో వెలగపూడి ప్రాంతంలో కొంతసేపు ఆందోళన వాతావరణం నెలకొంది.

### అగ్నిప్రమాదంపై హోంమంత్రి విచారణ

అమరావతిలోని వెలగపూడి అగ్నిప్రమాదం ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేదా కుట్ర కోణం దాగి ఉందా? అనే అంశాలపై విచారణ చేపట్టాలన్నారు. ఘటనాస్థలంలో సమీప పొలం నుంచి మంట వచ్చిందని ఎల్ అండ్ టీ ప్రతినిధులు చెప్పారు. పొలంలో గడ్డి



పేర్చి నిప్పుపెట్టిన ఆనవాళ్లను చూపించారు. అమరావతిలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన మంటలు చెలరేగి ఎల్‌అండ్‌టీ సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు దగ్ధమయ్యాయి. భారీగా మంటలు ఎగసిపడటంతో పరిసరాల్లో దట్టంగా పొగ అలముకొంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. అయితే ఘటనపై అనుమానాలు రావడంతో విచారణకు ఆదేశించారు.

# బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్‌గా ఏవీఎస్ఎస్ఎన్‌రాజు

**అమరావతి, మార్చి 11:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కు ఛైర్మన్‌తో పాటు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్‌గా వెటుకూరి ఏవీఎస్ఎస్ఎన్ రాజు నియమితులయ్యారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులుగా చల్లా మధుసూదన్ రావు, కె.జి. వెంకట పద్మలత, దొని శ్రీనివాస మూర్తి, వుండవల్లి గాంధీ బాబు, మండల గంగా సూర్యనారాయణ, ఎం. భవరాజు పద్మావతిలను ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ ఛైర్మన్, సభ్యులు పదవీ స్వీకరణ చేసిన తేదీ నుంచి మూడు సంవత్సరాల పాటు లేదా ఛైర్మన్‌కు 65 ఏళ్లు, సభ్యులకు 60 ఏళ్లు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారు.

# ఆంధ్రాను అప్పుల కూపంలో ముంచేసారు

మొదటి పేజీ తరువాయి

తాము చెబుతున్న విషయాలనే కాగ్ రిపోర్టు కూడా ధృవీకరించిందని ఆయన స్పష్టం చేశారు. "చంద్రబాబు ప్రభుత్వం అప్పుల విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతోంది. 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం చూపిన అప్పులు రూ. 60,485 కోట్లని చెబితే, కాగ్ రిపోర్టు మాత్రం అదే ఏడాదిలో జరిగిన అప్పులు రూ. 81,071 కోట్లని తేల్చి చెప్పింది. అంటే సుమారు రూ. 20 వేల కోట్ల వ్యత్యాసం ఉంది" అని జగన్ వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రాబడులు రూ. 1,68,024 కోట్లు మాత్రమేనని, ఖర్చులు మాత్రం రూ. 2,49,906 కోట్లకు చేరాయని తెలిపారు. రెవిన్యూ లోటు 56 శాతం పెరిగిందని, ద్రవ్య లోటు 30 శాతం పెరిగిందని విమర్శించారు. నెట్ బారోయింగ్ సీలింగ్ పరిమితిని కూడా దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ ఐదేళ్ల కాలంలో చేసిన అప్పులు కేవలం రూ. 3.31 లక్షల కోట్లు అయితే, ఈ రెండేళ్లలోనే చంద్రబాబు తెచ్చిన మొత్తం అప్పులు రూ. 3.2 లక్షల కోట్లకు చేరాయని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో



విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతి, దోపిడీ కారణంగానే ఆదాయాలు రావడం లేదని జగన్ ఆరోపించారు. "ఇసుక, మట్టి, లిక్కర్, భూములు.. దేన్నీ వదలడం లేదు. చంద్రబాబు అండ్ కో దోచిపెట్టడమే పనిగా పెట్టుకున్నారు. విశాఖపట్నంలో రూ. 5 వేల కోట్ల విలువ చేసే 54 ఎకరాల ప్రభుత్వ భూములను ముఖ్యమంత్రి బంధువు కబ్జా చేస్తున్నారు" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ బోర్డులను పీకేసి, రాబందుల్లా ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో కనీస నగదు నిల్వలు ఉండే రోజులు పడిపోయాయని జగన్ తెలిపారు. "ఏ కష్టాలు లేనప్పటికీ 2024-25లో నగదు నిల్వలు ఉన్న సమయం కేవలం 8 రోజులకు పడిపోయింది. 365 రోజుల్లో 357 రోజులు మినిమం బ్యాలెన్స్ కూడా ట్రెజరీల్లో లేదు. ఆర్‌బీఐ అడ్వాన్స్‌లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ హయాంలో కోవిడ్ ఉన్నా, ఆదాయాలు తగ్గినా హామీలు నెరవేర్చామని, కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారిపోయిందని ఆయన అన్నారు. 16 రోజుల అసెంబ్లీ సమావేశాలతో ప్రజలకు ఒరిగింది సున్నా అని, రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంటుందని ఆయన హెచ్చరించారు.



# విరిగిన విమాన ల్యాండింగ్ గేర్

## రన్‌వేపై థాయి విమానానికి తప్పిన ముప్పు

**హైదరాబాద్, మార్చి 11:** సాంకేతిక సమస్య, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ విమాన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తో సహా ఐదుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇది ఇలా ఉంటే.. తాజాగా హైదరాబాద్ నుంచి బయలుదేరిన విమానంకి పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుంచి థాయిలాండ్ బయల్దేరిన ఎయిరిండియా విమానానికి (బోయింగ్ 737) ప్రమాదం తప్పింది. బుధవారం ఫుకెట్ ఎయిర్ ఫోర్టులో ల్యాండ్ అయిన వెంటనే నోస్ వీల్ (ఫ్రంట్ ల్యాండింగ్ గేర్) ఊడిపోయింది. దీంతో విమానం రన్ వే నుంచి పక్కకు జారింది. వెనుక టైర్ కూడా పేలిపోయింది. ఈ ఘటన జరిగిన సమయంలో విమానం తక్కువ వేగంతో ఉండటంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ విమానంలో ఉన్న 133 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఆస్కార్ వేడుకకు రంగం సిద్ధం



## 15న సాయంత్రం ప్రత్యక్ష ప్రసారం

**లాస్ ఏంజిల్స్, మార్చి 11:** ప్రపంచ సినీ ప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే అతి పెద్ద వేడుక 'ఆస్కార్స్ 2026' 98వ అకాడమీ అవార్డ్స్ కు సర్వం సిద్ధమైంది. 2025లో విడుదలైన ఉత్తమ చిత్రాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందించేందుకు లాస్ ఏంజెల్స్ లోని డాల్బీ థియేటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అగ్రశ్రేణి హాలీవుడ్ తారలు, ప్రతిభావంతులైన దర్శకులు, నిర్మాతలు ఒకే వేదికపై సందడి చేయనున్నారు. ఈ ఏడాది ఆస్కార్ వేదికపై భారతీయ నటి ప్రియాంక చోప్రా కూడా ప్రెజెంటర్‌గా వ్యవహరించనున్నారు. రాబర్ట్ డౌనీ జూనియర్, అన్నే హాత్‌వే, గ్వినేత్ పాల్ట్రో, పాల్ మెస్కల్ వంటి ప్రముఖ స్టార్స్‌తో కలసి ఆమె వేదికపై అవార్డులను ప్రదానం చేయనున్నారు. 98వ అకాడమీ అవార్డ్స్ ఈనెల 15న ఆదివారం అమెరికా కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటలకు లాస్ ఏంజెల్స్‌లోని ప్రఖ్యాత డాల్బీ థియేటర్‌లో అట్టహాసంగా జరగనున్నాయి. కాల వ్యత్యాసం కారణంగా భారతదేశంలో ఈ వేడుకలను మార్చి 16 సోమవారం వేకువ ఝామున 4:30 గంటల నుంచి వీక్షించవచ్చు. తారల తళుకులతో రెడ్ కార్పెట్ ఈవెంట్ ప్రారంభమవుతుంది. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం మొదలవుతుంది. ప్రముఖ హాస్యనటుడు, టెలివిజన్ వ్యాఖ్యాత కోనన్ ఓబ్రియన్ వరుసగా రెండో ఏడాది కూడా ఈ వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ ప్రేక్షకులు ఆస్కార్స్ వేడుకలను డిజిటల్, టెలివిజన్ ప్లాట్‌ఫామ్‌లలో వీక్షించవచ్చు. స్టార్ మూవీస్‌లో ఉదయం 4:30 గంటల నుంచి ప్రత్యక్ష ప్రసారం అవుతుంది. ఉదయం చూడలేని వారి కోసం అదే రోజు రాత్రి ఈ వేడుకను పునః ప్రసారం చేయనున్నారు. అలాగే జియో హాట్‌స్టార్ యాప్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం అవుతుంది.

# త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగిస్తాం: ట్రంప్

**వాషింగ్టన్, మార్చి 11:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం భీకరంగా సాగుతున్న వేళ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఇరాన్‌తో యుద్ధం ముగియవచ్చన్నారు. అమెరికా దళాలు ఇప్పటికే టెహ్రాన్ సైనిక సామర్థ్యాలపై భారీ నష్టాన్ని కలిగించాయని చెప్పారు. యుద్ధం జరుగుతుందని పేర్కొన్నారు. అనుకున్న సమయం కంటే చాలా ముందున్నామన్నారు. ఆరు వారాల్లో అనుకున్నదాని కంటే అధిక నష్టాన్ని కలిగించామని చెప్పారు. ఇప్పటికే ఇరాన్‌లోని అన్ని లక్ష్యాలనూ ఛేదించామని తెలిపారు. ఇరాన్ వద్ద ఇంకేమీ మిగల్లేదని వెల్లడించారు. తాను ఎప్పుడనుకుంటే అప్పుడు ఈ యుద్ధం ఆగుతుందని ఈ సందర్భంగా ట్రంప్ స్పష్టం చేశారు. బుధవారం ఒక ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

# 10మంది మావోల లొంగుబాటు

**ఒడిశా, మార్చి11:** దేశంలో మావోయిస్టుల నిర్మూలన కోసం కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం సాకారం కానుంది. ఒడిశాలోని కంధమాల్ జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోయారు. బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ ఎదుట 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో నీతూ కూడా ఉన్నారని జిల్లా ఎస్పీ వెల్లడించారు. మావోయిస్టు పార్టీ స్టేట్ కమిటీ సభ్యురాలు ఆమె కొనసాగుతున్నారని చెప్పారు. వీరిపై మొత్తం రూ.1.65 కోట్ల రివార్డు ఉందని ఎస్పీ వివరించారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం ఆపరేషన్ కగార్‌ను చేపట్టింది. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దేశంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశాలలో మాత్రమే మావోయిస్టుల ప్రభావం ఉంది. ఛత్తీస్‌గఢ్‌లో వీరి ప్రభావం అధికంగా ఉండడంతో.. పోలీసులతోపాటు కేంద్ర భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహించాయి. దీంతో ఈ రాష్ట్రంలో భారీగా ఎన్‌కౌంటర్లు జరిగాయి. దీనిలో వందలాది మంది మావోయిస్టులు మరణించారు. అలాగే భారీగా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లో పోలీసుల కూంబింగ్ పెరగడంతో.. ఆ రాష్ట్రానికి సరిహద్దులుగా ఉన్న జార్ఖండ్, ఒడిశాలోకి ప్రవేశించారు. ఆయా రాష్ట్రాల్లో సైతం పోలీసులు కూంబింగ్ చేపట్టడంతో.. వారంతా పోలీసుల ఎదుట లొంగిపోవడం మినహా గత్యంతరం లేని పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు తెలంగాణ ప్రభుత్వం ఎదుట పలువురు మావోయిస్టు పార్టీ అగ్రనేతలు లొంగిపోయిన విషయం విదితమే. ఆపరేషన్ కగార్ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్రం వడివడిగా అడుగులు వేస్తోంది.



# కేంద్ర మాజీ మంత్రి కావూరి మృతి

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణం
- కావూరి మృతిపై చంద్రబాబు తదితరుల సంతాపం



**హైదరాబాద్, మార్చి 11:** తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు (82) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. కావూరి సాంబశివరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నేతల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఎంపిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. మన్మోమన్ కేబినేట్‌లో మంత్రిగా పనిచేశారు. ఆయన మృతి పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం రాజకీయ రంగానికి తీరని లోటుగా పలువురు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ మంత్రి నారా లోకేశ్, పలువురు నేతలు కావూరి సాంబశివరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర అని కొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ కేంద్రమంత్రి, బీజేపీ నేత కావూరి సాంబశివరావు అనారోగ్యంతో కన్నుమూశారని తెలిసి విచారం వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఐదుసార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా వారు ప్రజాసేవకు జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. రాజకీయంలో వారికున్న సుదీర్ఘ అనుభవంతో.. ప్రజాసమస్యలపై పార్లమెంటు లోపలా, బయటా తన గళాన్ని వినిపించారని ప్రశంసించారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కావూరి సాంబశివరావు మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కావూరి సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మరణం పట్ల కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి కావూరి అని కొనియాడారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడు కావూరి అని ప్రశంసించారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, ముఖ్యంగా బీజేపీ కుటుంబానికి తీరని లోటని భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతికి మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి సంతాపం వ్యక్తం చేశారు. కావూరి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. కావూరి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని పనబాక లక్ష్మి పేర్కొన్నారు. కావూరి సాంబశివరావు మృతి పట్ల మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో తనదైన ముద్ర వేసిన గొప్ప నాయకుడు కావూరి అని కొనియాడారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి 5 సార్లు ఎంపీగా గెలిచిన నిబద్ధత గల నేతను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని లగడపాటి రాజగోపాల్ తెలిపారు.

# అమెరికాలో రిలయన్స్ ఆయిల్ రిఫైనరీ

## 300 బిలియన్ డాలర్లతో భారీ ప్రాజెక్ట్
## రిలయన్స్‌తో అమెరికా ప్రభుత్వం ఒప్పందం
## సోషల్ మీడియా ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 11:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 300 బిలియన్ డాలర్ల చమురు శుద్ధి కర్మాగార ప్రాజెక్టును టెక్సాస్‌లో ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో భారతదేశ రిలయన్స్ ఇండస్ట్రీ భాగస్వామి క ఆవడం విశేషం. ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఈ ప్రాజెక్టును అమెరికా చరిత్రలో అతిపెద్ద ఒప్పందం గా పేర్కొన్నారు. ఇది అమెరికన్ కార్మికులు, ఇంధన వృద్ధి, దక్షిణ టెక్సాస్ ప్రజలకు భారీ విజయం అని అభివర్ణించారు. ట్రంప్ ప్రకటన ప్రకారం.. ఈ ప్రాజెక్టు దేశీయ ఇంధన ఉత్పత్తిని బలోపేతం చేయడానికి, పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడానికి ఓ ముఖ్యమైన దశగా ఉంటుంది. బ్రౌన్స్‌విల్లే నౌకాశ్రయంలో ఉనికిలో ఉండే అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ సంస్థ దీనిని అభివృద్ధి చేస్తుంది. ట్రంప్ ఈ ప్రాజెక్టును ఆర్థిక, వ్యూహాత్మక మైలురాయిగా పేర్కొన్నారు. అయితే, పెట్టుబడి నిర్మాణం, ఖర్చులు లేదా ఆర్థిక వివరాలపై ప్రకటనలో స్పష్టత ఇవ్వలేదు. గత 50 ఏళ్లలో అమెరికా గడ్డపై నిర్మించతలపెట్టిన మొట్టమొదటి రిఫైనరీ ఇదే కావడం విశేషం. ఈ మెగా ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ 'రిలయన్స్' కీలక భాగస్వామిగా చేరడం అంతర్జాతీయ వాణిజ్య వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. సుమారు 300 బిలియన్ల డాలర్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెరికా-భారత్ మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. ప్రపంచంలోనే అత్యంత పరిశుభ్రమైన మరియు అత్యాధునికమైన రిఫైరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ డీల్ కుదుర్చుకున్నందుకు రిలయన్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ భాగస్వామ్యం ఇరు దేశాలకు గెలుపు లాంటిదని అభివర్ణించారు. ఈ భారీ ప్రాజెక్టు కేవలం ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా, అమెరికా ఇంధన భద్రతను గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, టెక్సాస్ ప్రాంత ఆర్థిక పురోగతికి ఇది కీలకం కానుంది. పర్యావరణ హితంగా ఉండేలా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి ఇంధనాన్ని శుద్ధి చేయడం దీని ప్రత్యేకత. గతంలో పెట్రోలియం రంగంలో రిలయన్స్‌కు ఉన్న అపారమైన అనుభవం, ముఖ్యంగా జామ్‌నగర్ వంటి అతిపెద్ద రిఫైనరీల నిర్వహణ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకునే ట్రంప్ యంత్రాంగం ఈ డీల్‌కు మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది. ఈ ఒప్పందం వల్ల అమెరికా చమురు దిగుమతుల పై ఆధారపడటం తగ్గి, అంతర్జాతీయ మార్కెట్లో తన పట్టును మరింత బిగించే అవకాశం ఉంది. ఇది అమెరికాలో ఇంధన ఉత్పత్తిని పెంచి, బిలియన్ డాలర్ల ఆర్థిక ప్రభావాన్ని తీసుకువస్తుంది. ప్రపంచంలోనే అత్యంత శుభ్రమైన శుద్ధి కర్మాగారంగా ఇది నిలుస్తుంది' అని ట్రంప్ పోస్టులో పేర్కొన్నారు. ఇప్పటికే 2024లో డల్లాస్ ప్రాంతానికి చెందిన స్టార్టప్ సంస్థ ఎలిమెంట్ ఫ్యూయల్స్ హోల్డింగ్స్ బ్రౌన్స్‌విల్లేలో దాదాపు 50 సంవత్సరాల తర్వాత పూర్తిగా కొత్త అమెరికన్ చమురు శుద్ధి కర్మాగారం నిర్మించేందుకు ప్రణాళికను తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే అమెరికా ఇంధన రంగంలో పెద్ద మార్పులు తీసుకురావడంతో పాటు భారత్-అమెరికా ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# హర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు

- ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్, పలు నౌకలు ధ్వంసం



**టెహ్రాన్, మార్చి 11:** చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అవి ధ్వంసమయ్యాయి. తాము జరిపిన దాడుల్లో ఇరాన్ కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ పేర్కొంది. ఈ దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. జలసంధిలో పేలుడు సృష్టించడానికి ఇరాన్ సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా నిఘా వర్గాలకు సమాచారం అందిందని ఆ దేశ మీడియా పేర్కొంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. జలసంధి సమీపంలో ఇరాన్ ఎక్కడైనా మైన్స్‌ను అమర్చినట్లయితే.. వాటిని తక్షణమే తొలగించాలని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. లేదంటే పర్యవసానాలు చాలా తీవ్రంగా.. మునుపెన్నడూ చూడని స్థాయిలో ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ స్వయంగా వాటిని తీసేస్తే.. అది మంచి పరిణామం అన్నారు. లేదంటే కరేబియన్ సముద్రంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా నౌకలను ధ్వంసం చేసేందుకు ఉపయోగించిన క్షిపణులను వాడి జలసంధిలోని మైన్‌లేయర్స్ పడవలను లక్ష్యంగా చేసుకుంటామన్నారు. ట్రంప్ హెచ్చరికల తర్వాత ఇరాన్ మైన్‌లేయర్స్‌ను ధ్వంసం చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలో భీకర దాడులు జరిగాయి. ఈ జలసంధి సమీపంలో ఇరాన్ మోహరించిన మైన్‌లేయర్స్, నౌకలు లక్ష్యంగా అమెరికా దళాలు విరుచుకుపడడంతో అవి ధ్వంసమయ్యాయి. తాము చేపట్టిన దాడుల్లో ఇరాన్‌కు చెందిన 16 మైన్‌లేయర్స్‌తో పాటు పలు నౌకలు ధ్వంసం అయ్యాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ క్రమంలనే దాడికి సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా చమురును కొనుగోలు చేసేందుకు భారత్‌కు ఇచ్చిన అనుమతి వల్ల పుతిన్ సర్కార్‌కు పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని శ్వేతసౌధం ప్రకటించింది.

# 17న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన టీటీడీ

**తిరుమల, మార్చి 11:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 19న ఉగాది ఆస్థానాన్ని పురస్కరించుకుని 17వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది ఉత్సవాలకు ముందు మంగళవారం కోయిల ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆపవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది. 16వ తేది ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. అదేవిధంగా మార్చి 19న ఉగాది ఆస్థానం సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా విఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడమైనది. ఈ కారణంగా 18వ తేదీ విఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించరని టీటీడీ తెలిపింది.





## సంపాదకీయం

# జల్‌జీవన్‌తో నీటి సమస్య పరిష్కారం అయ్యేనా ?

ఏటా వరదలు, నీటి కరువు సాధారణం అయ్యింది. వర్షాకాలంలో వరదలు ముంచెత్తితే..ఎండాకాలంలో మంచినీటి కటకటలు తప్పడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ సమస్యపై స్పష్టమైన అవగాహన కలగడం లేదు. మనకు ఎన్నో జీవనదులు, సహజసిద్ద వనరులు ఉన్నా, వాటిని వినియోగించడం ఎలా అన్న ఆలోచన చేయడం లేదు. ఎండాకాలం రాగానే తాత్కాలిక పథకాలతో మంచినీటి సమస్యను గట్టెక్కిస్తున్నారు. ఇకపోతే కేంద్రం జల్‌జీవన్ మిషన్ కింద లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నా..శాశ్వత పరిష్కారం చూపడం లేదు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని కేంద్ర ప్రభుత్వం 2028 డిసెంబరు వరకు పొడిగించింది. 2019-2024 వరకే పరిమితమైన ఈ పథకం చాలా రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో అమలుకాని విషయాన్ని ప్రభుత్వం పరిగణనలో తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం దీనిపై నిర్ణయం తీసుకుంది. ఈ పథకం మొత్తం కేటాయింపులను రూ.8.69 లక్షల కోట్లకు పెంచింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.3.59 లక్షల కోట్లకు పెంచాలని నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రాలకు రూ.1.51 లక్షల కోట్ల అదనపు ప్రయోజనం కలగనుంది. పథకం అమలును పర్యవేక్షించేందుకు జాతీయస్థాయిలో సుజలం భారత్ పేరుతో ఒక డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమల్లోకి తేనుంది. దీనికింద ప్రతి పల్లెను ఒక సుజల గ్రామంగా గుర్తించి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. ఈ పథకం కింద చేపట్టిన పనులు పూర్తయినట్లు గ్రామపంచాయతీలు ధ్రువీకరించి, ప్రతి ఇంటికీ కొళాయి నీరు అందించేందుకు సిద్ధమైనట్లు ప్రకటించాల్సి ఉంటుంది. ఆ తర్వాతే పథకం నిర్వహణకు అవసరమైన యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటుచేస్తాయి. పథకాన్ని ప్రజలు సొంతం చేసుకొని సామాజికంగా, ఉమ్మడిగా నిర్వహించేలా ప్రోత్సహించేందుకు ఏటా 'జల్ ఉత్సవ్' కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. అన్ని గ్రామాలనూ 'హర్‌ఘర్ జల్' గ్రామాలుగా తయారు చేస్తామని ప్రకటించారు. అయితే ఈ పథకానికి అవసరమైన నీటి వనరులను సమకూర్చడంలో మాత్రం రాష్ట్రాలు దృష్టి సారించడం లేదు. జల్‌జీవన్ పథకం అమల్లో ఉన్నా గ్రామాల్లో మంచినీటి సమస్యలు తీరడం లేదు. కారణం నీటి వనరులను వినియోగించక పోవడమే. వేసవి వస్తున్నదంటే మంచినీటికి కటకటలాడాల్సిన పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలని ప్రజలు ఆందోళన చెందడం సర్వసాధారణ మైపోతున్నది. పాలకుల అసమర్థత, కొందరు అధికారుల అవినీతి, అవగాహనారాహిత్యంతో పాటు ప్రకృతి సహాయనిరాకరణ కూడా తోడుకావడంతో అందుబాటులో ఉన్న కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడుతున్నారు. ప్రజల్లో అవ గాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రాను రాను తీవ్ర రూపం దాల్చుతున్నది. మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో నగరాలు, పట్టణాల్లో మంచినీటి వ్యాపారం అదుపు లేకుండాపోతున్నది. ఇప్పుడు ఈ వ్యాపారం నగరాలకేకాక, మండల కేంద్రాలకు, గ్రామాలకు శివారు పల్లెలకు కూడా విస్తరించింది. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా మంచినీటి పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నాఅడిగేవారు, అడ్డగిం చేవారు లేకుండా పోతున్నారు. కలుషితనీరు అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయి. పాలకులు మంచినీటి విషయంలో ప్రత్యేక చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఉంది. భూగర్భజలాల మట్టాలు తగ్గిపోవడం మానవాళికి ఏ మాత్రం క్షేమంకాదు. ఇకపోతే లక్షలాది ఎకరాలకు సరి పోయే వేలాది టిఎంసిల నీరు వివిధ నదుల ద్వారా పొంగిపొర్లి యేటా సముద్రంపాలవుతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రజలందరికీ కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన నీరు అందించ లేని అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్నాం.దేశవ్యాప్తంగా ఇప్పటివరకు లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చుపెట్టారు. పెడుతున్నా రు. కానీ వ్యయం చేస్తున్న నిధుల్లో ఏ మేరకు క్షేత్ర స్థాయి వరకు వెళ్లి ప్రజలకు ఉపయోగపడుతున్నాయనేదే ప్రశ్న. కరవుల్లోనే కాదు వర్షాలు సమృద్ధిగా కురిసిన సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో మంచినీటి సమస్యతీవ్రంగా ఉంటుంది. ఈసారి వేసవిలో నీటికొరత తీవ్రంగా ఉండే అవకాశాలు న్నట్లు భూగర్భశాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. బోరు బావుల వినియోగం దేశవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపో తున్నది. విద్యుత్ డిమాండ్ తోపాటు నీటి వృధా కూడా పెరుగు తున్నదనే చెప్పొచ్చు. తగ్గిపోతున్న భూగర్భజలాల భర్తీకి అవసరం మేరకు ప్రయత్నాలు జరగకపోవడంతో దేశం లోని అనేక రాష్ట్రాల్లో నీటి మట్టాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా అంతమయ్యే పరిస్థితులు ఏర్పడవచ్చునని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానాటికీ బోరుబావుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి పెరిగిపోతే అనేక అనర్థాలకు దారితీస్తున్నది. భూగర్భ జలాల వినియోగం మూడింతలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. దేశరాజధాని ఢిల్లీతోసహా పంజాబ్, రాజ స్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో ఇష్టానుసారంగా లక్షలాది కోట్ల లీటర్ల భూగర్భజలాలు తోడేస్తున్నారు. దేశంలో మూడోవంతు జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తాగు యోగ్యమైనవి కావని గతంలోనే కేంద్రం అంగీకరించింది. రాబోయే వేసవిలో మంచినీటి కొరతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్దం చేసుకోవాల్సి ఉంది.



డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక

# అమెరికా ఆర్థిక సంస్థలపై దాడులు చేస్తాం

- ఇరాన్ సంచలన హెచ్చరిక
- టెక్ దిగ్గజాలపై దాడులకు సిద్ధమంటూ ప్రకటన
- గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలకు వార్నింగ్
- టెహ్రాన్ బ్యాంకుపై ఇజ్రాయెల్ దాడికి ప్రతికారం
- హోర్ముజ్ జలసంధి మూసివేతతో భారత్‌కు చమురు సెగ






**టెహ్రాన్/వాషింగ్టన్:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ 12వ రోజుకు చేరుకోవడంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు మరింత తీవ్రమయ్యాయి. ఇన్నాళ్లూ చమురు క్షేత్రాలు, సైనిక స్థావరాలకే పరిమితమైన దాడులు ఇప్పుడు ఆర్థిక కేంద్రాల వైపు మళ్లాయి. అమెరికా, ఇజ్రాయెల్‌కు చెందిన ప్రముఖ బ్యాంకులు, ఆర్థిక సంస్థలపై దాడులు చేస్తామని ఇరాన్ మిలిటరీ తాజాగా హెచ్చరించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని కీలకమైన 'బ్యాంక్ సెపా'పై ఇజ్రాయెల్ క్షిపణి దాడి చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్, ఇకపై తాము కూడా అదే రీతిలో బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీ కమాండ్ 'ఖాటమ్ అల్ అన్బియా' విడుదల చేసిన హిట్ లిస్టులో అమెరికాకు చెందిన అగ్రశ్రేణి కంపెనీలు ఉన్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, ఎన్విడియా, ఒరాకిల్ వంటి టెక్ సంస్థలు తమ లక్ష్యాలని ఇరాన్ ప్రకటించింది. గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ సంస్థల కార్యాలయాలకు ప్రజలు దూరంగా ఉండాలని, కనీసం ఒక కిలోమీటర్ పరిధిలో ఉండవద్దని హెచ్చరికలు జారీ చేసింది. ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీయడం ద్వారా శత్రు దేశాలను లొంగదీసుకోవాలని వ్యూహరచన చేస్తోంది.

### భారత్‌పై తీవ్ర ప్రభావం

యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'లో రవాణా స్తంభించిపోయింది. దీనివల్ల భారతదేశం, చైనా వంటి ఆసియా దేశాలకు ముడిచమురు సరఫరా నిలిచిపోయి సంక్షోభం నెలకొంది. భారత్ తన అవసరాల కోసం గల్ఫ్ దేశాలపైనే ఎక్కువగా ఆధారపడుతుండటంతో, ఇక్కడ ఉద్రిక్తతలు పెరిగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది.

### రంగంలోకి అగ్రరాజ్యాలు

మరోవైపు ఇరాన్ వద్ద ఉన్న అణు నిల్వలు, క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేశాయి. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ నివాసంపై జరిగిన దాడుల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం ఇరుపక్షాలు రాజీ పడే సూచనలు కనిపించకపోవడంతో, ఈ 'ఆర్థిక యుద్ధం' ప్రపంచ మార్కెట్లపై ఎటువంటి ప్రభావం చూపుతుందోనని అంతర్జాతీయ సమాజం ఆందోళన చెందుతోంది.

# పశ్చిమాసియా యుద్ధంపై రాజకీయాలా

- గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయులందరినీ క్షేమంగా తీసుకొస్తాం
- కేరళ పర్యటనలో కాంగ్రెస్, వామపక్షాల తీరుపై మండిపాటు



**తిరువనంతపురం, మార్చి 11:** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు సంధించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతా రహితంగా మాట్లాడుతున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. దేశ యువతపై ఆయనకు అవగాహన లేదంటూ రాహుల్ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ యువరాజుకి ఏమీ తెలీదంటూ ఆయనపై పరోక్ష విమర్శలు చేశారు. దేశ అభివృద్ధిని కాంగ్రెస్ యువరాజు చూడలేక పోతున్నారంటూ రాహుల్ తీరుపై మండిపడ్డారు. బుధవారం కేరళంలోని ఎర్నాకులంలో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. యుద్ధం పేరుతో తనను కాంగ్రెస్ పార్టీ దూషిస్తోందని తెలిపారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంపై కాంగ్రెస్, వామపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. గల్ఫ్‌లో భారతీయులు చిక్కుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు. ఆయా దేశాల్లోని భారతీయులను కాపాడేందుకు కేంద్రం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఇక ఈ పర్యటనలో పలు ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారు. అలాగే వివిధ పథకాలను ఆయన ప్రారంభించారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేశారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదని మోదీ అన్నారు. ఈ పర్యటన అనంతరం తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్రంలో పలు అభివృద్ధి పథకాలకు ఆయన శంకుస్థాపన చేయనుండడంతోపాటు వివిధ పథకాలను ప్రారంభించనున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో తమిళనాడు, కేరళలతోపాటు అసోం, మేఘాలయా, పుదుచ్చేరి అసెంబ్లీలకు మార్చి నుంచి మే మాసాల మధ్య ఎన్నికల నగారా మోగనుంది. దీంతో ఆయా రాష్ట్రాల్లో అధికారం అందుకోవాలని బీజేపీ, కాంగ్రెస్‌తోపాటు వామపక్ష పార్టీలైన కమ్యూనిస్టు పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఆ క్రమంలో ప్రధాని మోదీ బుధవారం కేరళ, తమిళనాడుల్లో పర్యటిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

# స్పీకర్‌పై వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

- లోక్‌సభలో విపక్షాలపై అమిత్ షా ఫైర్
- పార్లమెంటరీ రాజకీయాల్లో ఇదో దురదృష్టకరమైన ఘటన అని వ్యాఖ్యలు



**ఢిల్లీ, మార్చి 11:** లోక్‌సభలో స్పీకర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో వీగిపోయింది. అయితే ఈ ఓటింగ్‌కు ముందు అధికార, ప్రతిపక్షాలు ఒకరి మీద ఒకరు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేశారు. గతంలో రాహుల్ గాంధీ మోదీని కౌగిలించుకుని, తరువాత కన్ను గీటడం లాంటి చర్యలను గుర్తుచేశారు. దీనితో విపక్షాలు అమిత్ షాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంమంత్రి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నినాదాల మధ్యే, సభాపతి స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ఓటింగ్ నిర్వహించారు. దీనితో విపక్షాలు పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. అనంతరం లోక్‌సభను జగదాంబికా పాల్ రేపటికి వాయిదా వేశారు.

### నిప్పులు చెరిగిన అమిత్ షా

అంతకు ముందు అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుతూ అమిత్ షా విపక్షాలపై మండిపడ్డారు. లోక్‌సభ స్పీకర్ అధికార, విపక్షాలకు సమానంగా ప్రాతినిధ్యం వహించే ఒక నిష్పాక్షిక సంరక్షకుడని అన్నారు. ఓం బిర్లాపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఖండించిన ఆయన, సభ అనేది పార్లమెంటరీ నిబంధనల ప్రకారమే నడుస్తుందని, ఆయా రాజకీయపార్టీల రూల్స్ ప్రకారం నడవదని స్పష్టం చేశారు. ఓం బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో మాట్లాడుతూ అమిత్ షా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 'స్పీకర్ చిత్తశుద్ధిని విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తడం దేశ ప్రజాస్వామ్య ప్రక్రియనే ప్రశ్నించడంతో సమానం. మనం మన హక్కుల గురించి మాట్లాడవచ్చు. కానీ ఎవరూ సభ నియమాలను ఉల్లంఘించలేరు. స్పీకర్ నిర్ణయాలతో మనం ఏకీభవించలేకపోవచ్చు. కానీ మనం ఆయన మాటలకు కట్టుబడి ఉండాలే తప్ప సందేహించకూడదు. భారత పార్లమెంటరీ చరిత్రలో లోక్ సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం ఇది నాలుగోసారి. గతంలో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్పీకర్‌పై ఎప్పుడూ అవిశ్వాస తీర్మానం పెట్టలేదు' అని అమిత్ షా అన్నారు.

### పరస్పర విశ్వాసం ఉండాలి!

'సభ పరస్పర విశ్వాసంతో నడుస్తుంది. అధికార పక్షానికి, ప్రతిపక్షానికి స్పీకరే సంరక్షకుడు. అందుకే నిబంధనలు రూపొందించబడ్డాయి. ఈ సభ ఒక సంతో (మార్కెట్ ప్లేస్) లేదా పండుగో కాదు. ఇక్కడ నిబంధనల ప్రకారమే ముందుకు సాగాలి. సభా నిబంధనలకు వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదు' అని అమిత్ షా పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలనే ఉద్దేశంతో ప్రజాస్వామ్య గౌరవానికి చిహ్నమైన స్పీకర్‌పై ప్రశ్నలు లేవనెత్తడం అత్యంత విచారకరమని, అది పూర్తిగా ఖండించదగినదని అమిత్ షా అన్నారు. పార్లమెంటరీ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న పదాలను (అన్ పార్లమెంటరీ వర్డ్స్) తొలగించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని, అలాంటి భాషను రికార్డుల నుంచి తప్పక తొలగించాలని అభిప్రాయపడ్డారు. చివరిగా "మీరు మీ హక్కులను కాపాడుకోవచ్చు. కానీ ప్రివిలేజ్ (ప్రత్యేక అధికారం) అనే భ్రమలో జీవించేవారిని వారి పార్టీగానీ, ప్రజలుగానీ రక్షించలేరు. అందుకే వారు క్రమంగా ప్రజల మద్దతును కోల్పోతున్నారు" అంటూ విపక్షాలపై ఆయన విమర్శలు గుప్పించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం | విజయనగరం | విశాఖపట్నం
గురువారం 12 - 03 - 2026 పేజీలు : 6




# అనకాపల్లిలో జీరో వేస్ట్ రెసిడెన్షియల్ స్కూళ్లు

**- చెత్త ద్వారా సర్క్యులర్ ఎకానమీ**
**- కలెక్టరుకు సీఎం అభినందనలు**
**- రాష్ట్రమంతటా ఈ పద్ధతి అమలు చేయాలని ఆదేశం**

**అనకాపల్లి , మార్చి 11 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లను జీరోవేస్ట్ స్కూళ్లుగా మార్చుతూ ఆ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా అధికారులు చేసిన వినూత్న ప్రయత్నం జిల్లా కలెక్టర్ల సదస్సు దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో 114 సంస్థల్లో చెత్త, వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించడంలో జిల్లా కలెక్టర్ వినూత్నంగా వ్యవహరించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేస్తూ అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఆ దిశగా ఈ విద్యా సంస్థల్లో ఉన్న చదువుతున్న విద్యార్థులు ఈ చెత్తను పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి పారేసేలా వారిలో చైతన్యం కల్పించారు. తడి చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ఆయా స్కూల పరిధిలో ప్రత్యేకంగా గుంత తవ్వి అందులో వేశారు. ఈ చెత్తను కంపోస్టుగా తయారు చేయడానికి ప్రత్యేకంగా గుంతలు తవ్వి వాటిని రైతులకు ఉపయోగపడే ఎరువుగా తయారు చేస్తున్నారు. హాస్టళ్ల నుంచి వృధాగా వెళ్లే నీరులో హానికరం కాని నీరు, హానికర నీరు అని రెండుగా విడదీసి, అవి బయటకు వెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పొడి చెత్తను రీసైక్లింగ్ కోసం ఆయా పరిధిలోని స్వర్ణ సచివాలయానికి అందజేశారు. మురికి నీరును మున్సిపల్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటుకు పంపేలా ఏర్పాటు చేశారు. 114 స్కూళ్లలో 24,775 మంది విద్యార్థులకు ఇది లబ్ది కలిగింది. ఈ సంస్థల నుంచి ప్రతి నెలా 57.1 టన్నుల తడి చెత్త, 24.5 టన్నుల పొడి చెత్త పోగవుతోంది.

ఈ చెత్తద్వారా హాస్టళ్లకు ప్రతి నెలా రూ.2.17 లక్షల ఆదాయం సమకూరుతోందని అనకాప్లి జిల్లా కలెక్టరు వివరించారు. జీరో వేస్ట్ సంస్థలుగా జిల్లాలో రెసిడెన్షియల్ స్కూళ్లను మార్చుతూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ చేసిన ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు.. ఈ మోడల్‌ను అన్ని జిల్లాల కలెక్టర్లు అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ఒక మంచి పేరు సూచించాలన్నారు. కేవలం ఇంతటితో ఆగకుండా అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో వారి అవసరాలకు సరిపడేలా కూరగాయలు పండించేలా తోటలు సాగు కూడా చేపట్టాలని. తద్వారా కూరగాయల అవసరాల్లో సమృద్ధి సాధించవచ్చన్నారు. ఈ దిశగా కూడా చర్యలు తీసుకోవాలన్నారు

# ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి వేసవి రక్షణ పరికరాలు అందజేసిన ట్రాఫిక్ సిఐ ఎం.నారాయణ



**అనకాపల్లి టౌన్ , మార్చి 11 (మనసులో మాట) :** సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుహిన్ సిన్హా , డి.ఎస్.పి ఎం.శ్రావణి ఆదేశాలు మేరకు అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం. నారాయణ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి డ్యూటీ సమయంలో ఉపయోగపడే ట్రాఫిక్ డ్యూటీ క్యాప్స్, ఎండలో కళ్లను రక్షించే కళ్ళజోళ్ళు, మాస్క్‌లను అందజేశారు. వేసవిలో తీవ్రమైన ఎండలో కూడా నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ సామగ్రిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది విధుల్లో జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# కన్నుల పండువగా శ్రీ నూకాలమ్మ అమ్మవారి రెండవ రోజు పునఃప్రతిష్టా కార్యక్రమాలు

**- పసుపు నీళ్ల బిందెలతో గంగాభిషేకానికి తరలివచ్చిన వేల మంది మహిళలు**

**నర్సీపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** నర్సీపట్నంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీ నూకాలమ్మ అమ్మవారి దేవాలయ పునఃప్రతిష్ట, కలశ స్థాపన మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం నాటి కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా జరిగాయి. ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ సంకల్పం, గవ్యాంత పూజ, మార్జనలు, వాస్తుపూజ, వాస్తు హోమం, వాస్తుబలి, పర్యగ్ని కరణం, లక్షణోద్ధారణం, క్షీరాభిషేకం, గ్రామ ప్రదక్షిణం, జలాధివాసం, ధాన్యాధివాసం, పంచశయ్యాది వాసం, యాగశాల అర్చన, త్రికుండాత్మక మూలమంత్ర హోమములు, కళాహోమం మరియు శాంతిహోమం తదితర కార్యక్రమాలను ఆగమ శాస్త్రోక్తంగా కన్నుల పండువగా జరిపించారు. అనంతరం సాయంత్రం నర్సీపట్నం సెంటర్లో నిర్వహించిన గంగాభిషేక కార్యక్రమం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ మహా ఘట్టంలో వేలాది మంది మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో పసుపు నీళ్లు నింపిన బిందెలతో భారీ ఊరేగింపుగా తరలివచ్చారు. యాగశాల వద్ద నుండి ప్రారంభమైన ఈ భక్తిపూర్వక యాత్ర నూకాంబిక ఆలయం వరకు కోలాహలంగా సాగింది. అక్కడ ఆలయంలోని





కలశమునకు మరియు శ్రీ నూకాలమ్మ అమ్మవారికి మహిళలు ఎంతో భక్తిభావంతో గంగాభిషేకం నిర్వహించారు. వేలాది మంది మహిళలు పాల్గొన్న ఈ అపురూప ఆధ్యాత్మిక ఘట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వారి సతీమణి చింతకాయల పద్మావతి , కుమారుడు చింతకాయల విజయ్ ,డాక్టర్ సువర్ణ చింతకాయల రాజేష్ సతీమణి దివ్యశ్రీ స్వయం గా పాల్గొని అమ్మవారి సేవలో తరించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు పర్యవేక్షణలో వేలాది మంది భక్తుల నడుమ సాగిన ఈ గంగాభిషేక మహోత్సవంతో నర్సీపట్నం పురవీధులన్నీ భక్తి పారవశ్యంలో మునిగిపోయాయి.

# ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షకు 755 మంది హాజరు

**: జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు**

**శ్రీకాకుళం , మార్చి 11 (మనసులో మాట) :** ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షు 755 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మార్చి 11 (బుధవారం)వ తేదీన జరిగిన ఓపెన్ స్కూల్ (APOSS) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష (311- గణితం, 315 -చరిత్ర ఁ 320-అకౌంటన్స్)లకు గాను జిల్లా మొత్తం మీద 6 పరీక్షా కేంద్రాలను జి. భానుమూర్తి రాజు, (District Level Observer), 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 6 సిట్టింగ్ స్క్వాడ్ ల నిరంతర పర్యవేక్షణ లో నిర్వ హించారు . ఓపెన్ స్కూల్ (APOSS) ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష (311-గణితం, 315 -చరిత్ర ఁ 320-అకౌంట న్స్) లకు గాను మొత్తం 866 మంది అభ్యర్థులకు గాను 755 మంది అభ్యర్థులు హాజరు కాగా 111 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు ఆయన వివరించారు. బుధవారం నిర్వహించిన పరీక్షలలో 6(ఆరుగురు) విద్యార్థులు మాస్ కాపీయింగ్ కు పాల్పడుతూ స్క్వాడ్ అధికారుల ఆకస్మిక తనిఖీలో పట్టుబడినట్లు వెల్లడించారు.

# విశాఖ ఉక్కుకు గ్యాస్ కొరతపై సిఎం స్పందించాలి

**స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్**



**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ కొరత ఏర్పడకుండా సిఎం చంద్రబాబు నాయుడు తక్షణం చొరవ ప్రదర్శించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. 'ఇరాన్-అమెరికా, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న యుద్ధం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రభావం చూపుతోంది. స్టీల్‌ప్లాంట్ రోజువారీ కార్యకలాపాల కోసం సుమారు 12 టన్నుల లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ అవసరం. ప్రస్తుతం ప్లాంట్‌లో 120 టన్నుల గ్యాస్ మాత్రమే అందుబాటులో ఉంది. ఇది మరో పది రోజులకు మాత్రమే సరిపోతుంది. మరో 300 టన్నుల గ్యాస్‌కు ఇప్పటికే డబ్బు చెల్లించినా దానిని పంపేందుకు నిరాకరిస్తున్నారు. ప్లాంట్ సుమారు 20 రకాల ముడిసరుకులను వివిధ రాష్ట్రాలు, దేశాల నుండి తెప్పించుకుంటోంది. ఎల్పిజి కొరత ఏర్పడితే వేలాది మంది కార్మికులు పాల్గొనే ఈ భారీ ఉత్పత్తి ప్రక్రియ ఆగిపోయే ప్రమాదం ఉంది. గ్యాస్ కొరత వల్ల స్టీల్ ఉత్పత్తితో పాటు అమ్మోనియా, మెడికల్ ఆక్సిజన్ వంటి ఇతర బై-ప్రొడక్ట్స్ తయారీ కూడా నిలిచిపోయే అవకాశముంది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ లాభాల బాటలో పయనిస్తోంది. ఫిబ్రవరిలో రూ.34 కోట్ల లాభాన్ని గడించింది. మార్చిలో రూ.150 కోట్ల లాభం లక్ష్యంతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌లో ఉత్పత్తికి ఎలాంటి ఆటంకమూ కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకోవాలి' అని అయోధ్యరామ్ ఆ వీడియోలో పేర్కొన్నారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రిపై ఒత్తిడి తెచ్చి, ప్లాంట్‌కు అవసరమైన గ్యాస్ సరఫరాను పునరుద్ధరించాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా

# మనం ముందుకు వెళదాం : ఎస్పై రాములమ్మ

**అనకావల్లి టౌన్ ,మార్చి 11 (మననులో మాట) :** మహిళా సాధికారతే లక్ష్యంగా మనం ముందుకు వెళదాం అని మహిళలకు పిలుపునిచ్చారు వన్ స్టాప్ సెంటర్ ఎస్పై రాములమ్మ నాబార్డ్ సంస్థ ,ఎస్‌విడిఎస్ .(శారద వేలి డెవలప్మెంట్ ) వారు సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఎస్పై రాములమ్మ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తుమ్మ పాల ఎస్.వి.డి.ఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు తాను ఈ కార్యక్రమంలో పాల్గొన్నానని తెలిపారు. మహిళా సాధికారీత , రైట్స్, జస్టిస్ ,యాక్షన్, ఫర్ ఆల్ విమెన్ అండ్ గర్ల్స్ గురించి





ఆన్లైన్ లోన్ ఫ్రాడ్ యాప్స్ కోసం వివరించారు. ప్రతి మహిళా తనను తాను మార్చుకుంటూ ఆర్థికంగా, ఎదగాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలంటే మీ ఆలోచనలు మరింత ఉన్నతంగా ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా బాలికలకు వివాహ ప్రసక్తే తీసుకురాకూడదు అన్నారు. ముందు వారిని వారు తెలుసుకునే విధంగా రేపు సమాజంలో అదరక, బెదరక ప్రతి అడుగు ధైర్యంగా ముందుకు వేసే విధంగా మీ పెంపకం ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనే మానసిక పరిపక్వత వారికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్విడిఎస్ సిబ్బంది, డ్వాక్రా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ స్మార్ట్ గేట్లను ప్రారంభించిన అదానీ గంగవరం పోర్టు

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** భారతదేశంలోనే అత్యంత లోతైన, ఆధునిక ఓడరేవులలో ఒకటైన అదానీ గంగవరం పోర్టు, డిజి యాత్ర ఫర్ పోర్ట్స్ ("ఓడరేవుల కోసం డిజియాత్ర") గా వర్ణించబడిన పరిశ్రమలో మొట్ట మొదటి కార్యక్రమం డిజిటల్ స్మార్ట్ గేట్లను ప్రారంభించడంతో దాని డిజిటల్ పరివర్తన ప్రయాణంలో మార్గదర్శక అడుగు వేసింది. ఈ డిజిటల్ గేట్లును పార్కింగ్ జోన్లు, ఎంట్రీ గేట్లు, వెయిట్ బ్రిడ్జిలు, టార్పాలిన్ స్టేషన్లతో సహా పోర్టు కార్యకలాపాలకు సంబంధించి అత్యంత కీలకమైన ప్రాంతాలలో అందుబాటులోకి తీసుకురాబడ్డాయి. ఇవి పూర్తిగా క్రమబద్ధీకరించబడిన , సాంకేతికత-ఆధారిత లాజిస్టిక్స్ రవాణాను నిర్ధారిస్తాయి. ఈ అత్యాధునిక వ్యవస్థను కస్టమ్స్ & సిజిఎస్టి ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్. శ్రీధర్, ఐ.ఆర్.ఎస్. కస్టమ్స్ అడిషనల్ కమిషనర్, ఆర్. వి. ప్రథమేష్ భాను; జెసిసి జితేంద్ర పటేల్; జెసిసి - పి ఎం యశ్వంత్ ; జెసిసి - ఆకాష్ సింగ్లా ; ఏసిసి - ఎన్ రవి కుమార్ ; ఏసిసి- జె రాజేష్ కుమార్ తో పాటుగా అదానీ గంగవరం పోర్ట్ నాయకత్వ బృందంతో కలిసి ప్రారంభించారు. అధునాతన, సాంకేతికత ఆధారిత కార్యకలాపాల పట్ల పోర్ట్ నిబద్ధత పరంగా ఒక ముఖ్యమైన మైలురాయిని ఇది సూచిస్తుంది. ఈ అధునాతన వ్యవస్థ టెర్మినల్ ఆపరేటింగ్ సిస్టమ్ (టిఓఎస్) కనెక్టివిటీ, పోర్ట్ ఆపరేటింగ్ సిస్టమ్ , కస్టమర్ ఇంటిగ్రేషన్‌తో ఇప్పటికే ఉన్న ఫాస్టాగ్ టెక్నాలజీతో అనుసంధానించబడుతుంది. ఇది సౌకర్యవంతమైన, పారదర్శకమైన, అత్యంత సురక్షితమైన లాజిస్టిక్స్ అనుభవాన్ని అందిస్తుంది. ఈ డిజిటల్ స్మార్ట్ గేట్ సిస్టమ్ కార్యాచరణ



సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, సౌకర్యవంతమైన రీతిలో సమగ్రమైన విధంగా కస్టమర్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడింది. మాన్యువల్ గేట్ ఆపరేషన్లను పూర్తిగా ఆటోమేటెడ్, కాంటాక్ట్‌లెస్ ప్రాసెసింగ్‌తో భర్తీ చేయడం ద్వారా, పోర్ట్ ఇప్పుడు వేగవంతమైన వాహన క్లియరెన్స్, మెరుగైన ఖచ్చితత్వం మరియు కార్యకలాపాలు సజావుగా జరగటాన్ని నిర్ధారిస్తుంది. 100% డిజిటల్ గేట్ ఆపరేషన్లు ఫాస్టాగ్ /రిడ్ఆధారిత ధృవీకరణ మాన్యువల్ తనిఖీలను తొలగిస్తుంది, వేగవంతమైన ఖచ్చితమైన ప్రాసెసింగ్‌ను నిర్ధారిస్తుంది.

**మెరుగైన భద్రత ఁ యాక్సెస్ నియంత్రణ**

అధీకృత వాహనాలకు మాత్రమే ప్రవేశంఅనుమతించబడుతుంది, పోర్ట్ చుట్టూ భద్రతను బలోపేతం చేస్తుంది. ఆటోమేటెడ్ గేట్ క్లియరెన్స్ మరియు రియల్-టైమ్ ట్రాకింగ్ వంటివి వాహనాలు వేచి ఉండే సమయాలను తగ్గిస్తాయి మరియు అడ్డంకులను నివారిస్తాయి. డ్రైవర్లు హైవే టోల్ గేట్ల మాదిరిగానే సజావుగా, ఊహించదగిన ఫాస్ట్‌ట్యాగ్-ఆధారిత కదలికను ఆనందిస్తారు. ఈ కార్యాచరణ ప్రయోజనాలతో పాటు, ఈ వ్యవస్థ వాహన కదలికల యొక్క నిజ-సమయ దృశ్యమానతను అందించడం ద్వారా పారదర్శకత , నియంత్రణను పెంచుతుంది. పోర్ట్ ఆపరేటింగ్ సిస్టమ్‌తో పూర్తి ఏకీకరణ సమగ్రమైన డిజిటల్ ట్రాకింగ్, ఆటోమేటెడ్ మూవ్‌మెంట్ లాగ్స్ మెరుగైన సమ్మతి పర్యవేక్షణను అనుమతిస్తుంది, భద్రత మరియు మొత్తం పోర్ట్ నిర్వహణను బలోపేతం చేస్తుంది. ఈ డిజిటల్ పరివర్తన రద్దీని తగ్గిస్తుంది, మాన్యువల్ జోక్యాన్ని తగ్గిస్తుంది మరియు పోర్ట్ కార్యకలాపాల మొత్తం సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది - వేగవంతమైన టర్నరౌండ్, అంతరాయం లేని రీతిలో సౌకర్యవంతమైన గేట్ ఆపరేషన్‌లు, కస్టమర్‌లు రవాణా భాగస్వాములకు వేగవంతమైన డాక్యుమెంటేషన్‌ను అందిస్తుంది - కస్టమర్ అనుభవాన్ని పెంచుతుంది. ఈ సందర్భంగా కస్టమ్స్ ఁ సిజిఎస్టి ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్ . శ్రీధర్, ఐ ఆర్ ఎస్ వారు మాట్లాడుతూ బలమైన నియంత్రణ పర్యవేక్షణను కొనసాగిస్తూ, సౌకర్యవంతమైన రీతిలో వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో పోర్ట్ కార్యకలాపాలలో సాంకేతికత ఆధారిత పరివర్తనను చేర్చడం కీలక పాత్ర పోషిస్తుంది. ఇలాంటి డిజిటల్ కార్యక్రమాలు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తాయి, పారదర్శకతను నిర్ధారిస్తాయి. దిగుమతి మరియు ఎగుమతి లాజిస్టిక్ భాగస్వాములకు మరింత ఊహించదగిన వాతావరణాన్ని సృష్టిస్తాయి.." అని అన్నారు. "సాంకేతికత, సామర్థ్యం , కస్టమర్ కేంద్రీకృతతను మిళితం చేసే, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న పోర్ట్ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం. డిజిటల్ స్మార్ట్ గేట్ వ్యవస్థ ఆ దిశలో ఒక మైలు రాయి విజయం, ఇది భారతీయ పోర్ట్ రంగంలో వేగం, పారదర్శకత మరియు భద్రతకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమం అదానీ గంగవరం పోర్ట్‌ను డిజిటల్ ఆవిష్కరణలలో అగ్రగామిగా నిలిపింది, వినియోగదారులకు వేగవంతమైన, పారదర్శకమైన మరియు సమర్థవంతమైన కార్యకలాపాలను అందిస్తోంది మరియు భారతదేశ సముద్ర రవాణా రంగంలో ఆటోమేషన్ మరియు కార్యాచరణ శ్రేష్ఠతకు కొత్త ప్రమాణాన్ని నిర్దేశిస్తోంది.



# సైబర్ మోసాల బాధితులకు రూ.22.47 కోట్లు రీఫండ్

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** సైబర్ నేరాలపై కఠిన చర్యలు తీసుకుంటూ విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ మరో చారిత్రాత్మక మైలురాయిని నమోదు చేసింది. సైబర్ మోసాలకు గురైన బాధితులకు చట్టపరమైన ప్రక్రియల ద్వారా ఫ్రీజ్ చేసిన నిధులను తిరిగి అందిస్తూ రాష్ట్రంలోనే అత్యధికంగా 1,240 మంది బాధితులకు మొత్తం రూ.22.47 కోట్లను రీఫండ్ చేసి విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక గుర్తింపు సాధించింది. విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ అదనపు జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఐపీఎస్ చొరవతో సైబర్ నేరాలపై వేగంగా స్పందిస్తూ బ్యాంకులు సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకోవడం ద్వారా ఈ రీఫండ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, సైబర్ నేరాలపై వెంటనే స్పందించడం వల్లే బాధితుల డబ్బులను త్వరగా తిరిగి పొందగలిగామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, యాప్‌లను నమ్మవద్దని సూచించారు. 2019--2023 : రూ.1,10,54,183,2024 : రూ.3,75,56,655,2025 : రూ.12,63,01,520..2026 (ప్రస్తుతం వరకు) : రూ.4,98,42,011.. ఇప్పటివరకు మొత్తం రూ.22,47,54,369లను సైబర్ మోసాల బాధితులకు తిరిగి అందజేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇంకా మిగిలిన బాధితులకు కూడా బ్యాంకులతో సమన్వయం చేసుకుని హోల్డ్‌లో ఉన్న నిధులను తిరిగి అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సైబర్ నేరాలపై కఠిన చర్యలు సైబర్ క్రైమ్ కేసులపై దర్యాప్తు చేపట్టి ఇప్పటివరకు మొత్తం 558 మందిని అరెస్ట్ చేశారు. ఇందులో ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ కేసుల్లో 470 మంది, సోషల్ మీడియా సంబంధిత కేసుల్లో 88 మంది ఉన్నారు. లోన్ యాప్ మోసాలపై ప్రత్యేక చర్యలు..ఇన్‌స్టంట్ లోన్ యాప్ మోసాలపై చేపట్టిన చర్యల్లో భాగంగా సుమారు రూ.60 లక్షల విలువైన క్రిప్టోకరెన్సీ స్వాధీనం చేసుకుని, కోర్టు ఆదేశాల మేరకు 126 మంది బాధితులకు రూ.57,24,349 మొత్తాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. పెరుగుతున్న సైబర్ మోసాలు ప్రస్తుతం డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ ట్రేడింగ్ యాప్ మోసాలు, టాస్క్ ఆధారిత ఆన్‌లైన్ మోసాలు, రిమోట్ యాక్సెస్ యాప్ మోసాలు, లోన్ యాప్ వేధింపులు, సోషల్ మీడియా అకౌంట్ టేకోవర్, ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు క్రిప్టోకరెన్సీ ద్వారా డబ్బు మళ్లింపు వంటి మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరించారు... సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా, వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : ఇన్చార్జ్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి



**పాడేరు రూరల్ , మార్చి 11 (మనసులో మాట) :** బాల్య వివాహాల వల్ల సామాజిక రుగ్మత ను పెంచడమే కాకుండా, ఇలాంటివి చట్టరీత్యా నేరమని ఇన్చార్జ్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి స్పష్టం చేశారు. పాడేరు మండలం ఓనూరు, నందిగరువు గ్రామంలో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిరోధక అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండకుండా చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లలకు శారీరకంగా, మానసికకంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ముఖ్యంగా మాతా శిశు మరణాలకు బాల్య వివాహాలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఆడపిల్లకు 18 మగవానికి 20 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం జరిపించాలని తెలిపారు. చట్టపరమైన చర్యలు, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా 'బాల్య వివాహాల నిరోధక చట్టం' ప్రకారం కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యకు ప్రాధాన్యత అవగాహన లేని కారణంగా గిరిజన ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం జరుగుతుందన్నారు. చదువుకొని అవగాహన ఉన్న వారు వారి పిల్లలకు పెళ్లిళ్లు చేయకుండా, వారిని ఉన్నత చదువులు చదివించా గలుగుతున్నారని, ప్రభుత్వం ప్రభుత్వం నుండి వచ్చే రైతులను అందుపుచ్చుకొని వారి పిల్లలకు ఉన్నతమైన చదువులు చదివిస్తున్నారని పిలుపునిచ్చారు. గ్రామంలో ఎక్కడైనా బాల్య వివాహ ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అంగన్‌వాడీ కార్యకర్తలకు, సచివాలయ సిబ్బందికి లేదా 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమం పాల్గొనే ముందు ఓనూరు, నందిగరువు గ్రామాలలో స్కూల్స్,అంగన్వాడి సెంటర్, రేషన్ బియ్యం పంపిణీనిపై గ్రామస్తులు అడిగి తెలుసుకొని, స్కూలు అంగన్వాడి సెంటర్ను పరిశీలించి ఉపాధ్యాయులతో, స్కూల్ పిల్లలకి అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వసతులపై ఆరా తీశారు. గ్రామాంలోని గ్రామస్థులతో కలసి మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్, పీఎం జన్మన్ గృహ నిర్మాణ పనులపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇంకనూ గ్రామంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అయన అడగగా, గ్రామస్తులు నందిగరువు గ్రామంలో అంగన్వాడి సెంటర్, స్కూల్ భవనాలు లేదని గ్రామస్తులు కోరారు.ఆ రెండు ఏర్పాటు స్కూల్ భవనము అంగన్వాడి సెంటర్ ఏర్పాటు చేసినట్లయితే చుట్టుపక్కల గ్రామ పిల్లలు అధిక సంఖ్యలో వచ్చి విద్యాభియాసించే అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ గ్రామంలో సిట్ ఆర్గనైజేషన్ వారి తరఫున బాల్యవివాహాల పై అవగాహన రథం ద్వారా ప్రచారాన్ని నిర్వహిసస్తూ, గ్రామస్తులచే దింసాను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజరత్నం, వీధులపాలెం డాక్టర్ మనీష్ ,డిప్యూటీ ఎంపీడీవో రమేష్, ఎంఈఓ బి విశ్వనాథం,ఈ పి ఐ యు రవికుమార్, సిడిపిఓ జి. సరదా దేవి, స్థానిక గ్రామ సర్పంచ్, సిహెచ్ఓ చంద్రకళ, ఐసిడిఎస్ సూపర్వైజర్ కొండమ్మ, అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నర్సీపట్నంలో ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమం

## ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** గర్భాశయ ముఖ క్యాన్సర్ నుంచి ఆడపిల్లలను రక్షించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు లాంఛనంగా ప్రారంభించారు. 14 ఏళ్లు పూర్తి చేసుకుని 15 ఏళ్ల లోపు ఉన్న బాలికలకు ఆయన స్వయంగా దగ్గరుండి, ధైర్యం చెబుతూ వ్యాక్సిన్ వేయించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రద్దీని తగ్గించేందుకు తన ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన మూడు అదనపు ఓపీ కౌంటర్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా, ఆడపిల్లల భవిష్యత్తును కాపాడే ఇటువంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు పదివేల రూపాయల వరకు ఖర్చయ్యే ఈ ఖరీదైన టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని, అర్హులైన బాలికలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి విజ్ఞప్తి మేరకే కేంద్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తు చేస్తూ ఆమెకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీకా పంపిణీ విషయంలో వైద్య సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. వ్యాక్సిన్ వేసే ముందు బాలికల వయసును ఆధార్ కార్డు ద్వారా నిర్ధారించుకోవాలని, వారు అల్పాహారం తీసుకున్నారో లేదో అడిగి తెలుసుకోవాలని సూచించారు. టీకా వేసిన తర్వాత బాలికలను కనీసం అరగంట పాటు పర్యవేక్షణలో ఉంచాలని ఆదేశించారు.

ఈ వ్యాక్సిన్‌ను ప్రత్యేక కూలింగ్ వ్యాన్ల ద్వారా నేరుగా పాఠశాలలకే తీసుకెళ్లి విద్యార్థినులకు వేయాలని అధికారులను ఆదేశించారు. టీకా వల్ల ఒకవేళ చిన్నపాటి దుష్ప్రభావాలు కనిపిస్తే, వాటిని రాజకీయం చేస్తూ ప్రభుత్వ వైఫల్యంగా ప్రచారం చేయవద్దని మీడియాకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ సతీమణి పద్మావతి, కోడలు డాక్టర్ సువర్ణ, ఆర్డీవో వివి రమణ, ఎమ్మార్వో రామారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.హైమావతి, డీఐఓ చంద్రశేఖర్ దేవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధా శారద, పర్యవేక్షణ కమిటీ సభ్యులు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చెరువు గట్టు తవ్వి అక్రమంగా జిరాయితీ పొలంలో

# రోడ్డు వేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలి



**నర్సీపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజవర్గం గొలుగొండ మండలం కొత్త మల్లంపేట రెవెన్యూ చెందిన సర్వేనెంబర్ 23 లో లింగంపేట గ్రామానికి చెందిన సీరంరెడ్డి మాణిక్యం కు జిరాయతి భూమి ఉంది. అయితే గత సోమవారం రాత్రి కొంతమంది వ్యక్తులు భూమిలో ఉన్న దాదాపు 50 సర్వే మొక్కలను తొక్కి వేసి మా జరాయితి భూమిలో జెసిబి, బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో మా భూమిలో అడ్డంగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణము మా భూమి నందు లింగంపేట పంచాయతీకి చెందిన కొంతమంది నాయకులు, వి.ర్.ఓ. దగ్గర ఉండి రాత్రి పూట నిర్మాణం చేయడం చేయటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతే కాకుండా పక్కనే ఉన్న జగడాల బండ చెరువు తాలూకా ప్రధాన గట్టును పూర్తిగా తొలగించి ఈ రోడ్డు నిర్మాణం చేయడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మేము టిడిపి పార్టీ ఓటు వేసిన కారణంగా గ్రామానికి చెందిన నాయకులు మా మీద కక్ష కట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినా వీరి ఆగడాలు చేస్తున్నారని అన్నారు. తన జరాయితీ భూమి నందు తన అనుమతి లేకుండా రోడ్డు వేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపైన స్థానిక ఎమ్మార్వో కు స్థానిక పోలీస్ స్టేషన్ కు, ఎంపీడీవో ఆఫీస్ కూడా ఫిర్యాదు చేయడం జరిగిందని, దీనిపైన అధికారులు తక్షణమే స్పందించి తమకు న్యాయం చేయవలసిందిగా కోరారు. లేని యెడల జిల్లా కలెక్టర్ కి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయడం జరుగుతుందని తన భూమి పైకి వచ్చి మమ్మల్ని బెదిరించడం కాకుండా అన్యాయంగా రోడ్డు నిర్మిం చడం జరుగుతుందని వారిపైన తక్షణమే చర్యలు తీసుకోవాలని వారి నుండి మాకు ప్రాణహాని కూడా ఉందని,రక్షణ కల్పించవలసిందిగా వారు కోరుతున్నారు.



# రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి

**చీడికాడ , మార్చి 11 (మనసులో మాట) :** రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేస్తున్నారని మండల టిడిపి అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు అన్నారు మండలంలో ఇంటిపాలెం గ్రామంలో సిసి రోడ్డు పనులను మండల టిడిపి అధ్యక్షులు పోతల చిన్నంనాయుడు బుధవారం ప్రారంభించారు

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మండలంలో తుని వలస ఇంటి పాలెం గ్రామాలకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి 27 లక్షలు నిధులు మంజూరు చేయడం జరిగింది ఈ నిధులతో రెండు గ్రామాల్లో సీసీ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి అన్నారు

ఈ కార్యక్రమంలో కోణం రిజర్వాయర్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్యాడ చిన్నంనాయుడు గ్రామ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు విసారపు నాగేశ్వరరావు మెంబర్ నానాజీ టిడిపి నాయకులు సిరసపల్లి నానాజీ నారాయణరావు దొడ్డి శ్రీనివాసరావు పడాల తాతారావు కాకర కొండమ్మ బిజెపి నాయకులు సిరసపల్లి గౌరీ శంకర్ పాల సంఘం అధ్యక్షులు గొర్లి అప్పారావు జనసేన నాయకులు సిరసపల్లి శివ నీటి సంఘం డైరెక్టర్లు లంక రమణ బాబు సిరసపల్లి జగ్గారావు పాల్గొన్నారు

# కార్యకర్తల సహకారంతోనే మహిళా దినోత్సవ వేడుకలు విజయవంతం

## - మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి



**అనకాపల్లి రూరల్ , మార్చి 11 (మనసులో మాట) :** మంగళవారం స్థానిక లక్ష్మీదేవి పేట సీతారామ కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక లక్ష్మీదేవిపేట మహిళల సహాయ, సహకారాలతో విజయవంతం అయిందని మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఓరుగంటి నాగమణి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈశ్వరరావు అలాగే జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం గొప్ప విషయమన్నారు.

ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలలు నుంచి వ్యయ ప్రయాసలతో మహిళలు హాజరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మహిళలకు బిజెపిలో మహిళలకు సముచిత స్థానం, అధిక ప్రాధాన్యత ఉంటుందనుటకు ఈ సదస్సు నిదర్శనం అన్నారు.

### వాడ్రాపల్లి పారిపల్లెమ్మ అమ్మవారిని దర్శించుకున్న

# టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ



**మునగపాక , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో వెలసి ఉన్న పారిపల్లెమ్మ అమ్మవారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,శ్రీధర్మ ఫౌండేషన్ ఛైర్మన్ కర్రి సాయికృష్ణతో పాటు జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు,గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని,అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని సాయికృష్ణ ప్రార్థించారు. అనంతరం అమ్మవారి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కూడా సాయికృష్ణ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్,తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరాహ నర్సింగరావు,తెలుగు రైతు మునగపాక మండల అధ్యక్షుడు మళ్ల శేషు,వాడ్రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆడారి బాలాజీ,మళ్ల శంకర్,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీని కలిసిన దిమ్మల శివ

**మునగపాక , మార్చి 11 (మనసులో మాట) :** వైసీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త, చోడవరం మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీని మంగళవారం మునగపాక మండల వైసీపీ అధ్యక్షులు దిమ్మల శివ మర్యాదపూర్వకంగా కలిశారు.దీనిలో భాగంగా ధర్మశ్రీని కలిసి గజమాల,శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ నెంబర్ బీలా అప్పలనాయుడు,మాజీ కోపరేట్ డైరెక్టర్ మర్లపల్లి రామకృష్ణ,ఎలక నూకరాజు,ఎస్సీ విభాగం నెంబర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న గురుకుల విద్యార్థులు

## - అమ్మవారు తీర్థ ప్రసాదములు అందజేసిన ఆలయ కమిటీ



**అనకావల్లి రూరల్ , మార్చి 11 (మనసులో మాట) :** రాష్ట్రంలో పేరొందిన నూకాంబిక అమ్మవారిని అనకావల్లి పట్టణంలో గల మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు బుధ వారం దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్లబాబు), ధర్మ కర్తల ఆధ్వర్యంలో నూకంబిక అమ్మవారి ఆలయం లో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న గురుకులం లోని విద్యార్థులు పరీక్షలు బాగా రాసి,తమ తల్లిదండ్రులు యొక్క ఆశయాలకు అనుగుణంగా ఉన్నత స్థానానికి చేరాలని వేదమంత్రోచ్చారణతో దీవించారు. దేవాలయం ఆవరణలో గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డాక్టరు జోశ్యుల ఉష విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ శ్రీ నూకాంబిక అమ్మవారి యొక్క దీవెనలు మీకు ఎల్లప్పుడూ ఉంటాయని, పదో తరగతి పరీక్షలు బాగా రాసి గురుకులానికి, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని దీవించారు.పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ కర్రి గంగాధర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులకు దూరంగా ఉన్న, వారి యొక్క ఆశలు, ఆలోచనలు పిల్లల భవిష్యత్తు గురించి ఉంటాయని, పరీక్షలు బాగా రాసి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,దేవాలయ సిబ్బంది, విద్యార్థులకు తీర్థప్రసాదాలు అందించారు.అనంతరం పాఠశాల ఆవరణలో 10వ తరగతి విద్యార్థులచే "తల్లికి వందనం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పట్ల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ కు ధన్యవాదములు తెలియజేశారు.

# పారిపల్లెమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరప్పు



**మునగపాక , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో శ్రీపారిపల్లెమ్మ అమ్మవారిని యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేతో అమ్మవారికి విశేష పూజలు చేయించారు. అనంతరం ఆలయ పెద్దలు విజయ్ కుమార్ ని సత్కరించి,తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో యలమంచిలి నియోజకవర్గ టీడీపీ నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన అధ్యక్షులు టెక్కలి పరశురామ్,తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరాహ నర్సింగరావు,టీడీపీ సీనియర్ నాయకులు కాండ్రేగుల నూక అప్పారావు,జనసేన నాయకులు చొప్పా శ్రీను,టీడీపీ సీనియర్ నాయకులు దాడి ముసిలినాయుడు,సూరిశెట్టి రాము,మండల జనసేన నాయకులు ఆడారి గణేష్,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# జొన్నాడ పిఎసిఎస్ కార్యకలాపాలపై డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున సమీక్ష



**నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ , మార్చి 11 (మనసులో మాట) :** విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ ) చైర్మన్ శ్రీ కిమిడి నాగార్జున గారు జొన్నాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పిఏసిఎస్)ను సందర్శించి కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్, సీఈఓ, సిబ్బందితో సమావేశమై డిపాజిట్లు పెంచడం, ఋణ పోర్ట్‌ఫోలియో విస్తరణ పై పలు సూచనలు చేశారు. రైతుల అభివృద్ధికి పిఎసిఎస్ లు కీలకమని పేర్కొంటూ విజయనగరం డిసిసిబి సహాయంతో ఆధునిక వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపది కన రైతులకు అందించడంతో పాటు సాంకేతిక సహాయం కల్పించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఋణాల మంజూరులో డ్యూ డిలిజెన్స్ పాటించి రికవరీలు మెరుగుపరచాలని సిబ్బందికి సూచించారు. సొసైటీ ఆర్థిక పరిస్థితిని సమీక్షించి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

# నెల్లిమర్ల ఎంజెపికి 'పిఎంశ్రీ' తో కొత్త వెలుగులు

- రూ.1.80 కోట్లతో భవన నిర్మాణాలు
- శరవేగంగా నిర్మాణ పనులు



**నెల్లిమర్ల , మార్చి 11 (మనసులో మాట) :** నెల్లిమర్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల దశాబ్దాల వసతి సమస్యకు త్వరలో తెరపడనుంది. కేంద్ర ప్రభుత్వ 'పిఎంశ్రీ' పథకం కింద మంజూరైన నిధులతో పాఠశాల రూపురేఖలు మారడమే కాకుండా, విద్యార్థినులకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి రానున్నాయి.

**అదనపు తరగతి గదుల నిర్మాణం - శరవేగంగా పనులు :**

పాఠశాల ఆవరణలో సుమారు రూ. 1.80 కోట్ల భారీ వ్యయంతో అదనపు భవనాల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొత్తగా 8 గదులు నిర్మాణం చేపడుతున్నారు. 5 అత్యాధునిక ల్యాబ్‌లు,1 డిజిటల్ లైబ్రరీతో పాటు ?రెండు అదనపు తరగతి గదుల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి.

**మూడు దశాబ్దాల ప్రస్థానం - పెరుగుతున్న అవసరాలు:**

ఈ విద్యా సంస్థ ప్రస్థానం పరిశీలిస్తే, వసతుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. 1992లో పాఠశాలగా ప్రారంభమై వేలాది మంది గ్రామీణ విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించింది. 2018లో ఈ పాఠశాల ప్రాంగణంలోనే జూనియర్ కళాశాల కూడా మంజూరైంది. గత ఆరేళ్లుగా పాఠశాలకు చెందిన పాత భవనాల్లోనే ఇటు పాఠశాల, అటు కళాశాల రెండూ నిర్వహించాల్సి రావడంతో విద్యార్థినులు ఇరుకు గదుల్లో తీవ్ర ఇబ్బందులు పడేవారు. "పిఎంశ్రీ నిధులతో చేపట్టిన ఈ నిర్మాణాలు వచ్చే విద్యా సంవత్సరం (2025-26) ప్రారంభం నాటికే అందుబాటులోకి వస్తాయని కన్వీనర్ ప్రిన్సిపాల్ బిబి రావు వెల్లడించారు. దీనివల్ల ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మరియు పాఠశాల పిల్లలకు విడివిడిగా తరగతులు నిర్వహించు కోవడానికి, ప్రాక్టికల్స్ చేసుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.

# మాకు న్యాయం చేయాలంటూ విద్యార్థినిలు ఆందోళన



**చీడికాడ , మార్చి 11 (మనసులో మాట) :** పోషకాహారమైన భోజనాలు మెనూ ప్రకారం అమలపరచాలని హాస్టల్లో మెనూ ప్రకారం పోషకాహారమైన భోజనాలు అమలు పరచాలని బీసీ హాస్టల్ బాలికల విద్యార్థు నిలు రోడ్డుపై బయటాయించి నిరసన వ్యక్తం చేశారు ..మండలం కేంద్రంలో గల బిసి బాలికల హాస్టల్ విద్యార్థు నిలు బుధవారం పాఠశాలలో తరగతులు ముగించుకొని వచ్చి హాస్టల్ ముందు పోషకాహారమైన భోజనాలు పెట్టాలని, చాలీచాలని భోజనం పెడుతున్నారని ఆందోళన చేశారు ఈ విషయంపై డిప్యూటీ డైరెక్టర్ శ్రీదేవి మంగళవారం సాయంత్రం గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి అనంతరం హాస్టల్ కు వచ్చి హాస్టల్ భవనం పరిశీలించి తొందరలోనే విద్యార్థ నీ లకు కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారని అనంతరం వార్డెన్ తో మాట్లాడి విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారమైన భోజనం అందించాలని ఆదేశించి వెళ్లరని అయినప్పటికీ కూడా బుధవారం ఉదయం అల్పా హారం నాణ్యతలేని కిచిడీ చేసి చట్నీ లేకుండా వడ్డించారని అందువలన విద్యార్థులు చాలా వరకు కూడా కడుపునిండా అల్పాహారం తినలేదని హాస్టల్ విద్యార్థులు గగ్గోలు పెడుతూ రోడ్డుపై బయటయించడం జరిగింది. అంతే కాకుండా విద్యార్థు లు విలేకరులతో మాట్లాడుతూ మాకు హాస్టల్లో భోజనాలు మెనూ ప్రకారం అమలు అయ్యేటట్లు చూడాలని దీనిపై అధికారులు చొరవ తీసుకొని తక్షణవే న్యాయం చేయాలంటూ విద్యార్థులు కన్నీరు వంతవై తెలియజేశారు అంతే కాకుండా హాస్టల్ భవనం కూడా సరిపోవడం లేదని మాకు పక్కా భవనం నిర్మించాలని వేడుకుంటున్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న బీసీ హాస్టల్ బాలికలు

అంతేకాకుండా డిప్యూటీ డైరెక్టర్ మేడం హాస్టల్ వర్కర్లకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు పై అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలని విద్యార్థినిలు వేడుకున్నారు

# 48వ వార్డులో గుడ్ మార్నింగ్ గంకల చొరవతో నూతన వీధి దీపాలు

## కొండ ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటుపై ఫలించిన గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి



**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్, నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయాలని 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్,ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు పలుమార్లు వినతులు చేశారు .గంకల కవిత అప్పారావు యాదవ్ పిర్యాదుపై అధికారులు స్పందించి బుధవారం వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా 48వ వార్డునకు రూ.16.5 లక్షలతో నూతన రింగ్ పోల్స్,6 మీటర్ల పోల్స్ 35,45 వీధి దీపాలు కేటాయించినట్లు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు.ఇందులో భాగంగా వార్డులో గల బాపూజీ నగర్,రామకృష్ణ నగర్, నీలకంఠ నగర్, శివలింగ పురం, పల్నాటి కాలనీ, న్యూ శ్రీనివాస్ నగర్ లో ఏ ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్ అవసరం ఉన్నది అనేది అధికారులతో కలిసి గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటించి పలు చోట్ల పోల్స్ ఏర్పాటు చేశారు.పగలు, రాత్రి తేడా లేకుండా ఉదయం నుంచి కార్మికులతో కలిసి మధ్యాహ్నం భోజనం విరామం లేకుండా కార్మికులతో రాత్రి వరకు ఉండి వార్డులో నూతన పోల్స్,లైట్స్ ఏర్పాటుకు సూచనలు చేశారు.ఈ సందర్భం గా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డు అంతా కొండ ప్రాంతం కావడంతో చీకటి ప్రదేశం నెల కొంటుందని,ఈ చీకటి ప్రదేశంలో ఆకతాయిల ఆగడాలు పెరుగు తున్నా యని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని పలుమార్లు కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్,జీవీఎంసీ మేయర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండి లకు వార్డులో నూతన రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి అందజేయడం జరిగిందని, ఇదే విషయంపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డులో రింగ్ పోల్స్ అవశ్యకత ఉందని ప్రజల ద్వారా తెలుసుకొని గత నాలుగు ఏళ్లగా పోరాటం చేశామని ఈ పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.పలు మార్లు అందించిన వినతులపై జీవీఎంసీ కమిషనర్,మేయర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్పందించి వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ కేటాయించడం జరిగిందని,వాటిని బాపూజీ నగర్,రామకృష్ణ నగర్,నీలకంఠ నగర్ లో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.త్వరలో మరి కొన్ని చోట్ల హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేసి వార్డు అంతట విద్యుత్ దీపాల వెలుగులను కురిపిస్తామన్నారు. వార్డులో అధికారులతో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చినట్లు గంకల పేర్కొన్నారు.అతి త్వరలో వార్డులో మరిన్ని వీధి దీపాలు,సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని గంకల హామీ ఇచ్చారు.ప్రతి క్షణం వార్డు అభివృద్ధి కోసమే కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.48వ వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు పట్ల గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి ఫలించిందని, వార్డులో గంకల కవిత అప్పారావు యాదవ్ కృషితో నూతన వెలుగులు వెలగడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ సూచించారు.

# గిరిజన మహిళలకు '3డి ప్రింటింగ్ - వెదురు కళాకృతుల'పై రెండు రోజులు శిక్షణ : ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వరరావు




**పాడేరు , మార్చి 11 (మనసులో మాట) :** గిరిజన మహిళల ఆర్థిక సాధికారత మరియు సుస్థిర జీవనోపాధిని పెంపొందించడమే లక్ష్యంగా, ఈ శిక్షణా కార్యక్రమాన్ని పాడేరు ఐటిడిఏ మరియు విశాఖపట్నం గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల మరియు భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, ఇన్చార్జ్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, ఏపిఓ (పివిటిజి) ఏం.వెంకటేశ్వరరావు తెలిపారు. పాడేరులోని 'కాఫీ హౌస్' వేదికగా మంగళవారం నాడు షెడ్యూల్డ్ తెగలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరియు హస్తకళలు విక్రయించే మహిళలకు రెండు రోజులుపాటు ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు . కార్యక్రమలో ఇంచార్జ్ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, ఏపిఓ (పివిటిజి ) వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పదవ తరగతి కనీస అర్హత కలిగిన వివిధ మండలాల నుండి వచ్చిన సుమారు 60 మంది గిరిజన మహిళలు ఈ శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుత ప్రయోజనాలకు అనుగుణంగా ఆధునిక యంత్రాల వినియోగం మరియు నాణ్యమైన వస్తువుల తయారీపై వీరికి పూర్తి అవగాహన కల్పించనున్నారు. సంస్కృతి,సాంప్రదాయలకు అనుగుణంగా ప్రకృతిలో లభ్యమయ్యే వెదురును ఉపయోగించి, హస్తకళలల తయారీలో ఆధునికత 3డి ప్రింటింగ్ సాంకేతికతతో కూడిన మెలకువలను, వెదురుతో కూడిన అల్లికలను, (బాంబు ఫ్యూషన్), వినూత్నమైన కళాకృతులను ఎలా తయారు చేయాలనే అంశంపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిం చామని వీటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని తెలిపారు. గిరిజన మహిళలు ఇటువంటి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థికం గా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ వినూత్న సాంకేతికత ద్వారా మార్కెట్లో గిరిజన ఉత్పత్తులకు మంచి గిరాకీ లభించే అవకాశం ఉందని, శిక్షణ నిర్వహించిన నిర్వాహకులు తెలి పారు. ఈ కార్యక్రమం లో బి. కీర్తి ప్రియ ప్రిన్సి పాల్, గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల, విశాఖ పట్నం. డి.పి.ఎం (వెలుగు), పాడేరు. ఐ సి డి ఎస్ పరిపాలనా అధికారి, శిక్షణ పొందుతున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికలు మరియు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే

# కఠిన చర్యలు తప్పవు : ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం, మార్చి 11 (మనసులో మాట) :** విజయనగరం జిల్లా నెల్లిమర్ల పోలీసు స్టేషనులో 2025 సం. మే నెలలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన పంది నారాయణ (24 సం. లు) అనే వ్యక్తికి విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి శ్రీమతి కే.నాగమణి గారు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 6,000/-లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ. 5 లక్షలను మంజూరు చేయాలని మార్చి 11న తీర్పు వెల్లడించినట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. నెల్లిమర్ల మండలం, కొండవెలగాడ గ్రామానికి చెందిన పంది నారాయణ అదే గ్రామానికి చెందిన ఒక 16ఏళ్ళ మైనరు బాలికతో ఇన్స్టాగ్రాంలో పరిచయం పెంచుకొని, సంవత్సరం నుండి ప్రేమిస్తున్నానని నమ్మించి, ఆ బాలికను అనేక సార్లు శారీరకంగా అనుభవించి మోసం చేసాడన్నారు. ఆ బాలిక గర్భం దాల్చడంతో, అది గమనించిన బాలిక తల్లితండ్రులు ఈ విషయాన్ని గ్రామ పెద్దల వద్ద ప్రస్తావించగా నిందితుడు బాలికను పెళ్లి చేసుకుంటానని ఒప్పుకొని, పెళ్లి చేసుకోకుండా దాటవేస్తు కాలయాపన చేసేవాడు. తేది 15.05.2025న కడుపునొప్పితో బాధపడగా ఆ బాలికకు అబార్షన్ అయిందని, వెంటనే బాలికను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ బాలిక ఇచ్చిన స్టేట్మెంట్ మేరకు నెల్లిమర్ల పోలీసు స్టేషను ఎస్ఐ బి.గణేష్ తే.15.05.2025దిన పోక్సో కేసు నమోదు చేశారన్నారు. అనంతరం అప్పటి విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టి, ముద్దాయిని అరెస్ట్ చేసి, రిమాండుకు తరలించి, నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తి చేసేటట్లు పోలీసు మరియు జ్యుడిషియల్ అధికారులు చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. నిందితుడు పంది నారాయణ (24 సం. లు) పై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు కె.నాగమణి నిందితుడికి 20 సంవత్సరాలు కఠిన కారాగారం మరియు రూ. 6,000/-ల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షల మంజూరు చేస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పును వెల్లడించారన్నారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసుల తరుపున ఫోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎస్.రామమూర్తి నాయుడు వాదనలు వినిపించారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసి, నిందితుడిని శిక్షించబడే విధంగా సమర్ధవంతంగా పని చేసిన అప్పటి విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్, సి.ఎం.ఎస్. హెచ్సి సిహెచ్. రామకృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబులు ఎ.మురళి, స్పెషల్ పిపి ఎస్.రామమూర్తి నాయుడులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. పోక్సో కేసులలో శిక్షలు పరంగా రాష్ట్రంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, మైనర్ బాలికలు మరియు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ తీవ్రంగా హెచ్చరించారు. బాలికలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, బాగా చదువుకొని వారి భవిష్యత్తు మీద దృష్టి సారించి తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పే మోసగాళ్ళ మాటలునమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేసారు.



# మూలపేట శ్మశానవాటికలో శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

**మునగపాక , మార్చి 11 (మనసులో మాట) :** మూలపేట గ్రామాభివృద్ధికి తెలిపారు.ప్రజల సహకారం మరువలేనిదని సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు మూలపేట శ్మశానవాటిక అభివృద్ధిలో భాగం గా జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలపేటకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుధ్యం మెరుగునకు కృషి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణ కొరకు ట్రాఫిక్ సోల్జర్స్ : సిపి సంఖభ్రత బాగ్చి



**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** విశాఖపట్నం సిటీలో ట్రాఫిక్ పోలీసులు ప్రజల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మరియు ట్రాఫిక్ నియంత్రణ కొరకు ట్రాఫిక్ సోల్జర్స్ అనే వినూత్న కార్యక్రమంను 206 మంది ట్రాఫిక్ సోల్జర్స్ తో విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సోల్జర్స్ ముఖ్యమైన ట్రాఫిక్ జంక్షన్ లలో, పాఠశాల జంక్షన్ లలో, మార్కెట్లు, ఆసుపత్రులు మొదలగు ప్రదేశాలలో రద్దీ సమయంలో ట్రాఫిక్ నియంత్రించడంలో సహాయపడవలెననీ, ప్రధాన కూడళ్ళలో పాద చారులు, వృద్దులు, మహిళలు, చిన్నారులు సురక్షితంగా రోడ్లను దాటడంలో సహాయపడవలనీ. రోడ్డు వాహనదారులకు హెల్మెట్లు మరియు సీట్ బెల్ట్స్ ఉపయోగించేలా అవగాహన కల్పించవలనీ, డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మొబైల్ ఫోన్ వాడకుండా ఉండేలా సలహా ఇవ్వవలనీ, పండుగలు, ర్యాలీలు మరియు వి.ఐ.పి.ల రాక సమయంలో ట్రాఫిక్ ను మరింత సమర్ధవంతంగా నిర్వహించేలా సహాయపడవలెననీ, సిగ్నల్ జంప్, రాంగ్ పార్కింగ్, రాష్ డ్రైవింగ్ చేసిన వారి వివరాలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స అందేలా చూడటం మరియు అత్యవసర సేవల కొరకు ఎమర్జెన్సీ నెంబర్ లకు కాల్ చేయాలన్నారు,ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి సీసీ కెమేరాలలో రికార్డ్ అయిన ప్రమాద దృశ్యాలను చూపించి, ఆ ప్రమాదాలకు గల కారణాలను వివరించారు. బుధవారం నుండి ఈ ట్రాఫిక్ సోల్జర్స్ సంబంధిత ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ల పరిధులలో విధులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏ డి సి పి . కె ప్రవీన్ కుమార్, ట్రాఫిక్ ఏసిపి ,ఎస్. వాసుదేవ్ , ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

# శిరస్త్రాణం ధరించండి : ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు



**శ్రీకాకుళం , మార్చి 11 ( మనసులో మాట ) :** హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. రామారావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించిన హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది హెల్మెట్ అవశ్యకత,రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి హెల్మెట్ అవసరాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నివారించాలని కోరారు.





# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన అవసరం లేదు

- రొయ్యల రైతులు పానిక్ హార్వెస్టింగ్ చేయొద్దు
- వదంతులను నమ్మకుండా శాస్త్రీయంగా అక్వాకల్చర్ కొనసాగించాలి
- షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి / శ్రీకాకుళం , మార్చి 11 (మనసులో మాట)** : గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రొయ్యల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ (APSADA) కో-వైస్ ఛైర్మన్, నాన్-ఆఫీషియల్ కమిటీ సభ్యులు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియా లో వచ్చిన వార్తలు, మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మన దేశ సముద్ర ఆహార ఎగుమతులపై చూపే ప్రభావం గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మధ్యప్రాచ్య (గల్ఫ్) ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మీడియాలో వచ్చిన వార్తల వల్ల కొంతమంది ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులపై ప్రభావం ఉంటుందనే భయంతో ముందస్తు లేదా పానిక్ హార్వెస్టింగ్ చేయడం సరికాదని రైతులకు సూచించారు. భారతదేశం నుండి జరిగే మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లేది కేవలం 3,4 శాతం మాత్రమేనని, అది కూడా ప్రధానంగా హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుందని తెలిపారు. ఇతర దేశాలకు యూరోపియన్ యూనియన్ , అమెరికా , జపాన్, చైనా వంటి దేశాలకు వెళ్లే సముద్ర ఆహార కంటైనర్లు రెడ్ సీ సూయెజ్ కాలువ మార్గం, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం, చైనా సముద్ర మార్గం ద్వారా నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

**అమెరికా టారిఫ్‌లతో పోటీ సామర్థ్యంపై ప్రభావం లేదు**

అమెరికా మార్కెట్‌లో డిమాండ్ 2026 మార్చి నెలాఖరుకు మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా సీ ఫుడ్ ఎక్స్పో నార్త్ అమెరికా (మార్చి 15 -17, 2026, బోస్టన్, అమెరికా) అనంతరం డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అమెరికా మార్కెట్‌లో సాధారణంగా 50 మరియు 60 కౌంట్ రొయ్యలకు మంచి డిమాండ్ ఉంటుందని, ఇవి ఆంధ్రప్రదేశ్ రైతులు సాధారణంగా ఉత్పత్తి చేసే సైజులు కావున ఆ కౌంట్ వచ్చే వరకు మధ్యస్థ పట్టుబడులు చేయనవసరం లేదన్నారు. భారతీయ రొయ్యలపై అమెరికా విధించే సుమారు 20 శాతం టారిఫ్ సహా ఇతర పోటీ దేశాలపై ఉన్న టారిఫ్‌లతో సమానంగా ఉండటం వల్ల అంతర్జాతీయ సముద్ర ఆహార ఎగుమతి మార్కెట్‌లో భారతదేశ పోటీ సామర్థ్యం కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

**షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం**

ప్రస్తుతం షిప్పింగ్ కంటైనర్ల కొరత ఉందని ప్రచారం జరుగుతున్న వార్తలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతులు ప్రభావితం అవుతున్న పరిస్థితి ప్రస్తుతం లేదని, అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంటైనర్లు ఇప్పటి వరకు వెనక్కి రాలేదని తెలిపారు. ఎగుమతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, రైతులకు సమయానుకూల సూచనలు అందించేందుకు ప్రతి నెల చివరి వారంలో APSADA డైరెక్టర్లు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతదేశం , యూరోపియన్ యూనియన్ మధ్య కొనసాగుతున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు పూర్తైతే భారత సముద్ర ఆహార ఎగుమతు లకు మరింత మార్కెట్ అవకా శాలు లభించి భవిష్యత్తులో ఎగుమ తులు పెరగడానికి దోహద పడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**ఆక్వా రైతులు ఆందోళన చెందొద్దు**

ఆక్వా రైతులు భయంతో లేదా ముందస్తు హార్వెస్టింగ్ చేయన వసరం లేదని, ఇలా చేయడం వల్ల మార్కెట్‌లో ఒకేసారి అధిక సరఫరా ఏర్పడి రొయ్యల ధరలు పడిపోవ డం, రైతులకు ఆర్థిక నష్టం కలగడం జరిగే అవకాశం ఉ ందన్నారు. రైతులు ఎగుమతి దారులు మరియు మత్స్యశాఖ అధికారుల సలహాలతో తమ ప్రణాళిక ప్రకారం కల్చర్ సైకిల్ పూర్తయ్యాక మాత్రమే సరైన సమయంలో హార్వెస్టింగ్ చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ అంతర్జాతీ య పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు , ఇతర సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేస్తూ రాష్ట్రం నుండి సముద్ర ఆహార ఎగుమతులు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రొయ్యల రైతులు నిరాధారమైన వార్తలు , వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా, శాస్త్రీయ విధానంలో అక్వాకల్చర్ కార్యకలాపాలను కొనసాగించాలని మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు కోరారు.



## నకిలీ నోట్ల చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట)** : విశాఖ నగరంలో నకిలీ నోట్ల చలామణి చేసేందుకు ప్రయత్నం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను గుట్టును మహారాణిపేట పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా మహారాణిపేట స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను ఏసీపీ ఈస్ట్ కొండపల్లి లక్ష్మణ మూర్తి వెల్లడించారు. విశాఖ నగరాన్ని కేంద్రంగా చేసుకుని నకిలీ నోట్ల చలామణికి కుట్ర పన్నిన 10 మంది సభ్యుల అంతర్రాష్ట్ర ముఠాను అరెస్ట్ చేయడం జరిగిందని, వీరంతా వివిధ జిల్లాలకు చెందిన వారని ఆయన తెలిపారు. ?మహారాణిపేట ఇన్స్‌పెక్టర్ జి. దివాకర్ యాదవ్ కి అందిన పక్కా సమాచారంతో, సోమనాథ్ మెడికల్ షాప్ వద్ద వాహన తనిఖీలు చేపట్టామని ఏసీపీ పేర్కొన్నారు. జగదాంబ నుంచి కలెక్టర్ ఆఫీస్ వైపు వెళ్తున్న ఒక స్విఫ్ట్ కారును ఆపి తనిఖీ చేయగా, అందులో ముగ్గురు వ్యక్తులు నకిలీ కరెన్సీతో పట్టుబడ్డారని వెల్లడించారు. వారిని లోతుగా విచారించిన తరువాత, శరత్ థియేటర్ సమీపంలోని గీత ఇన్ లాడ్జిలో ఉన్న మరో ఏడుగురు ముఠా సభ్యులను కూడా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ?వీరి వద్ద నుండి దాదాపు రూ. 37.70 లక్షల విలువైన నకిలీ నోట్లను, అలాగే రూ. 3,34,500 అసలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఒక కారు, 12 మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని, ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన మహారాణిపేట ఇన్స్‌పెక్టర్, ఎస్సైలు, టాస్క్ ఫోర్స్ బృందాన్ని అభినందిస్తున్నట్లు కొండపల్లి లక్ష్మణమూర్తి వివరించారు.

## పెట్రోల్ డీజిల్ నిల్వల కొరతతో జీకేవీధి జీసీసీ బంక్ మూసివేత



**గూడెంకొత్తవీధి , మార్చి 11 (మనసులో మాట)** : మండలంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ నిల్వలు పూర్తిగా లేకపోవడంతో బంక్‌ను తాత్కాలికంగా మూసివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇంధన సరఫరా నిలిచిపోవడంతో వాహనదారులకు ఇంధనం అందించలేని పరిస్థితి ఏర్పడినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. గూడెంకొత్తవీధి మండల పరిధిలో ఉన్న ఈ బంక్ పరిసర ప్రాంతాల ప్రజలకు మాత్రమే కాకుండా అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కూడా ముఖ్యమైన ఇంధన కేంద్రంగా నిలిచింది. ఈ మార్గం ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా అడవులు, కొండ ప్రాంతాల గుండా సాగుతున్న ఈ రహదారిపై ఇంధన కేంద్రాలు తక్కువగా ఉండటంతో ఈ బంక్ ప్రయాణికులకు కీలకంగా మారింది. అయితే ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ నిల్వలు లేకపోవడంతో బంక్ మూసివేయబడటంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి వచ్చే లారీలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ బంక్‌పై ఆధార పడుతుండటంతో ఇంధన కొరత సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో ఈ రహదారి గుండా ప్రయాణించే వాహనదారులు ముందస్తు జాగ్రత్తగా తమ వాహనాలలో పూర్తిస్థాయిలో పెట్రోల్, డీజిల్ నింపుకొని ప్రయాణించాల్సిందిగా బంక్ నిర్వాహకులు సూచించారు. ముఖ్యంగా అంతర్రాష్ట్ర ప్రయాణాలు చేసే వాహనదారులు మార్గమధ్యంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. ఇంధన సరఫరా త్వరలోనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిల్వలు అందుబాటులోకి వచ్చిన వెంటనే బంక్‌ను మళ్లీ ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. అంతర్రాష్ట్ర రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఇంధన సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రెండో రోజూ ఏసీబీ తనిఖీలు



**విజయనగరం , మార్చి 11 (మనసులో మాట)** : విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో రెండో రోజు బుధవారం కూడా ఎసిబి తనిఖీలు కొనసాగాయి. ఉదయం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్న ఎసిబి అధికారులు రికార్డులను పరిశీలించారు. ఆ రికార్డుల ఆధారంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని వెంటపెట్టుకుని పలు నిర్మాణాలను పరిశీలించారు. పలు డివిజన్ల ప్లానింగ్ కార్యదర్శులను కూడా రప్పించుకొని వివరాలను ఆరాతీశారు. లైసెన్స్ సర్వేయర్లను కూడా కార్యాలయానికి పిలిపించి, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రెండో రోజు కూడా ఎసిబి తనిఖీలు నిర్వఎట్టించడంతో కార్యాలయం మూగబోయింది. రికార్డులు పరిశీలించిన ఎసిబి అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకున్నట్లు సమాచారం. వివరాలు బయటకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచారు. భవన నిర్మాణాల అనుమతుల విషయంలో వస్తున్న ఆరోపణలు, విమర్శలు వాస్తవమో, కాదో తెలియాల్సి ఉంది.

ఈ తనిఖీల్లో పలు భవనాలకు సంబంధించిన అనుమానాలను టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి అడిగి తెలుసుకుని రాసుకున్నట్లు తెలిసింది. రెండో రోజు తనిఖీల్లో ఎసిబి డిఎస్‌పి, సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 34వ వార్డు డిజిటలైజేషన్ పై వాసుపల్లి దిశ నిర్దేశం



**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట)** : దక్షిణ నియోజకవర్గం 34వ వార్డు డిజిటలైజేషన్ ప్రక్రియలో ముందుండాలని ఆ వార్డు నాయకులకు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దిశ నిర్దేశం చేశారు. 34 వ వార్డు వైఎస్ఆర్సిపి శ్రేణులతో ఆసీలమెట్ట పార్టీ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ క్యాడర్ రిజిస్ట్రేషన్, అనుబంధ సంఘాల కమిటీలు డిజిటలైజేషన్ చేయాలన్నారు. నియోజకవర్గ వార్డులలో 34వ వార్డు ముందు ఉండేలా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 14 వార్డులు కూడా పోటాపోటీగా వేగవంతం చేయాలని సూచించారు. కష్టపడే కార్యకర్తకు వైఎస్ఆర్సిపి లో గుర్తింపు లభిస్తుందన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా నేరుగా సముచిత స్థానం అధిష్టానం కల్పించే విధంగా ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని వైయస్సార్ సీపి శ్రేణులందరూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముమ్మరంగా చేసి డిజిటలైజేషన్ను పూర్తి చేయాలని వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకులు లింగం శ్రీను, బాడిద బోయిన అప్పారావు, లండా రమణ, జిల్లా నాయకులు వాసుపల్లి ధనరాజు, అంబటి అప్పలరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భారత్, సౌత్ నాయకులు బెవర మహేష్, చింతపల్లి లీలా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 14న లోక్ అదాలత్ : ప్రధాన న్యాయమూర్తి చిన్నం పెట్టి రాజు

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట)** : విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు జిల్లా? న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు చిన్నంపెట్టి రాజు ఈ నెల 14 (శనివారం) నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్లో విశాఖపట్నం ప్రధాన కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండల కోర్టులలో గరిష్ట సంఖ్యలో కేసులను పరిష్కరించాలని జుడీషియల్ అధికారులను ఆదేశించారు. లోక్ అదాలత్ సజావుగా సాగేందుకు మరియు కక్షిదారులకు వేగంగా న్యాయం అందించేందుకు విశాఖపట్నం హెడ్ క్వార్టర్స్ మరియు అన్ని మండలాల్లో తగిన సంఖ్యలో ప్రత్యేక బెంచ్లను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. రాజీ పడదగ్గ సివిల్ మరియు క్రిమినల్ కేసులు. చెక్ బౌన్స్ కేసులు, వాహన ప్రమాద భీమా పరిహారం కేసులు, పెండింగ్లో ఉన్న ట్రాఫిక్ చలానాలు, బ్యాంక్ రికవరీ మరియు ఇతర కుటుంబ వివాదాలు సంబందించిన కు కేసులను గుర్తించి ఇరు పక్షాల మధ్య రాజీ కుదిర్చి అత్యధిక కేసులు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. లోక్ అదాలత్ను విజయవంతం చేసి, ఎక్కువ కేసులను పరిష్కరించాలని ఆకాంక్షించారు. చిన్నంశెట్టి రాజు, చైర్మన్-కం- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, విశాఖపట్నం వారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో




న్యాయ సేవా సదన్ లో మధురవాడలోని ఎన్.వి.పి లా కాలేజీ విద్యార్థులకు 'క్లినికల్ మరియు లీగల్ ఎడ్యుకేషన్' పై ఈరోజు అవగాహన సదస్సును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సివిల్ జడ్జి ఆర్. సన్యాసినాయుడు నిర్వహించారు. న్యాయశాస్త్ర విద్యార్థులు కేవలం థియరీ చదువులకే పరిమితం కాకుండా, న్యాయస్థానాల పనితీరు మరియు పేదలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ-కార్యదర్శి పేర్కొన్నారు.

ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులైన వారు ఎవరు, మహిళలు, పిల్లలు మరియు అణగారిన వర్గాలకు చట్టం కల్పిస్తున్న రక్షణల గురించి సన్యాసినాయుడు వివరించారు. ప్రతి విద్యార్థి సమాజంలోని పేదవారికి న్యాయం చేకూర్చడంలో ఒక వారధిగా పనిచేయాలని, లా కాలేజీలలో ఉండే లీగల్ ఎయిడ్ క్లినిక్ల ద్వారా ప్రజలకు సేవ చేయాలని సూచించారు.

కోర్టుల చుట్టూ తిరగకుండా, తక్కువ సమయంలో వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక అద్భుతమైన వేదిక అని, ఈ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## పినకోట పిహెచ్సిని ఆకస్మితంగా తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ఓ

**అనంతగిరి , మార్చి 11 (మనసులో మాట)** : అనంతగిరి మండలం,పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని బుధవారం అల్లూరి జిల్లా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.డి కృష్ణమూర్తి నాయక్ అకస్మికంగా తనిఖి చేసారు. ముందుగా అటెండెన్స్ ను మూమెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు.విధులకు హాజరుకాని (పి.యం.ఓ.ఓ) పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారి,మహిళా హెల్త్ సూపర్ వైజర్,ఏ.ఎన్.ఏం,హెల్త్ అసిస్టెంట్ ఫార్మాసిస్ట్ విధులకు హాజరుకాలేనందున వారికి ఒక రోజు జీతం నిలిపివేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించని స్టాఫ్ నర్స్ ను మందలించారు.సిబ్బంది సమయపాలన పాటిస్తూ కేటాయించిన బాధ్యతలు విధిగా నిర్వర్తించాలని,విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యుటేషన్ పై పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ప్రాంతీయ ఆసుపత్రి,చింతపల్లికి వెళ్ళిన పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారి,రూడకోట పిహెచ్సికు వెళ్ళిన స్టాఫ్ నర్స్ తదితరుల డిప్యుటేషన్ రద్దుచేసినట్టు ఆదేశించారు. పి.హెచ్.సి లో వైద్యం కొరకు వచ్చే రోగులకు సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను నీశితంగా పరిశీలించారు.వైద్యం కొరకు వచ్చిన రోగులతో ముచ్చటించి గ్రామాలలో అధికంగా ప్రబలుతున్న రోగాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో క్షేత్ర స్థాయి సిబ్బంది ఇంటింటి సందర్శనలు గూర్చి, అందిస్తున్న వైద్య సేవల గూర్చి రోగులకు అడిగితెలుసుకున్నారు. పి.హెచ్.సిలో ఉన్న ప్రసవ నిరీక్షణ కేంద్రాన్ని సందర్శించి గర్భిణి స్త్రీలతో ముచ్చటించారు. అన్నివార్డులను ,ప్రసూతి



గదిని క్షుణ్ణంగా పరిశీలించారు, ల్యాబ్ ద్వార నిర్వహిస్తున్న పరిక్షలు మలేరియా కేసులను అందించిన చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీని తనిఖి చేసి అందుబాటులో ఉన్న మందులను వ్యాక్సీన్ లను పరిశీలించారు. పి.హెచ్.సిలో సుఖ ప్రసవాలు జరుపుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేసారు.ప్రసవం పొందిన బాలింతతో అయన మాట్లాడుతూ..తల్లిపాల ప్రాముఖ్యత,వ్యాధి నిరోధక టీకాల గూర్చి, పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. కాన్పు అనంతరం 48గంటలు సిబ్బంది పర్యవేక్షణలో ఉండాలని తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు నిర్ధారించిన అనంతరం తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనం సహాయంతో వారి గ్రామానికి తరలించాలని సిబ్బందికి ఆదేశించారు.పి.హెచ్.సి పరిసరాలను పరిశుబ్రంగా ఉంచాలని సిబ్బందిని తెలిపారు.పి.హెచ్.సిల పరిధిలో కాన్పునకు సిద్దంగా ఉన్న గర్భిణిలను సుఖప్రసవాల కొరకు ముందస్తుగా బర్త్ వెయిటింగ్ హోంలకు తరలించాలించాలని అన్నారు. ఈ సదుపాయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు జిల్లా పరిధిలో ఉన్న పి.హెచ్.సిలలో సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని,గిరిజన ప్రాంతంలో అనారోగ్యంతో బాదపడుతున్న రోగులకు అందించే వైద్య సేవలలో నిర్లఖ్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. డి కృష్ణమూర్తి నాయక్,పి.హెచ్.సి వైద్యాధికారులు వెంకటేష్, రూప్ చంద్, హాస్పిటల్ సిబ్బంది, పాల్గొన్నారు.

## ఆతవ రోడ్లకు మహర్దశ

**వేపాడ , మార్చి 11 (మనసులో మాట)** : మండలంలోని ఆతవ గ్రామం నుంచి భూమిరెడ్డి పాలెం వరకు రూ.2.40కోట్ల ఎన్ఆర్ఇజీఎస్ నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు.అలాగే ఆతవ గ్రామం నుండి బాణాది గ్రామానికి మరో రూ.2.60 కోట్ల నిధులతో పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ డిఇ తెలిపారు. ఇటీవల మండలంలో పలు రోడ్ల మరమ్మతులకు గురయ్యాయని, వర్షాకాలంలో మరింత ఇబ్బందులు పడుతున్నామని సింగరాయి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఉప



ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫేసీలో వినతి పత్రం అందించారు. స్పందించిన ఉన్నతాధికారులు ఆయా గ్రామాల్లో రోడ్లు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో పనులు త్వరతగతిన పూర్తి చేసి ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించాలని అప్పారావు కోరారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

## పౌర సేవల మెరుగుదలకు..ఫిర్యాదుల పరిష్కారానికి

# పటిష్ట చర్యలు : కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** పౌర సేవల మెరుగుదలకు, ఫిర్యాదుల పరిష్కారానికి విశాఖపట్టణం జిల్లాలో ప్రత్యేక వ్యవస్థను రూపొందించి పారదర్శక రీతిలో అవలంబిస్తున్నామని, పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన 6వ కలెక్టర్ల కాన్ఫరెన్స్లో విశాఖపట్నం జిల్లా పరిధిలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవల నిర్వహణ విధానం గురించి ఆయన వివరించారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటాను ప్రతి వార్డు, ప్రతి సచివాలయం స్థాయిలో సమగ్రంగా విశ్లేషిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎక్కడ ఎక్కువగా ఫిర్యాదులు నమోదవుతున్నాయో గుర్తించి, ఒకే ప్రాంతం నుంచి పదేపదే వచ్చే సమస్యలను ప్రత్యేకంగా నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఉదాహరణకు ఒక ప్రాంతంలో నీటి లీకేజీ లేదా పైప్లైన్ దెబ్బతినడం వంటి సమస్యలపై పదేపదే ఫిర్యాదులు వస్తే, ఆ ప్రాంతానికి సంబంధించిన మొత్తం డేటాను విశ్లేషించి ప్రత్యేకంగా ఒక ఇన్సిడెంట్ లేదా టికెట్ సృష్టించి ఆ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని ఫిర్యాదులు, సేవలపై సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణ జరుగుతోందన్నారు. మున్సిపల్ పరిపాలన శాఖ నిర్ణయించిన సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ ప్రకారం ప్రతి ఫిర్యాదు నిర్ణీత సమయంలో పరిష్కరించ బడిందా లేదా



అన్నది కూడా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ఒక స్థాయిలో సమస్య పరిష్కారం ఆలస్యమైతే, అది తదుపరి ఉన్నతాధికారులకు ఆటోమేటిక్గా ఎస్కలేట్ అయ్యే విధంగా వ్యవస్థను రూపొందించామన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ స్పందించకపోతే సూపర్వైజర్కు, సూపర్వైజర్ స్పందించకపోతే అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్ కు, అవసరమైతే తదుపరి ఉన్నత స్థాయికి సమస్య వెళ్లేలా హైరార్కీని పునర్నిర్వచించినట్లు వివరించారు. అదనంగా ఈ వ్యవస్థను పీటీఆర్ఎస్ (Property Tax Record System)తో అనుసంధానం చేసి రియల్ టైమ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రస్తుతం మనమిత్ర ప్లాట్ఫారమ్తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఇది పూర్తయితే వివిధ విభాగాల మధ్య సమన్వయం మరింత మెరుగవుతుందని చెప్పారు. ఈ అప్లికేషన్ ద్వారా పౌరులు యుటిలిటీ సేవలకు సంబంధించిన చెల్లింపులు, విద్యుత్ బిల్లులు, మున్సిపల్ సేవల ఫీజులు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలు వంటి అనేక సేవలకు ఆన్లైన్లో చెల్లింపులు చేయగలుగుతున్నారని పేర్కొన్నారు. పౌర సేవల విభాగంలో అనేక సేవలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా సర్వీస్ సర్టిఫికెట్లు జారీ చేయడం, వివిధ ధృవీకరణ సేవలు కూడా ఈ అప్లికేషన్లో చేర్చినట్లు చెప్పారు. ఏఐ ఆధారిత చాట్బాట్ ను కూడా అభివృద్ధి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మెనూలను ఉపయోగించడం కష్టంగా ఉన్నవారు కూడా చాట్బాట్ ద్వారా తమ సమస్యను సులభంగా తెలియజేయవచ్చన్నారు. చాట్బాట్ పౌరుల ప్రశ్నలను ఏఐ మోడల్ ద్వారా విశ్లేషించి ఫిర్యాదును నమోదు చేయడం లేదా సేవ కోసం అభ్యర్థనను నమోదు చేస్తుందని తెలిపారు. అనంతరం సర్వీస్ రిక్వెస్ట్ నంబర్ జనరేట్ అవుతుందని, దాని ద్వారా పౌరులు తమ అభ్యర్థన స్థితిని ట్రాక్ చేసుకోవచ్చన్నారు. ఈ వ్యవస్థలో పుష్ నోటిఫికేషన్ సౌకర్యం కూడా ఉందని, అత్యవసర పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు, వాతావరణ హెచ్చరికలు, విపత్తులకు సంబంధించిన సమాచారం వంటి విషయాలను వెంటనే పౌరులకు చేరవేయవచ్చని తెలిపారు. అదనంగా స్థానిక స్థాయిలో ప్రత్యేక హెచ్చరికలు, చెల్లింపు రిమైండర్లు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని కూడా పౌరులకు పంపే సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు.

# ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలి

**విశాఖ , మార్చి 11 (మనసులో మాట) :** అమెరికా, ఇజ్రాయిల్ సామ్రాజ్యవాదం నశించాలని, ఇరాన్పై చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపేయాలని, ప్రజలు, కార్మికులు, రైతుల ప్రయోజనాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన తలపెట్టారు. యుద్ధం వద్దు.. శాంతి ముద్దు అని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఎస్జె.అచ్యుతరావు మాట్లాడుతూ.. ఆయిల్ మీద పెత్తనం కోసం ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం చేస్తున్నాయని, దీన్ని తక్షణం ఆపాలని, లేనిపక్షంలో దేశ ఆర్థిక వ్యవస్థ, కార్మికులు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. మన దేశ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రధాని మోడీ అమెరికాకు అనుగుణంగా వ్యవహరించడం నష్టదాయకమని తెలిపారు. యుద్ధం వల్ల ఇప్పటికే గ్యాస్ ధరలు పెరిగాయని, భవిష్యత్తులో పశ్చిమ ఆసియా నుండి దిగుమతి అయ్యే ప్రతి సరుకు ధరా పెరిగే అవకాశముందని



చెప్పారు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ అనకాపల్లి కూరగాయల మార్కెట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ప్రపంచ శాంతి కోరుతూ తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఆర్పిఐ జాతీయ నాయకులు అంజయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రమణ్యం, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడారు.. ఇరాన్పై దాడులు చేసి ఆ ప్రాంతంలో తమ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు యుద్ధానికి దిగాయని చెప్పారు. పాఠశాలలు, నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని అమాయక ప్రజానీకంపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. తక్షణమే యుద్ధాన్ని విరమించి, శాంతియుత పద్ధతిలో పరిష్కారం కోసం ఇరు దేశాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఐద్వా,ఎఐటియుసి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మాన్సాస్ భూదోపిడీ ఆపాలి

**విజయనగరం , మార్చి 11 (మనసులో మాట) :** టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక విజయనగరంలో మాన్సాస్ భూదోపిడీ అధికమైందని, వెంటనే దీన్ని ఆపాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పాత మహారాజా ఆసుపత్రి వద్ద ఉన్న రైతు బజారు స్థలాన్ని 22ఎ నుంచి తొలగించి రాజుల కుటుంబానికి అప్పగించారని తెలిపారు. ఫూల్బాగ్లో డఫ్ అండ్ డమ్ స్కూల్ ఎదురుగా ఉన్న స్థలం ప్రభుత్వభూమి అంటూ మున్సిపల్ అధికారులు అక్కడ ఉన్న నిర్మాణాలు తొలగించారన్నారు. ఇప్పుడు మాన్సాన్ బోర్డు పాతేశారని, దానిపై సర్వే నెంబర్ కానీ, విస్తీర్ణం కానీ రాయలేదని చెప్పారు. అది ప్రభుత్వ భూమి అని స్పష్టమైందని, దాన్ని తక్షణమే పేదలకు, పేద జర్నలిస్టులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫూల్బాగ్లో పీజీ కాలేజీ ఎదురుగా ఉన్న వారికి, రామకృష్ణనగర్,



ఎల్బిజి నగర్, గురజాడ నగర్, గంజిపేట, బుంగవీధి, జొన్నగుడ్డి.. ఇలా అనేక చోట్ల పేదలు ఇళ్లు కట్టుకుని 20 నుంచి 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని, వీరికి నివాసం ఉన్న చోటే పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించాలని డిమాండ్చేశారు. గుంకలాం జగనన్న కాలనీ, హుదూద్, టిడ్కో కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 13న కార్పొరేషన్ కమిషనర్కి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. 14న ఫూల్బాగ్ భూమి పరిశీలనకు వెళ్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడతామని తేల్చిచెప్పారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సిపిఎం నగర నాయకులు బి.రమణ, వి.రామచంద్రరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

# హౌసింగ్ ప్రాజెక్టులకురెరా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**విజయనగరం , మార్చి 11 (మనసులో మాట) :** రాష్ట్రంలో 500 చదరపు మీటర్లు లేదా 8 అపార్ట్మెంట్ల కంటే ఎక్కువగా కలిగిన ప్రతి హౌసింగ్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) వద్ద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎపి రెరా చైర్మన్ ఆర్.ఎస్.శివారెడ్డి తెలిపారు. రెరా ఆధ్వర్యంలో రెరా చట్టం, 2016 నిబంధనలు, వాటి అమలు విధానంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని ప్రయివేటు హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ రెరా వద్ద రిజిస్ట్రేషన్ పొందని ప్రాజెక్టులపై ప్రాజెక్టు వ్యయంలో పది శాతం అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని ప్రాజెక్టులకు మార్చి 31 వరకు 50 శాతం అపరాధ రుసుం సబ్సిడీతో రిజిస్ట్రేషన్కు అవకాశం కల్పించినట్లు చెప్పారు. నిర్మాణ రంగంలో వచ్చే సమస్యలు, ఫిర్యాదులను రెరా ద్వారా మాత్రమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులో వాస్తవంగా కల్పిస్తున్న సౌకర్యాలను మాత్రమే వినియోగదారులకు తెలియజేయాలని, అగ్రిమెంట్లో



పొందుపరచుకోవాలని తెలిపారు. అగ్రిమెంట్లో పొందుపరిచిన విధంగా ప్రాజెక్టు పూర్తి చేయకున్నా, వసతులు కల్పించకున్నా ఫిర్యాదుల మేరకు రెరా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెరా అసిస్టెంట్ డైరెక్టర్ జివిజిఎస్ వరప్రసాద్, సభ్యులు రాజశేఖర్ రెడ్డి, కామేశ్వరరావు, శివారెడ్డి, వెంకటరత్నం, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, జె.కులదీప్ పాల్గొన్నారు.



# గిరిజన విద్యార్థులకు కిట్లు పంపిణీ

**మన్యం జిల్లా , మార్చి 11 (మనసులో మాట) :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న గిరిజన విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పరీక్షా సామగ్రి కిట్లను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా యంత్రాంగం, ఐటిడిఎ సంయుక్త ఆధ్వర్యంలో ఐసిఐసిఐ బ్యాంక్ సౌజన్యంతో జిల్లాలోని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో చదువుతున్న 1815 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షా కిట్ల పంపిణీ కార్యక్రమం ఆయన ఛాంబరులో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థికి అవసరమైన రైటింగ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, జ్యామెట్రీ బాక్స్, లాంగ్ స్కేలుతో కూడిన పూర్తిస్థాయి కిట్ను అందిస్తున్నట్లు చెప్పారు. సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా కిట్లను అందజేసిన ఐసిఐసిఐ బ్యాంక్ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టి, మీ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐసిఐసిఐ బ్యాంక్ రీజినల్ హెడ్ సత్యనారాయణ రెడ్డి, ఐటిడిఎ ఎపిఒ పి.మురళీ ధర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి, బ్యాంక్ ప్రతినిధులు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఈ ఏడాది పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు శ్రీతేజ చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్టు తరఫున చైర్మన్ మోజోరు తేజోవతి అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ఆమె ఈ కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పట్టణంలోని బాలిక జెడ్పీ ఉన్నత పాఠశాల, పెద్దకాపువీధి జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలుర హైస్కూల్తో పాటు తంపటాపల్లి, ఎం.సింగుపురం తరదితర జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు.



# ఆర్టిసి బస్సు,లారీ ఢీ

**రామభద్రపురం , మార్చి 11 (మనసులో మాట) :** రామభద్రపురం మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఆర్టిసి బస్సు, లారీ ఢకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న సుమారు 25 మందికి గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి సాలూరు వెళుతున్న ఆర్టిసి బస్సు.. విజయనగరం నుంచి పార్వతీపురం వెళుతున్న లారీని ఢకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

కొంతమందికి తీవ్రగాయాలు కావడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి ఆర్టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ఎస్ఐ ప్రసాదరావు తెల్చారు. కొట్టక్కి గ్రామానికి చెందిన గులిపల్లి ఎర్రమ్మ, బలిజిపేట మండలం బర్లి గ్రామానికి చెందిన ఇజ్జాడ గౌరమ్మ, బొబ్బిలి మండలం నారసింహునిపేటకు చెందిన పి.నాగరాజు, ఎం.బూర్జివలసకు చెందిన గేదెల దాడమ్మ, బొబ్బిలి పట్టణంలోని దేవరవీధికి చెందిన ఆలమూరి యోగిత, సీతానగరం మండలం అంబివలస గ్రామానికి చెందిన పాలకొండ తిరుపతి, రామభద్రపురం మండలం పాడివానివలస గ్రామానికి చెందిన నెక్కల గౌతమి, తదితరులకు బలమైన గాయాలయ్యాయి.

వీరిలో నలుగురికి తీవ్ర గాయాలవడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్కు కాలు విరిగిపోయింది. సంఘటనా స్థలాన్ని బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ పరిశీలించారు. ఈ ఘటన వల్ల రెండువైపులా ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు సకాలంలో స్పందించి ట్రాఫిక్ను క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో బస్సు నుజ్జునుజ్జు కావడంతో క్రేన్ సహాయంతో తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్ఐ మానవత్వం రామభద్రపురం ఎస్ఐ ప్రసాదరావు మానవత్వాన్ని చాటు కున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కొంత మంది 108 వాహనానికి ఫోన్ చేశారు. అయినప్పటికీ ఆ వాహనం రావడం కొద్దిగా ఆలస్యం కావడంతో వెంటనే తన జీపులో తీవ్రంగా గాయపడిన వ్యక్తులను హుటాహుటిన రామభద్రపురం ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం బాడంగి సిహెచ్సికి తరలించారు. రక్తపు మడుగులో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం చేయించిన ఎస్ఐను పలువురు అభినందించారు

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యేబాడంగి : ప్రమాదంలో గాయపడి, బాడంగి సిహెచ్సిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే బేబినాయన పరామర్శించారు. సంఘటన వివరాలను ఆరాతీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ఉన్నారు.

# గిరిజనుల అవసరాల రీత్యా కొత్త రోడ్లు : ప్రభుత్వ విప్

**కొమరాడ , మార్చి 11 (మనసులో మాట) :** గిరిజన ప్రాంతంలో ప్రజా అవసరాల రీత్యా అవసరమైన చోట కొత్త రోడ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని సీసాడవలస నుంచి నయ వరకు రూ.5 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతరాష్ట్ర రహదారి అధ్వానంగా ఎన్నో ఇబ్బందులు పడిన విషయం ప్రజలకు తెలిసిందేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల అవసరాలకు అనుకూలంగా రోడ్లు ఏర్పాటు చేస్తుందని అన్నారు. పాత రహదారులను మరమ్మతులు చేసి ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తుందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో డోలివోతలు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త రహదారులను మంజూరు చేసి శరవేగంగా పనులు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కార్పొరేషన్ సంక్షేమ అభివృద్ధి డైరెక్టర్, మండల టిడిపి కన్వీనర్ ఎస్ ఉదరు శేఖర్ పాత్రుడు, టిడిపి సీనియర్



నాయకులు దేవకోటి వెంకటనాయుడు, ఎఎంసి వైస్ చైర్మన్ జి.గౌరీ శంకర్రావు, టిడిపి నాయకులు వి.రాఘవ, బి.భానూజీరావు, బి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన సీతానగరం : మండలంలోని గాదెలవలస నుంచి ఏగోటివలస వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోనెల విజరుచంద్ర బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని గ్రామాలకు తారు రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం తన లక్ష్యమని స్పష్టం చేశారు. ఏప్రిల్ నాటికి ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులకు తీసుకొస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు రౌతు వేణుగోపాలనాయుడు, పెంట సత్యంనాయుడు, మండల తెలుగు యువత నాయకులు భోగి శంకరరావు, నాయకులు సాలా హరిగోపాలరావు, పెద్దబ్బాయి సర్పంచులు తెంటు రామారావు, గొట్టాపు అప్పారావు, బూర్జ కోపరేటివ్ అధ్యక్షులు పాలి గౌర్నాయుడు పరవాడ అచ్యుతరాయుడు, గాదెలవలస గ్రామ టిడిపి నాయకులు వై.ప్రసాద్, బి.సత్యనారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుపథ, మన్యసీమ సంపాదకులు రాంజీ మృతి

**విశాఖపట్నం , మార్చి 11 (మనసులో మాట) :** గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో వున్న సుపథ, మన్యసీమ సంపాదకులు యామిజాల రామనరసింహం (రాంజీ) (66) బుధవారం సాయంత్రం మృతి చెందారు. నగరంలోని గురుద్వార దగ్గర గల కిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందినట్లు రాంజీ పెద్ద కుమారుడు భరద్వాజ్ తెలిపారు. యామిజాల రామ నరసింహం స్టీల్ ప్లాంట్లో కొంత కాలం ఉద్యోగం చేశారు. ఐఎన్టియుసి కార్మిక సంఘం అధ్యక్షులుగా కూడా పని అనంతరం రాంజీ సుపథ, మన్యసీమ దినపత్రికలతో పాటు యామిజాల పబ్లికేషన్ ను కూడా నడిపారు. అంత్యక్రియలు రేపు ఉదయం దొండపర్తిలోని (పాత సూర్య థియేటర్ దగ్గర) బాలాజీ రెసిడెన్స్ నుండి జరుగుతాయని వారు తెలిపారు. రాంజీకి భార్య, ఇద్దరు కుమారులు కలరు. రాంజీ మృతి పట్ల మనం దిన పత్రిక ఉత్తరాంధ్ర రీజినల్ చీఫ్ బ్యూరో ఎం వి ఎస్ జి తిలక్,పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి (సెక్రటరీ జనరల్) డాక్టర్ పి.ఎల్.కె. మూర్తి సంతాపం వ్యక్తం చేశారు. ఒక మంచి స్నేహితుడిని కోల్పయామని వారు ఒక ప్రకటనలో తెలిపారు.ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్ అధ్యక్షులు డాక్టర్. ఎం.ఆర్.ఎల్. వర్మ రాంజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అందరినీ ఆప్యాయతగా పలకరించే రాంజీ మృతి



చిన్నపత్రికలకు తీరని లోటు అని ఆయన అన్నారు. పలువురు పత్రికా సంపాదకులు, జర్నలిస్టు రాంజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

# జిల్లా పరిషత్ పాఠశాల కళాశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ



**గూడెంకొత్తవీధి , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో సీలేరు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శ్రీ సత్యసాయి సేవా సమితి హైదరాబాద్ ఆధ్వర్యంలో విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ స్పోర్ట్స్ కిట్లను అందించినట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ క్రీడా పరికరాలను అందించడంలో సీలేరు వైస్ సర్పంచ్ వల్లి ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఆయన శ్రీ సత్యసాయి సేవా సమితి హైదరాబాద్ ప్రతినిధి శశిభూషణరావుతో మాట్లాడి సీలేరు విద్యార్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందించేలా చర్యలు తీసుకున్నారు. సమితి సభ్యులు స్పందించి పాఠశాల,కళాశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పలు క్రీడా పరికరాలను అందజేశారు. స్పోర్ట్స్ కిట్లను అందుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి. శంకర్రావు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగభూషణం శ్రీ సత్యసాయి సేవా సమితి హైదరాబాద్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాల్సిన అవసరం ఉందని, అందించిన క్రీడా పరికరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు క్రీడా పరికరాలు అందించడం ద్వారా వారికి మంచి ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్జో, డిసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, విష్ణు కుమార్, సత్యనారాయణ, స్వర్ణలత, హైస్కూల్ పీటీ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు,విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ సమితి సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

# హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే యంత్రంతో క్షయ వ్యాధి గుర్తింపు

**గూడెంకొత్తవీధి , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం హ్యాండ్‌హెల్డ్ ఛాతీ ఎక్స్‌రే యంత్రంతో క్షయ వ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి మరియు జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ డి. కృష్ణమూర్తి నాయక్ ఆదేశాల మేరకు "టి.బి. ముక్త్ భారత్ అభియాన్ 2.0"లో భాగంగా వంద రోజుల ప్రత్యేక డ్రైవ్ కింద ఈ కార్యక్రమం చేపట్టారు. సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని సీలేరు సచివాలయం లో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మొత్తం 128 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ముందుగానే గుర్తించి తక్షణ వైద్యం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దుప్పులవాడ, ధారకొండ, గుమ్మిరేవులు ప్రాంతాల్లో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా 60 సంవత్సరాల పైబడిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, ధూమపానం మరియు మద్యపానం చేసే వారు, బరువు తక్కువగా ఉన్న వారు, గతంలో టి.బి. బాధితులు వారి



కుటుంబ సభ్యులు ఈ పరీక్షలను వినియోగించుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పసుపులేటి నారాయణ రావు, హోమియో వైద్యాధికారిణి డాక్టర్ బి. సృజనరాయ్, మండల సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ గంట అశోక్ కుమార్, హెల్త్ సూపర్వైజర్ యన్. త్రినాథ్, సీనియర్ టి.బి.ల్యాబ్ సూపర్వైజర్ అగ్రహారపు అచ్యుత వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ రాజబాబు, ల్యాబ్ టెక్నీషియన్ శివ, స్టాఫ్ నర్స్ హైమా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెళ్లి పేరుతో మోసగించిన వ్యక్తికీ 1 సం॥ జైలు శిక్ష, జరిమానా

**మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఆర్.గోవిందరావు**



**విజయనగరం , మార్చి 11 (మనసులో మాట) :** విజయనగరం మహిళా పోలీస్ స్టేషనులో 2023వ సంవత్సరంలో నమోదైన కేసులో నిందితుడు విజయనగరం పట్టణంకు చెందిన బండి సుచిత్ (22 )కు విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి 1 సంవత్సరం జైలు శిక్ష మరియు రూ.2వేలు జరిమాన విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించినట్లుగా మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం పట్టణం బూర్లిపేటకు చెందిన ఒక మహిళ తన భర్తకు విడాకులు ఇచ్చేసి జీవిస్తుండగా, విజయనగరం పట్టణంకు చెందిన బండి సుచిత్ ఆ మహిళతో పరిచయం పెంచుకొని తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అనేక సార్లు శారీరకంగా అనుభవించి మోసం చేసాడన్నారు. బాధిత మహిళా ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ కే.టి.ఆర్.లక్ష్మి కేసు నమోదు చేయగా, అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ సిఐ బి.నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. న్యాయస్థానంలో నిందితుడు బండి సుచిత్ నేరంకు పాల్పడినట్లుగా సాక్ష్యాలు నిరూపితం కావడంతో విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎ.డి.జె. కోర్టు న్యాయమూర్తి ఎన్.పద్మావతి 1 సంవత్సరం జైలు శిక్ష రూ.2వేలు జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసువారి తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటరు వై. రేవతి వాదనలు వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ జి.సురపునాయుడు, సి.ఎం.ఎస్ ఎఎస్ఐ పి.మల్లేశ్వరరావు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారన్నారు. నిందితుడికి శిక్షపడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను డిఎస్పీ అభినందించారు.

## భవిష్యత్ తరాల సంక్షేమం కోసం రసాయన శాస్త్రంలో

# పరిశోధనలు అవసరం : ప్రముఖ శాస్త్రవేత్త గిరిబాబు



**విజయనగరం , మార్చి 11 (మనసులో మాట) :** భవిష్యత్ తరాల సంక్షేమం కోసం రసాయన శాస్త్రంలో పరిశోధనలు అవసరం అని ప్రముఖ శాస్త్రవేత్త గిరిబాబు చెప్పారు. బుధవారం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆరోగ్యం, శక్తి పర్యావరణ పరిరక్షణ కోసం సుస్థిర రసాయన శాస్త్రం (ఎస్ సిహెచ్ ఈ ఈ – 2026)" అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొ.ఎం.శరత్చంద్రబాబు స్వాగత ప్రసంగం చేసి సదస్సు ప్రాముఖ్యతని, లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.ఎస్.ఐ.ఆర్, హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.గిరిబాబు మాట్లాడుతూ .... భవిష్యత్ తరాల సంక్షేమం కోసం స్థిరమైన రసాయన శాస్త్ర పరిశోధనలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, శక్తి వనరుల సమర్థ వినియోగం, పచ్చశక్తి అభివృద్ధి, ఆరోగ్య రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధికి ఈ రంగంలోని పరిశోధనలు ఎంతో తోడ్పడుతున్నాయని ఆయన తెలిపారు. శాస్త్రవేత్తలు పర్యావరణానికి అనుకూలమైన పరిశోధనలను చేపట్టాలని సూచించారు. ముఖ్య ప్రసంగం ఐఐటి మద్రాసు కి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొ. పి.అబ్బురసన్ మాట్లాడుతూ .... ఆధునిక సమాజ అవసరాలను తీర్చడంలో స్థిరమైన రసాయన శాస్త్రం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, శక్తి ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మరింత విస్తృతంగా పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధకులు పరస్పరం సహకారంతో పనిచేస్తే సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు వెలువడతాయని తెలిపారు. తదుపరి ప్రసంగించిన ఐసర్ బెర్హాంపూర్ కి చెందిన ప్రొ.జి.రామకృష్ణ భట్ మాట్లాడుతూ .... పర్యావరణానికి హాని కలగకుండా రసాయన పరిశ్రమలు, సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం ఈ కాలంలో అత్యవసరమని అన్నారు. పర్యావరణానికి అనుకూలమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో యువ పరిశోధకులు ముందుకు రావాలని ఆయన సూచించారు. విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ .... స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో శాస్త్రీయ పరిశోధనలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇలాంటి జాతీయ సదస్సులు శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకుల మధ్య జ్ఞాన మార్పిడి, పరస్పర చర్చలకు వేదికగా నిలుస్తాయని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొఫెసర్ తంత్రవాహి శ్రీనివాసన్ మాట్లాడుతూ .... ఇలాంటి జాతీయ సదస్సులు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు.

శాస్త్రీయ చర్చల ద్వారా సమకాలీన సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. కలిదిండి సురేష్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కిశోర్ పడాల, అతిథి అధ్యాపకుడు డా. ఎస్. చంద్రశేఖర్, కమిటీ సభ్యులు డా. దివ్య కె., డా. ప్రమా చటర్జీ, డా. లత కల్యశీపూడి, డా. ఇప్పిలి తారకేశ్వరరావు, పరిపాలనాధికారి డా. ఎన్. వి. ఎస్. సూర్యనారాయణతో పాటు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుండి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఈ మూడు రోజుల సదస్సులో పాల్గొన్నారు.

# దారాపురం-పట్టమర్రి గ్రామాలకు బీటీ రహదారి పనుల ప్రారంభం



**గూడెంకొత్తవీధి , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో దారకొండ పంచాయితీలో రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్‌అండ్‌బీ రోడ్ నుంచి దారాపురం గ్రామం మీదుగా పట్టమర్రి గ్రామం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులను స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సుమారు 2.50 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ బీటీ రహదారి పనులకు రూ.2 కోట్ల 5 లక్షల వ్యయం కేటాయించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే దారాపురం, పట్టమర్రి మరియు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభమవుతాయని గ్రామస్థులు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నడిగట్ల రాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ మాడి రామన్న, కూటమి నాయకులు పోతురాజు గోవిందు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు రహదారి పనులు ప్రారంభమైనందుకు ఆనందం వ్యక్తం చేస్తూ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

# 13న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయాలి



**కురుపాం , మార్చి 11 (మనసులో మాట) :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ ఈనెల 13న మన్యం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. జియ్యమ్మవలస మండలం గడసింగపురంలో ఉపాధి హామీ చట్టం పరిరక్షణకు సంబంధించిన ప్రచారం బుధవారం నిర్వహించి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని బలహీనపరిచేలా కొత్త చట్టాలను తీసుకువస్తోందని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఈ పథకం దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఈ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని, ఉపాధి కూలీలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భూతాల మోహనరావు, గరుగుబిల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.పాచిపెంట : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, పాత పద్ధతిలో కొనసాగిం చాలని, కేంద్రం చేసిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలని మండలంలోని పాంచాలి, గురునాయుడుపేట, మోసూరు, గరెల్లవలస, పాచిపెంట, కొత్తవలస, గడివలస, తోటవలస విశ్వనాధపురం, పణుకువలసలో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు వెనుకబడి ఉన్న జిల్లాల్లో మన్యం జిల్లా కూడా ఉంది, వలసలు ఎక్కువ, కంపెనీలు తక్కువగా ఉన్న ప్రాంతంగా మన్యం జిల్లా ఉందన్నారు. దీంతో ఉపాధి హామీ చట్టమే ప్రధాన ఉపాధిగా ఈ ప్రాంత ప్రజలకు ఉందన్నారు. అటువంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ విషయమై వేతనదారుల కు అవగాహన కల్పించేందుకు సిపిఎం ఈనెల 11, 12 తేదీల్లో గ్రామాల్లో ప్రచారం, 13న కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. కావున ఈ ధర్నాకు కూలీలంతా కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.శ్రీను, కె.ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సుర్రు రామారావు, జర్నీ రామయ్య, మంచాల శీను, ఆటో యూనియన్ నాయకులు పోలరాజు, రమేష్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.బలిజిపేట: ఉపాధిహామీ చట్టం రక్షణ కోసం ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు మండలంలోని బలిజిపేట, పెదపెంకి, భైరిపురం, వంజరంపేట, అంపవల్లి, జనార్ధన వలస, వెంగళరాయపురం, వంతరాం, గంగాడ, గళావిల్లి, గేదెలుపేట, నారంనాయుడువలస, చిలకలపల్లి, నూకలవాడ పలగర గ్రామాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు, మండల నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో విబిజి రాంజీ చట్టాన్ని ప్రవేశపెట్టిందని, ఈ చట్టం ఉపాధి హామీ లక్ష్యాలకు విరుద్ధంగా ఉందని విమర్శించారు. పాత ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, విబిజి రాంజీ కొత్త పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈనెల11, 12 తేదీల్లో బలిజిపేట మండలాల్లో జరుగు ప్రచార యాత్రను ఉపాధి కూలీలు జయప్రదం చేయాలని ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బొద్దాన భానుమూర్తి, పీసా వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు, వెంకటరమణ లక్ష్మనాయుడు, పాల్గొన్నారుసీతానగరం: మండలంలోని బక్కుపేట, ఆర్, వెంకమ్మ పేట, రామవరం, లచ్చయ్య పేట, గుమ్మిడి వరం, గాదెల వలస, జానుమల్లు వలస, కోట సీతారాం పురం, రంగమ్మ పేట అంటిపేట, కాసయ్య పేట తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. అనంతరం ఉపాధి కూలీలతో జరిగిన సమావేశంలో సిపిఎం నాయకులు రెడ్డి ఈశ్వరరావు,రెడ్డి రమణమూర్తి, గవర వెంకటరమణ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొరపరెడ్డి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోగిల పాపయ్య, మిరియాల నాగరాజు పాల్గొన్నారు.పాలకొండ : మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణకై ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దావల రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని బుక్కురు, టి.కె రాజపురంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం కూలీలనుద్దేశించి రమణరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, కాద రాము మాట్లాడారు. దేశంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతైనా మెరుగుపడిందంటే దీనికి ప్రధానమైన కారణం ఉపాధి హామీ పథకమేనని, అంతటి ప్రతిష్టాత్మమైన చట్టాన్ని రద్దు చేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నించడం విచారకరమని, ఈ ప్రయత్నాల్ని ప్రజలంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమాప్రభ, మహిళా సంఘం ప్రతినిధి జి.పద్మలి తదితరులు పాల్గొన్నారు.పార్వతీపురం రూరల్ : మండలంలోని కృష్ణపల్లి, పెదమరికి గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం పరిరక్షణ ప్రచారంలో భాగంగా సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ గొర్లె వెంకటరమణ మాట్లాడుతూ ఉపాధిహామీ చట్టం పరిరక్షణకై ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ప్రజలు, ఉపాధి హామీ కూలీలు పెద్ద ఎత్తున వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కొమరాడ: ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని కోరుతూ సిపిఎం నాయకులు మండలంలో కొమరాడ, గుమడ, కోటిపాము, గంగిరేవలస, దేవకొన, ఉలిపిరి, చోళ్లపదం, అర్తాం, దుగ్గి, కల్లికోట, సివిని, విక్రం పురం పంచాయల్లో ఆటో ప్రచారం జరిగింది.

ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఉపాధి చట్టాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని కోరుతూ ఈనెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కూలీలు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాము, పెంటయ్య, శివున్నాయుడు, లక్ష్మయ్య, రామారావు, రామస్వామి, మహిళలు పాల్గొన్నారు.వీరఘట్టం: పాత ఉపాధి హామీ చట్టాన్ని పునర్దించాలని కోరుతూ మండలంలోని కడకల్లా, నడిమికెల్లా, విక్రంపురం, చిట్టిపూడి వలస తదితర గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎన్ సింహాచలం, కృష్ణ, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



**గూడెంకొత్తవీధి , మార్చి 11 (మనసులో మాట) :** మండలంలో సీలేరు గ్రామంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు.సీలేరు రైతు భరోసా కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ఆధార్ నమోదు కేంద్రం ద్వారా గ్రామ ప్రజలకు ఆధార్‌కు సంబంధించిన పలు సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కేంద్రంలో కొత్త ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో పేరు, చిరునామా, మొబైల్ నంబర్ మార్పులు, బయోమెట్రిక్ అప్డేట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు ఆధార్ సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిన ప్రజలకు ఈ కేంద్రం ద్వారా స్థానికంగానే సౌకర్యం కల్పించడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ పాంగి దుర్జో మాట్లాడుతూ, గ్రామ ప్రజలు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఆధార్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ప్రజలకు సులభంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో గ్రామ స్థాయిలోనే ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పరశురాం మాట్లాడుతూ, ఆధార్ కార్డులో వివరాలు సరిచేసుకోవాల్సిన వారు, కొత్తగా నమోదు చేసుకోవాల్సిన వారు రైతు భరోసా కేంద్రానికి వచ్చి సేవలను పొందాలని సూచించారు. ఆధార్ ప్రస్తుతం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నందున ప్రతి ఒక్కరు తమ ఆధార్ వివరాలు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ సేవలను పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా సబ్బవరపు గణేష్ జన్మదిన వేడుకలు

**చోడవరం , మార్చి 11 (మనసులో మాట) :** మార్చి 11, జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యలక మల్లిబాబు ఆధ్వర్యంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో 200 మందికి పైగా పేదలకు అన్న సమారాధన నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు యలక మల్లి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులై మొట్టమొదటిసారిగా పుట్టినరోజు జరుపుకుంటున్న అన్న సబ్బవరపు గణేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ...., దళిత బడుగు బలహీన వర్గాలకి అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చోడవరం సద్భావ టీం ఆధ్వర్యంలో ప్రతిరోజు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం, ... చేస్తున్న వారికి అభినందనలు తెలియజేశారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక








# సమాజహితమే లక్ష్యం

## పాత్రికేయుల సంక్షేమమే ధ్యేయం

- కంచర్ల మీడియా గ్రూపు అధినేత కంచర్ల అచ్యుతరావు
- ఘనంగా కంచర్ల మీడియా గ్రూపు ఆత్మీయ సమావేశం
- త్వరలో పూర్తిస్థాయిలో 'మనసులో మాట' దినపత్రిక ప్రింటింగ్, 'కె.టివి' ఛానల్ ప్రసారాలు ప్రారంభం
- పాత్రికేయులకు వేతనాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని వెల్లడి

**విజయనగరం, మార్చి 11 (మనసులో మాట జిల్లా ప్రతినిధి):** నానాటికీ విలువలు కోల్పోతూ, దీనావస్థకు చేరుకుంటున్న పాత్రికేయ రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా 'కంచర్ల మీడియా గ్రూపు' అడుగులు వేస్తోందని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, 'మనసులో మాట' ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు ప్రకటించారు. బుధవారం స్థానిక ఒక ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన కంచర్ల మీడియా గ్రూపు ఉత్తరాంధ్ర పాత్రికేయులు, మార్కెటింగ్, సర్కులేషన్ సభ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

**నిజాయితీ గల జర్నలిజం కోసం..**

ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో విలువలు పడిపోతున్న ప్రస్తుత తరుణంలో, నిజాన్ని నిర్భయంగా చెబుతూ సమాజ హితం కోసం పనిచేయాలన్న తపనతోనే తాను మీడియా రంగంలోకి ప్రవేశించానని తెలిపారు. "సహకారమే చాకిరి.. ఉపకారమే ఊపిరి" అన్న నినాదంతో సంస్థ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట:**

పలు పత్రికలు పాత్రికేయుల శ్రమను వాడుకుంటూ కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని, దీనివల్ల జర్నలిస్టుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రతి పాత్రికేయునికి పనికి తగ్గ వేతనం అందించడంతో పాటు, వారికి ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గత ఏడు నెలలుగా ఈ రంగంలోని లోతుపాతులను అధ్యయనం చేసి, ఒక పక్కా ప్రణాళికతో ముందుకు వస్తున్నట్లు ఆయన వివరించారు.

**నూతన సాంకేతికతతో 'మనసులో మాట':**

ప్రస్తుతం పిడిఎఫ్ రూపంలో ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ , తెలంగాణ ప్రాంతాల నుండి తాజా సమాచారాన్ని సేకరించి, 32 పేజీలకు పైగా వార్తలతో పాఠకులకు చేరువవుతున్నామని, త్వరలోనే అత్యాధునిక సాంకేతికతతో పూర్తిస్థాయి కలర్ ఎడిషన్ పత్రికను తీసుకువస్తామని అచ్యుతరావు వెల్లడించారు. అలాగే 'కె.టివి' ఛానల్ ద్వారా పల్లె నుంచి ఢిల్లీ దాకా ఎప్పటికప్పుడు తాజా పరిణామాలను ప్రజలకు అందించేలా ప్రసారాలను రూపకల్పన చేశామన్నారు.



**టీమ్ వర్క్‌తో విజయపథంలోకి..:**

కంచర్ల మీడియా గ్రూప్ సీఈఓ శంకర్ నాయుడు మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులను అధిగమిస్తూ 'మనసులో మాట' పత్రిక, 'కె.టివి' ఛానళ్లను ట్రైల్ రన్‌గా నడుపుతున్నామని, ప్రజల ఆదరణతో త్వరలోనే నూతన ఒరవడిని సృష్టిస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని రిపోర్టర్ లు, మార్కెటింగ్, సర్కులేషన్ టీమ్ లతో విజయపథంలో నడవగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్కులేషన్ మేనేజర్ బలరామ నాయుడు మాట్లాడుతూ.. పత్రికను ప్రతి పల్లెకు చేర్చేందుకు పటిష్టమైన టీమ్ వర్క్ సిద్ధంగా ఉందన్నారు.

**విలువలతో కూడిన వార్తలు అందించాలి**

సంస్థ జనరల్ మేనేజర్, సీనియర్ పాత్రికేయులు మేడవరపు రంగనాయకులు మాట్లాడుతూ.. విలువలతో కూడిన వార్తలు అందిస్తూ పాఠకుల మనోభావాలకు చేరువకావాలని పాత్రికేయులకు సూచించారు. పాత్రికేయులకు కంచర్ల మీడియా గ్రూపు ఒక పెద్ద భరోసా అని పేర్కొన్నారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పాఠకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆయన వివరించారు. సీనియర్ పాత్రికేయులు ఎం. విజయభాస్కర్, ఎలిశెట్టి సురేష్ తదితరులు మాట్లాడుతూ.. పాత్రికేయుల ఆర్థిక స్వావలంబన గురించి ఆలోచించే ఇటువంటి యాజమాన్యం రావడం శుభపరిణామన్నారు.

**వందేమాతరం గేయం ఆలాపన :**

సమావేశం ప్రారంభంలో డాక్టర్ మండపాక రవి పర్యవేక్షణలో దశిక పేర్రాజు మ్యూజిక్ అకాడమీ విద్యార్థినులు ఎన్.పి. శారద, ఆదిభట్ల శ్రావణి, డాక్టర్ హంసిత ఆలపించిన 'వందేమాతరం' గీతం అందరినీ అలరించింది. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా పాత్రికేయులకు, గుర్తింపు కార్డులు, బహుమతులు అందజేశారు. అనంతరం ఉత్తరాంధ్ర పరిధిలోని సీనియర్ జర్నలిస్టులు అచ్యుతరావు ను ఘనంగా సన్మానించారు. ఉత్తరాంధ్ర పరిధిలో విజయనగరంలో జరిగిన ఈ ఆత్మీయ సమావేశం పాత్రికేయులలో కొత్త ఉత్సాహాన్ని, నమ్మకాన్ని నింపింది.








KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
గురువారం 12 మార్చి 2026


# రాజమండ్రిలో ఆగని మరణమృదంగం!

- ‘కల్తీ పాల‘ ఘటనలో పెరుగుతున్న మృతుల సంఖ్య
- రెయిన్ బో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన రెండేళ్ళ బాలుడు
- ఇప్పటి వరకూ 12 మంది మృతి..వీరిలో ఇద్దరు చిన్నారులే
- వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న మరో 8 మంది
- వెంటిలేటర్, డయాలసిస్ పొందుతున్న అయిదుగురు, ముగ్గురికి డయాలసిస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 12:** మనిషికి అతి భయంకరమైన శబ్దం ‘మరణ మృదంగం‘. ఏదో జరిగేటప్పుడు వచ్చే అపశృతి ధ్వని. ఇటువంటి శబ్దం ఎవరూ వినాలని కోరుకోరు. కానీ ఆ భయంకర ధ్వని నిరంతరం వినిపిస్తే.. ఊహించుకోవటానికే భయపడతారు. కానీ తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం నగరంలో గత ఫిబ్రవరి 16 నుండి నిత్యం నగర వాసులు ‘మరణ మృదంగం‘ వింటూ విషాదంలో మునిగి తేలుతున్నారు. గత నెల 15వ తేదీన మహా శివరాత్రి రోజు పాలు సేవించి అనేకమంది తీవ్ర అస్వస్థత పాలయ్యారు. వీరిలో 20 మంది ‘అనురియా‘ (కిడ్నీ ఫెయిల్యూర్) కు గురయ్యారు. నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స నిమిత్తం చేరారు.

కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగా వెంట్రిలేటర్ పై ఉంటూ డయాలసిస్ చేయించుకుంటూ..జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. గత 23 రోజులుగా మృత్యువుతో అనుక్షణం పోరాడుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు మొక్కని దేవుడు లేడు. చేయని పూజలు లేవు. దర్శించని పుణ్య క్షేత్రాలు లేవు. ఏ దేవుడైనా తమ మొర ఆలకించబోతాడా.. అనుగ్రహించకపోతాడా అనే ఆశ, ఆరాటం.

కానీ ఈ 23 రోజుల్లో 12 మంది మృతిచెందారు. వీరిలో ఇద్దరు చిన్నారులే. బుధవారం స్థానిక లాలా చెరువు ప్రాంతానికి చెందిన జై కృత్ రాజ్ (2 సంవత్సరాల 9 నెలలు) మృతిచెందాడు. నగరంలోని రెయిన్‌బో చిన్న పిల్లల ఆసుపత్రిలో గత నెల ఫిబ్రవరి 19 నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ అంటే 21 రోజుల పాటు నరక యాతన అనుభవిస్తూ..బుధవారం తుదిశ్వాస విడిచాడు. పాపం ఆ చిన్నారి తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం.

**పాలే గరళమై..**

అభం శుభం తెలియని చంటి బిడ్డ..గట్టిగా మూడేళ్ళు కూడా లేని చిన్నారి.. చేసిన నేరం ఏమీ లేదు. కేవలం పాలు తాగడమే మహా పాపమైనట్టు..మృత్యువు కాటేసింది. ఇప్పటి వరకూ మృతిచెందిన 12 మందిలో ఇద్దరు చిన్నారులు ఇలా మృత్యువాత పడాల్సి వచ్చింది. ఇంతకంటే దారుణం, ఇంతకంటే మహా ఘోరం ఏముంటుంది?. తమ బిడ్డ ఆసుపత్రిలో అచేతనంగా ఉంటే..వైద్యులు అనుక్షణం బ్రతికించడానికి విశేషంగా కృషి చేసినా ఫలితం లేకపోవడంతో.. ఇక తమ బిడ్డ శాశ్వతంగా తమ కళ్ళ నుంచి కనుమరుగవుతున్నాడనే నిజాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆసుపత్రిలో చేరిన కృతిరాజ్ ఈ రోజు కాకపోతే.. రేపు, లేదంటే ఎల్లుండు, ఆ మర్నాడు వచ్చేస్తాడనుకుని రాత్రింబవళ్ళు కళ్ళల్లో వత్తులు చేసుకుని ఆశతో ఎదురు చూస్తున్న వారికి వైద్యుల నోటమ్మట నుండి ‘మీ అబ్బాయి ఇక లేడు‘ అన్న మాటలు కర్ణ కఠోరంగా వినిపించాయి. కుప్పకూలిపోయారు. వారిని ఎలా ఓదార్చాలో తెలియని పరిస్థితి.

ఇటువంటి దృశ్యాలు..కల్తీ పాల ఘటన తర్వాత..రాజమహేంద్రవరం నగరంలోని కిమ్స్, రెయిన్‌బో, డెల్టా, రవి చైతన్య ఆసుపత్రులలో తరచుగా కనిపిస్తూనే ఉన్నాయి. కల్తీ పాల ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన బాధితులంతా దాదాపు ఈ ఆసుపత్రుల్లోనే చేరారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలు అక్కడున్న వారందరి హృదయాలను ద్రవించి వేస్తున్నాయి. ఎవ్వరూ ఏమి చేయలేని నిస్సహాయస్థితి.

రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా పంపిన నలుగురు వైద్య నిపుణుల బృందమే..కాపాడలేని పరిస్థితి. ముంబాయి నుంచి తెప్పించిన యాంటీ డోసు..ఎవ్వరికీ ఏ విధంగానూ ఉపయోగపడుతున్నట్టు అనిపించడం లేదు. అసలు ఈ యాంటీ డోసు ఎవరికైనా వినియోగించారో లేదో కూడా తెలియదు. వైద్య రంగం అన్ని రకాలుగా ఎంతగానో అభివృద్ధి చెందినా..మరెందుకో అనురియా బాధితులను బ్రతికించలేకపోతున్నారో. వైద్య రంగంలో విప్లవాత్మకమైన ఫలితాలు సాధించినా..కల్తీ పాలు సేవించిన బాధితుల విషయానికి వచ్చే సరికి ‘సారీ‘ అనే మాటే వినిపిస్తోంది. ఇక్కడ వైద్యుల లోపాన్ని అనుమానించడమో, అవమానించడమో కాదు. ఆ స్థాయి వైద్యం ఇంకా మన భారతదేశంలో అందడం లేదనే ఆవేదన మాత్రమే.

కళ్ళ ముందు మృత్యువుతో నరక యాతన అనుభవిస్తూ పోరాటం చేస్తున్నా..వైద్యులు ఏమీ చేయలేని నిస్సహాయ పరిస్థితి. రోగి పరిస్థితి వారికి తెలుసు. అయితే కుటుంబ సభ్యుల ఆవేదనను చూడలేక చివరి వరకూ తమకు చేతనైన వైద్య సహాయం అందిస్తూ..ఎలాగైనా బ్రతికించాలనే ఆరాటం, తపన వైద్యులది. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. కాకపోతే రోజుకు ఒకరు చొప్పున.. మృత్యువాత పడటమే..నగర వాసులను కలచి వేస్తోంది.

**మృతుల వివరాలు..**

బుధవారం రెయిన్‌బో ఆసుపత్రిలో 2.9 సంవత్సరాల జై కృత్ రాజ్ మృతిచెందాడు. అలాగే ఆరేళ్ళ బీ మనోహర్ మృతిచెందిన విషయం తెలిసిందే. సేనాపతి రామలక్ష్మి (73), బీ అనంతలక్ష్మి (72), జీ వెంకటలక్ష్మి (69), ఆర్ సూర్యకుమారి (62), జీ సూర్యారావు (81), కే సత్యనారాయణ (76), శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), టీ రమణి (58), కృష్ణవేణి (76) మృతిచెందారు. కాగా రెడ్డి అనంతలక్ష్మి (55), ఎన్ కొండబాబు (64), ఎంఆర్ఆర్ తార్వి (5), కడలి కృష్ణారావు (73), డీ రితిక్ (1.9), పిచుక నాగేశ్వరరావు (72), జీ వెంకటేశ్వరరావు (76), బీ వీరలక్ష్మి (60) నగరంలోని పలు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. కిమ్స్ ఆసుపత్రిలో 4గురు, రెయిన్‌బో ఆసుపత్రిలో ఇద్దరు, డెల్టా ఆసుపత్రిలో ఒకరు, రవి చైతన్య ఆసుపత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. వీరిలో అయిదుగురు వెంటిలేటర్, డయాలసిస్ పొందుతుండగా, ముగ్గురు డయాలసిస్ లో ఉన్నారు. త్వరగా కోలుకోవాలని కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో పాటు ‘మనసులో మాట‘ కోరుకుంటోంది.



## మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- శాసనసభ్యుడు వనమాడి కొండబాబు

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపదన యోజన పథకం ద్వారా సముద్రంలో చేపల వేట చేయు మత్స్యకారులకు సబ్సిడీ పై మంజూరి అయిన బోటు ఇంజన్లు గూడ్స్ ఆటోను బుధవారం జగన్నాధపురం శాసనసభ్యులు స్వగృహం నందు నిర్వహించిన కార్యక్రమంలో శాసన సభ్యుడు వనమాడి కొండబాబు, మత్స్యకారుల నాయకులు నాగడి నాగేశ్వరరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సముద్రంలో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్న మత్స్యకారు కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు కృషి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మత్స్యకారులు నూతన సాంకేతిక పరిజ్ఞానమును ఉపయోగించుకొని చేపల ఉత్పత్తిని పెంచి ఆర్థికంగా ఎదగాలనే దృఢ సంకల్పంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశ్యమని దానిలో భాగంగానే నేడు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా 40 శాతం సబ్సిడీపై ఇంజిన్లు మరియు మూడు చక్రాల వాహనం (ఆటో) అందించడం జరిగిందని, కోపనాతి దేవరాజు, వంక రంగరాజు, కోపనాతి రాజు, తెనాలి రమణ లకు సుమారు 1,33,280 రూపాయల విలువ చేసే ఇంజన్ మరియు 3, 13, 280 రూపాయలు విలువ చేసే ఇంజన్ మరియు 3,13,280 విలువ చేసే ఆటో రాగిత ఈస్టర్ రాణిలకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి వి.కృష్ణారావు, మత్స్యశాఖ సహాయ సంచాలకులు కే కరుణాకర్ రావు, ఆప్కాబ్ ఉపాధ్యక్షులు బలసాడి రంగారావు, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంఘాని నాగేశ్వరరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సి.హెచ్. ఉమామహేశ్వరరావు, మల్లాడి రాజు, రామలింగరాజు, ఎరుపిల్లి రాము, చొక్కా బాబురావు, బడే సత్యరావు, సూరాడ చిన్నారావు, ఎరుపిల్లి సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## చించినాడ బ్రిడ్జి పై 14 రోజులపాటు రాకపోకలు నిలుపుదల



**అమలాపురం( మనసులోమాట) మార్చి 11 :** డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం మండలం చించినాడ బ్రిడ్జి బేరింగ్ రీప్లేస్మెంట్ పనులకు గాను 14 రోజులపాటు రాత్రి 12 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు బ్రిడ్జిపై వాహనాలు నిలుపుదల చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దిగువ ప్రకటించిన తేదీలలో ఈ యొక్క నిలుపుదల వర్తిస్తుందని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. ఈనెల 12, 15, 18, 21, 24, 27, 30 తేదీల లోనూ ఏప్రిల్ నెలలో 2, 5, 8, 11, 16, 21, 26 తేదీలలో రాత్రి 12 గంటల నుండి ఉదయం 5 గంటల వరకు వాహనాలు రాకపోకలు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. కావున ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి జాతీయ రహదారులు భవనాల శాఖ బ్రిడ్జి బేరింగులు రీప్లేస్మెంట్ పనులకు సహకరించాలని ఆమె ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



## నేడు జిల్లాకు రానున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ

- రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ‘మహిళా జన్ సున్వాయ్‘..
- మహిళల సమస్యలపై అర్జీలు స్వీకరించనున్న శైలజ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** తూర్పు గోదావరి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ నేడు (గురువారం) పర్యటనకు రానున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా ‘జన్ సున్వాయ్‘ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి టీ శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం రాజమహేంద్రవరం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ మీటింగ్ హాల్‌లో ఉదయం 9.30 గంటలకు మహిళలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. మహిళలు ఎదుర్కొంటున్న గృహ హింస, వరకట్న వేధింపులు, ఆస్తి వివాదాలు, కుటుంబ సమస్యలు, ఇతర మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత ఆధార పత్రాలతో కలసి సమర్పించవచ్చని తెలిపారు. సమర్పించబడిన అర్జీలను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరిశీలించి తగిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు సూచనలు చేయబడతాయని అన్నారు. కాబట్టి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మహిళలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను సమర్పించేందుకు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారి టీ శ్రీదేవి కోరారు.

## 6వ జిల్లా కలెక్టర్ల సమావేశం

- తొలి రోజు పాల్గొన్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి





**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** అమరావతి రాజధాని ప్రాంతంలోని వెలగపూడి సచివాలయంలో నిర్వహిస్తున్న 6వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో తొలి రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సమావేశాన్ని జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రసారంగా జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఇతర జిల్లా అధికారులు వీక్షించారు. సమావేశం తొలి రోజు స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, దాని అమలుకు రూపొందించిన పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, రాష్ట్ర జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాల్లో విజయవంతంగా అమలవుతున్న పథకాలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్ సేవలు, సుపరిపాలనలో సాంకేతికత వినియోగం, పెట్టుబడులు, వైద్యారోగ్య రంగం, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ దిశగా అమలు చేయాల్సిన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ల సదస్సులో యాక్షన్ ప్లాన్ ప్రకటించారు. ప్రతీ మూడు నెలలకోసారి పాలనా అంశాలపై సమీక్ష నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన మధ్య సమతుల్యత సాధిస్తున్నామన్నారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా రూపొందించిన పది సూత్రాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తే మంచి పరిపాలన అందించవచ్చని తెలిపారు. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను పారదర్శకంగా ప్రజలకు అందించాలని సూచించారు. మార్చి 13న అన్నదాత సుఖీభవ పథకాన్ని మూడో విడతగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల ఖాతాల్లో మిగతా మొత్తాన్ని జమ చేస్తుందని తెలిపారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాల ప్రతినిధులతో కలిసి “రైతన్నా మీ కోసం” కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఖరీఫ్ సాగు కోసం మే 15న సాగు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉగాది సందర్భంగా 2.5 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. “ఇంద్ర ధనస్సు” పథకం ద్వారా దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. విద్యుత్తు రంగంలో గతంలో అమలు చేసిన ట్రూ అప్ విధానంతో వచ్చిన భారాన్ని తగ్గిస్తూ ట్రూ డౌన్ అమలు చేశామని, రూ.4600 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరిస్తోందన్నారు. ఈ ఏడాది విద్యుత్తు కొనుగోలు ధరను యూనిట్‌కు 39 పైసల మేర తగ్గించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో కుసుమ్ పథకం కింద 3 లక్షల పంప్ సెట్లు అందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే సబ్ స్టేషన్ యూనిట్ ఆధారంగా మైక్రో గ్రిడ్ వ్యవస్థను ఏర్పాటు చేసి “ప్రోజ్యూమర్” కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఐటీ, ఏఐ, క్వాంటం ల్యాబ్స్ తరహాలో వ్యవసాయ రంగానికి ప్రత్యేకంగా అత్యున్నత స్థాయి సంస్థ అవసరమని పేర్కొంటూ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో “ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్” ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండు రోజులు జరుగు... మంత్రులు జిల్లా కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్ముఖ్ సగిలి



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 11..** రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రులతో బుధవారం నుండి రెండురోజుల పాటు జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో మొదటిరోజు బుధవారం సదస్సులో పాల్గొన్న కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్. కలెక్టర్ల సమావేశానికి హాజరైన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు. మొదటి రోజు కలెక్టర్ల సమావేశంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాల్లో విజయవంతమైన కార్యక్రమాలపై సమీక్షించిన ముఖ్యమంత్రి. పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టుబడులు, వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై ఈ సమావేశంలో చర్చ జరగనున్నది

## కోర్టు ఉత్తర్వులకే దిక్కులేదా..?

- పేదలపై ‘జెసిబి‘ జులుం!
- వంద గజాల షెడ్డుపై భూబకాసురుల కన్నే..
- అండగా నిలిచిన బంధువులు గ్రామస్థులు!
- గ్రామ ప్రజల సాక్షిగా అక్రమ రిజిస్ట్రేషన్ల దందా....
- పట్టించుకోని అధికార యంత్రాంగం...!



**కాకినాడ (మనసులో మాట ) మార్చి 11..** కాకినాడ రూరల్ సర్పవరం గ్రామం లో సుమారు 75 ఏళ్లుగా ఆ భూమి వారికే తెలుసు ఆ మట్టితోనే వారి అనుబంధం. కానీ, రాత్రికి రాత్రే జిరాయితీ పేరుతో పుట్టుకొచ్చిన తప్పుడు పత్రాలు ఆ పేదల నీడను దూరం చేసేందుకు సిద్ధమయ్యాయి. సాక్షాత్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే విధించినా లెక్కచేయకుండా జెసిబితో వచ్చి దౌర్జన్యం చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సదరు స్థలంలో 75 సంవత్సరాలుగా నివిస్తున్నామని భోనాసుల మాణిక్యం, ఆమె కుమారులైన రామకృష్ణ, సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం సర్పవరం గ్రామంలో లోకల్ ఫండ్ రోడ్ సర్వే నంబర్ 34/2 లో పీనుగుల పుంత గా పిలవబడే గ్రామ పోరంబోకుకు లో 4 ఎకరాల 20 సెంట్లు ఉండేది. ఈ భూమిలో భోనాసుల మాణిక్యం, ఆమె కుమారులైన రామకృష్ణ, సత్యనారాయణ గత ఏడు దశాబ్దాలుగా నివాసం ఉంటున్నారు. మొదట తాటాకుల పాక వేసుకుని తదనంతరం వంద గజాల విస్తీర్ణంలో చిన్న రేకుల షెడ్డు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ భూమి తమదంటూ బుధవారం కొంతమంది వ్యక్తులు జెసిబితో వచ్చి ఒక్కసారిగా హల్‌చల్ చేసి భయ బ్రాంతులకు గురి చేశారని అంతటి తో ఆగకుండా షెడ్డును కూల్చివేసేందుకు ప్రయత్నించడంతో బాధితులు వారి బంధువులు ప్రాణాలకు తెగించి అడ్డుకున్నామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని అధికారులను వారు ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక KANCHARLA



## అటల్ ఇంక్యుబేషన్ అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్

- కేంద్రాల ద్వారా దేశంలో 6782 స్టార్టప్ లు అభివృద్ధి
- ఏపీలో మూడు కొత్త కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు
- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** భారత దేశ వ్యాప్తంగా యువతకు మరింత ప్రోత్సాహం ఇచ్చి నూతన ఆవిష్కరణల ద్వారా యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అటల్ ఇన్నోవేషన్ మిషన్ కింద అటల్ ఇంక్యుబేషన్ కేంద్రాలు, అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని, వీటి ద్వారా దేశవ్యాప్తం గా పలు ప్రాంతాల్లో ఇప్పటివరకు 103 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కేంద్ర గణాంకాలు కార్యక్రమాల అమలు శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ తెలిపారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ అమలు, కొత్త కేంద్రాలు ఏర్పాటుపై బుధవారం కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల్లో 103 కేంద్రాలు ఏర్పాటు చేయగా, వీటిలో 83 అటల్ ఇంక్యుబేషన్ సెంటర్లు, 20 అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్లు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 6,782 స్టార్టప్ లు అభివృద్ధి చెందగా, ఇందులో 2 వేలు పైబడి స్టార్టప్ లు మహిళల ఆధ్వర్యంలో ఏర్పడ్డాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం మూడు కేంద్రాలు పని చేస్తుండగా, వీటి ద్వారా 157 స్టార్టప్ లు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నివేదిక మేరకు ఇంక్యుబేషన్ కేంద్రాలు పనితీరు సంతృప్తికరంగా ఉందన్నారు, అలాగే దేశవ్యాప్తంగా మరో 48 కొత్త ఇంక్యుబేషన్ కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదన ఉండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ లో మూడు కొత్త ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటుకు ప్రతిపాదన ఉందని కేంద్ర మంత్రి వివరించినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## సీనియర్ జర్నలిస్టు దివంగత వారణాసికి ఘన నివాళి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** కాకినాడ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దివంగత వారణాసి సూర్యనారాయణ మూర్తి మృతి అత్యంత బాధాకరమని ఆయన తన శేష జీవితం పాత్రికేయ వృత్తిలోనే కొనసాగడం పలువురికి ఆదర్శమని కాకినాడ చెందిన పలువురు జర్నలిస్టు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అత్యంత సీనియర్ జర్నలిస్టు వారణాసి సూర్యనారాయణ మూర్తి సంస్కరణ సభ బుధవారం కాకినాడలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో సీనియర్ జర్నలిస్టు రాయవరపు ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో తన జర్నలిస్టు మిత్రులతో కలిసి సంస్మరణ సభ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ముందుగా వారణాసి చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమం వివరాలు వెల్లడించారు. ఈ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వా శేషబాబ్జీ హాజరై వారణాసితో తనకున్న అనుభవాలను వివరించారు. 1984 సంవత్సరం నుండి వారణాసి తనకు తెలుసని అప్పుడే తాను సిపిఎం లోకి వచ్చానని తాను చేసిన కార్యక్రమాలను రేడియో వార్తల ద్వారా తెలియజేసే వారన్నారు. అప్పుడు విలేకరులకు ఒక ప్రత్యేకమైన లక్ష్యం ఉండేదని అది నేడు కొరవడిందని చెప్పారు ప్రజా సమస్యల వార్తలను ముందు భాగంలో ప్రచురించే వారని ప్రస్తుత పరిస్థితుల్లో మీడియా పెట్టుబడిదారి చేతుల్లోకి వెళ్లిపోవడంతో ప్రజా సమస్య అనుకున్నంత స్థాయిలో ప్రచురణ జరగటం లేదని బాబ్జి అన్నారు. పాత్రికేయ రంగంలో సుమారు 60 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన వారణాసి మృతి చెందడం అత్యంత బాధాకరమని బాబ్జి చెప్పారు. అలాగే దివంగత వారణాసితో తమకున్న అనుభవాలను సీనియర్ జర్నలిస్టులు బొడ్డు వెంకటరమణ మూర్తి, ఎన్ దుర్రానీలు గుర్తు చేసుకుని సభికులకు తెలియజేశారు. సీనియర్ జర్నలిస్టు వారణాసి మూర్తికి సంతాపంగా హాజరైన జర్నలిస్టులందరూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి కాకినాడకు చెందిన పలువురు జర్నలిస్టులు హాజరై సంతాపం వ్యక్తం చేశారు.

# ప్రతి రంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారు

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

- తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం - మిన్నంటిన సంబరాలు
- సాంస్కృతిక, క్రీడా బాలికలకు, మహిళలకు సత్కారం - కల్తీ పాల మృతులకు నివాళులు






**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** ప్రతి రంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారని పలువురు వక్తలు కొనియాడారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో స్టేడియం రోడ్డులోని అల్యూమినియం అసోసియేషన్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగర తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ అధ్యక్షతన పార్లమెంటరీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, పార్లమెంటరీ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి, ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ తురకల నిర్మల, నగర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ద్వారా పార్వతి సుందరి నేతృత్వంలో, నగర టీడీపీ అధ్యక్షుడు మజ్జి రాంబాబు సారథ్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణు గోపాల రాయుడు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతున్నారని, ఆనాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబు నాయుడు, లోకేష్ మహిళల అభ్యున్నతి కోసం ఎంతో ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధానంగా నగరంలో మహిళల భద్రత కోసం అసాంఘిక శక్తులను, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ లను ఏరేస్తున్నామని.. వారిలో మార్పు రావాలని, లేదంటే మరింత చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా హెచ్పీవీ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని అన్నారు. నగరంలో చీకట్ల వాతావరణం లేకుండా రూ.80 లక్షలతో 1300 విద్యుత్తు లైట్లు వేయించామన్నారు. రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆడపిల్లలకే బంగారు భవిష్యత్తు ఉందని బాలికలను, మహిళలను ప్రోత్సహించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ దేశం పార్టీలో ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ లు మహిళల పక్షపాతిగా వారి అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మహిళలందరూ వారికి మద్దతుగా నిలవాలని కోరారు. గన్ని కృష్ణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఎమ్మెల్యేలుగా నిలిచేందుకు సంసిద్ధం కావాలని మీ శక్తియుక్తులు పెంపొందించుకోవాలని అన్నారు.

**కల్తీ పాల మృతులకు నివాళులు..**

కాగా ఇటీవల చోటు చేసుకున్న కల్తీ పాల ఘటనలో మృతి చెందిన 11 మంది ఆత్మకు శాంతి చేకూరాలంటూ వేడుకలు ప్రారంభానికి ముందుగా నివాళులర్పించారు. వారి కుటుంబాలకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని వేడుకుని మృతుల కుటుంబాల సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాకారులకు సత్కారం..**

ఈ సందర్భంగా బాలికల కోలాటం నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నగరంలోని విద్యా సంస్థలకు చెందిన పలు క్రీడ అంశాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభతో నగరానికి వన్నె తెచ్చిన బాలికలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, నగర తొలి మహిళ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మతో పాటు పలువురు ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించి నగదు బహుమతి అందజేశారు. తెలుగుదేశం పార్టీల్లో విశేషంగా పనిచేసిన సీనియర్ మహిళా నాయకురాళ్ళను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలకు ముందుగా వందలాదిగా మహిళలు డీలక్స్ సెంటర్ నుంచి భారీ ర్యాలీగా అల్యూమినియం అసోసియేషన్ హాలుకు చేరుకున్నారు.

# ఘనంగా సావిత్రీబాయి ఫూలే సంస్మరణ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే 129 వ సంస్మరణ సభ పూలే సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు నయనాల కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక సీతంపేట బీసీ బాలికల వసతి గృహంలో జరిగింది. ముఖ్య అతిథిగా కాకినాడ జనరల్ హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ పితాని కోమల పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ పితాని కోమల, నయనాల కృష్ణారావు మాట్లాడుతూ
నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను కుప్పకూల్చి కులరహిత సమాజ స్థాపనకు పోరాటం ప్రారంభించిన ఆద్యులు పూలే దంపతులని, అన్ని కులాల మహిళలకు విద్య నిషేదించబడిన కాలంలో తొలి బాలికల పాఠశాల స్థాపించిన యోధులని కొనియాడారు. ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయిని మాతా సావిత్రీబాయి పూలే అని, అగ్రవర్ణ స్త్రీలు కోసం బాలహత్య ప్రబంధక గృహాన్ని స్థాపించి గర్భవతులైన వితంతువులు, వారి పిల్లల సంరక్షణ బాధ్యత తీసుకున్న తొలి సాధ్వీమణి సావిత్రీబాయి పూలే అని అన్నారు. సామాజిక స్థితిగతులపై కవితలు, పావడాలు వ్రాసిన కవయిత్రి సావిత్రీబాయి అని, వితంతువులకు గుండు గీయించాలనే ఆచారాన్ని నిరసించి, క్షురకుల చేత ఉద్యమింపజేశారని, దేశంలో కర్షక, కార్మిక, ఖాదీలాంటి అనేక ఉద్యమాలకు ఆద్యులు పూలే దంపతులని అన్నారు. వారు ప్రారంభించిన ఉద్యమాలు ఇంకా సఫలీకృతం కాలేదని, వారి ఆశయ సిద్ధికి, బహుజనుల సర్వతోముఖాభివృద్ధికి అంతా కృషి చేయాలని డాక్టర్ కోమల, నయనాల కృష్ణారావు కోరారు. కార్యక్రమంలో ఎంవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు రహిత జీవనశైలిని ప్రోత్సహించండి

**- పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** పొగాకు రహిత జీవన శైలిని ప్రోత్సహించటం ద్వారా పొగాకు వ్యతిరేక దినోత్సవం లక్ష్యాన్ని సాదించగలమని 'ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ - ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని (నో స్మోకింగ్ డే) పురస్కరించుకుని రాజమండ్రి శాఖ అధ్యక్షుడు రహమాన్ ఖాన్ అధ్యక్షతన హుక్కుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్ నందు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది మార్చి నెల రెండవ బుధవారం జాతీయ నో స్మోకింగ్ డే నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా ధూమపానం వలన వచ్చే క్యాన్సర్, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు గురించి అవగాహన కల్పించాలని సూచించారు. రాజమండ్రి అభయ్ ఎమర్జెన్సీ ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్ కృష్ణ భరద్వాజ్ హాజరై మాట్లాడుతూ పొగాకు పొగలో కార్బన్ మోనాక్సైడ్ అనే విష వాయువు ఉంటుందని ఇది శరీర అవయవాలకు అవసరమైన ఆక్సిజన్ అందకుండా ఆపుతుందని.. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధులైన దీర్ఘకాలిక అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్, ఎంఫిసెమా, క్రానిక్ బ్రాంకైటీస్ ల ప్రమాదం పెరుగుతుందని అన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అలాగే కరోనరీ ఆర్టరీ వ్యాధి వంటి గుండె జబ్బుల ప్రమాదం కూడా పెరుగుతుందని అన్నారు. పెయిన్ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ దీర్ఘకాలిక నొప్పులకు చేయు అధునాతన నొప్పి చికిత్స విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యూ ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, కోల లక్ష్మీ నారాయణ, ఎం బాపూజీ, శైలజ, రాజ్యలక్ష్మి, హీరా, శ్రీదేవి, కే మాసరరాజు, ఎంఎస్ ప్రకాష్, పీ వాసు లతో పాటు వంద మంది సభ్యులు హాజరయ్యారు.



# రాష్ట్ర ఉత్సవంగా మొల్లమాంబ జయంతి

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** 16వ శతాబ్దపు ప్రసిద్ధ తెలుగు కవయిత్రి, 'మొల్ల రామాయణ' కర్త ఆతుకూరి మొల్లమాంబ జయంతిని మార్చి 13 న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారిక రాష్ట్ర పండుగగా (రాష్ట్ర ఉత్సవం) నిర్వహిస్తోంది. ఈ మేరకు జిల్లా స్థాయిలో మార్చి 13వ తేదీన కవయిత్రి మొల్లమాంబ (మొల్ల) జయంతి నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం 10.30 గంటలకు కాకినాడ ఆశ్రమం పబ్లిక్ స్కూల్ సమీపంలోని బోటు క్లబ్ పార్క్ వద్ద గల కవయిత్రి మొల్లమాంబ (మొల్ల) విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరుగుతుందన్నారు.




# అనగనగా..ఆనంద్!

**- హోటల్ సీజ్ తో రోడ్డున పడ్డ కార్మికులు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** రాజమహేంద్రవరం నగరంలో ఒక వెలుగు వెలిగిన ఆనంద్ రీజెన్సీ హోటల్ ను సోమవారం సీజ్ చేశారు. దీంతో ఆ హోటల్ లో పనిచేసే కార్మికులు రోడ్డున పడ్డారు. వీరికి సంబంధించిన 36 నెలల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సొమ్ము యాజమాన్యం స్వాహా చేసిందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివాదాలకు, ఉద్రిక్తతలకు కేంద్రంగా నిలిచిన ఆనంద్ రీజెన్సీ హోటల్ సీజ్ వేయడంతో ఏమి చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో కార్మికులు ఉన్నారు. యాజమాన్యం, కార్మికుల మధ్య వేతనాలకు సంబంధించి వివాదాలు ఉన్నాయి. హోటల్ యాజమాన్యం తీరును నిరసిస్తూ కార్మికులు న్యాయం కోసం పలు సందర్భాల్లో నిరసన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఆనంద్ రీజెన్సీ గ్రూప్ చైర్మన్ రవి శంకర్ వరప్రసాద్ యానాం బ్రాంచ్ నుంచి వబయలు దేరిన ఆయన మృతదేహం గోగులంకలో లభ్యమైంది. ఈ ఘటన అప్పట్లో తీవ్ర సంచలనంగా మారింది. సీబీఐ దర్యాప్తు చేపట్టింది. అలాగే ఆస్తులకు సంబంధించిన లీజులు, అద్దె ఒప్పందాలపై న్యాయపరమైన అంశాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. గత సంవత్సరం (2025) హోటల్ సీజ్ నేపథ్యంలో హోటల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తంపై యాజమాన్య నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, చట్టపరమైన సమస్యల నేపథ్యంలో ఆనంద్ రీజెన్సీ హోటల్ సీజ్ వేశారు. హోటల్ కార్మికులు అనేక సార్లు రోడ్డెక్కి ఆందోళనలు చేసినా కార్మిక శాఖ సరైన రీతిలో స్పందించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరంలోని జాంపేటలో ఎందరో ప్రముఖులకు చక్కని ఆతిథ్యంతో గుర్తింపు పొందిన ఆనంద్ రీజెన్సీ ప్రస్తుతం 'అనగనగా..ఆనంద్' అని చెప్పుకునే పరిస్థితికి చేరడం శోచనీయం.

# మీ అవయవదానం మరొకరికి జీవనాధారం

- సౌత్ జోన్ డీఎస్పీ ఎస్ భవ్యకిషోర్
- రాజమహేంద్రవరం పీఎంపీల ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన ర్యాలీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** ఒకరు అవయవదానం చేయటం ద్వారా ఎనిమిది మందికి జీవనాధారం చూపించవచ్చని సౌత్ జోన్ డీఎస్పీ ఎస్ భవ్య కిషోర్ అన్నారు. బుధవారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమండ్రి శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఖాన్ అధ్యక్షతన స్థానిక సౌత్ జోన్ డీఎస్పీ ఆఫీసు నుండి అజాద్ చౌక్ మీదుగా దేవీచౌక్ వరకు అవయవదానంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ ఎస్ భవ్య కిషోర్ మాట్లాడుతూ మన దేశంలో ప్రతి ఏటా వేలాది మంది అవయవాలు సకాలంలో అందక మరణిస్తున్నారని, ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత తన అవయవాలను దానం చేయటం ద్వారా ఎనిమిది మందికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చని అన్నారు. ఈ అవయవదానం పై అవగాహన కల్పిస్తున్న పీఎంపీలను అభినందించారు. పీఎంపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది అంతా పీఎంపీ అసోసియేషన్ ద్వారా అన్ని మండలాల్లో అవయవదానంపై అవగాహన కల్పించడం జరుగుతుందని, ఈ అవగాహన లేకపోవడం వల్ల, కొన్ని అపోహల వల్ల ప్రజలు అవయవదానానికి వెనకాడడం జరుగుతుందన్నారు. కనుక ప్రతి పీఎంపీ ముందుగా మీరు అవయవదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానందం, జిల్లా కోశాధికారి పీ చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్, కోశాధికారి యూ ప్రసాద్ బాబు, కేఎస్ఎస్ఎన్ రెడ్డి, సుంకర శ్రీనివాస్, శైలజ, రాజ్యలక్ష్మి, హీరా, కోలా లక్ష్మీనారాయణ, ఎం బాపూజీ లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి ఆకస్మిక తనిఖీలు..



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి బుధవారం రాజమహేంద్రవరం నగరంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలోని సుబ్బారావు పేటలో ఉన్న మూడు ఐసీడీఎస్ కేంద్రాలు, నెహ్రూ నగర్‌లోని ఎంపీపీ పాఠశాలను ఆమె సందర్శించారు. పర్యటనలో భాగంగా పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును, అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు పోషక విలువలు కలిగిన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని శుభ్రంగా, రుచికరంగా వండి అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వసతి గృహాల్లో ఉండే పిల్లల పట్ల వ్యక్తిగత బాధ్యతతో వ్యవహరించి, వారికి నాణ్యమైన ఆహారం అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు, వసతి గృహాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత వంటి అంశాలపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో వంట చేసే వారు కూడా బాధ్యత వహించాలని, మండల విద్యా శాఖ అధికారి కూడా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేయడంలో బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి వెంట ఏఎస్ఓ నాగాంజనేయులు, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం సందీప్, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ, పౌర సరఫరాల, పాఠశాల విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA మనసులో మాట సంచలన తెలుగు దిన పత్రిక



## జనాభా ప్రతిపాదికన పంచాయితీ ల వర్గీకరణ

**అడ్డతీగల (మనసులో మాట) న్యూస్ మార్చి 11 ..** అడ్డతీగల ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారము అడ్డతీగల మండలనికి సంబంధించిన గ్రామపంచాయతీలను జనాభా ప్రతిపాదికన చేసిన మండల వర్గీకరణ చేసినట్లు అడ్డతీగల మండల అభివృద్ధి ఏ వి వి కుమార్ తెలిపారు. అడ్డతీగల గ్రామపంచాయతీని అర్బన్ గ్రామ పంచాయితీగా వర్గీకరించారు అని అన్నారు. 5000 పైగా జనాభా కలిగిన ఈ పంచాయతీ లో గ్రామీణ ప్రాంతంలోనే ఉంటూనే పట్టణ సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. 2500 జనాభా కలిగిన గొంటివానిపాలెం పంచాయితీని గ్రేడ్1 పేర్కొన్నట్లు తెలిపారు. 1500 జనాభా కలిగిన గ్రేడ్ 2 పంచాయతీలుగా డి. భీమవరం డి. రామవరం, దాన్యం పాలెం, దుర్చార్తి, కోనలవ, రాయిపల్లి, తిమ్మాపురం, తుంగమడుగుల, ఎల్లవరంలను వర్గీకరించమన్నారు భీముడు పాకలు, బొడ్లంక, గొండోలు, కిమ్మూరు, మట్లపాడు, పులి గోగులపాడు, సోమన్నపాలెం, వీరవరం, వేటమామిడి ఈ గ్రామ పంచాయతీలను గ్రేడ్ 3 గా 1500 కంటే తక్కువ జనాభా ఉండడంతో వర్గీకరించామని మండల అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు

## ర్యాలీ జగన్మోహిని కేసు స్వామి ఆలయ హుండి ఆదాయం రూ. 14 లక్షలు



**కొత్తపేట మనసులో మాట మార్చి 11..** అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో వేంచేసి ఉన్న జగన్మోహిని కేశవ స్వామి ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఐదు నెలల మూడు రోజులకు గాను ప్రధాన హుండీ,రూ, 9 లక్షల52 వేలు 522, అన్నదాన హుండి రూ, 4లక్షల 45వేలు990, మొత్తం13లక్షల, 98,వేల512 ఆదాయం అదే వచ్చిందని, చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, పాలక మండల సభ్యు లు, ఆత్రేయపురం గ్రూపు దేవాలయాల గ్రేడ్ 3 అధికారి బి నరేంద్ర కుమార్, పాలక్ మండల సభ్యులు గ్రామస్తుల ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి తెలిపారు.

## వంశీకృష్ణకు శుభలేఖ అందించిన యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘ రెడ్డి దంపతులు



**అనపర్తి (మనసులో మాట)మార్చి 11:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ జే ఆర్ సి కన్వెన్షన్ లో ఏప్రిల్ 2 వ తేదీన జరగబోయే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల కుమార్తె డాక్టర్ నల్లమిల్లి సనాతని, పాణ్యం శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి వెంకటరెడ్డి దంపతుల కుమారుడు, జనార్దన్ రెడ్డి ల వివాహ వేడుకకు హాజరు కావాలని, హైదరాబాద్ లో మహా టీవీ గ్రూప్ ఛైర్మన్ మారెళ్ల వంశీకృష్ణ కి శుభలేఖను అందించిన యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘ రెడ్డి దంపతులు.

### ఇంటి నిర్మాణ అనుమతులతో నిర్మిస్తున్న

# షాపులను వెంటనే నిలిపివేయాలి

### - జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీ పై చర్యలు తీసుకోవాలి - ఏపీ ఆర్ సి ఎస్ డిమాండ్



**జగ్గంపేట (మనసులో మాట) మార్చ్ 11..** జగ్గంపేటలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణ అనుమతులతో నిర్మిస్తున్న షాపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జగ్గంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎండిఓ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి కే.సతీష్ మాట్లాడుతూ రాజకీయ, ఆర్థిక, పంచాయతీ సెక్రెటరీ అండదండలతో కేవలం పంచాయతీకి చెందవలసిన పన్నులను ఎగొట్టడానికి ఇంటి నిర్మాణం కొరకు తీసుకున్న అనుమతులతో షాపులు నిర్మిస్తున్నారని ఆ షాపులను తక్షణమే నిలిపేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానంగా పంచాయితీలను అభివృద్ధి పదంలో నడిపిస్తున్నామని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఇలాంటి విషయంలో నిమ్మకు నీరెత్తి నట్లు వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. 70 శాతం పూర్తి అయిపోయిన షాపులకు ఇప్పటివరకు స్పందించలేదంటే ఎంతవరకు పర్యవేక్షణ ఉందో దీన్ని బట్టి అర్థమవుతుందని ఆయన తెలిపారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే పన్నులు ఎగ్గొట్టకూడదని పన్నులు కడితే అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. కానీ ఇక్కడ లంచాలకు అలవాటుపడి అభివృద్ధిని, బాధ్యతలను గాలికి వదిలేస్తున్నారని ఆయన విమర్శించారు. తక్షణమే ఈ షాపులపై విచారణ చేపట్టి నిలిపేయాలని, అలాగే పంచాయతీ కార్యదర్శి పై విచారణ చేపట్టి,చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.లేనియెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## పదవ తరగతి పరీక్షలు నిష్పక్షపాతంగా జరిపించాలి

### - తల్లిదండ్రుల విన్నపం

**కాజులూరు (మనసులో మాట) ఫిబ్రవరి 11..** పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ముఖ్యమైనవి. ఈ పరీక్షల్లో పొందిన మార్కులు వారి ఉన్నత విద్యకు, భవిష్యత్తు అవకాశాలకు పునాది వేస్తాయి. అందువల్ల ఈ పరీక్షలు పూర్తిగా నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా జరగాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇటీవలి కాలంలో కొన్ని ప్రాంతాల్లో చదివిన విద్యార్థులకు తక్కువ మార్కులు రావడం, చదవని విద్యార్థులకు ఎక్కువ మార్కులు రావడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది నిజంగా చదువుపై శ్రమించే విద్యార్థులకు అన్యాయం చేయడం వంటిదే. కష్టపడి చదివిన విద్యార్థులు నిరుత్సాహానికి గురవుతారు. అలాగే ఇది విద్యా వ్యవస్థపై నమ్మకాన్ని కూడా తగ్గిస్తుంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోతే విద్యార్థులలో అనుమానాలు పెరుగుతాయి. పరీక్షా పత్రాల మూల్యాంకనం నిష్పక్షపాతంగా జరగాలి. ప్రతి విద్యార్థి రాసిన సమాధానాల ఆధారంగా మాత్రమే మార్కులు ఇవ్వాలి. ఎలాంటి పక్షపాతం లేకుండా మూల్యాంకనం జరగడం చాలా అవసరం.

అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన నియమాలు పాటించాలి. నకిలీ (మాల్ ప్రాక్టీస్) జరుగకుండా పర్యవేక్షణ ఉండాలి. అధికారులు కూడా పరీక్షా ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలి. దీంతో నిజంగా చదివిన విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు ప్రభుత్వం మరియు విద్యాశాఖ అధికారులను కోరుతూ పదవ తరగతి పరీక్షలను పూర్తిగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని విన్నపం చేస్తున్నారు. అలా జరిగితేనే విద్యార్థుల్లో నమ్మకం పెరుగుతుందనీ మరియు వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. నిష్పక్షపాతంగా జరిగే పరీక్షలే విద్యార్థుల ప్రతిభను నిజంగా వెలుగులోకి తీసుకొస్తాయి. అందుకే పదవ తరగతి పరీక్షలు ఎలాంటి అన్యాయం లేకుండా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉంది.

## పరీక్షలు రాసే విద్యార్థులకు ఆ దేవాలయమే కేంద్రం



**సామర్లకోట (మనసులో మాట) మార్చ్ 11;** సామర్లకోట లోని ప్రాచీన మాండవ్య నారాయణస్వామి ఆలయం పరీక్షలు రాసి ప్రతి విద్యార్థికి అత్యంత ప్రధాన కేంద్రం. ఈ దేవాలయంలో కొద్దిసేపు కూర్చుని చదివితే చాలు విజయం తథ్యమనే నమ్మకం నెలకుంది. ప్రతి అట పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు వివిధ పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు మాండగ నారాయణస్వామి ఆలయాన్ని దర్శించి, కొద్దిసేపు ఆలయ ప్రాంగణంలో చదివి ఆ తర్వాత పరీక్షలకు తరలి వెళ్తారు. కాకినాడ జిల్లాకు చెందిన పలు ప్రభుత్వ కార్పొరేట్ పాఠశాల విద్యార్థులు సైతం బస్సులలో పెద్ద ఎత్తున ఈ ఆలయానికి పరీక్షల ముందు తరలి వస్తారు. వివిధ కార్పొరేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున బుధవారం తరలివచ్చి స్వామిని దర్శించారు, ఉపాధ్యాయులు ముందుగా సరస్వతి ప్రార్ధనలు నిర్వహించి, అనంతరం విద్యార్థులతో కలిసి ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపారు. విద్యార్థులు తమ తమ పాఠ్యాంశాలను కొద్దిసేపు చదివి, అనంతరం తమ తమ పాఠశాలలకు తరలి వెళ్లారు. స్వామిని దర్శించి, ఆలయంలో కొద్దిసేపు చదివితే చాలు విజయం తధ్యమని విద్యార్థులు ధీమాను వ్యక్తం చేయటం విశేషం. ప్రాచీన కాలంలో మాండవ్య నారాయణస్వామి ఆచరించిన తపస్సు ఫలితంగా సాక్షాత్తు శ్రీమన్నారాయణ లక్ష్మీదేవితో కలిసి స్వయంభుగా ఈ క్షేత్రంలో వెలిసినట్లు ఆలయ చరిత్ర వివరిస్తోంది.

## శ్రీ బాలాజీ స్కూల్ లో విద్యార్థులతో ఫుడ్ ఫెస్టివల్



**ముమ్మిడివరం(మనసులో మాట) మార్చి 11..** ముమ్మిడివరం శ్రీ బాలాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులలో సృజనాత్మకత, సహకారం మరియు బాధ్యతాభావాన్ని పెంపొందించేందుకు ప్రత్యేకంగా బుధవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా వివిధ రకాల ఆహార పదార్థాలతో స్టాళ్లను ఏర్పాటు చేసి, ఉపాధ్యాయులు,సహవిద్యార్థులకు విక్రయించారు. కార్యక్రమంలో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ రకాల పిండి వంటలను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామరాజు ఆద్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ పి.సుజాత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇంట్లో వండిన ఆహార పదార్థాల ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని రామరాజు తెలిపారు. పాఠశాలల్లో జరిగే ఫుడ్ ఫెస్టివల్ (ఆహార ఉత్సవం) విద్యార్థులలో సృజనాత్మకత, సాంప్రదాయ వంటకాలపై అవగాహన పెంచుతుంది. ఇందులో విద్యార్థులు స్వయంగా తయారుచేసిన వివిధ రకాల వంటకాలు (పిండి వంటలు, సాంప్రదాయ ఆహారాలు) ప్రదర్శన చేశారు. ఇది ఆరోగ్యకరమైన ఆహారం, పౌష్టికాహారం మరియు వైవిధ్యమైన రుచుల గురించి నేర్చుకునేందుకు ఒక చక్కని వేదిక. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి, వారిని అభినందించారు. బయట దొరికే జంక్ ఫుడ్ కంటే ఇంట్లో వండుకునే పౌష్టికాహారం ఆరోగ్యానికి ఎంత మంచిదో ఈ ఉత్సవం ద్వారా తెలిసింది. ఇది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఒక మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండంట్ పి.సుజాత మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు, సమన్వయం మరియు సేవా భావం వంటి విలువలు అభివృద్ధి చెందుతయాన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామరాజు మరియు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సంప్రదాయ వంటకాలను ప్రోత్సహించడం, పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేయడం, మరియు విద్యార్థులలో వంట నైపుణ్యాలను పెంపొందించడం చేశారు. ఈ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం పాఠశాలలో ఆనందభరిత వాతావరణాన్ని సృష్టించింది.

### ఉద్యమ పార్టీ సిపిఐ కి

# విరాళాలు ఇచ్చి సహకరించండి

### - ఆవుల శేఖర్ పిలుపు



**ఉండి, మనసులో మాట మార్చి 11 :** నూరేళ్ల చరిత్ర కలిగిన ఉద్యమ పార్టీ సిపిఐకి విరీ విగా విరాళాలు ఇచ్చి ప్రజా ఉద్యమాలకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఉండి జంగాల కాలనీలో గడపగడపకు ఇంటింటికి తిరిగి కరపత్రం అందించి బుధవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ సిపిఐ జిల్లా కార్యదర్శి కో నాల భీమారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలను సాగించడంలో సిపిఐ కి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. వందేళ్ళ చరిత్ర లో ఎన్నో ప్రజా ఉద్యమాలు ,భూ పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తనదైన శైలిలో సిపిఐ ముందుకు సాగుతుందన్నారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల, గొంతుకై వారి పక్షాన పోరాడుతుందన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి మౌలిక వసతుల కల్పనకు పనిచేస్తుందన్నారు. తాగు, సాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, ఇల్లు ,ఇళ్ల స్థలాలు, పింఛన్లు ,విద్య ,వైద్యం, ఉపాధి, అర్హులకు కల్పించే విధంగా ప్రజా పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఏరియా కార్యదర్శి కలి శెట్టి వెంకట్రావు, మండలి నాగేశ్వరరావు, సనపాల శ్రీను, తమ్మరాని శ్రీనివాస్, పెరవలి పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



### భీమవరంలో రేప్ మన దేశ భవిష్యత్తు కోసం అనే అంశంపై

# అవగాహన ర్యాలీ

**భీమవరం, (మనసులో మాట) మార్చి 11 :** మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ పై బ్రాండ్స్ ఆఫ్ కలాం సమస్త ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనకై మా ప్రయత్నం మన దేశ భవిష్యత్తు కోసం అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, డీవీఎంసీ మెంబర్ అయినా సత్య సుధామ మాట్లాడుతూ గురువారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక లోదరన్ హై స్కూల్ గ్రౌండ్స్ నుండి విద్యార్థులు మరియు స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రకాశం చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మా దగ్గర వినియోగంపై ఆ దేశ పురోగతికి వివాహం కలుగుతుందని యువత మొత్తం అందులకు బానిసయి వారి కెరీర్ తో పాటు వారి కుటుంబాలను కూడా విచ్ఛిన్నశీ అవుతున్నాయని అన్నారు. మార్చి 12వ తేదీ 100 మీటర్ల జాతీయ జెండాతో 100 మంది సెలబ్రిటీలతో, వంద ప్లేడ్జిలతో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని కావున అందరూ దీనిలో భాగస్వాములు అవ్వాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్య సుధామ తెలిపారు.

## ఇర్రిపాకలో ప్రాథమిక, అంగన్వాడి పాఠశాలలు ఆకస్మిక తనిఖీ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 11..** జగంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంటుందా లేదా అని విద్యార్థిని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సున్నితంగా హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులను ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునే విధంగా ర్యాలీలు చేపట్టి తల్లిదండ్రులలో చైతన్యం తీసుకురావాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడానికి అవసరమైతే నేను కూడా ఇంటింటికి తిరుగుతానని ఆయన ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా ఫ్యాన్లు, పాఠశాలలకు రంగులు, మైనర్ రిపేర్లు చేయించడం జరుగుతుందని, విద్యార్థిని విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధిచేసిన మంచినీళ్లు కూడా అందిస్తామని ఆయన తెలియజేశారు.

## హెచ్ పి వి టికా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేనెహ్రూ




**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 11..** జగ్గంపేట మండలం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉచితంగా అందజేస్తున్న హెచ్‌పీవీ టీకా పంపిణీ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై హెచ్ పీవీ, టి కా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాలు నిండిన బాలికలు ఈ టీకా వేసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నివారించవచ్చని తెలిపారు. ఈ టీకా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా అందిస్తున్నారని .కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం 'స్వస్థ నారి' కార్యక్రమంలో భాగంగా ఈ వ్యాక్సినేషన్ చేపడుతోందని ఈ టీకా 80% కంటే ఎక్కువ ప్రభావవంతంగా పనిచేస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.

## గర్భాశయ క్యాన్సర్ నిర్మూలనకు బృహత్ ప్రణాళిక



**సామర్లకోట (మనసులో మాట) మార్చి21;** గర్భాశయ క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళిక చేపట్టినట్లు గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ తెలిపారు. బుధవారం సామర్లకోట సాయి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి కూటమి నేతలు ప్రారంభించారు. డాక్టర్ విజయ పావని, డాక్టర్ రమ్య ప్రభ తదితరులు పాఠశాల విద్యార్థులకు వ్యాక్సిన్ ప్రక్రియ నిర్వహించారు. పాఠశాల స్థాయి నుండే వ్యాక్సిన్ అందిస్తున్నట్లు వైద్యులు వివరించారు. కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర, బలుసు వాసు, అరుణ వంశీ, పడాల వీరబాబు, గోల్టి సత్యనారాయణ, కాపవరపు కుమార్ ( కేకే) తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



మండపేట మునిసిపల్ ప్రత్యేక అధికారిగా

## రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్ డి నాగ నరసింహారావు

**- ఈ నెల 17 న బాధ్యతలు స్వీకరణ**

**- అదే రోజు ముగుస్తున్న కౌన్సిల్**

మండపేట (మనసులో మాట ) మార్చ్ 11 మండపేట పురపాలక సంఘం ప్రత్యేక అధికారి గా రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్(ఆర్డీ) మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సి హెచ్ నాగ నరసింహారావు ను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17 నాటికి పుర పాలక సంఘం కౌన్సిల్ ఐదేళ్ల కాల పరిమితి ముగుస్తుంది. ఈ నేపధ్యంలో ఆయా పుర పాలక సంఘం లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండపేట పుర పాలక సంఘం కౌన్సిల్ సమావేశం ఈ నెల 17 మంగళ వారం ఉదయం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత నిర్వహించనున్నారు. అదే రోజుతో కౌన్సిల్ పదవి కాలం ముగుస్తుంది. దీంతో కౌన్సిల్ సభ్యులను, చైర్ పర్సన్, వైస్ చైర్మన్,కో ఆప్షన్ సభ్యులు లను ఘనంగా సత్కరించి వీడ్కోలు చెప్పనున్నారు. 17 సాయంత్రం కౌన్సిల్ బాధ్యత పూర్తిగా ప్రత్యేక అధికారి చేతిలోకి వెళుతుంది. మునిసిపల్ ఆర్డీ నాగ నరసింహారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా ప్రశాంతం గా జరిగాయి..

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవరావు**

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** కాకినాడ జిల్లాలో ఈ రోజు నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్2026 (డే14) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సక్రమంగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవ రావు గారు తెలిపారు. ఈ రోజు నిర్వహించిన కామర్స్×× పరీక్షకు జిల్లాలో మొత్తం 3,867 మంది విద్యార్థులు కేటాయించబడగా, అందులో 3,644 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. 223 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగినట్లు పేర్కొన్నారు. అలాగే మాల్‌ప్రాక్టీస్‌కు సంబంధించిన ఎటువంటి ఘటనలు నమోదు కాలేదని వెల్లడించారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించడానికి జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు డా. జె. రాంబాబు (డి ఈ సి 1), వి. శ్రీనివాస్ (డి ఈ సి 2), డి.వి.కె. వర్మ (డి ఈ సి 3) జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు సక్రమంగా మరియు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు.

## గుడివాడ అమర్నాద్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కారుమూరి



తణుకు (మనసులో మాట) మార్చి 11 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ ని మాజీ మంత్రికారుమూరి నాగేశ్వరరావు మరియు ఆయన కుమారుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు పార్లమెంట్ ఇంచార్జ్ కారుమూరి సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వారు చర్చించుకున్నట్లు మాజీ మంత్రి కారుమూరి తెలిపారు.

# అమలాపురంలో హలీం రుచులు

**- మరో వారం మాత్రమే**





**అమలాపురం (మనసులోమాట) మార్చి 11:** రంజాన్ సందర్భంగా అమలాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన షాదాబ్ హలీం సెంటర్ కోనసీమ వాసులకు హైదరాబాద్ ప్రత్యేక రుచులను పరిచయం చేస్తూ విశేష ఆదరణ పొందుతోంది. అమలాపురం షాదీ ఖానా వద్ద ప్రారంభించిన ఈ హలీం సెంటర్ కేవలం మరో వారం రోజుల పాటు మాత్రమే అందుబాటులో ఉంటుందని నిర్వాహకుడు మొహమ్మద్ బషీర్ తెలిపారు. రంజాన్ ప్రారంభం నుంచి హలీం ప్రియులు భారీగా స్పందిస్తున్నారని, కోనసీమ ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనివని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులైన వంటకారులు ప్రత్యేకంగా తయారుచేస్తున్న హలీం ప్రత్యేక రుచితో అందరినీ ఆకట్టుకుంటోంది. హలీం తో పాటు మటన్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, దమ్ బిర్యానీ, పాయా రోటీ వంటి వంటకాలు కూడా అందుబాటులో ఉంచి కోనసీమ బిర్యానీ ప్రియులకు హైదరాబాద్ రుచులను అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు జరుగుతున్నా యని చెప్పారు. రంజాన్ నెల కేవలం కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో హలీం కూడా మరికొద్ది రోజులే అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని కోనసీమ వాసులు తప్పక వినియోగించుకోవాలని ఎండి షరీఫ్, షబాబ్ హుస్సేన్ కోరారు. అమలాపురంలో హైదరాబాద్ రుచులను ఆస్వాదించాలనుకునే వారికి షాదాబ్ హలీం సెంటర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

### మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం

# ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుంది

**- కిశోర బాలికలందరూ హెచ్పీవీ వ్యాక్సిన్ స్పెషల్ డ్రైవ్ ను వినియోగించుకోవాలి**

**- ఊబలంక పిహెచ్సీ వద్ద వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట మనసులో మాట మార్చి 11..** ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో మహిళల సంరక్షణ కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఊబలంక పిహెచ్సి పరిధిలో కిషోర్ బాలికల కోసం ప్రభుత్వం అందిస్తున్న హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పీహెచ్సీ పరిసరాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యపరంగా ఎదుర్కొంటున్న క్యాన్సర్ వంటి మహమ్మారులను ఎదుర్కోవడం కోసం ముందస్తు చర్యల్లో భాగంగా 14 సం.ల వయస్సు నుంచి 15 సం.ల వయస్సు ఉన్న కిశోర బాలికలకు హెచ్పీవీ వ్యాక్సిన్ వేయడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ తోపాటు అనేక క్యాన్సర్ లకు గురి కాకుండా ఉండాలనే ఆలోచనతో బృహత్తరమైన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కొనియాడారు. కిశోర బాలికలు ఉచితంగా వ్యాక్సిన్ అందించడం గొప్ప విషయమన్నారు. బయట మార్కెట్లో ఈ వ్యాక్సిన్ ఖరీదు రూ.4వేల వరకూ ఉంటుందని, మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం మొదలుపెట్టిన ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషించే మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధానమైన అంశంగా భావించి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనే మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యంతో హెచ్ పి వి ఇంజక్షన్లు స్పెషల్ డ్రైవ్ ద్వారా అందిస్తున్నారన్నారు. ఊబలంక పీహెచ్సీ పరిధిలోనే 350 మందిని గుర్తించి వ్యాక్సిన్ అందించడం జరుగుతుందన్నారు. మహిళలంతా కూడా మరీ ముఖ్యంగా 14 నుంచి 15 వయసు ఉన్న కిశోర బాలికలు తప్పకుండా ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని పిలుపునిచ్చారు. మహిళల ఆరోగ్యం కాపాడుకోవాలని తెలిపారు.

# విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి - ఎస్సై మౌనిక



**పెద్దాపురం (మనసులో మాట) మార్చి 11;** పాఠశాల స్థాయి నుండి విద్యార్థినిలు సమాజ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని పెద్దాపురం ఎస్సై మౌనిక కోరారు. పెద్దాపురం జడ్పీ బాలికల పాఠశాలలో బుధవారం విద్యార్థినిలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ, పాఠశాలలో ఉపాధ్యాయుల పట్ల విద్యాభక్తి అంకిత భావం కలిగి ఉండాలని, పాఠశాల విషయాలతో సహా, సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను తల్లిదండ్రులకు వివరిస్తూ తగు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ మౌనిక సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికులు, తల్లిదండ్రులు, పోలీసుల రక్షణ పొందాలని కూడా ఎస్ఐ మౌనిక వివరించారు. మహిళా రక్షణ చట్టాలు, సైబర్ క్రైమ్, వాట్సాప్ ప్రమాదాలు తదితరాంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేజీబీవీ లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం




**కోటనందూరు (మనసులో మాట) మార్చి 11..** కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో 2026 -27 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి 12-03-2026 తేది నుండి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జి.రాజేశ్వరి తెలియజేశారు. 6వతరగతిలో 40 సీట్లు, ఇంటర్ ఒకేషనల్ ఎంపీహెచ్డబ్ల్యు మొదటి సంవత్సరం 40 సీట్లు ఉంటాయని, 5వ తరగతి, 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంతంలో ఉన్నవారు 1,20,000, పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారు 1,44,000 ఆదాయం కలిగి ఉండాలని, మైనార్టీ,ఎస్టీ, ఎస్సీ, ఓబిసి, బిపిఎల్, డ్రాప్ అవుట్స్, ఆర్ఫాన్స్, సెమీ అర్ఫాన్స్, వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఏప్రిల్ 1,తెలియజేశారు. దరఖాస్తు చేసుకోవడానికి విద్యార్థి మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, పాస్పోర్ట్ సైజు ఫోటోలు 2, 10వ తరగతి హాల్ టికెట్ నెంబర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హతలు సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు జత చేయాలని తెలియజేశారు. వివరములకు Website http://apkgbv.apctss.in.

### గర్భాశయ క్యాన్సర్ బారిన బాలికలు పడకుండా

# హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సినేషన్



**అమలాపురం (మనసులోమాట) మార్చి 11:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గర్భాశయ క్యాన్సర్ వంటి మహమ్మారి బారిన నేటి యువతరం బాలికలు పడకుండా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్.పి.వి) వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చురుగ్గా సాగుతు న్నాయని జిల్లా ఇమ్యునైజేష న్ అధికారి బి .వి. వి సత్య నారా యణ తెలిపారు. బుధవారం స్థానిక బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు కుడిపూడి భాగ్యలక్ష్మి గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత లు ప్రారంభించారు . ఈ సందర్భంగా డి ఐ ఓ సత్యనా రాయణ మాట్లాడుతూ ప్రస్తుతం 14 ఏళ్లు వయసున్న బాలికల కు భవిష్యత్తులో గర్భాశ య క్యాన్సర్ సోకకుండా ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ గౌతమి డాక్టర్ అమృతలు ఆధ్వర్యంలో చేపట్టారన్నారు. హెచ్.పి.వి వ్యాక్సిన్ ఖర్చుతో కూడుకున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి గా ఉచితంగా అందిస్తున్నాయన్నారు. గర్భా శయ క్యాన్సర్ సోకుండా హెచ్. పి.వి వ్యాక్సిన్ను ఏపీ వైద్య శాఖ ప్రారంభించినట్లు చెప్పారు. హెచ్.పి.వి వ్యాక్సినేషన్ చేయించు కోవడం ద్వారా హెచ్.పి.వి వైరస్ వ్యాప్తి చెందదని చెప్పారు. మూడు నెలల పాటు ఈ వాక్సినేషన్ కార్యక్రమం అందుబాటులో ఉంటుందన్నారు.బాలికల ఆరోగ్య రక్షణకు కీలక ముం దడుగు అన్నారు. ఉచిత హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమం 14 సంవత్సరాలు నిండిన 15 సంవత్సరాలలోపు బాలికల ఆరోగ్య రక్షణకు కీలకమన్నారు . గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుండి బాలికలను రక్షించ డానికి కేంద్ర ప్రభుత్వం ఉచిత హెచ్పివి వ్యాక్సినేష న్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారన్నారు. ఎంపీపీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ హెచ్ పి వి వ్యాక్సినే షన్ ముఖ్య ఉద్దేశం బాలికల్లో భవిష్యత్తులో వచ్చే ప్రమాదక రమైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ను ముందుగానే నివారించి, విముక్తి పొందేందుకు హ్యూ మన్ పప్పిలోమా వైరస్ వ్యాక్సిన్ను ప్రభుత్వం ఉచితం గా అందిస్తోందన్నారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 14 సంవత్సరాలు పైబడి 15 సంవత్సరాల లోపు వయసు గలిగిన బాలికలు సద్విని యో గం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలన్నారు. డాక్టర్ గౌతమి మాట్లాడుతూ గత కొద్ది రోజులు గా ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఇంటింటి సర్వే నిర్వ హించి, ఈ ప్రాంతంలో ఉన్న టార్గెట్ బాలికలను గుర్తించారన్నారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం వచ్చే మూడు నెలల పాటు కొనసాగుతుందని, ఈ సమయంలో గుర్తించిన బాలికలందరికీ పూర్తిగా ఉచితంగా వ్యాక్సిన్ అం దించబడుతుందని వైద్యులు తెలిపారు, డాక్టర్ అమృత మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనేది మహిళల్లో ఎక్కువగా కనిపించే ఒక ప్రమాదకరమైన వ్యాధని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు జానకి లక్ష్మి మా ధవి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ప్రైయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే

**- ఎంఈఓ మనోహరం**

**రాజోలు మార్చి 11 మనసులోమాట:** ప్రైయివేట్ పాఠశాలల యాజమాన్యాలు అన్నీ ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మండల విద్యాశాఖాధికారి నల్లి మనోహరం తెలిపారు. మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రైయివేట్ పాఠశాలల యాజమాన్యలతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆర్జెడి అదేశానుసారం 12(1)సి ప్రకారం 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలని ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దుచేస్తామని అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్క ప్రైయివేట్ పాఠశాల సిఎఫ్ఎంఎస్ వెండర్ కోడ్ ని కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల ఆన్లైన్లో హాజరు విషయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### అక్షర ఆంధ్ర ఉల్లాస కార్యక్రమంనకు

## మండల ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ



అడ్డతీగల మనసులో మాట మార్చి 11 పోలవరం జిల్లా అడ్డతీగల మండలం అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయం లో అక్షరాంధ్ర ఉల్లాస కార్యక్రమం లో భాగంగా బుధవారం నాడు అడ్డతీగల మండల ప్రత్యేక అధికారి రంపచోడవరం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య ఆధ్వర్యంలో మార్చి15 న జరగబోవు ఫైనల్ పరీక్షకు లెర్నర్స్7084 మందికి పరీక్షకేంద్రల ఏర్పాటు ,ఇన్విజిలేటర్ ఏర్పాటు లెర్నర్స్ ను పరీక్ష కేంద్రాలకు ఏ విధంగా సమావేశపరచాలి , పేపర్స్ మూల్యాంకనం చేయుట,వచ్చిన మార్క్స్ ఆన్లైన్ లో ఎంటర్ చేయుట అనే అంశాలపై ఎంపిడిఓ, మండల విద్యాశాఖాధికారి,ఎమ్ జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ ఏ పి ఓ,ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి, వెల్ఫేర్ అసిస్టెంట్ వారి కి పై అంశాలపై తగు సూచనలు సలహాలు ఇవ్వటం జరిగిందని అడ్డతీగల ఎంపీడీవో ఏవివి కుమార్ తెలిపారు.

## విద్యార్థుల ప్రతిభ అమోఘం

**కాజులూరు జిల్లా విద్యార్థుల ఘన విజయం**




కాజులూరు (మనసులో మాట) మార్చి 10.. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి విజ్ఞాన వారోత్సవాల్లో కాజులూరు జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతూ విశేష విజయాలు సాధించారు. ఈ పోటీలు కాకినాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ.పి.ఎస్.పి. క్వార్టర్స్ ప్రాంగణంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో సైంటిస్ట్ మోనో యాక్షన్ విభాగంలో బేబీ శ్రీ జాహ్నవి ప్రథమ స్థానం సాధించి అందరి ప్రశంసలు పొందిందగా పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగంలో జెస్సీ ప్రథమ స్థానం సాధించి పాఠశాలకు గౌరవాన్ని తెచ్చిందనీ విద్యార్థులు తమ సృజనాత్మకత, శాస్త్రీయ అవగాహనను ప్రదర్శిస్తూ విజయాన్ని అందుకోవడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి విలేఖరులకు తెలియజేస్తూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని, సమాజ అభివృద్ధికి ఉపయోగపడే శాస్త్రీయ వైఖరులను పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్ర విజ్ఞానం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించిన గైడ్ టీచర్ చింతా నారాయణమూర్తిని, అలాగే విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, కమిటీ సభ్యులు, మండల విద్యాశాఖాధికారులు డేవిడ్, జాన్, పాఠశాల విద్యాదాత అన్యం శ్రీరామచంద్రమూర్తి పాఠశాల స్టాఫ్ సెక్రటరీ హరినాథ్, సైన్స్ ఉపాధ్యాయులు సత్య ప్రసాద్, సుజాత, రాజరాజేశ్వరి, గీతా, కృష్ణవేణి, సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మీకామేశ్వరి, శ్రీనివాసరావు, బాషా తదితరులు కూడా విద్యార్థులను అభినందించి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



- జనసేన పార్టీ భావాలను లోతుగా అర్థం చేసుకుని సిద్ధాంతాలకు అనుగుణంగా
- జన సైనికులు పనిచేసి పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయాలని జనసేనకులకు వీర మహిళలకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే

# పంతం నానాజీ పిలుపు..

**కాకినాడ (మనసులో మాట ) మార్చి 11..** ప్రజలకు చేసిన అభివృద్ధిని తెలియజేస్తూ రాష్ట్ర జనసేన పార్టీ విస్తృతస్థాయి సభ్యత్వ నమోదు జనసేన ఉద్యమి లో భాగంగా జన సైనికులు, వీర మహిళలు ముందుకు వచ్చి సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జనసేన ఉద్యమి లో భాగంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఇప్పటికీ 23 వేల పైచిలుకు సభ్యత్వాలు నమోదు జరిగాయని అయితే ఈ నెల 17వ తేదీ వరకు సభ్యత్వ నమోదు కొనసాగుతుందని అలాగే 14వ తేదీ జరుగు పార్టీ ఆవిర్భావ బహిరంగ సభ ఎండల వల్ల ఏ మండలానికి ఆ మండలంలో సమావేశంలో ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. అలాగే రూరల్ లో మరింత వేగంగా సభ్యత్వ నమోదు జరగాలని తెలియజేశారు. ఇంచార్జిగా నరసరావుపేట ఉన్నందున గత ఏడాది 35 వేలు సభ్యత్వ నమోదు జరిగిందని ఈ సంవత్సరం 50 వేల వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందని భావిస్తున్నామని అన్నారు. మనం చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ సభ్యత్వ నమోదుకు ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు.

# కోనసీమ జిల్లా ఎస్పీకు జాతీయ ఎస్సీ కమిషన్ నోటీసులు..



Government of India
National Commission for Scheduled Castes
(A Constitutional body set up under Article 338 of the Constitution of India)

File No. APCR/FI/AP/2026/326132

Date: 10/03/2026

Notice

To
The Superintendent of Police
Dr.Ambedkar Konaseema Dist
Andhra Pradesh

Sub: Harassment by the Police

Sir/Madam,

Whereas a Complaint/information has been received by the National Commission for Scheduled Castes from Shri/Smt Nakka Rama Kalyan and Others dated 10/03/2026 ...

Encls: As above.

Yours faithfully

Dr.G.Sunil Kumar Babu
DIRECTOR

Copy for information :

Nakka Rama Kalyan and Others,H.No. 6-105/1 Gantipedapeta Village, Kothapeta Mandal, DR. BR. Ambedkar Konaseema District, Andhra Pradesh ,--Select- -,Konaseema,Andhra Pradesh,

**అమలాపురం( మనసులోమాట) మార్చి11:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట మండల గంటి పెదపేట గ్రామానికి చెందిన దళిత యువకులపై దాడికి పాల్పడిన నిందితులను వదలి కేవలం దళిత యువకులపైనే కేసులు కట్టి కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారని జాతీయ ఎస్సీ కమిషన్‌కు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై కోనసీమ జిల్లా ఎస్పీకు నోటీసులు అందాయి. ఈ మేరకు ఫిర్యాదు దారుడైన నక్కా రామకళ్యాణ్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ నుంచి నోటీసులు మంగళవారం అందాయని వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ వెల్లడించారు.. ఇటీవల జాతీయ ఎస్సీ కమిషన్ దిండి గ్రామం విచ్చేసిన క్రమంలో ఈ కేసుకు సంబందించి ఈ ఫిర్యాదును చేశారు. దీనిపై తక్షణం స్పందించిన కమిషన్ కేసుకు సంబందించి పూర్వాపరాలు తెలియజేయాలని ఎస్పీకు నోటీసులు జారీ చేస్తూ ఆదేశించింది.. కేసులో ఘటన ఏరోజున జరిగింది..పూర్తి వివరాలు తెలియజేయాలని, బాధితుల పేర్లు, అడ్రస్‌లు, నిందితుల వివరాలు, ఎఫ్ ఐ ఆర్ నమోదుచేసిన తేదీ, ఏసెక్షన్ల కింద కేసు నమోదయ్యింది, నిందితుల అరెస్ట్ వివరాలు, చార్జిషీట్ ఫైనల్ రిపోర్ట్ తోపాటు బాధితులకు ఏవిధమైన పరిహారం అందించారన్న వివరాలు 30 రోజుల్లోగా తెలపాలని ఆదేశించింది.. తమ ఫిర్యాదుపై జాతీయ ఎస్సీ కమిషన్ స్పందించడంపై ఫిర్యాదు దారులు హర్షం వ్యక్తం చేశారు.

# తిరుమల తరహాలో వాడపల్లి అభివృద్ధి

- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి
- రూ.1.35 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట మనసులో మాట మార్చి 11..** తిరుమల తరహాలో కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సభ్యులు, దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా స్వామిని దర్శించుకుని, రూ. 1.25 కోట్లతో నిర్మించనున్న స్టెయిన్ లెస్ స్టీల్ క్యూలైన్లు నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 10లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ను ప్రారంభించారు. కరూర్ వైశ్యా బ్యాంకు అందించిన దర్శనం, లడ్డూ టిక్కెట్లను జారీ చేసే టిక్కెట్ మిషన్ ను ప్రారంభించారు. పుష్కర ఘాట్ ను, కోనేరు అభివృద్ధి పనులతో పాటు, వకుళమాత అన్నదాన భవన నిర్మాణ పనులను, ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన గడువు లోపుగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు శనివారాలు, ఏడు ప్రదక్షిణలు ఏడేడు జన్మల పుణ్యఫలం అంటూ లక్షలాదిగా తరలి వస్తున్న భక్తులకు తగినట్లుగా సౌకర్యాలు కల్పించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యూలైన్ల నిర్మాణానికి శంకుస్థాపన, పార్కింగ్ కేంద్రానికి వెళ్ళడానికి రూ. 50లక్షల ఎమ్జీఎన్ఆర్జీఎస్ నిధులతో రహదారి నిర్మాణం, దానికి కొనసాగింపుగా పార్కింగ్ ఏరియా నుంచి ఏటిగట్టు వరకూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టినట్లు తెలిపారు. వకుళమాత అన్నదాన భవనం త్వరలోనే పూర్తి చేయాలని ఆదేశించించారు, కోనేరు పనులు, రథం షెడ్డు పనులు పూర్తవుతున్నాయని ఎనిమిది ఎకరాలు పార్కింగ్ స్థలం శాండ్ ఫిల్లింగ్ పూర్తయిందని, త్వరలోనే గ్రావెల్ ఫిల్లింగ్ చేయనున్నట్లు తెలిపారు. రూ. 12 కోట్లతో శ్రీనివాసం పేరుతో 54 రూములు, 4 డార్మెటరీలు నిర్మాణానికి త్వరలో దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి శంకుస్థాపన చేస్తారని, మరొక డార్మెటరీ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తామని. టూరిజం శాఖ సహకారంతో 18 టెన్షల్ షెల్టర్స్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రసాద్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వ నిధుల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. శ్రీనివాసం 2 కోసం టిటిడి ని సంప్రదిస్తున్నామని తెలిపారు. లక్ష లీటర్ల వాటర్ ట్యాంకు కోసం హెటిరో సంస్థలు విరాళం అందించడం జరిగిందని, ఆ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని, 2 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు కూడా నిర్మిస్తామని తెలిపారు. రహదారి వెడల్పు, నిర్మాణాల కోసం టెండర్లు పిలిచామన్నరు. పాలక్ మండల సభ్యులు గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ లో

# అరుదైన పాంక్రియాటైటిస్ సర్జరీ

- మెడికల్ డైరెక్టర్ డా.హరి కిరణ్ వర్మ




**అమలాపురం (మనసులోమాట) మార్చి 11:** పశ్చిమగోదావరి జిల్లా కి చెందిన 54 సంవత్సరాల చిట్టిబాబు అనే వ్యక్తి సుమారు సంవత్సరం నుండి "క్రానిక్ ప్యాంక్రియాటైటిస్" వ్యాధి వల్ల వచ్చే నొప్పితో బాధపడుతూ చాలా హాస్పిటల్స్ కి తిరిగినా వ్యాధి పరిష్కారం దొరకలేదు. దీంతో వైద్యులు హైదరాబాద్ ఏ.ఐ.జీ హాస్పిటల్ కి రిఫర్ చేయగా హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకునే స్థోమత లేక ఆ రోగి, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ అమలాపురం లో ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ ఉన్నారని తెలిసుకొని ఆయనను సంప్రదించారు. డా.సుధీర్ ఆ రోగికి పరీక్షలు జరిపి, ఆయన క్లోమములో రాళ్లు ఏర్పడటం వలన నొప్పి తో బాధ పడుతున్నారని గమనించారు. రోగికి శస్త్ర చికిత్స చేసి నయం చేస్తానని ధైర్యం చెప్పారు. ఈ నెల 5వ తేదీన ఆ రోగికి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డా. సుధీర్, మత్తు వైద్యులు డా.సురేష్ లతో కూడిన వైద్య బృందం తగిన శస్త్రచికిత్స విజయవంతంగా చేసారు. ఆ రోగి అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ లో 6 రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకొని బుధవారం ఆరోగి సంతోషంగా ఇంటికి వెళ్లారని డాక్టర్ సధీర్ తెలిపారు.

డాక్టర్ సుధీర్ ఎం.ఎస్. జనరల్ సర్జరీ పీ.జీ.ఐ చండీగఢ్‌లో చదివి, ఏ.ఐ.ఎం.ఎస్., న్యూ ఢిల్లీ నుండి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి ఎం.సి.హెచ్. చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ఇక మీదట ఎలాంటి కాంప్లికేటెడ్ కేస్ అయినా క్యాన్సర్ అయినా ట్రీట్‌మెంట్ కోసం వైజాగ్ లేదా హైదరాబాద్ వెళ్ళవలసిన అవసరం లేదని, అమలాపురం మెడ్ యునైటెడ్ హాస్పిటల్ లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియపారు. కోనసీమ ప్రజలందరూ ఈ సదుపాయాలను వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని మెడికల్ డైరెక్టర్ డా.హరి కిరణ్ వర్మ కోరారు.




# ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలి




**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 11:** ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు, బోధనేతర పనులు రద్దు చేయాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. బుధవారం మండల పరిధిలోని 14 ప్రభుత్వ హైస్కూల్స్, ఏపీడబ్ల్యుఆర్ చొల్లంగిపేట పాఠశాలల్లో ఆయన కృతజ్ఞతా పర్యటన చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుపి పాఠశాల నుంచి హైస్కూల్గా అప్గ్రేడ్ అయిన సుంకరపాలెం, పత్తిగొంది పాఠశాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై అధిక ఒత్తిడి తీసుకువస్తున్నారని ఇది సరికాదన్నారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి 32 నెలలు గడిచినప్పటికీ సీఎం చంద్రబాబు పీఆర్సీ కమీషనర్ను ఇంతవరకు నియమించలేదని, వెంటనే కమీషన్ వేసి 29 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేసారు. ఈ పర్యటనలో రాష్ట్ర కార్యదర్శి టి.చక్రవర్తి. జిల్లా సహోధ్యక్షురాలు బి.నాగమణి, ఉమ్మడి జిల్లా ఎఫ్ డబ్ల్యుఎస్ కోశాధికారి చెక్కా త్రిమూర్తులు, గోపి సత్యన్నారాయణ, ఎం.తాతారావు కె.ఈశ్వరరావు, ఎం. బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గర్భాశయ ముఖ క్యాన్సర్ కు నివారణ మందు హెచ్‌పివి టీకా




**అనపర్తి ( మనసులో మాట) మార్చి 11:** రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం మంగళవారం నాడు ఉదయం 9 గంటలకు రామవరం గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ గిరిడా గంగాభవాని చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమమునకు నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మల్లిడి జీవన్ రెడ్డి, తాడి సతీష్ రెడ్డి చింతా సురేష్ రెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, జీవి రెడ్డి, రైస్ మిల్ అసోసియేషన్ చైర్మన్ కర్రి వెంకటరెడ్డి ఇతర గ్రామ పెద్దలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆడవారికి వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ నిర్మూలనకు ముందస్తు జాగ్రత్తగా క్యాన్సర్ నివారణ మందును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం జరిగింది. ఈ వ్యాక్సినేషన్ వల్ల ఆడవారిలో వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ రాకుండా నివారించడం జరుగుతుంది. ఆడవారిలో వచ్చే సర్వైకల్ డిసీజెస్ ను ఆడవారి ఆరోగ్యం కూడా కాపాడవచ్చు. ఈ వ్యాక్సినేషన్ను ప్రతి 14 సంవత్సరాలు నుండి 15 సంవత్సరాల లోపు ఆడపిల్లల అందరికీ వేయించాలని వైద్యులు సూచించడం జరిగింది. మహిళా గ్రామ పెద్దలు ఈ వ్యాక్సినేషన్ అందరూ ఉపయోగించుకోవాల్సిందిగా గ్రామంలో ఉన్న ప్రతి ఆడపిల్ల తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమం కి విచ్చేసిన నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ సదవకాశాన్ని ప్రతి తల్లిదండ్రులు వాళ్ళ ఆడపిల్లల ఆరోగ్యం కోసం, ఈ వ్యాక్సిన్ ను వారి ఆడపిల్లలకి వేయించవలసిందిగా కోరారు. అంతేకాకుండా ఈ వ్యాక్సిన్ ని అందరికీ అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంతో ఉత్కంఠ గా ప్రారంభించబడిన ఈ హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించి 11 మంది ఆడపిల్లలకు వ్యాక్సినేషన్ ఇవ్వడం, హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకున్నందుకు సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఈ విధంగానే అందరూ ఆడపిల్లల తల్లిదండ్రులు కూడా ఈ హెచ్ పి వి వ్యాక్సిన్ ను అందరు ఆడపిల్లలకు వేయించవలసిందిగా ఈ సదవకాశాన్ని వాడుకోవాల్సిందిగా వైద్యులు సూచించారు. ఈ వ్యాక్సిన్ పై ఎటువంటి అనుమానాలు, సందేహాలు ఉన్న మా వైద్య ఆరోగ్య కార్యకర్తలను ( ఏఎన్ఎం, ఆశాలు )అడిగి తెలుసుకోవాల్సిందిగా రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మీనాక్షి దేవి తెలియచేశారు . ఈ హెచ్ పి వి వ్యాక్సినేషన్ ప్రారంభం కార్యక్రమంలో గ్రామ పెద్దలు , ఇతర గ్రామ వార్డుమెంబర్స్, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది హెల్త్ సూపర్వైజర్లు సిహెచ్ శ్రీనివాస్, సుబ్రమణ్యం, శ్రీనివాస్, రత్నకుమారి, ఎస్ లక్ష్మి, ఎల్ టి రాజు, స్టాఫ్ నర్స్ స్, ఫార్మసిస్ట్ భవాని, ఎల్డిసి విజయ్ కుమారి మరియు ఎమ్మెల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు,ఆశాలు తదితరులు పాల్గొన్నారు.



## పి ఎంపీ ఆధ్వర్యంలో...

# నూతన ఔషదాలపై అవగాహన

**మండపేట (మనసులో మాట )మార్చ్ 11..** కమ్యూనిటీ పారామెడిక్స్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) రాయవరం, ఆలమూరు మండలాల ఆధ్వర్యంలో బయోలాజికల్ ఇ లిమిటెడ్ వారిచే ఔషదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పిఎంపి అసోసియేషన్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షత వహించారు. మండపేట సహస్ర రెస్టారెంట్ లో బుదవారం బయోలాజికల్ ఇ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఔషదాలపై జరిగిన అవగాహన సదస్సు లో కోన సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి పీఎంపీ ఔషధం వినియోగం పై అవగాహన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. నేషనల్ నో స్మోకింగ్ డే సందర్భంగా ధూమపానం వలన వచ్చే ఊపిరితిత్తులు వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నౌడు వెంకటరమణ పియంపి సభ్యులు పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న ఉండి ఎంపీడీవో కె శ్రీనివాస్

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 50.000 ప్రోత్సాహ బహుమతి
- ఉండి.ఎంపీడీవో.కె శ్రీనివాస్



**ఉండి, (మనసులో మాట) మార్చి. 11 :** ఉండి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా డోమ ప్రాజెక్ట్ డైరెక్టర్. మరియు ఉండి నియోజకవర్గం ప్రత్యేక అధికారి డాక్టర్ సిహెచ్ అప్పారావు, ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు కావాల్సిన మెటీరియల్స్ను సోమవారం అందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మండల జిల్లా స్థాయిలో రాణించాలని కోరారు అనంతరం ఉండి మండల అభివృద్ధి అధికారి కె శ్రీనివాస్, మాట్లాడుతూ మండలంలో మంచి ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని మండలంలో ఉన్న పలు స్కూలుకు సంబంధించి ప్రతి స్కూల్లో స్కూల్ ఫస్ట్ వచ్చిన వారికి మండలంలో అన్ని స్కూల్లో కలపి సుమారుగా విద్యార్థులకు 50 వేల రూపాయలు బహుమతిగా ఉన్నత చదువులకు అందిస్తానని అన్నారు. అందరు మంచి మార్కులు సాధించి మండలానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని నా చేతులతో బహుమతి ఎవరు పొందుతారని ఆశతో ఎదురు చూస్తున్నానని ప్రతి ఒక్కరు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురలు వై రామలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది,మరియు ఒమేగా రాజు తదితరులు పాల్గొన్నారు.

## ద్వారపూడి,ఏడిద,కేశవరం, చెల్లూరు... రూర్బన్ పంచాయతీలు...

# అదనంగా నిధులు.. వేగంగా అభివృద్ధి




**మండపేట (మనసులో మాట )మార్చ్ 11..** మండపేట నియోజక వర్గంలో ఉన్న ద్వారపూడి కేశవరం ఏడిద, రాయవరం మండలం చెల్లూరు గ్రామాల కు మహర్దశ పట్టనుంది. జనాభా,వార్షిక ఆదాయాలు ప్రాతిపదికన తూర్పుగోదావరి జిల్లాలో పంచాయతీలను నాలుగు కేటగిరీలుగా విభజించారు. పదివేలకు పైగా జనాభా,రూ.కోటికి పైనే ఆదాయం ఉన్న పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తింపునిచ్చారు. మండపేట నియోజకవర్గంలో మండపేట మండలం కేశవరం, ఏడిద, ద్వారపూడి,రాయవరం మండలం చెల్లూరు పంచాయతీలు ఈ జాబితాలో చేరాయి. ఈ మార్పులతో గ్రామాలకు పట్టణ స్థాయి మౌలిక వసతులు అదనపునిధులు అందే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు మేజర్ పంచాయతీ లు గా ఉన్న ఈ గ్రామాలను ప్రభుత్వం ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తుంది. సుందరీకరణ, పట్టణాల మాదిరి అభివృద్ధి చేస్తారు. మున్సిపాల్టీ తో సమానంగా నిధులు కేటాయిస్తారు. దీంతో ఈ పల్లెలు పట్టణాలు గా రూపాంతరం చెందనున్నాయి.

# అక్షర ఆంధ్ర ఉల్లాల్ ప్లాట్ పరీక్షల నిర్వహణపై సూచనలు

- ద్వామా పిడి అడపా వెంకటలక్ష్మి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** మార్చి 15 వ తేదీన అక్షర ఆంధ్రా ఉల్లాస్ ఎఫ్ ఎల్ ఎన్ ఏ టి 2025-26 పరీక్షల నిర్వహణ పై డ్వామా పీడీ అడపా వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీసీ లో ఏ పి ఓ లు ఎఫ్ ఏ యాప్ లో హాజరు నిర్వహణ మరియు పరీక్షల నిర్వహణ లో పాటించవలసిన నిబంధనల పై సూచనలు చేస్తున్న వయోజన విద్యా శాఖ ఉపసంచాలకులు పసుపులేటి పోశయ్య గణాంక సహాయకులు సునీల్ ఆనందబాబు పోలిశెట్టి రాజేష్ మరియు డ్వామా కార్యాలయ సిబ్బంది.



## అమలాపురం మున్సిపాలిటీ అభివృద్ధిలో కౌన్సిల్ పాత్ర అభినందనీయం

**- ఆనందరావు**

**అమలాపురం (మనసులోమాట) మార్చి 11:** అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం, వీడ్కోలు సభ బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ గత ఐదేళ్లుగా అమలాపురం పట్టణ అభివృద్ధికి సహకరించిన చైర్మన్, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయాలని, పట్టణ ప్రగతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్లను ఎమ్మెల్యే ఆనందరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

## దళితుల ప్రాణాలంటే చులకన ?

**ఎమ్.ఆర్.పి.ఎస్.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర్**

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు, వివక్షాత్మక చర్యలు పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల ప్రాణాలకు విలువ ఇవ్వని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది అని విమర్శించారు.
బుధవారం కాకినాడ రామారావుపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళితులపై జరుగుతున్న దాడుల కేసులు సంవత్సరాల తరబడి కోర్టుల్లో నత్తనడకన సాగుతుండటంతో బాధిత కుటుంబాలకు న్యాయం అందకుండా పోతుందని అన్నారు. అందుకే ప్రత్యేక కోర్టులు అనే పేరుతో కేసులు ఆలస్యం కాకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి సత్వర న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోషులకు త్వరితగతిన శిక్షలు పడితేనే సమాజంలో భయం ఏర్పడి ఇలాంటి ఘటనలు తగ్గుతాయని పేర్కొన్నారు.
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక ప్రాంతాల్లో దళితులపై దాడులు, హత్యలు, మహిళలపై లైంగిక వేధింపులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ప్రభుత్వం మాత్రం వాటిపై గంభీరంగా స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. అగ్రవర్ణాలకు చెందిన బాధితులకు కోటి రూపాయల నష్టపరిహారం ప్రకటించే ప్రభుత్వం, దళితుల ప్రాణాలకు మాత్రం కేవలం 20 లక్షల రూపాయలతో సరిపెట్టడం తీవ్ర వివక్షతకు నిదర్శనమని విమర్శించారు.
ఇటీవలి కాలంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో దళితులపై జరిగిన దాడులు, హత్యలు సమాజాన్ని కలచివేసాయని సుధాకర్ గుర్తు చేశారు. భూవివాదాలు, కుల వివక్ష, సామాజిక ఆధిపత్యం కారణంగా గ్రామాల్లో దళిత కుటుంబాలు ఇంకా భయాందోళనల మధ్య జీవిస్తున్నాయని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో దళిత యువకులపై దాడులు, గ్రామాల్లో సామాజిక బహిష్కరణలు, మహిళలపై అవమానకర సంఘటనలు చోటుచేసుకున్నప్పటికీ కేసుల విచారణలో ఆలస్యం జరుగుతోందని తెలిపారు.
దళితులపై జరిగే హత్యలు, దాడులు కేవలం వ్యక్తిగత సంఘటనలు కావని, అవి సామాజిక వివక్షకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దళితుల ప్రాణాలకు విలువ ఇవ్వాలంటే ప్రభుత్వం తక్షణమే దళిత మరణాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించే విధంగా చట్టపరమైన మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.
అదే విధంగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలకు సంబంధించిన కేసులు ప్రత్యేక దృష్టితో విచారించి, ఆరు నెలలలోపు తీర్పు వచ్చేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలను మౌనంగా చూస్తూ ఉండలేమని ,న్యాయం కోసం పోరాటం కొనసాగుతుందనీ ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాయని బజ్జంగి సుధాకర్ హెచ్చరించారు. దళితుల పట్ల వివక్ష చూపుతున్న ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 13 శుక్రవారం ధర్నా చౌక్ వద్ద మాదిగల ఆత్మగౌరవ గర్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున దళితులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో దళితుల ఆత్మగౌరవం, భద్రత కోసం ఈ పోరాటం కొనసాగుతుందని, న్యాయం సాధించే వరకు ఉద్యమం ఆగదని బజ్జంగి సుధాకర్ స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో ఎమ్ ఆర్ పి ఎస్ ఎస్ మహిళా అధ్యక్షురాలు బోడపాటి జిల్లా యూత్ ప్రెసిడెంట్ శిలీ జానీ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్పీజీ వినియోగదారులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదు..

- జిల్లాలో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా జిల్లాలో ఎల్పీజీ నిల్వలు ఉండేలా చర్యలు
- ఎల్పీజీ గ్యాస్ పంపిణీపై నిరంతర పర్యవేక్షణకు కాకినాడ పౌరసరఫరాల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కంట్రోల్ రూమ్ నెంబర్ 8886903611 - కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్



**కాకినాడ ( మనసులో మాట ) మార్చి 11..** ఇరాన్- ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం కారణంగా గ్యాస్ నిల్వలు తగ్గి, ధరలు పెరగనున్నాయని జరుగుతున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని, జిల్లాలోని వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు.
బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పౌరసరఫరాలు శాఖ అధికారులు, ఆయిల్ కంపెనీ ప్రతినిధులు, వివిధ గ్యాస్ ఏజన్సీ డీలర్లుతో సమావేశంలో నిర్వహించారు. ఇరాన్ మరియు ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితుల మూలంగా గ్యాస్ నిల్వలు తగ్గుతాయి, ధరలు పెరగనున్నాయి అనే అసత్య ప్రచారం నేపద్యంలో జిల్లాలోని ఎల్పీజీ నిల్వలు, పంపిణి, పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు వంటి అంశాలతో మీ సందర్భంగా జేసీ.. పౌరసరఫరాల శాఖ అధికారులతో చర్చించి, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. ఇరాన్ మరియు ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధ పరిస్థితుల మూలంగా గ్యాస్ నిల్వలు తగ్గుతాయి, ధరలు పెరగనున్నాయి అనే అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వినియోగదారులు అవసరాలకు తగిన విధంగా ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు పౌర సరఫరా అధికారులు, నిరంతరం పర్యవేక్షణ చేస్తూ వినియోగదారులకు అవసరమైన వంట గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న ఎస్సీ ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, వైద్య ఆరోగ్య శాఖ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలకు, సాధారణ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది పడకుండా నిరంతరం గ్యాసు పంపిణీపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయం కాకినాడ నందు ప్రత్యేకంగా కంట్రోల్ రూము ఏర్పాటు చేయడం జరిగిందని జేసీ తెలిపారు. గ్యాస్ సరఫరాపై ఏ విధమైన సందేహాలు, డొమెస్టిక్ (14.2 కేజీ)కు లికంట్రోల్ రూమ్ నెంబర్- 8886903611. కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కమర్షియల్ హోటళ్ళు, రెస్టారెంట్లు ఇతర వినియోగదారులకు అవసరమైన గ్యాస్ సరఫరా నేరుగా సంబంధిత ఆయిల్ కంపెని వెబ్ సైట్ నందలి హెల్ప్ డెస్క్ నందు నమోదు చేయడం ద్వారా గ్యాస్ సిలండర్లు పొందవచ్చని ఆయన తెలిపారు.
వినియోగదారులు గ్యాస్ రీఫిల్ బిల్లు ధర మాత్రమే చెల్లించాలని, గ్యాస్ డెలివరి సిబ్బందికి ఏ విధమైన అదనపు రుసుములు చెల్లించనవసరం లేదని, ఎవరైనా ఎక్కువ మొత్తం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని జేసీ అపూర్వ భరత్ తెలిపారు. కాకినాడ జిల్లాలో రోజుకు సుమారు 11,000 వరకు సిలండర్లు వినియోగం ఉంటుందని అంచనా వేసి, ఆ విధంగా వినియోగదారుల అవసరాల మేరకు గ్యాస్ సిలిండర్లు (రీఫిల్స్) అందుబాటులో ఉండేలా చూసుకోవాలని గ్యాస్ ఏజన్సీల చర్యలు తీసుకోవాలని జేసి అపూర్వ భరత్ ఆదేశించారు. ప్రభుత్వం రాయితితో ఇచ్చే డొమెస్టిక్ సిలండర్లు వాణిజ్య అవసరాల నిమిత్తం వినియోగం చేయరాదని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై నిత్యావసర సరుకుల చట్టం, 1955 అనుసరించి కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గ్యాస్ సిలండర్లు అక్రమ నిల్వ చేసి, కృత్రిమ కొరత సృష్టించి వినియోగదారులకు అందుబాటులో లేకుండా చేసే వ్యక్తులు, సంస్థలు, ఏజన్సీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుందని జేసీ తెలిపారు.
ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్ఎస్ఎస్.రాజు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి - ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట (మనసులో మాట ) మార్చ్ 11..** మండపేట నియోజక వర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు.
మండపేట మండలంలోని ద్వారపూడి, కేశవరం గ్రామాలలో చేపట్టిన సి.సి రోడ్ల నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరగా నిర్వహించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. మండపేట నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడమే ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు యరగతపు బాబ్జి కంటిపూడి శ్రీనివాసరావు, ఉండమట్ల సురేష్, ఎంపిపి ఉండమట్ల వాసు, కర్రి సుభాష్, ఉండమట్ల శ్రీనివాస్, పినిపే రాజు, తొర్లపాటి ప్రసాద్, గారపాటి శ్రీనివాస్, కర్రి శ్రీనివాస్, కంటిపూడి సుభాష్, లంక సూరిబాబు, గనిశెట్టి సత్తిబాబు,చింతా దొర బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పాడి ద్వారా ఆదాయాన్ని పెంపొందించు కోవాలి

**- పశు సంవర్ధక శాఖ అధికారులు**



**కపిలేశ్వరపురం (మనసులో మాట ) ఫిబ్రవరి 11..** జాతీయ కృత్రిమ గర్భాధారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆదేశాలు మేరకు లేగ దూడలు ప్రదర్శన నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు పరిశీలనలో అందం,ఆరోగ్యం, పోషణవిషయం లో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానంలో వున్న లేగ దూడలు ను గుర్తించి, వాటి యజమానులకు బహుమతులు అందచేశారు.వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులు పెంపకం ద్వారా నష్ట భయం లేకుండా అధిక ఆదాయం పొందవచ్చు అని పశు సంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులకు సూచించారు. పెయ్యి దూడలు పుట్టుక ద్వారానే పాల ఉత్పత్తి జరిగి రైతన్నకు ఆర్థిక లబ్ది చేరుతుందని, అందువలనే కేవలం 150రూపాయలు కు లింగ నిర్ధారణ వీర్యం ద్వారా పెయ్యి దూడలు పుట్టుక కు ప్రభుత్వం దోహదు పడుతుందని వివరించారు. అలాగే పశువులు ద్వారా చేకూరే పేడ , తొక్కుడు గడ్డివంటి సేంద్రాయ ఎరువులు పంట పొలాలకు వినియోగిస్తే ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ నెల మార్చి 16వ తేదీనుండి పశువులుకు గాలి కుంటు టీకాలు వేస్తారని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డి సి ఎమ్ ఎస్ మాజీ చైర్మన్ రెడ్డి ప్రసాద్, రాజమండ్రి డిప్యూటీ డైరెక్టర్ ఎమ్. వెంకటేశ్వర రావు, పశుగణాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ కె. కాంతారావు, అసిస్టెంట్ డైరెక్టర్ బి. అనితా కుమారి, పశు వైద్యులు వి వి రమణ మూర్తి, కె. లక్ష్మి కుమారి అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

### రంపయర్రంపాలెం జడ్పీ పాఠశాలకు పూర్వ పది విద్యార్థులు

## ఫర్నిచర్, పరీక్షకి కిట్లు బహూకరణ





**గోకవరం (మనసులో మాట), మార్చి 11 :** గోకవరం మండలం రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్వెల్ డే పార్టీ హెచ్ఎం కలుం అబ్బులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు పాఠశాలకు 12 వేల రూపాయలు విలువచేసే బీరువాను సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, ఎస్ఎంసి చైర్మన్ గంటా శ్రీను, స్కూల్ మెట్ ప్రెసిడెంట్ కాకర విష్ణు చేతుల మీదుగా బహుకరించడం జరిగింది. అదేవిధంగా పాఠశాల పూర్వ విద్యార్థులు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు పలివెల దేవి మనీషా, ఎలమంచిలి సాయి దుర్గ, పెనుగొండ స్మైలి లు రూ 8 వేలు తో 85 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు మాట్లాడుతూ పది పరీక్షలులో మంచి ఉత్తీర్ణత సాధించాలని, మంచి విలువలుతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, వరలక్ష్మి, కిరణ్ బాబు,భాస్కరరావు, సుబ్బారావు, రాంబాబు, ప్రకాశరావు దొర, బాల సుబ్రహ్మణ్యం, బాలు దొర, రామకృష్ణ, కుమారి, లక్ష్మీకాంతం, బాలు తదితరులు పాల్గొన్నారు



## విజ్ఞాన భాండాగారం భగవద్గీత

**- విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్**

**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** జాతి, మత, లింగ, వర్గ విభేదాలు లేకుండా అందరూ చదవాల్సిన మహాగ్రంథం ,విజ్ఞాన గని భగవద్గీత అని విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షులు రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ ఆర్థిక సహకారంతో ముద్రించిన లక్ష యువగళ గీతా చాలీసా పుస్తకాలను డాక్టర్ అడబాల మాధవి చేతుల మీదుగా పంపిణీ చేశారు .ఈ సందర్భంగా పట్నాయక్ మాట్లాడుతూ మన సమాజ సంస్కరణకు పంచ పరివర్తనలు భగవద్గీత ప్రభోధిస్తుందన్నారు. కుటుంబ ప్రయోజనం, సామాజిక సమరత, పర్యావరణ పరిరక్షణ, స్వధర్మ పరిరక్షణ వంటి అంశాలు భగవద్గీత ప్రబోధిస్తుందని పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరంగు దొరబాబు, అడబాల రత్న ప్రసాద్, రాజా , భమిడి శివమూర్తి, పార్థసారథి, తాటికాయల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

### బాల బాలికలకు చట్టాలపై

## అవగాహన కలిగి ఉండాలి



**కాజులూరు (మనసులో మాట) మార్చి 10..** బాల బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ సమితి సోషల్ వర్కర్ చిన బాబు అన్నారు. బుధవారం మండలంలోని బంధన్ పూడి గ్రామంలో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు సిడిపిఓ శ్రీదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మార్చి 2 నుండి మార్చి 20 తారీకు వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో బుధవారం కాజులూరు మండలం , బందనపూడి హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు స్వరూప రాణి అధ్యక్షతన బాల్య బాలికల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ చిన్నబాబు బాలికలకు బాల్య వివాహాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహం వల్ల కలిగే అనర్ధాలు శిక్షలు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, వల్ల కలిగే లాభాలు, మొదలగు వాటి గురించి వివరించడం జరిగింది. అనంతరం బాల బాలికలను గ్రూపులుగా ఏర్పరిచి క్విజ్ నిర్వహించడం జరిగింది. గ్రామ మహిళా సంరక్షకురాలు అరుణ మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు చేసుకుంటే అనేక అనర్ధాలు వస్తాయని బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని తెలియజేశారు. అంగన్వాడి వర్కర్స్, ఏ ఎన్ ఎం లు ఆశ వర్కర్స్,, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

### అత్యవసర పరిస్థితులకు

## సిద్ధంగా గ్రాసిమ్ టీమ్

**- విజయవంతమైన మాక్ డ్రిల్**



**అనపర్తి ( మనసులో మాట) మార్చి11:** బిక్కవోలు మండలం బలభద్రపురంలో అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు, గ్రామంలో గల గ్రాసింగ్ ఇండస్ట్రీస్ అవగాహనను పెంపొందించేందుకు ఆన్-సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ డ్రిల్‌లో భాగంగా హైడ్రోజన్ బ్యాంక్ ప్రాంతంలో హైడ్రోజన్ అగ్ని ప్రమాదం సంభవించినట్లు సిమ్యులేషన్ నిర్వహించారు. అనంతరం ప్లాంట్‌లోని అన్ని విభాగాల ఉద్యోగులను సురక్షితంగా మరియు పద్ధతిగా పూర్తి స్థాయి సైట్ ఎవాక్యుయేషన్ చేయడం జరిగింది. ఈ వ్యాయామం ద్వారా ప్లాంట్ అత్యవసర ప్రతిస్పందన విధానాల పనితీరు, వివిధ విభాగాల మధ్య సమన్వయం మరియు అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించడానికి అవకాశం లభించింది. ఈ మాక్ డ్రిల్‌ను తూర్పు గోదావరి మరియు ఏలూరు జిల్లాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ కె. కృష్ణమూర్తి సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీ శ్రీనివాస్ రెడ్డి, గ్రాసిమ్ టెక్నికల్ హెడ్ శ్రీనివాసన్, హెచ్ఆర్ హెడ్ వి. విజయ్ కార్తిక్, సిఎస్ఆర్ హెడ్ ముని భాస్కర్ రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ ఫణి కార్తిక్ తదితరులతో పాటు వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ కె. కృష్ణమూర్తి సంస్థ అత్యవసర సిద్ధతను అభినందిస్తూ, భవిష్యత్తులో అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు విలువైన సూచనలు అందించారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు ఉద్యోగుల భద్రతను నిర్ధారించడంలో, అత్యవసర పరిస్థితుల్లో సమన్వయాన్ని మెరుగుపరచడంలో మరియు పరిశ్రమలో ఉన్నత స్థాయి భద్రతా ప్రమాణాలను కొనసాగించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.



# హెచ్ పి వి టీకా పై ప్రజల అవగాహన పెంచుకోవాలి

- గర్భాశయ క్యాన్సర్ నివారణను వ్యాక్సిన్ నివారిస్తుంది
- 14 సంవత్సరాల నిండిన బాలికలకు హెచ్ పి వి టీకా వేయించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గోకవరం (మనసులో మాట), మార్చి 11 :** మహిళలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ముందుగా హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించుకోవాలని జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం మండల కేంద్రం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి లో ఆసుపత్రి ప్రధాన వైద్యురాలు డాక్టర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని 14 సంవత్సరాలు నిండిన బాలికలకు వ్యాక్సిన్ వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో విలువైనదని, ఇదే వ్యాక్సిన్ ప్రైవేట్ ఆసుపత్రిలో సుమారు పదివేలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తుందన్నారు. హెచ్ పి వి వ్యాక్సిన్ 80శాతం కంటే పైగా కచ్చితమైన ఫలితాలను ఇస్తున్నట్టు శాస్త్రీయంగా నిరూపితమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డాక్టర్ ల తో పాటు జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్ కుమార్, సూరంపాలెం ప్రాజెక్టు చైర్మన్ ఉంగరాల రాము, జగ్గంపేట నియోజవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు కన్నబాబు , మంగరౌతు రామకృష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ దాసరి తమ్మన్నదొర, మాజీ జెడ్పిటిసి పాలూరి బోసు బాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చెన్నదొర, తిరుమలాయపాలెం సర్పంచ్ పురంశెట్టి శివాజీ, మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్, దాసరి సీతారామకృష్ణ, దిండి వెంకటేశ్వరరావు, బద్దిరెడ్డి బాబి, మండిగ గంగాధర్, గళ్ళ రాము, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, అల్లాడ అరుణ, పిట్ట అరుణ్ కుమార్ , ఎస్ బాబు, కోన శివ నాయుడు తదితరులు పాల్గొన్నారు

# బాలికలకు గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 11..** ప్రతీ 14 సంవత్సరాలు పైబడి ఇంకా వివాహం కానటువంటి బాలికకు హెచ్.పి.వి వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని,ఈ వ్యాక్సిన్ వేయించడం వలన భవిష్యత్తులో గర్భాశయ ముఖ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) రాకుండా రక్షణ లభిస్తుందని కూటమి నాయకుడు రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణస్వామి బుధవారం అన్నారు. నాడు స్థానిక శివాలయం వీధిలో గల అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నందు హెచ్.పి.వి టీకా వేసే కార్యక్రమాన్ని డిప్యూటీ డి.ఎం అండ్ హెచ్.ఓ ప్రశాంతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడి లలిత, కౌన్సిలర్లు ఎండగండి నాగబాబు, కోణాల వెంకటరమణ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు

# శ్యామలాంబ ఆలయంలో ఘనంగా పూజ ఘటోత్సవం, ఊయల సేవ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** స్థానిక గీత అప్సర థియేటర్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ శ్యామలాంబ దేవస్థానంలో బుధవారం సాయంత్రం పూజా ఘటోత్సవం, ఊయల సేవ కార్యక్రమం మహా వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి జే వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కడియాల వీరభద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యులు అల్లాడ వెంకట అప్పారావు, బోను ఈశ్వరి, మల్లప్ప రెడ్డి ఈశ్వరి, కురగంటి త్రినాథ్, కెల్లా జయలక్ష్మి, తాడివలస వెంకటలక్ష్మి, అండలూరి చంద్రశేఖర్, తొర్లపాటి షాలిని, కారుమూరి సురేష్, ఎక్స్ అఫీషియో మెంబర్ మాదిరెడ్డి పద్మావతి హాజరయ్యారు. ఉత్సవాలు అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ కడియాల వీరభద్రరావు తెలిపారు.

# పిఠాపురం పాదగయ క్షేత్రంలో నిలిచిన అన్నదానం..

- ఇరాన్ - ఇజ్రాయిల్ అమెరికా యుద్ధ నేపథ్యంలో దిగుమతి ఆగడంతోనే గ్యాస్ కొరత..
- నిన్న మొన్నటి వరకు హోటళ్లపై నేడు పుణ్యక్షేత్రాలపై గ్యాస్ కొరత ప్రభావం




**పిఠాపురం, ( మనసులో మాట) మార్చి 11:** ప్రపంచ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, దాని ప్రభావంతో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేడు ఆధ్యాత్మిక క్షేత్రాలను కూడా తాకింది. దక్షిణ కాశీగా పేరుగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్న అన్నదాన కార్యక్రమానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా వంటగ్యాస్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడిందని, అందుకే అన్నదానాన్ని నిలిపివేస్తున్నామని ఆలయ అధికారులు వెల్లడించారు. క్షేత్ర పరిసరాల్లో "వంటగ్యాస్ సరఫరా నిలిచిపోయినందున అన్నదానం తాత్కాలికంగా రద్దు చేయబడింది" అని ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుండి దత్తాత్రేయ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు, అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చూసి తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి వేలాది మంది ఆకలి తీరుస్తున్న ఈ పవిత్ర క్షేత్రంలో ఇలాంటి పరిస్థితి రావడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, త్వరగా అన్నదానాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## కాకినాడ మదర్స్ ప్లంబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# అనాధ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ



**కాకినాడ (మనసులో మాట) మార్చి 11..** చిన్నపాటి శ్రమజీవులైన పంబ్లర్స్ తమ సేవా స్ఫూర్తిని చాటుతూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. పంబ్లర్స్ డే సందర్భంగా కాకినాడ మదర్స్ పంబ్లర్ అసోసియేషన్ సభ్యులు ప్రతాప్ నగర్‌లోని జనావళి అనాథాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి తమ పెద్దమనసును ప్రదర్శించారు. ఆర్థికంగా పెద్దగా స్థోమత లేకపోయినా, తమ వంతు సహాయం చేయాలనే భావనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం.

ఈ సందర్భంగా అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని పేర్రాజుపేటలో ఉన్న మదర్స్ పంబ్లర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఆరు సంవత్సరాలుగా పంబ్లర్స్ డే సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో వెనుకబడిన వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది ప్రతాప్ నగర్‌లోని జనావళి అనాథాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేయాలని అసోసియేషన్ సభ్యులు సూచించడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన వివరించారు. వృద్ధులు, నిరాధారులకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. చిన్నపాటి శ్రమతో జీవనం సాగించే పంబ్లర్స్ అయినప్పటికీ, సమాజానికి తిరిగి సేవ చేయాలనే తపన తమలో ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. అనాథాశ్రమంలోని వృద్ధులు పండ్లు అందుకుని ఆనందం వ్యక్తం చేశారు. తమను గుర్తించి సహాయం చేసిన పంబ్లర్ అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వాన్ని పెంపొందిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. పంబ్లర్స్ వంటి శ్రమజీవులు తమ కష్టార్జితంలో కొంత భాగాన్ని సమాజ సేవకు వినియోగిస్తూ సేవా స్ఫూర్తిని చాటుకోవడం అభినందనీయం అని స్థానికులు పేర్కొన్నారు. సమాజంలో నిరాధారులు, వృద్ధులకు తోడ్పాటు అందించే ఇటువంటి కార్యక్రమాలు ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మదర్స్ పంబ్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు వరసాల సతీష్, ఉపాధ్యక్షుడు దేవాడ దుర్గా ప్రసాద్ రెడ్డి, కార్యదర్శి పి. శ్రీనివాస్, ఖజాంచి ఎం. సురేష్, మాజీ అధ్యక్షుడు లక్ష్మణరావు, మాజీ ఉపాధ్యక్షుడు సాంబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సభ్యులు కిలిమి రాజారెడ్డి, ఎరా రెడ్డి, సాంబాబు, శ్రీనివాస్, సత్తిబాబు, డి. వీరబాబు, కంపా ఎర్రయ్య రెడ్డి, చిన్ని కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

# ప్రజల ప్రాణాలంటే..అంత చులకనా?!

- 'కల్తీ పాల' ఘటన మసిపూసి మారేడుకాయ చేద్దామనా..
- బాధితుల శాంపిల్స్ నేషనల్ ఫోరెన్సిక్ లేబరేటరీకి ఎందుకు పంపలేదు?
- ఈ వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలి
- బొల్లినేని ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన అనంతరం ప్రభుత్వం పై ఫైర్ అయిన మాజీ ఎంపీ మార్గాని భరత్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 11:** 'కల్తీ పాల' ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ఇచ్చేసి చేతులు దులుపుకుందామంటే సరిపోదని, ప్రజల ప్రాణాలంటే అంత చులకనా అని లోక్‌సభ మాజీ సభ్యుడు మార్గాని భరత్ రామ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 'కల్తీ పాల' బాధితులను ఆయన పరామర్శించారు. వైద్యులతో రోగుల పరిస్థితి పై ఆరా తీశారు. బాధితుల బంధువులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో భరత్ మాట్లాడుతూ రాజమండ్రిలో కూటమి నేతల తీరు ఆకతాయితనంగా ఉందని మండిపడ్డారు. నాటకాలు వేయడానికి టైం ఉంది కానీ... చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్, మంత్రి సత్య కుమార్ గాని కల్తీ పాల బాధితుల గురించి పట్టించుకునే పరిస్థితి లేదా అని సూటిగా ప్రశ్నించారు. దీన్నో యాక్సిడెంట్ గా..మసిపూసి మారేడు కాయ అన్న రీతిలో చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

బాధితుల శాంపిల్స్ నేషనల్ ఫోరెన్సిక్ లేబరేటరీకి ఎందుకు పంపలేదని భరత్ ప్రశ్నించారు. ఈ 'కల్తీ పాల' ఘటన వ్యవహారాన్ని సీబీఐకి అప్పగించాలని, అప్పుడే నిజానిజాలు వెల్లడవుతాయని అభిప్రాయపడ్డారు. పోలీసులు అన్ని రకాలుగా దర్యాప్తు జరపాలని భరత్ డిమాండు చేశారు. 160 లీటర్ల పాలు తీసుకొస్తే 20 కుటుంబాలు మాత్రమే ఎందుకు ఎఫెక్ట్ అయ్యాయి?, పాలలో యూరియా కలిసిందా... ఫార్మాలిన్ కలిసిందా... గిట్టని వాళ్లు ఏమైనా పురుగుల మందు కలిపారా... అన్న విషయాలు ఇప్పటి వరకు స్పష్టం కాలేదన్నారు బాధిత కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని, ఈ ఘటనలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మిల్క్ ప్రొక్యూర్ మెంట్ యాక్ట్ తీసుకొచ్చారని, ఆ చట్టాన్ని ఎందుకు ఇంప్లిమెంట్ చేయడం లేదని ప్రశ్నించారు. చిన్నారులు సైతం మృతువుతో పోరాడుతున్నారన్నారు. మీ కుటుంబంలోనే ఇటువంటి ఘటనలు జరిగితే ఇలాగే ప్రవర్తిస్తారా అని ప్రశ్నించారు.

పురుగుల మందు తీసుకుని ఎలా తీవ్ర అనారోగ్యం ఎదుర్కొంటారో అటువంటి పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయన్నారు.

ల్యాబ్ నుంచి రిపోర్టు రావడానికి వారాలు ఎందుకు పడుతుంది?, ప్రభుత్వం హైడ్రామా ఆడుతోందని విమర్శించారు. ఈ ఘటన జరిగిన తర్వాత హెరిటేజ్ అడ్వర్టైజ్మెంట్లు విపరీతంగా పెంచిందని, ఈ ఘటనను కూడా వ్యాపారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నీ కల్తీయేనని విమర్శించారు.

చంద్రబాబు హయాంలో తిరుమల లడ్డూకు సంబంధించి ఘీ ఫ్లేవర్ ఎన్ హ్యాన్సర్స్ కొన్నారని అది కల్తీ కాదా అని భరత్ ప్రశ్నించారు.

బాధిత కుటుంబాలకు 25 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండు చేశారు. ఈ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు

తనిఖీల గురించి ప్రశ్నిస్తే ఫుడ్ సేఫ్టీ అధికారులు మాకు స్టాఫ్ లేరని చెప్పడం దారుణమని భరత్ విస్మయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రుడా మాజీ చైర్మన్ రౌతు సూర్య ప్రకాశరావు, పార్టీ నాయకులు శ్రేణులు పాల్గొన్నారు.



# వంట గదిలో మగవారు.. అన్యోన్యతకు సరికొత్త బాట!

- మూలపేట గ్రామంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం

**పిఠాపురం, ( మనసులో మాట) మార్చి 11 :** కుటుంబంలో భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండాలంటే బాధ్యతలను ఇద్దరూ పంచుకోవాలని, ముఖ్యంగా వారంలో ఒకరోజైనా మగవారు వంట చేసి మహిళలకు సహాయపడాలని పిఠాపురం సిడిపిఓ దుర్గాదేవి పిలుపునిచ్చారు. బుధవారం మూలపేట గ్రామంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మి ఆదేశాల మేరకు ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా దుర్గాదేవి మాట్లాడుతూ, మగవారు వంటగదిలో భార్యకు తోడుగా నిలవడం వల్ల వారి మధ్య ప్రేమానురాగాలు పెరుగుతాయని, ఇది కుటుంబ సఖ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఈ కార్యక్రమంలో పురుషులు స్వయంగా పలు రకాల సాంప్రదాయ వంటకాలను తయారు చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. మగవారు వండిన ఈ వంటకాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా, ఆరోగ్యకరమైన దాంపత్యం, లింగ సమానత్వంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రాప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, జిల్లా బాలల హక్కుల పరిరక్షణ సమితి కౌన్సిలర్ దుర్గారాణి, అంగన్వాడీ కార్యకర్తలు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వంగా గీతా విశ్వనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తోట నరసింహం..



**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 11 :** వంగా సత్యనారాయణ మూర్తి మృతి తీరని లోటని జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీ మంత్రి తోట నరసింహం,రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ అన్నారు. పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి,మాజీ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ బావ గారైన వంగా సత్యనారాయణ మూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను కాకినాడలో జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్,మాజీ మంత్రి తోట నరసింహం,రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ముందుగా ఆయన వారు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఆయన మృతి తీరని లోటని తోట నరసింహం,తోట శ్రీ రాంజీ అన్నారు.ఈ కార్యక్రమంలో గొన్నాల కృష్ణార్జున, కారే శ్రీనివాసరావు పాల్గొని నివాళులర్పించారు.

# హెచ్పీవీ వ్యాక్సిన్ తో క్యాన్సర్ నుంచి రక్షణ

- గాడిమొగ పీ హెచ్ సి లో వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభం



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 11:** కిశోర బాలికలకు హెచ్పీవీ (హ్యూమన్ పాపిలోమ వైరస్) వాక్సిన్ వేయడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ తోపాటు అనేక క్యాన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చని గాడిమొగ సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అన్నారు. బుధవారం గాడిమొగ పీహెచ్సీలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కిశోర బాలికలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించడం గొప్ప విషయమన్నారు. బయట మార్కెట్లో ఈ వ్యాక్సిన్ ఖరీదు రూ.4వేల వరకు ఉంటుందన్నారు. వైద్యాధికారిణి జయభార్గవి మాట్లాడుతూ 14 ఏళ్లలోపు ఆడపిల్లలకు ఈ వాక్సిన్ వేయన్నునట్లు తెలిపారు. అన్ని రంగాలలో కీలకపాత్ర పోషించే మహిళల ఆరోగ్యాన్ని కాపాడడం ప్రధానమైన అంశంగా భావించి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనే మహమ్మారిని రూపుమాపాలనే లక్ష్యంతో హెచ్పీవీ ఇంజక్షన్లు స్పెషల్ డ్రైవ్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్నకుమార్, గాడిమొగ ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, పీహెచ్సీ స్టాఫ్ హెచ్ వీ నెహ్రూరాణి, హెచ్పీ లక్ష్మి, సీహెచ్ ఓ కుమారి, ఎంపీహెచ్ఈఓ బీఎల్ జీఎస్ కుమార్, హెచ్ఎస్ రంజన్, స్టాఫ్ నర్స్ సత్య, ఎంఎలెచ్పీలు హేమంత్, లావణ్య, నాగమణి, ఏఎన్ఎంలు రమణ, లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
గురువారం 12 మార్చి 2026 పేజీ : 18



## మున్సిపల్ కౌన్సిల్ లో సాధారణ సమావేశం

**పలమనేరు మార్చ్11( మనసులో మాట):** పలమనేరు పురపాలక సంఘం నందు ఉదయం 11,45 నిమిషాలకు సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన నీలం సంజీవరెడ్డి కౌన్సిల్ హాల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ.... కౌన్సిల్ అజెండా ను చైర్మన్, కౌన్సిల్ సభ్యులు ఆమోదించడమైనది. ప్రస్తుత కౌన్సిల్ పదవీకాలం పూర్తి కావడం వలన కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ చాముండేశ్వరి తో పాటు కౌన్సిలర్ అందరికి పూల మాలలు వేసి శాలవా కప్పి ఘనంగా సన్మానించినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్, మున్సిపల్ ఏఈ స్నేహప్రియ, ఏ ఈ శిరీష, టిపిఓ ఇందిరా, మెప్మా బాబా, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, ప్రభుత్వ శాఖల ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 13న బహిరంగ సభ సమావేశం..

**- ఎంపీడీవో వెంకటేశు**

**ధర్మవరం మార్చి 11 (మనసులో మాట)..** మార్చి నెల 13వ తేదీన 19వ విడత సామాజిక తనిఖీ నిర్వహణ నిర్వహణలో భాగంగా బహిరంగ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రజావేదిక బహిరంగ సభను ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 01.4.2024 నుండి 31. 3. 2025 మధ్యకాలంలో ధర్మవరం మండలంలో జరిగిన వివిధ పనులకు12.1.26 నుండి ఈనెల 12వ తేదీ నుండి2.3.26 వరకు సామాజిక తనిఖీ బృందములు అన్ని గ్రామ పంచాయతీలలో తనిఖీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సభలో సామాజిక తనిఖీ ద్వారా గుర్తించిన అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. కావున ఈ ప్రజా వేదిక బహిరంగ సభకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, గ్రామపంచాయతీ సర్పంచులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి, వెలుగు పంచాయతీ, ఇంజనీరింగ్ శాఖ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ సిబ్బంది, ఎస్ఎస్సి ఏ ఏ ఈ, ఉపాధి హామీ శ్రామికులు తప్పక హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

### కస్తూరిబా బాలికల విద్యాలయంలో తరగతుల ప్రవేశాల కొరకు

## దరఖాస్తు చేసుకోండి

**- ప్రిన్సిపాల్ ఏ.చంద్రకళ**



**ధర్మవరం మార్చి 11 (మనసులో మాట)..** పట్టణంలోని పోట్లమర్రి గ్రామంలో గల కస్తూరిబా బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) 2026-27 విద్యా సంవత్సరం గాను ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరమునకు, అదేవిధంగా ఏడవ, ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ, సెకండ్ ఇయర్ ఇంటర్ లో మిగిలి ఉన్న సీట్లకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ ఏ. చంద్రకళ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 12వ తేదీ నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరించబడునని తెలిపారు. ఇంటర్మీడియట్లో సిఇసి గ్రూపు కలదని, తల్లిదండ్రులు లేని పిల్లలు, ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనారిటీ, వికలాంగులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మైనారిటీ విద్యార్థులు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కలదని తెలిపారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, ఫోన్ నెంబర్, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, కుల ధ్రువీకరణ పత్రము, రేషన్ కార్డు తో అప్లై చేసుకోవాలని తెలిపారు. మా పాఠశాలలో మంచి వసతి భోజన సదుపాయం అత్యాధునిక డిజిటల్ బోధన ఇంగ్లీష్ మీడియం నందు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల యందు నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు.

### గ్యాస్ ధరలతో పెంపుతో

# సామాన్యులపై పెనుభారం

**- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి**

- మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ ఏమైంది? కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేతిరెడ్డి
- ప్రజలపై భారం మోపొద్దు గ్యాస్ ధరలపై కూటమి ప్రభుత్వానికి కేతిరెడ్డి డిమాండ్
- రెండు సంవత్సరాలు గడిచినా హామీలు అమలు కాలేదు: కేతిరెడ్డి విమర్శలు
- గ్యాస్ ధరల పెంపుపై కూటమి ప్రభుత్వంపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే ఫైర్




**ధర్మవరం మార్చి 11 (మనసులో మాట)..** గ్యాస్ ధరలతో పెంపుతో సామాన్యులపై పెరుగు తగదని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారు గ్యాస్ ధరల పెంపునకు నిరసనగా సిలిండర్లను మోస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పెంచిన గ్యాస్ ధరలను ప్రభుత్వమే భరించాలని, గతంలో వైయస్సార్ మహిళలపై భారం పడకుండా ఆదుకోవడం జరిగిందన్నారు. అధికారంలోకి వస్తే పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తామని నారా లోకేష్ హామీలు ఏమయ్యాయి అని వారు ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న ఎందుకు ధరలు తగ్గించలేకపోతున్నారని వారు మరోసారి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగదారులపై 14.2 కేజీల సిలిండర్ల పై 60 రూపాయలు పెరగడం జరిగిందన్నారు. అలాగే కమర్షియల్ సిలిండర్ పై 115 రూపాయలు పెంచడం దారుణం అన్నారు. ప్రస్తుతం యుద్ధం పరిస్థితుల్లో నేపథ్యంగా గ్యాస్ కొరత తీవ్రంగా ఉందని ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని వారు గుర్తు చేశారు. గృహ వినియోగదారులు మళ్లీ సిలిండర్ బుక్ చేయాలంటే 21 రోజులు వరకు బుకింగ్ లేకపోవడం దారుణం అని తెలిపారు. ప్రజల కష్టాలు చంద్రబాబుకు నిజంగా తెలిస్తే పెంచిన గ్యాస్ ధరలను ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించే విధంగా చర్యలు చేపట్టాలని వారు తెలిపారు. రానున్న రోజుల్లో చంద్రబాబు ప్రభుత్వం ప్రజా క్షేత్రములో తగిన మూల్యం చెల్లించుకొక తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి బాల్రెడ్డి, నీలూరి ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెందమూరి నారాయణరెడ్డి, కత్తి పెద్దన్న ,కౌన్సిలర్లు బోయ రమాదేవి, కత్తే ఆదిలక్ష్మి, సబేహా, పద్మజా, సునీత తదితరులు పాల్గొన్నారు.

### జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం

# 17వ తేదీ వరకు పొడిగింపు

**- జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి**




**ధర్మవరం మార్చి 11 (మనసులో మాట)** జనసేన పార్టీ ఆదేశాల మేరకు జనసేన పార్టీలో పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల అనగా మార్చి 17 తేదీ వరకు పొడిగించినట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాతో సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన పార్టీ కార్యకర్తలు అభిమానులు తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో నిర్వహించి ఒక వేడుకల ముందుకు తీసుకుని వెళ్లాలని వారు పిలుపునిచ్చారు. రాయలసీమలోని ప్రతి నియోజకవర్గంలో కనీసం 10,000 సభ్యత్వాలు నమోదు చేయడానికి లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 40 లక్షల నుండి 50 లక్షల వరకు సభ్యత్వాలు నమోదు అయ్యే దిశగా కృషి చేయాలని వారు తెలిపారు.

### తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం

# వైకాపా నేతలు అబద్ధపు ప్రచారాలు

**- టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి**



**తిరుమల, మార్చి 11 (మనసులో మాట)..** తిరుమల పవిత్రతను దెబ్బతీస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం వైకాపా నేతలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి మండిపడ్డారు.తిరుపతి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైకాపా నాయకుల తీరుపై నిప్పులు చెరిగారు. వైకాపా నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొడుతూ భానుప్రకాష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. "శ్రీవేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో మేము ఎప్పుడూ విశ్వాసపాత్రమైన కుక్కల వలె సేవలందిస్తామని వైకాపా నేతలు మాత్రం గుంటకాడ నక్కలలా అదను చూసి తిరుమలపై విషం చిమ్ముతున్నారు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోలేక, భక్తుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిని ఉద్దేశించి భానుప్రకాష్ రెడ్డి నేరుగా సవాల్ విసిరారు. "మీ హయాంలో టీటీడీలో జరిగిన పనుల్లో ఎక్కడా కమీషన్లకు కక్కుర్తి పడలేదని కాణిపాకం వినాయక ఆలయం వద్ద సత్యప్రమాణం చేసే ధైర్యం మీకు ఉందా?" అని ప్రశ్నించారు. ఇకపై వైకాపా నేతలు మీడియా సమావేశాలు పెట్టి అడ్డగోలుగా మాట్లాడటం మానుకోవాలని, ఏదైనా మాట్లాడితే పక్కా ఆధారాలతో వాస్తవాలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు. తిరుమల ప్రతిష్టను గంగలో కలిపే ప్రయత్నం చేస్తే భక్తుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.



## శ్రీతిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు

**- సి ఆర్ రాజన్**

పలమనేరు మార్చి 11( మనసులో మాట)

పలమనేరు మున్సిపల్ పరిధిలోని గంటావూరు బీసీకాలనీ నందు వెలసిన శ్రీతిరుపతి గంగమ్మకు సోమవారం దేవాలయం చైర్మన్, డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయంలో ఉదయం అభిషేకం అనంతరం పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయ ధర్మకర్త,ఆలయ చైర్మన్ సేవారత్న స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అలాగే సాయంత్రం 4గంటలకు వన్నియకుల క్షత్రియ కోఆపరేటివ్ ఫైనాన్స్ స్టేట్ చైర్మన్ డాక్టర్ సి.ఆర్.రాజన్ ఆలయం వద్దకు రాగానే అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది.ఈసందర్భంగా ఆయనకు చైర్మన్ ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం జ్వాలాదీప ప్రజ్వలన, అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించి భక్తులకు అమ్మవారిని దర్శనం దర్శించుకోవడం జరిగింది. ఈసందర్భంగా వేలాదిమంది భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం టిడిపి నాయకులకు ఆలయ చైర్మన్ డాక్టర్ మురుగన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

## సివిల్ ర్యాంక్ 360 సాధించిన జయశ్రీ కి సన్మానం



పలమనేరు మార్చ్ 11 ( మనసులో మాట):కృష్ణమ్మగారి జీవనధార ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు క్రిష్ణమ్మ గారిజనార్ధన్ ఆధ్వర్యంలోపలమనేరు మండలంలోని జల్లారుపల్లె గ్రామానికి చెందిన జయశ్రీ సివిల్స్ 360 ర్యాంకు సాధించినారు. ఆ విద్యార్థినికి ఫౌండేషన్ తరపున సన్మానించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో కోటీశ్వర్,మోహన్, జిల్లేడు అరుణ్, లాయర్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ ఎం ఎస్ పరీక్షలో 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు

**- హెడ్మాస్టర్ జ్యోతిలక్ష్మి**



**ధర్మవరం మార్చి 11 (మనసులో మాట)..** ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 3 మూడవ తేదీ (2025) జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో పట్టణంలోని సంజయ్ నగర్ లో గల బిఎస్సార్ పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 14 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో ఎంపిక కావడం జరిగిందని హెడ్మాస్టర్ జ్యోతిలక్ష్మి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ విజయం సాధించిన విద్యార్థులందరికీ కూడా హెడ్మాస్టర్ తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ 14 మంది విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం వరకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం ద్వారా స్కాలర్షిప్లు అందుతాయని తెలిపారు. అనంతరం పాఠశాల కమిటీ వారు కూడా కృతజ్ఞతలను తెలియజేశారు.

## ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ప్రసంగం తమలో నూతన ఉత్సాహం కలిగించింది



**ఉమ్మడి అనంతపురం, మార్చి 11 (మనసులో మాట)..** అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ప్రసంగం తమలో నూతన ఉత్సాహం కలిగించిందని కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు... ఇటీవల జరిగిన తెలుగుదేశం ప్రభుత్వంలో టిడిపి నాయకుల అరెస్టులతో క్యాడర్ కాస్త గందరగోళంలో పడింది... నగరంలోని డివిజన్ లలో నాయకులు,కార్యకర్తలు పర్యటించకపోవడంతో సమస్యలు తిష్ట వేశాయి... దీంతో రెండు రోజులుగా పార్టీ నాయకులు కార్యకర్తలతో దశలవారీగా ఎమ్మెల్యే చర్చించారు... అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ 18వ తేదీ నుండి కార్పొరేషన్ గడువు ముగుస్తుందని... ఇక పాలక మండలికి ఎటువంటి అధికారాలు ఉండవన్నారు... ప్రతి డివిజన్లో అధికారులు, నాయకుల మధ్య సమన్వయం కోసం సమావేశాలు ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు... ప్రతి డివిజన్ మీటింగ్ కు హాజరై డివిజన్ నాయకుల ఆదేశాలు అధికారులు పాటించేలా చేస్తానని నాయకులు, కార్యకర్తల హర్షద్వానాల మధ్య ఎమ్మెల్యే హామీ ఇచ్చారు... మూడు నెలలలో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నందున ప్రతి నాయకుడు ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు... వైకాపా పాలకమండలి, మన టిడిపి కార్యకర్తలకు మధ్య అధికారులు ఇటు తేల్చుకోలేకపోయారని ఆయన వాపోయారు...పారిశుద్ధ్యం విషయంలో తనకు ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే పరిష్కరించేలా డివిజన్ నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు... ప్రజలకు అందుబాటులో ఉండని వారిని సాగనంపటానికి కూడా వెనకాడనని ఎమ్మెల్యే హెచ్చరించారు....18 వ తేదీ నుండి ప్రతి డివిజన్ వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి, అన్ని వార్డులలో టిడిపి గెలిపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలను నాయకులను కోరారు... ఈ సమావేశం ఆద్యంతం ఆసక్తికరంగా జరిగింది... నాయకులకు భరోసా కల్పించే విధంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడాలని టిడిపి శ్రేణులు పేర్కొంటున్నాయి.



మహిళా శిశు సంక్షేమ శాఖలో

## తప్పుడు నివేదికల వ్యవహారం

**- రెండో రిమైండర్ పంపిన సాకే వినయ్ కుమార్**

**పుట్టపర్తి, మార్చి 11 (మనసులో మాట)..** శ్రీ సత్యసాయి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖలో తప్పుడు నివేదికలు సమర్పించిన వ్యవహారంపై కర్నూలు ప్రాంత రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి రోహిణి కి ఈరోజు రెండవ రిమైండర్ ఈమెయిల్ పంపినట్లు బహుజన్ సమాజ్ పార్టీ ఉపాధ్యక్షుడు మరియు ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకే వినయ్ కుమార్ తెలిపారు.తాను ఇచ్చిన ప్రజా ఫిర్యాదుకు సంబంధించి జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల ఉన్నతాధికారులకు పంపిన నివేదికలో వాస్తవాలను వక్రీకరించి తప్పుడు సమాచారం సమర్పించినట్లు ఆయన ఆరోపించారు. తాను పుట్టపర్తి బాలల అభివృద్ధి ప్రాజెక్టు కార్యాలయాన్ని మాత్రమే సందర్శించగా, ఇతర కార్యాలయాలను కూడా సందర్శించి ఫిర్యాదును ఉపసంహరించుకున్నట్లు నివేదికలో పేర్కొనడం పూర్తిగా అసత్యమని ఆయన స్పష్టం చేశారు.ఈ విషయంపై ఫిబ్రవరి 28న ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్పుడు నివేదికలు సమర్పించడం ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ ప్రవర్తనా నియమాలు మరియు క్రమశిక్షణా నియమాల ప్రకారం తీవ్రమైన ఉల్లంఘనగా పరిగణించబడుతుందని ఆయన తెలిపారు.కాబట్టి సంబంధిత అధికారిపై తక్షణ విచారణ జరిపి వివరణ కోరాలని, అవసరమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. తగిన చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లనున్నట్లు సాకే వినయ్ కుమార్ హెచ్చరించారు.

మోసాలిసా పెళ్లి!..

## హైటెన్షన్ నడుమ పోలీసులు ఫుల్ ప్రొటెక్షన్

ప్రయాగరాజ్ మహా కుంభమేళా 2025లో తన మంత్రముగ్ధమైన కళ్లతో, అమాయకపు చిరునవ్వుతో కోట్లాది మంది హృదయాలను కొల్లగొట్టిన 18 ఏళ్ల ఇంటర్నెట్ సెన్సేషన్ మోనాలిసా భోంస్లే జీవితం ఇప్పుడు ఒక అనూహ్య మలుపు తిరిగింది. కుంభమేళాలో పూసలు అమ్ముతూ ఓవర్‌నైట్ సెలబ్రిటీగా మారిన ఈ అందాల సుందరి, ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం పోలీస్ స్టేషన్ మెట్లెక్కడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మలయాళ చిత్రసీమలో 'నాగమ్మ' చిత్రంతో అడుగుపెడుతున్న ఆమె, షూటింగ్‌లో ఉండగా ఈ వివాదం తలెత్తింది. తన ప్రేమను వ్యతిరేకిస్తున్న తండ్రిని ఎదిరించి, రక్షణ కోరుతూ ఆమె పోలీసులను ఆశ్రయించడం సంచలనం సృష్టిస్తోంది. గత ఏడాదిన్నరగా కేరళకు చెందిన ఫర్మాన్ ఖాన్ అనే యువకుడితో మోనాలిసా ప్రేమాయణం సాగిస్తోంది. వీరిద్దరికీ ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడగా, అది కాస్తా డేటింగ్‌కు దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తండ్రి హుటాహుటిన కేరళ చేరుకుని, ఆమెను బలవంతంగా ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, తన తండ్రితో కలిసి వెళ్లడానికి నిరాకరించిన మోనాలిసా, తన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని భావించి తిరువనంతపురంలోని తంపనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరిన్ని కనుగొనండి అంతర్జాతీయ వార్తలు విశ్లేషణ జ్యోతిష్యం సేవలు వాతావరణ సమాచార సేవలు ఆంధ్రప్రదేశ్ వార్తలు ఈ సాయంత్రమే వీశీఋశ్రీఅయి పెళ్లి.. తన ప్రియుడితో కలిసి పోలీసుల ముందుకు వచ్చిన ఆమె, తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరింది. తన మేజర్ హోదాను ఉపయోగించి తనకిష్టమైన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం వీరి వివాహ వేడుకకు కేరళ పోలీసులు భద్రత కల్పిస్తుండటం విశేషం. కాగా ఈరోజు సాయంత్రం తిరువనంతపురంలోని ఒక ఆలయంలో తన ప్రియుడిని వివాహం చేసుకోబోతోంది. ాాశ్రీంశీ =ముఃు మోనాలిసా మూడు వీడియోలు చూస్తే మతి పోవాల్సిందే.. వీశీఋశ్రీఅయి వరుస సినిమాలు.. మోనాలిసా ప్రస్థానం ఒక అద్భుతమైన సినీ కథను తలపిస్తుంది. కుంభమేళాలో సామాన్యంగా కనిపించిన ఈ అమ్మాయి వీడియోలు వైరల్ కావడంతో సినిమా అవకాశాలు క్యూ కట్టాయి. ఇప్పటికే సనోజ్ మిశ్రా దర్శకత్వంలో 'ది డైరీ ఆఫ్ మణిపూర్' చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైన ఆమె, 'దిల్ జానియా' అనే మ్యూజిక్ వీడియోతో మిలియన్ల వ్యూస్ సాధించింది. తెలుగులో కూడా సాయి చరణ్ సరసన 'లైఫ్' అనే సినిమా ద్వారా హీరోయిన్‌గా లాంచ్ అవుతోంది. కెరీర్ పరంగా ఎదుగుతున్న ఈ తరుణంలో ఆమె వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు చర్చలకు దారితీస్తున్నాయి.

డ్రగ్స్,గంజాయి వంటి మత్తుపదార్థాల నిర్మూలన పై

## మార్చి 17,18 డివైఎఫ్ఐ జనచైతన్య జీపు జాతా



డ్రగ్స్,గంజాయి నీ వ్యతిరేకిస్తూ యువతను చైతన్య పరిచే విధంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మార్చి 17,18 న రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా జన చైతన్య జీపు జాతా నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని వీరనాల శివకుమార్ లు తెలిపారు.బుధవారం కడప జిల్లా కార్యాలయం నందు జన చైతన్య జీపు జాతా పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో యువతను పట్టి పీడిస్తున్న మహమ్మారి డ్రగ్స్ మరియు గంజాయి రెండు అన్నారు.వీటి బారిన పడి యువత తమ ఉజ్వల భవిష్యత్ ను నాశనం చేసుకుంటున్నారని అటు తల్లిదండ్రులకు,ఇటు సమాజానికి పనికిరాకుండా పోతున్నారని అన్నారు.వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వాల పై ఉందన్నారు.డ్రగ్స్, గంజాయి మాఫియాను నిర్మూలించాలన్నారు. విద్యాసంస్థల వద్ద టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం మత్తుపదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై పాఠ్యపుస్తకాల్లో ప్రత్యేక పాఠ్యాంశాన్ని చేర్చాలన్నారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో అత్యాధునిక మత్తు విముక్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏరియాలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని తద్వారా క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రధానంగా యువత చెడు మార్గాల వైపు ఉపాధి లేఖనే ఎక్కువ మొగ్గు చూపే అవకాశం ఉందని కావున ఉపాధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జనచైతన్య జీపు జాత ద్వారా యువతను చైతన్య పరుస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తూ వెళ్తామన్నారు. 17న బద్వేలులో జీపు జాత ప్రారంభమై మైదుకూరు ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ,కమలాపురం నియోజకవర్గాల మీదుగా వెళుతూ 18వ తేదీ సాయంత్రం జాతా కడపలో ముగుస్తుందన్నారు. ఈ జాతా ను యువత,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గండి. సునీల్,నగర ఉపాధ్యక్షులు పెద్దన్న పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాల నిర్మాణము పట్ల

## అధికారుల అలసత్వం తగదు

**- ప్రభుత్వ సొమ్మును దునిర్వియోగం చేస్తున్న అధికారులపై చర్యలు చేపట్టాలి**

**- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి**



మైదుకూరు పట్టణము నందు నిర్మాణంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను జిల్లా కార్యదర్శి వీరపోగు రవి బృందం బుధవారం సందర్శించడం జరిగింది .

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల క్రితమే గ్రామ పెద్దలు నంద్యాల రోడ్ లో 91 సెంట్లు కొని బాలికల ఉన్నత పాఠశాలకు జిల్లా పరిషత్ పంచాయతీ అధికారి పేరిట రిజిస్టర్ చేశారని భూములకు రెక్కలు వచ్చి ఆక్రములకు గురి అవుతున్న సమయంలో ఎస్ఎఫ్ఐ పోరాటం ద్వారా నాటి ప్రభుత్వము బాలికల ఉన్నత పాఠశాలకు ఏర్పాటుకు, నిర్మాణం కొరకు జీవో ఇచ్చిందని నిర్మాణం కూడా దాదాపుగా పూర్తి ఉందని, అధికారులు, ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యం వల్ల కోట్లాది ప్రజల సొమ్ము వృధా అవుతుందని, డ్రాప్ ఔట్ నివారించాలని ,బాలిక విద్యను ప్రోత్సహించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బాలికలు ఉన్నత పాఠశాలకు , జూనియర్ కాలేజీ వాటికి తిలోదకాలు ఇస్తున్నారని. బాలిక ఉన్నత పాఠశాల నిర్మాణం పూర్తిచేసి అక్కడ ఇంటర్మీడియట్ విద్యకు అవకాశం కల్పించి మైదుకూరు పట్టణంలో పభుత్వ బాలికల కాలేజీ విద్యకు కూడా ఏర్పాటును ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. బాలిక విద్య కోసం ప్రభుత్వం హెచ్చిస్తున్న లక్షలాది రూపాయలు వాటికి వినియోగించే వనరులు నిర్వీర్యం అవుతున్నాయని, లక్షలాది ప్రజల సొమ్మును వెచ్చించి నిరుపయోగానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి అని, బాలుర, బాలికల పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉండుట వలన పలు సమస్యలకు దారి చూస్తున్నాయని దానిని నివారించుటకు బాలిక పాఠశాల తరలించాలని లేనిపక్షంలో బాలికలు, మహిళల ఆధ్వర్యంలో పెద్దయెత్తున ఎస్ఎఫ్ఐ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, అభినయ్, అభిషేక్, పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి



కడప నగరంలోని 21వ డివిజన్‌లో సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి

కడప నగర అభివృద్ధిలో భాగంగా మరో కీలక అడుగు పడింది. 21వ డివిజన్ సి.పి. బ్రౌన్ గ్రంథాలయం సమీపంలో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి ఈరోజు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ సిసి రోడ్డు మరియు ఆర్ఓబి పనులు పూర్తి కావడమనేది కడప నగరానికి ఎంతో కీలకం. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే 15, 16, 17, 19 మరియు 21వ డివిజన్లలోని దాదాపు 20,000 మంది జనాభాకు నేరుగా రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. గతంలో రైలు వచ్చే సమయంలో ఇక్కడ గంటల తరబడి ట్రాఫిక్‌లో ఆగిపోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ రోడ్డు పనులు పూర్తయితే ఎక్కడా ట్రాఫిక్ జామ్ లేకుండా, ప్రజలందరూ సులభంగా రింగ్ రోడ్డుకు చేరుకునే అవకాశం ఉంటుంది అని వివరించారు.

నగర ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి,స్థానిక మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం

## ఉచిత మెగా వైద్య శిబిరం



**ఉమ్మడి అనంతపురం ..** జిల్లా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం ఉచిత మెగా వైద్య శిబిరం

– జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఖూూ గారి ఆధ్వర్యంలో బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారిచే క్యాన్సర్ నిర్ధారణ మరియు ఇతర ఆరోగ్య సమస్యలపై పరీక్షలు

– స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఉచిత మెగా వైద్య శిబిరం... భారీగా పాల్గొని క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు ఇతర ఆరోగ్య సమస్యలకు సంబంధించి టెస్టులు, చెకప్స్ చేయించుకున్న పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు

– ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ గారు...ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ ప్రాణాంతకం కాదని వెల్లడించిన జిల్లా ఎస్పీ

– క్యాన్సర్ రాకుండా తీసుకునే ముందస్తు జాగ్రత్తలపై అవగాహన చాలా ముఖ్యం... అనుమానం వస్తే డాక్టర్లను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించిన ఎస్పీ గారు

– అనంతరం... బ్రెస్ట్ క్యాన్సర్, సర్వేకల్ కేన్సర్, లంగ్ కేన్సర్ లపై అవగాహన చేశారు. వయస్సు వల్ల మరియు జన్యుపరంగా లేదా అలవాట్ల వల్ల వచ్చే క్యాన్సర్లు రాకుండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు... వస్తే త్వరగా డిటెక్ట్ చేయడానికి సంబంధిత డాక్టర్లను సంప్రదించి టెస్టులు చేయించుకోవడం తదనుగుణంగా చికిత్స తీసుకోవాలని ఎస్పీ సూచనలు

– కాన్ఫరెన్స్ హాలులో పురుషులు, మహిళలకు వేర్వేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఫిజీషియన్, గైనకాలజీ, తదితర విభాగాలకు సంబంధించి నిపుణులైన బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్లచే హెల్త్ చెకప్ లు

– అనంతరం... బసవ తారకం హాస్పిటల్ కు సంబంధించిన ప్రత్యే బస్సులోనే అత్యాధునిక పరికరాల ద్వారా ఆయా విభాగాల్లో నిపుణులైన డాక్టర్లు, టెక్నీషియన్లచే క్లినికల్ ఎగ్జామినేషన్ నిర్వహించారు

– ఈకార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, జిల్లా మాజీ గ్రంథాలయ ఛైర్మన్ & నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు గౌస్ మహమ్మద్దీన్, హైదరాబాద్ బసవతారకం ఇండో- అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ గైనకాలజిస్టులు జ్యోతి, మాన్విత, జనరల్ ఫిజీషియన్ రవిశంకర్ , రేడియాలజిస్ట్ ప్రభాకర్ , మేనేజర్ లక్ష్మణ్ ...సి.ఐ లు ధరణికిశోర్, క్రాంతికుమార్, ఆర్ ఐ లు పవన్ కుమార్, మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమీటి సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాండ్ల హరినాథ్ , లక్ష్మీనారాయణ, సరోజ మరియు పోలీసులు వారి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్



**కడప జిల్లా, మార్చి 11 (మనసులో మాట)..** కడప నగరం లోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అరెస్ట్ చేశారు.వారి వద్ద నుండి సుమారు 4 కేజీల 400 గ్రాముల గంజాయి, ఒక ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, ఒక మొబైల్ ఫోన్, మరియు ₹2,000 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు కడప డిఎస్పీ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో కడప జిల్లా లో పోలీసులు గంజాయి రవాణా మరియు విక్రయాలపై నిఘా ఉంచినట్లు కడప జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో చిన్నచౌక్ సిఐ ఓబులేసు, ఎస్సైలు రాజరాజేశ్వర్ రెడ్డి, మరియు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు

## టీడీపీ నేత నూర్ ఆలౌట్ లిక్విడ్ తాగి ఆత్మహత్యాయత్నం

**నూర్ మహమ్మద్ ఆత్మహత్యాయత్నం ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్.**



**ఉమ్మడి అనంతపురం, మార్చి 11 (మనసులో మాట)..** డివిజన్ లోని కొంతమంది పార్టీ నాయకులతో వ్యక్తిగత విషయాలపై గొడవలతో మనస్తాపం. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి నూర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే దగ్గుపాటి. నూర్ కు ఎలాంటి ప్రాణాపాయం లేదని ఎమ్మెల్యేకి తెలిపిన వైద్యులు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే దగ్గుపాటి. నూర్ నన్ని ఇఫ్తార్ విందుకు ఆహ్వానించాడు.. సమయాభావం వలన వెళ్లలేదు. డివిజన్లో నాయకులు మధ్య గొడవ జరిగింది. ఇది చిన్న విషయం అయినా నూర్ మనస్తాపంతో ఆత్మహత్యాయత్న చేసుకున్నాడు. దీనిని కొందరు భూతద్దంలో చూపాలని చూస్తున్నారు. రాజకీయ నిరుద్యోగులు ఇలాంటి వాటిని రాజకీయం చేస్తున్నారన్న దగ్గుబాటి.

కడపలో నూతన పల్స్ హాస్పిటల్ ను ప్రారంభించిన

## వైఎస్ జగన్ సతీమణి భారతి



కడపలో నూతన పల్స్ హాస్పిటల్ ను ప్రారంభించిన మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సతీమణి శ్రీమతి వైఎస్ భారతి రెడ్డి మాట్లాడుతూ.. కడప ప్రజలకు ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రారంభమైన పల్స్ ఆసుపత్రి, ప్రజల ఆరోగ్యం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
తెలంగాణ
హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం
గురువారం 12 మార్చ్ 2026


# రాష్ట్రంలో మూడో డిస్కమ్.. సీఎండీగా ముషారఫ్ అలీ ఫరూఖీ

**వ్యవసాయం.. సాగునీటి పథకాల కోసం ప్రత్యేక సంస్థ**

**తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆవిర్భావం**

**మింట్ కాంపౌండ్ లో ప్రధాన కార్యాలయం**

**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మూడో డిస్కమ్ ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఉన్న టీజీఎస్పీడీసీఎల్.. టీజీఎన్పీడీసీఎల్ సంస్థలకు అదనంగా 'తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్' (రైతు డిస్కమ్) పేరుతో కొత్త సంస్థను ప్రారంభించింది. ఈ కొత్త డిస్కమ్ కు చైర్మన్.. మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)గా ఐఏఎస్ అధికారి ముషారఫ్ అలీ ఫరూఖీని ప్రభుత్వం నియమించింది. హైదరాబాద్ మింట్ కాంపౌండ్ లో ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ఉండనుంది.



## వ్యవసాయ రంగానికి ప్రత్యేక సేవలు

పెరుగుతున్న సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేశారు. రైతు డిస్కమ్ ప్రధానంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు.. మిషన్ భగీరథ.. జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ బీ) అవసరాలను చూసుకుంటుంది. కొత్త వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వడం.. ట్రాన్స్ ఫార్మర్ల నిర్వహణ.. నాణ్యమైన విద్యుత్ సరఫరా వంటి బాధ్యతలను ఈ సంస్థ నిర్వర్తించనుంది. బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా తిరుపతి రెడ్డి.. కృష్ణారెడ్డి.. మోహన్ రావు.. నరసింహులు నియమితులయ్యారు. భారీ సాగునీటి ప్రాజెక్టుల వల్ల విద్యుత్ పంపిణీ వ్యవస్థపై పెరుగుతున్న భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# మహిళా ఆరోగ్య పరీక్షల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- రాష్ట్రవ్యాప్తంగా ఉమెన్ వెల్ నెస్ ప్రొఫైలింగ్ కార్యక్రమ అమలు
- 46 లక్షల మంది మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు
- అధికారులతో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష



**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఉమెన్ వెల్ నెస్ ప్రొఫైలింగ్' కార్యక్రమంలో అలసత్వం వహించవద్దని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుండి ఆరోగ్యశాఖ.. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమ పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు.

## సౌకర్యాల్లో లోటు ఉండకూడదు

టెస్టుల కోసం గ్రామాల నుండి మహిళలను ఆసుపత్రులకు తీసుకురావడానికి.. పరీక్షల అనంతరం తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేర్చడానికి వాహనాలను సమకూర్చాలని సెర్ప్ అధికారులకు మంత్రి సూచించారు. ఆసుపత్రుల్లో మహిళలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా డాక్టర్లు.. సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తాగునీరు.. కుర్చీలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని.. ఒకేరోజు ఎక్కువ మందిని పిలిచి ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. రక్త నమూనాల సేకరణ నుండి ల్యాబ్ కు చేర్చే వరకు కోల్డ్ చైన్ నిబంధనలు పక్కాగా పాటించాలని.. డేటా నమోదులో తప్పులు దొర్లకుండా చూడాలని హెచ్చరించారు.

## 46 లక్షల మందికి 30 రకాల పరీక్షలు

దేశంలోనే ఎక్కడా లేని విధంగా మహిళల కోసం ఈ ప్రణాళికను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. 32 జిల్లాల్లోని 542 మండలాల్లో ఉన్న సుమారు 46 లక్షల మందికి ఈ పరీక్షలు నిర్వహిస్తారు. రక్తహీనత.. మధుమేహం.. బీపీ.. థైరాయిడ్.. కిడ్నీ పనితీరు వంటి 30 రకాల పరీక్షలు చేస్తారు. తొలి దశలో ప్రతి జిల్లాలో 5 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని.. రెండో దశలో మిగిలిన మండలాలకు విస్తరిస్తామని వెల్లడించారు. స్క్రీనింగ్ లో అనారోగ్యం తేలితే వెంటనే చికిత్స ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

## డిజిటల్ హెల్త్ రికార్డులు

ప్రతి లబ్ధిదారురాలికి క్యూఆర్ కోడ్ తో కూడిన డిజిటల్ హెల్త్ రికార్డులను సృష్టించి.. ఈ-హెచ్ ఎం ఐ ఎస్ ప్లాట్ ఫామ్ కు అనుసంధానిస్తామని మంత్రి తెలిపారు. రిపోర్టులను నేరుగా మొబైల్ కు ఎస్ ఎం ఎస్ రూపంలో లేదా 'ఈ-ఆరోగ్యం' యాప్ ద్వారా అందిస్తామన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లేటప్పుడు రిపోర్టుల కాగితాలు తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని వివరించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ.. హెల్త్ కమిషనర్ సంగీత సత్యనారాయణ.. ఆరోగ్యశ్రీ సీఈఓ ఉదయ్ కుమార్.. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్.. జిల్లా డీఎంహెచ్ ఓలు పాల్గొన్నారు.

# ఎల్ బీ స్టేడియంలో 15న ప్రభుత్వ ఇఫ్తార్ విందు

**ఏర్పాట్లపై మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ సమీక్ష**

**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 15న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'దావత్-ఏ-ఇఫ్తార్' ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.. వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది తన మొదటి ఇఫ్తార్ కార్యక్రమమని.. దీనిని అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులకు మంత్రి సూచించారు.

## 10 వేల మందికి ఏర్పాట్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మంత్రులు.. ఎమ్మెల్యేలు.. మత పెద్దలతో పాటు సుమారు పదివేల మంది ఈ వేడుకకు హాజరయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రోటోకాల్ పాటించడంలో ఎక్కడా రాజీ పడకూడదని.. ఆహార నాణ్యత.. పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. జీహెచ్ ఎంసీ.. పోలీస్.. విద్యుత్.. జలమండలి.. ఆర్ అండ్ బీ.. వైద్య శాఖల మధ్య పక్కా సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్.. భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. స్టేడియంలో పారిశుద్ధ్యం.. నిరంతర విద్యుత్.. తాగునీరు.. వైద్య శిబిరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు.. మైనార్టీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రవాణా.. వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు

**రోడ్ సెక్టార్ పాలసీ-2047 లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు**

**అంతర్జాతీయ ప్రమాణాలతో రవాణా వ్యవస్థ.. ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్**

**జిల్లా కేంద్రాల్లో రింగ్ రోడ్ల నిర్మాణం.. ఆసుపత్రుల పనుల్లో వేగం**



**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

తెలంగాణ రాష్ట్ర రూపురేఖలను మార్చే విధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా.. వైద్య రంగాల్లో భారీ మార్పులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'రోడ్ సెక్టార్ పాలసీ-2047' లక్ష్యంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో రవాణా వ్యవస్థను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరం నుండి రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా నిర్ణీత సమయంలో చేరుకునేలా రోడ్ల నెట్ వర్క్ ను అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు.

## ట్రాఫిక్ రహిత నగరం

హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ఏర్పడుతున్న ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి కల్పించడానికి కనెక్టివిటీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లో పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటికీ ఒక రింగ్ రోడ్డు నిర్మించి.. వాటిని జాతీయ రహదారులతో అనుసంధానించాలని పేర్కొన్నారు. దీనివల్ల జిల్లాల ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని ఆకాంక్షించారు. రోడ్ల అభివృద్ధి పనుల్లో భూసేకరణ వంటి అడ్డంకులు కలగకుండా జీహెచ్ ఎంసీ.. రెవెన్యూ విభాగాల మధ్య పూర్తి సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు.

## అత్యాధునిక వైద్యం.. అందరికీ అందుబాటులో

పేద ప్రజలకు అత్యాధునిక వైద్యం చేరువ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న అన్ని టీచింగ్ హాస్పిటల్స్.. పెద్ద ఆసుపత్రుల పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి.. పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. హాస్పిటల్స్ భవనాల నిర్మాణం వేగంగా పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వెలుగుమట్లలో అద్భుతమైన మోడల్ కాలనీ

- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పాలు పొంగించాలి
- వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు కేటాయింపు

## డిసెంబర్ 9న గృహప్రవేశాలు

**ఖమ్మం, మార్చి 11 (మనసులో మాట):**

తెలంగాణలో ప్రతి పేదవానికి ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అర్హులైన 412 మందికి బుధవారం ఆయన ఇళ్ల పట్టాలు.. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పత్రాలు పంపిణీ చేశారు. మంత్రులు పొంగులేటి.. తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. వెలుగుమట్లలో దేశం గర్వించేలా ఒక మోడల్ కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు.



## డిసెంబర్ 9 నాటికి నిర్మాణాలు పూర్తి

మోడల్ కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని డిసెంబర్ 9 కల్లా పూర్తి చేయాలని అధికారులను భట్టి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అదే రోజు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తామని తెలిపారు. ఇక్కడ పేదలకు ఇళ్ల పట్టాలతో పాటు నీరు.. విద్యుత్.. రోడ్లు.. ఆసుపత్రి.. కమ్యూనిటీ హాల్ వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మిగిలిన 16 ఎకరాల భూమిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్.. ఇతర ప్రభుత్వ విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## గత ప్రభుత్వంపై విమర్శలు

పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ వెలుగుమట్ల పేదలకు కనీస సౌకర్యాలు కల్పించకుండా మోసం చేసిందని భట్టి విమర్శించారు. నిస్సహాయులైన పేదల నుండి కొందరు మాఫియా శక్తులు లక్షల రూపాయలు వసూలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా పంపిణీ చేయకుండా ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 4.5 లక్షల ఇళ్ల కోసం 22,500 కోట్లు కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

## మంత్రుల స్పందన

వెలుగుమట్లలో దశాబ్దాల కష్టాలకు ముగింపు పలికామని మంత్రులు పొంగులేటి.. తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. కోర్టు సమస్యల వల్ల గతంలో ఇక్కడ అభివృద్ధి చేయలేకపోయామని.. ఇప్పుడు న్యాయబద్ధంగా అర్హులను గుర్తించి పట్టాలు ఇచ్చామని తెలిపారు. 311 మందికి ఇళ్ల స్థలాలు.. సొంత స్థలం ఉన్న 101 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. పేదలు ఆత్మగౌరవంతో బతికేలా మోడల్ కాలనీలో అన్ని వసతులు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం కంటే ముందే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



# మార్చి నుండే రైతు భరోసా నిధుల జమ

**రెండు విడతల్లో 9 వేల కోట్లు: మంత్రి వివేక్**

**సన్న వడ్లకు బోనస్.. ఏప్రిల్ లో రెండో విడత**

**చెన్నూరు, మార్చి 11 (మనసులో మాట):**

తెలంగాణ రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. మార్చి నెల నుండే రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. మొత్తం 9 వేల కోట్ల రూపాయలను రెండు విడతల్లో పంపిణీ చేస్తామని వెల్లడించారు. మార్చి నెలాఖరులోగా 4,500 కోట్లు.. మిగిలిన నిధులను ఏప్రిల్ లో జమ చేస్తామన్నారు. సన్న వడ్లు పండించే 90 శాతం రైతులకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. చెన్నూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఆయన.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కమిషన్ల కోసమే ప్రాణహిత ప్రాజెక్టును పక్కనపెట్టి కాళేశ్వరాన్ని తెచ్చిందని విమర్శించారు. ఐకేపీ.. డీసీఎంఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి

**ఇది రాజ్యాంగ విలువల ఉల్లంఘన**

**కడియం.. దానంలకు క్లీన్ చిట్ ఇవ్వడంపై కేటీఆర్ ఆగ్రహం**

**కాంగ్రెస్ బీ ఫామ్ పై పోటీ చేసిన వ్యక్తికి క్లీన్ చిట్ ఎలా ఇస్తారు?**

**ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక చీకటి రోజు**

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):



పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్.. కడియం హరికి శాసనసభాపతి ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యంపై బహిరంగ దాడి అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ స్పీకర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు అని అభివర్ణించారు. ఇది కేవలం ఒక తీర్పు మాత్రమే కాదని.. అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేయడమేనని ఆరోపించారు.

### ప్రజల తీర్పును అవమానించడమే

కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ మీద ఎంపీగా పోటీ చేసిన వ్యక్తికే క్లీన్ చిట్ ఇవ్వడం అంటే ప్రజల తీర్పును అవమానించడమేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల ఓట్లతో గెలిచిన పదవులను స్వార్థ లాభాల కోసం మార్చుకుంటే.. దానికి స్పీకర్ ఆమోదముద్ర వేస్తే ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని ప్రశ్నించారు. ఇటువంటి నిర్ణయాలు వ్యవస్థలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు

తెలంగాణ ప్రజలు అన్నీ గమనిస్తున్నారని.. సరైన సమయంలో తగిన సమాధానం చెబుతారని కేటీఆర్ హెచ్చరించారు. అధికార బలాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగ వ్యవస్థలను తమకు అనుకూలంగా వాడుకోవడం ప్రజాస్వామ్యానికి చేటని విమర్శించారు. తెలంగాణ రాజకీయాల్లో ఇదొక దురదృష్టకర పరిణామమని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రంలో నడుస్తోంది అంబేడ్కర్ రాజ్యాంగం కాదు.. కాంగ్రెస్ రాజ్యాంగం

**స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**కాంగ్రెస్ ద్వంద్వ నీతికి ఈ నిర్ణయమే నిదర్శనం**

**తెలంగాణను ఏటీఎంలా వాడుకుంటున్న హస్తం పార్టీ**



హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్.. కడియం హరి అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ నేత.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. స్పీకర్ తీర్పు ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు వంటిదని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం అంబేడ్కర్ రాజ్యాంగం కాకుండా.. కాంగ్రెస్ రాజ్యాంగం నడుస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ద్వంద్వ నీతికి ఈ తీర్పు ఒక నిదర్శనమని వ్యాఖ్యానించారు.

### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

ప్రజల తీర్పును కాలరాస్తూ కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ టికెట్ మీద ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్.. తన కుమార్తెను కాంగ్రెస్ ఎంపీగా పోటీ చేయించి.. పార్టీ కండువా కప్పుకుని మరీ చేతి గుర్తుకు ఓటేయమని అడిగిన కడియం హరిలకు క్లీన్ చిట్ ఇవ్వడం కాంగ్రెస్ మార్క్ రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. నిత్యం చేతిలో రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ.. తెలంగాణలో ఆరు గ్యారంటీలనే కాకుండా రాజ్యాంగాన్ని కూడా గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు.

### తెలంగాణ ఒక ఏటీఎంలా మారింది

తెలంగాణ నిధుల దోపిడీకి ఇక్కడ అధికారాన్ని అడ్డుపెట్టుకుంటున్నారని.. దీనికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఒక ఏటీఎంలా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి నిర్ణయాలకు భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# కలెక్టర్ నిర్ణయంతో రోడ్డున పడ్డ దళిత కుటుంబం

**జనగామ కలెక్టరేట్ ఎదుట టీస్టాల్ తొలగింపు**

**అధికారుల తీరుపై సీపీఎం నాయకుల నిరసన**

**నిరుపేద మహిళా శక్తి పథకం దుకాణంపై వేటు**

జనగామ, మార్చి 11 (మనసులో మాట):

జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తీసుకున్న నిర్ణయంతో ఒక నిరుపేద దళిత కుటుంబం రోడ్డున పడింది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మంజూరైన వనిత టీ స్టాల్.. మిల్క్ పార్లర్ ను జిల్లా కలెక్టరేట్ ఎదురుగా గతంలో ఉన్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రారంభించారు. అయితే దీనిని వెంటనే తొలగించాలంటూ ప్రస్తుత కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని టీస్టాల్ ను తొలగించారు.

### సీపీఎం నిరసన

టీస్టాల్ ను తొలగిస్తున్న క్రమంలో సీపీఎం నాయకులు అధికారులను తీవ్రంగా అడ్డుకున్నారు. నిరుపేద మహిళల జీవనోపాధిని దెబ్బతీయడం సరికాదని నినాదాలు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన పథకంలో భాగంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాన్ని.. నిబంధనల పేరుతో తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు పోలీసుల సహకారంతో టీస్టాల్ ను అక్కడి నుండి తరలించారు. ఒక కలెక్టర్ ప్రారంభించిన దుకాణాన్ని మరొక కలెక్టర్ తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం కోరుతోంది.

# ఆ ఇద్దరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే..

- తేల్చిచెప్పిన స్పీకర్
- కడియం.. దానంలకు క్లీన్ చిట్
- పార్టీ మారినట్లు ఆధారాల్లేవని పిటిషన్లు కొట్టివేత
- నేడు సుప్రీం కోర్టులో విచారణ.. సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):

శాసనసభ్యులు దానం నాగేందర్.. కడియం హరిలకు పెద్ద ఊరట లభించింది. పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపుల కేసులో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. వీరిద్దరూ పార్టీ మారినట్లు సరైన ఆధారాలు లేవని.. అందుకే వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. దానం నాగేందర్.. కడియం హరి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా వారిద్దరినీ బీఆర్ఎస్ ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్లు స్పీకర్ స్పష్టం చేశారు.



### టెక్నికల్ గా రుజువు కాలేదు

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుండి దానం నాగేందర్.. స్టేషన్ ఘన్ పూర్ నుండి కడియం హరి బీఆర్ఎస్ ఎస్ తరపున గెలిచారు. ఆ తర్వాత వారు కాంగ్రెస్ లో చేరినట్లు ఆరోపణలు రావడంతో బీఆర్ఎస్ ఎస్.. బీజేపీ నేతలు స్పీకర్ కు పిటిషన్లు ఇచ్చారు. అయితే తాజా విచారణలో తాము ఇప్పటికీ బీఆర్ఎస్ ఎస్ లోనే ఉన్నామని ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు వాంగ్మూలం ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న స్పీకర్.. టెక్నికల్ గా వారు పార్టీ మారినట్లు నిరూపితం కాలేదని పేర్కొంటూ పిటిషన్లను డిస్మిస్ చేశారు. ఇప్పటికే ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్.. తాజాగా ఈ ఇద్దరికీ ఊరటనిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### నేడు సుప్రీం కోర్టులో తుది విచారణ

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశంపై గురువారం సుప్రీం కోర్టులో కీలక విచారణ జరగనుంది. కేసు మళ్లీ విచారణకు వచ్చేలోపు స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించాలని అత్యున్నత న్యాయస్థానం గతంలోనే సూచించింది. ఈ నేపథ్యంలో పదిమంది ఎమ్మెల్యేల వ్యవహారంపై స్పీకర్ తన తుది తీర్పును వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని కడియం హరి.. దానం నాగేందర్ స్వాగతించారు. కాగా.. స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో సుప్రీం కోర్టులో గురువారం జరగబోయే విచారణలో ఏం జరుగుతుందన్న ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# నేను బీఆర్ఎస్ వీడలేదు.. కాంగ్రెస్‌లో చేరలేదు

**స్పీకర్ తీర్పును స్వాగతించిన ఎమ్మెల్యే దానం నాగేందర్**

**కేసీఆర్ అంటే ఇప్పటికీ ఎంతో గౌరవం ఉంది**

**నాపై ఫిర్యాదు చేసే అధికారం కౌశిక్ రెడ్డికి ఎక్కడిది?**

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):



తాను బీఆర్ఎస్ పార్టీని వీడలేదని.. కాంగ్రెస్ లో చేరలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టం చేశారు. అనర్హత పిటిషన్ల విషయంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. బుధవారం స్పీకర్ తీర్పు వెలువరించిన అనంతరం దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. తనకు బీఆర్ఎస్ నుండి ఎన్నడూ నోటీసులు రాలేదని.. విప్ కూడా జారీ చేయలేదని గుర్తు చేశారు. స్పీకర్ పరిధిలో తాను ఎక్కడా పొరపాటు చేయలేదని.. రాజ్యాంగబద్ధంగానే అంతా జరిగిందని వివరించారు.

### కేసీఆర్ కు జవాబుదారీగా ఉంటా

తనకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అంటే ఇప్పటికీ గౌరవం ఉందని.. క్రమశిక్షణ పరంగా ఏవైనా చర్యలు తీసుకోవాలంటే ఆయనకే ఆ అధికారం ఉందని దానం నాగేందర్ స్పష్టం చేశారు. పాడి కౌశిక్ రెడ్డికి తనపై ఫిర్యాదు చేసే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. తనపై కొందరు వ్యక్తిగత కక్షతోనే ఫిర్యాదులు చేశారని విమర్శించారు. ఒకవేళ ఉపఎన్నికలకు వెళ్లాల్సి వచ్చినా తాను సిద్ధమేనని.. పాదయాత్ర చేసి మళ్లీ గెలిచి చూపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. స్పీకర్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని తెలిపారు.

### హైదరాబాద్ అభివృద్ధి కోసమే సీఎం తో కలయిక

హైదరాబాద్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి పనిచేస్తున్నానని.. అంతమాత్రాన పార్టీ మారినట్లు కాదని దానం పేర్కొన్నారు. ఎంపీగా పోటీ చేయడం తన వ్యక్తిగత ఆకాంక్ష అని.. అందుకోసం ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా తాను ఏ రోజూ పనిచేయలేదని స్పష్టం చేశారు. రాజీనామా చేయకుండానే ఎంపీగా పోటీ చేశానని.. తనకు ఎప్పటికైనా ఎంపీ అవ్వాలనే కోరిక ఉండేదని వెల్లడించారు.

# నైతిక విలువలు నా ఒక్కడికేనా.. కేసీఆర్ పాటించారా?

**స్పీకర్ తీర్పును స్వాగతించిన ఎమ్మెల్యే కడియం హరి**

**కేసీఆర్ క్షమాపణ చెబితే రాజీనామాకు సిద్ధం**

**ప్రైవేట్ యూనివర్సిటీలకు వ్యతిరేకమే.. త్వరలో అన్నీ బయటపెడతా**

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):



అనర్హత పిటిషన్‌పై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును ఎమ్మెల్యే కడియం హరి స్వాగతించారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం తాను బీఆర్ఎస్ లోనే ఉన్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ తో తనకు సిద్ధాంతపరమైన విభేదాలు ఉన్నాయని.. బీఆర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లినా ఎదుర్కోవడానికి.. ప్రజాక్షేత్రంలో తేల్చుకోవడానికి సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు.

### నైతికతపై కేసీఆర్ కు సవాల్

గతంలో కేసీఆర్ హయాంలో జరిగిన ఫిరాయింపులపై కడియం హరి తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ.. నైతిక విలువలు తనకు మాత్రమే వర్తిస్తాయా? కేసీఆర్ కు వర్తించవా? అని ప్రశ్నించారు. టీడీపీ శాసనసభా పక్షం బీఆర్ఎస్ లో విలీనం కాకముందే తలసాని నివాస్ యాదవ్ ను మంత్రిని చేయడం నైతికమా అని నిలదీశారు. గతంలో జరిగిన తప్పులకు కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని.. ఆయన క్షమాపణ చెబితే తాను ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని సవాల్ విసిరారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను కేసీఆర్ గతంలో మంత్రులుగా చేయలేదా అని ఆయన దుయ్యబట్టారు.

### వరంగల్ విభజనపై ఆరోపణలు

రాజకీయంగా తనను ఎదగకుండా చేయడానికే కేసీఆర్ వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేశారని కడియం హరి ఆరోపించారు. ఎంతో చరిత్ర ఉన్న వరంగల్ ను విభజించడాన్ని తాను అప్పట్లోనే తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. మల్లారెడ్డి.. పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రైవేట్ యూనివర్సిటీలు ఇవ్వడానికే తన స్థానంలో సబితా ఇంద్రా రెడ్డిని విద్యాశాఖ మంత్రిని చేశారని విమర్శించారు. ప్రైవేట్ యూనివర్సిటీలకు తాను వ్యతిరేకమని.. త్వరలోనే అన్ని వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు.

# స్పీకర్ తీర్పుపై హైకోర్టుకు వెళ్తాం

**శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది: బండి సంజయ్**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా ఉండి కాంగ్రెస్ ఎంపీలుగా పోటీ చేసినా అనర్హత లేదా?**

**కడియం శ్రీహరి.. దానం నాగేందర్ లకు క్లీన్ చిట్ ఇవ్వడం సిగ్గుచేటు**

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):

కడియం శ్రీహరి.. దానం నాగేందర్ లపై అనర్హత పిటిషన్లను స్పీకర్ గడ్డం ప్రసాద్ కొట్టివేయడం దారుణమని కేంద్రమంత్రి.. బీజేపీ నేత బండి సంజయ్ మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. కన్నతల్లే బిడ్డను చంపడం ఎంత పాపమో.. శాసన వ్యవస్థే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం అంతకంటే పెద్ద పాపమని అభివర్ణించారు. శాసన వ్యవస్థే ఫిరాయింపులను



ప్రోత్సహించేలా స్పీకర్ తీర్పు ఇచ్చారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్ తీర్పుపై తాము హైకోర్టుకు వెళ్తామని.. న్యాయ వ్యవస్థపై తమకు సంపూర్ణ నమ్మకం ఉందని స్పష్టం చేశారు.

### ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు

బీఆర్ఎస్ నుండి ఎమ్మెల్యేలుగా గెలిచి.. కాంగ్రెస్ టికెట్ పై ఎంపీలుగా పోటీ చేసినప్పటికీ అనర్హత వేటు వేయకపోవడం సిగ్గుచేటు అని బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుని ప్రచారం చేసినా పార్టీ ఫిరాయించలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాంధీ భవన్ లో సంసారం చేస్తూ.. కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నా ఫిరాయింపులు వర్తించకపోవడం ప్రజాస్వామ్యానికే చేటని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.

### తాబేదారులా వ్యవహరించవద్దు

రాజ్యాంగ వ్యవస్థలను కాంగ్రెస్ కార్యాలయంలో బంధించాలని చూస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించాలే తప్ప.. గాంధీ కుటుంబానికి తాబేదారులా ఉండకూడదని సూచించారు. గాడి తప్పిన శాసన వ్యవస్థను దారిలో పెట్టాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. గతంలో బెంగాల్ లో ఇటువంటి తీర్పును కోర్టు కొట్టివేసిన విషయాన్ని గుర్తు చేస్తూ.. తెలంగాణలోనూ న్యాయ వ్యవస్థ చెంప చెళ్లుమనేలా తీర్పు ఇస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ను బంగాళాఖాతంలో విసిరేస్తే తప్ప తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేమని స్పష్టం చేశారు.

# విరిగిన విమానం ల్యాండింగ్ గేర్..

**రన్‌వేపై థాయ్ విమానానికి తప్పిన ముప్పు**

**హైదరాబాద్ నుండి పుకెట్ బయలుదేరిన ఏయిరిండియా విమానం**

**133 మంది ప్రయాణికులు క్షేమం**

**నోస్ వీల్ ఊడిపోవడంతో రన్ వే పక్కకు జారిన విమానం**

హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):

సాంకేతిక సమస్యలు.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా తరచూ విమాన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల మహారాష్ట్రలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తో సహా ఐదుగురు మృతి చెందిన ఘటన మరువక ముందే.. తాజాగా హైదరాబాద్ నుండి బయలుదేరిన విమానానికి పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుండి థాయ్ లాండ్ బయలుదేరిన ఏయిరిండియా బోయింగ్ 737 విమానం బుధవారం పుకెట్ ఏయిర్ పోర్టులో ల్యాండ్ అయిన వెంటనే సాంకేతిక లోపం తలెత్తింది.

### రన్ వే పక్కకు జారిన విమానం

ల్యాండింగ్ సమయంలో విమానం ముందు భాగంలోని నోస్ వీల్ (ఫ్రంట్ ల్యాండింగ్ గేర్) ఒక్కసారిగా ఊడిపోయింది. దీంతో విమానం నియంత్రణ కోల్పోయి రన్ వే నుండి పక్కకు జారింది. అదే సమయంలో వెనుక టైర్ కూడా పేలిపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో విమానం తక్కువ వేగంతో ఉండటంతో పెద్ద ముప్పు తప్పిందని అధికారులు తెలిపారు. విమానంలో ఉన్న 133 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నట్లు ఏయిర్ పోర్టు అధికారులు వెల్లడించారు.

# మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలి

- సరూర్ నగర్ లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న మల్ రెడ్డి రామిరెడ్డి.. ముద్దగౌని లక్ష్మీప్రసన్న
- మహిళా సాధికారతే లక్ష్యం కావాలని పిలుపు



**ఎల్బీనగర్, మార్చి 11 (మనసులో మాట):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సరూర్ నగర్ లోని గౌడ సంక్షేమ సంఘం భవనంలో వేడుకలు ఘనంగా జరిగాయి. లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి.. బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు

ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మహిళలకు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు కేవలం గృహిణులుగానే పరిమితం కాకుండా.. విద్య.. ఉద్యోగ.. వ్యాపార.. రాజకీయ రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని.. వారు అన్ని రంగాల్లో ఎదిగినప్పుడే దేశం పురోగమిస్తుందని పేర్కొన్నారు. మహిళల రక్షణ.. సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

### ఘనంగా సన్మానం

ఈ వేడుకల్లో భాగంగా పలువురు మహిళా పోలీస్ సిబ్బంది.. మున్సిపల్ సిబ్బందిని అతిథులు ఘనంగా సన్మానించారు. స్థానిక మహిళలు.. కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా శక్తిని చాటేలా జరిగిన ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.



# తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా ప్రమాణం

**తెలుగులో ప్రమాణం చేసిన నూతన గవర్నర్**

**హాజరైన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు**

**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌భవన్ లో జరిగిన వేడుకలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. గవర్నర్ తెలుగులో ప్రమాణం చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి.. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. మంత్రులు హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన శివప్రతాప్ శుక్లాకు 73 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉంది. ఏబీవీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన.. యూపీలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా.. కేబినెట్ మంత్రిగా పనిచేశారు. గతంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా.. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం గవర్నర్ కు సీఎం రేవంత్ రెడ్డి.. ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

# గుండెపోటుతో బీజేపీ సీనియర్ నాయకుడు సాంబయ్య మృతి

**పార్థివ దేహానికి నివాళులర్పించిన జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ గౌడ్**

**అంతిమ యాత్రలో పాల్గొని పాడె మోసిన నాయకులు**

**జూలపల్లి మండల కేంద్రంలో విషాద ఛాయలు**

**జూలపల్లి, మార్చి 11 (మనసులో మాట):**



జూలపల్లి మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకుడు కోడూరి సాంబయ్య గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల బీజేపీ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు అమర్ గాని ప్రదీప్ కుమార్ గౌడ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సాంబయ్య పార్థివ దేహానికి బీజేపీ జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రదీప్ కుమార్ గౌడ్.. సాంబయ్య పాడె మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెంట లచ్చన్న.. బీజేపీ వార్డు సభ్యుడు.. పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేరుగు రమేష్.. మాజీ ఎంపీటీసీ.. మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు వేముల రాజమౌళి పాల్గొన్నారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు గుడిపాటి సంతోష్ రెడ్డి.. పెద్దల్ల ఐలయ్య.. దేవసాని శ్రీనివాస్.. కోడూరి రాజేశ్వర్.. దాడి రవీందర్.. దొడ్ల రాజయ్య.. మేరుగు కనకయ్య.. లెక్కల వజ్రారెడ్డి.. బెజ్జంకి రమేష్.. కంచి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.




# నిరుపేద బాలిక చదువుకు శివసాయి కంపెనీ ఆర్థిక చేయూత

**పదివేల రూపాయల ఎఫ్ డీ బాండ్ అందజేత**

**మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ మొలంగురి కమల్**

**పెద్దపల్లి, మార్చి 11 (మనసులో మాట):**

పెద్దపల్లికి చెందిన జ్యోతి అనే నిరుపేద బాలిక చదువు కోసం శివసాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ పదివేల రూపాయల విరాళం అందించింది. కంపెనీ ఎం డీ ఆదేశాల మేరకు.. సీనియర్ డైరెక్టర్ నాగుల కమల ఆధ్వర్యంలో.. షేర్ హోల్డర్ నాగుల శ్రీధర్ నిర్వహణలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీకొండ రాజేశ్వరి కుమార్తె జుట్టు జ్యోతి పేరు మీద పదివేల రూపాయల ఎఫ్ డీ (ఫిక్స్డ్ డిపాజిట్) బాండ్ ను అందజేశారు. ఈ వేడుకల్లో మహిళలందరూ కలిసి కేక్ కట్ చేసి సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా 3వ వార్డు కౌన్సిలర్ మొలంగురి కమల్.. మాజీ కౌన్సిలర్ తాడూరి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. వచ్చిన అతిథులను నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. నిరుపేదల చదువుకు అండగా నిలుస్తున్న శివసాయి సొసైటీ ఎం డీ కి మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపల్లి బ్రాంచ్ మేనేజర్ దూడం కళ్యాణి.. ఆఫీస్ స్టాఫ్ గెల్లు శ్రీలత.. పెరుక రోజరాణి.. ఉద్యోగులు లక్ష్మినారాయణ.. సాయిప్రియ.. సరిత.. సుగుణ.. స్రవంతి.. హారతి.. సంధ్య.. లక్ష్మి.. వాణి.. రాజేశ్వరి.. అంజమ్మ.. నాగరాజు.. లావణ్య.. సంజన పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కృషితో తీరిన దశాబ్దాల బస్సు కష్టాలు

**మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవల ప్రారంభం**

**ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు గ్రామస్తుల కృతజ్ఞతలు**

**బస్సుకు ఘనంగా పూజలు చేసిన ప్రజలు**




**మద్నూర్, మార్చి 11 (మనసులో మాట):**

జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు ప్రత్యేక చొరవతో డోంగ్లి మండలంలోని మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. సిర్పూర్.. పెద్ద టాక్లి.. చిన్న టాక్లి గ్రామాలకు బుధవారం నుండి బస్సు సేవలు ప్రారంభమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల సాకారమైందని.. ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇప్పుడు తమ గ్రామం నుండే వినియోగించుకోవచ్చని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. పెద్ద టాక్లి సర్పంచ్ కుమారుడు గైక్వాడ్ విలాస్ బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. బోధన్ డిపో ఆర్టీసీ అధికారులు.. డ్రైవర్.. కండక్టర్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు శ్రీనివాస్.. విట్టల్ రావును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు.. గ్రామ పెద్దలు.. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి చేరాలి

- మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ
- వంద మంది విద్యార్థులకు అండగా నిలిచిన కోమల్ల జలందర్
- మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్ష



**గొల్లపెల్లి, మార్చి 11 (మనసులో మాట):**

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు బుధవారం కోమల్ల జలందర్ పరీక్ష ప్యాడ్లు.. పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జలందర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకుని నిరంతరం కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.

### ప్రతిభను చాటాలి

రాబోయే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడి లేకుండా రాణించాలని.. పట్టుదలతో చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని జలందర్ పేర్కొన్నారు. విద్యాపరమైన సాయం అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుంకరి రవి.. జీ స్కిల్స్ యజమాని ముంజంపల్లి రమేష్.. సంగెం కళ్యాణ్ కుమార్.. ఐతరవేని మధు.. ఐతరవేని వెంకటేష్.. కత్తెర్ల హరీష్.. ఓర్సు శేషి.. ఉపాధ్యాయులు.. పాల్గొన్నారు.

# విత‌ంతు.. ఆసరా పింఛన్లను 4016 రూపాయలకు పెంచాలి

**కొత్త పింఛన్ల మంజూరులో జాప్యంపై బీసీ సంక్షేమ సంఘం ఆందోళన**

**జగిత్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత**

**ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని డిమాండ్**



**గొల్లపెల్లి, మార్చి 11 (మనసులో మాట):**

రాష్ట్రంలో వితంతు.. ఆసరా పింఛన్ల మొత్తాన్ని 4016 రూపాయలకు పెంచాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం అభినందనీయమని.. అయితే భర్తను కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వితంతువుల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వారు పేర్కొన్నారు.

### పింఛన్ల మంజూరులో జాప్యం వద్దు

కొత్త వితంతు పింఛన్ల మంజూరులో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు వివరించారు. గత ఐదేళ్లుగా పెండింగ్ లో ఉన్న వితంతు పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని.. ప్రస్తుతమున్న పింఛన్ మొత్తాన్ని 4016 రూపాయలకు పెంచి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

# గ్యాస్ సంక్షోభం.. హైదరాబాద్ హాస్టళ్లలో తిండి తిప్పలు

**మధ్య ప్రాచ్య యుద్ధ ప్రభావం.. నిలిచిన కమర్షియల్ గ్యాస్ సరఫరా**

**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట):**

మిడిల్ ఈస్ట్ లో యుద్ధ ప్రభావం హైదరాబాద్ లోని హాస్టళ్లపై పడింది. ఇరాన్.. ఇజ్రాయెల్ ఉద్రిక్తతల కారణంగా ఏర్పడిన గ్యాస్ సంక్షోభం ఐటీ కారిడార్ లోని హాస్టళ్లను ఇబ్బందుల్లోకి నెట్టింది. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో హాస్టల్ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల హాస్టళ్లలో వడ్డించే ఆహార పదార్థాల సంఖ్యను తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### మెనూలో మార్పులు

ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో దాదాపు 11 వేల హాస్టల్స్ ఉన్నాయని.. వీటిలో లక్షలాది మంది నివసిస్తున్నారని హాస్టల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. విద్య.. వైద్య రంగాలకు చెందిన హాస్టళ్లకు గ్యాస్ సరఫరా జరుగుతున్నా.. సాధారణ హాస్టళ్లకు మాత్రం సరఫరా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత కారణంగా ఎక్కువ ఇంధనం ఖర్చయ్యే చపాతీ.. దోశ వంటి ఆహార పదార్థాలను మెనూ నుండి తగ్గిస్తున్నట్లు యాజమాన్యాలు వెల్లడించాయి.

### అధికారుల స్పందన కరువు

కమర్షియల్ గ్యాస్ ఇవ్వలేని పక్షంలో రోజుకు కనీసం ఒక డొమెస్టిక్ సిలిండర్ అయినా కేటాయించాలని అధికారులను కోరుతున్నట్లు ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులతో మాట్లాడినా సరైన స్పందన రావడం లేదని వారు ఆరోపించారు. ప్రస్తుతానికి ఆహార పదార్థాలను తగ్గించి పరిస్థితిని నెట్టుకొస్తున్నామని.. హాస్టల్స్ మూసేసే పరిస్థితి రాకుండా చూడాలని కోరుతున్నారు.

# ఘట్కేసర్ హైవే డివైడర్ పై గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

**గాంధీ ఆసుపత్రి మార్చురీకి మృతదేహం తరలింపు**



**ఘట్కేసర్, మార్చి 11 (మనసులో మాట):**

ఘట్కేసర్ మైసమ్మ గుట్ట దగ్గర వందన హోటల్ ఎదురుగా ఉన్న వరంగల్ హైవే డివైడర్ పై గుర్తు తెలియని మగ వ్యక్తి శవం లభ్యమైంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా.. సుమారు 25 ఏళ్ల వయసున్న వ్యక్తి ఎటువంటి దుస్తులు లేకుండా పడి ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల కథనం ప్రకారం మృతుడి గురించి చుట్టుపక్కల .. విచారించగా.. అతను గత మూడు రోజులుగా పరిసరాల్లో బట్టలు లేకుండా రాత్రి సమయాల్లో తిరుగుతున్నాడని తెలిసింది. స్థానికులు అతనికి ఆహారం.. బట్టలు ఇచ్చినప్పటికీ తీసుకోలేదని.. వివరాలు అడిగినా ఏమీ చెప్పలేదని పోలీసులకు వివరించారు. మృతుడు సుమారు ఐదు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తు.. చామనఛాయ రంగు కలిగి ఉన్నాడు. శరీరంపై పాత చిన్న చిన్న గాయాలు ఉన్నాయి. హెచ్ పీ పెట్రోల్ బంక్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే వెంటనే ఘట్కేసర్ పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# తల్లి.. బిడ్డల ఆరోగ్యం మాకు ఎంతో ముఖ్యం

**ఇబ్రహీంపట్నంలో మదర్ ఫీడింగ్ సెంటర్ ప్రారంభం**

**ఇది ప్రజల కోసం చూపే పరిపూర్ణ ప్రేమకు చిహ్నం: ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి**

**మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బస్టాండులో ఏర్పాటు**



**రంగారెడ్డి జిల్లా, మార్చి 11 (మనసులో మాట)**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం బస్టాండు ప్రాంగణంలో మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ సెంటర్ ను ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. మహిళా సంక్షేమ శాఖ అధికారులతో కలిసి ఆయన ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక కేంద్రం మాత్రమే కాదని.. ప్రజల కోసం తాము చూపే పరిపూర్ణ సేవా ప్రేమకు చిహ్నం అని పేర్కొన్నారు. తల్లి.. బిడ్డల ఆరోగ్యం సమాజానికి ఎంతో ముఖ్యమని.. వారికి అవసరమైన ప్రతి సౌకర్యాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు.



బస్టాండుకు వచ్చే తల్లులు.. చిన్నపిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కేంద్రం ఏర్పాటు చేయడం అనివార్యమని చెప్పారు. ప్రజలకు అవసరమైన ప్రతి సదుపాయం కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. మహిళా సంక్షేమమే లక్ష్యంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు.

# మత సామరస్యమే దేశానికి బలం

**కుల మతాల మధ్య చిచ్చు పెట్టే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలి: కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి**



**జల్పల్లి, మార్చి 11 (మనసులో మాట):**

భారతదేశ ప్రజల బలం సెక్యులర్ భావజాలమేనని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. జల్పల్లి డివిజన్ లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జహంగీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశంలో.. రాష్ట్రంలో కొన్ని విచ్ఛిన్నకర శక్తులు.. పార్టీలు కుల మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నాయని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుండి హిందూ ముస్లిం భాయి.. భాయి అనే నినాదం కొనసాగుతోందని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. ప్రజలందరూ సోదరభావంతో కలిసిమెలిసి పండుగలు జరుపుకోవాలని కోరారు. కులం.. మతం అనేవి వ్యక్తిగతమని.. సమాజంలో అందరూ సమానమని స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.ఈ నెల 17న జల్పల్లి.. పహాడీషరీఫ్.. షహీన్ నగర్ ముస్లిం సోదరుల కోసం ప్రత్యేకంగా ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు లక్ష్మారెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి.. కాంగ్రెస్ నాయకులు.. స్థానిక ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# నా ప్లాట్ నాకే కావాలి

**సంస్కృతి కాలేజీ ముందు బాధితుడి నిరసన**

- తొమ్మిదేళ్లుగా కాలయాపన చేస్తున్న యాజమాన్యం
- అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించుకున్నారని బాధితుడి ఆరోపణ
- అధికారులు స్పందించి న్యాయం చేయాలని డిమాండ్







**ఘట్కేసర్, మార్చి 11 (మనసులో మాట):**

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ లోని సంస్కృతి ఇంజనీరింగ్.. ఫార్మసీ కళాశాల తీరు వివాదాస్పదంగా మారింది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన విద్యాసంస్థ అక్రమ కబ్జాలకు పాల్పడుతోందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన ప్లాట్ ను కళాశాల యాజమాన్యం ఆక్రమించుకుందంటూ బాధితుడు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. స్వయంగా సర్వే నిర్వహించి.. కాలేజీ గేటు ముందే బైఠాయించి తన నిరసనను తెలియజేశాడు.

**ప్రహరీ గోడతో అక్రమ కబ్జా**

ఘట్కేసర్ కు చెందిన ప్రవీణ్.. రవిశంకర్.. ఉదయ్ అనే వ్యక్తులు 2017లో సర్వే నంబర్ 126/1 లో 248 గజాల ప్లాట్ కొనుగోలు చేశారు. అయితే ఆ భూమిని సంస్కృతి కళాశాల యాజమాన్యం ఆక్రమించి.. అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించుకుందని బాధితుడు ఆరోపిస్తున్నాడు. తన భూమి గురించి అడిగితే గత తొమ్మిదేళ్లుగా సెటిల్మెంట్ చేస్తామంటూ కాలేజీ యాజమాన్యం కాలయాపన చేస్తోందని వాపోయాడు.

**స్పందించని యాజమాన్యం**

ఇప్పుడు తీరా తన భూమి తనకు కావాలని అడిగితే అసలు స్పందనే లేకపోవడంతో బాధితుడు రోడ్డెక్కాడు. "నేను కష్టపడి కొనుక్కున్న ప్లాట్ ను విద్యాసంస్థ కబ్జా చేసింది.. అడిగితే తొమ్మిదేళ్లుగా రేపు మాపు అంటూ తిప్పుకుంటున్నారు" అని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు వెంటనే స్పందించి తన భూమిని తనకు అప్పగించాలని.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాడు. చట్ట ప్రకారం న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆపనని స్పష్టం చేశాడు.

# పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



- పెద్దగూడెం పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు
- క్రమశిక్షణ.. సంస్కారమే విద్యకు సార్థకత: హెచ్ ఎం దానయ్య
- విద్యార్థులకు క్రీడా దుస్తులు.. సామాగ్రి పంపిణీ

**భూదాన్ పోచంపల్లి, మార్చి 11 (మనసులో మాట):**

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని పెద్దగూడెం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే వై దానయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు తమ సీనియర్లకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ.. నిబద్ధత.. పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉన్నత చదువులతో తల్లిదండ్రులకు.. ఉపాధ్యాయులకు.. గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. చదువుతో పాటు సంస్కారం ఉన్నప్పుడే ఆ విద్యకు సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పదవ తరగతి చదువుతున్న వారికి క్రీడా దుస్తులు.. పెన్నులు.. స్కేల్స్.. ఇతర సామాగ్రిని బహుకరించారు. ఈ వేడుకలో గ్రామ పెద్దలు పక్కిరు నర్సిరెడ్డి.. సుధాకర్ రెడ్డి.. శ్రీనివాస్ రెడ్డి.. జమున.. సునీత.. ఉపాధ్యాయులు వెంకటరెడ్డి.. మణిపాల్ రెడ్డి.. లచ్చిమల్ల వెంకన్న.. సరిత కుమారి.. నాగార్జున రెడ్డి.. తండు శ్రీనివాస్.. మాస కల్పన పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలు తెలుసుకునేందుకే మీ ముందుకు వచ్చాం

**మంచాల మండలంలో ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి పర్యటన**

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన.. గ్రామ సభల్లో సమస్యల పరిష్కారం**

**నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.. కాంట్రాక్టర్లకు హెచ్చరిక**



**రంగారెడ్డి జిల్లా, మార్చి 11 (మనసులో మాట)**

ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని.. మీ కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకే మీ వద్దకు వచ్చామని ఇబ్రహీంపట్నం ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" లో భాగంగా మంచాల మండలంలోని లింగంపల్లి.. తాళ్లపల్లి గూడ.. చిత్తపూర్.. జాపాల్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు మంచాల గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని.. సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరించారు.

**పనుల్లో జాప్యం చేస్తే చర్యలు**

టెండర్లు తీసుకుని పనుల్లో ఆలస్యం చేయడం తగదని ఎంఎల్ఏ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. "పని చేయలేకపోతే తప్పుకోండి.. ప్రజలను ఇబ్బంది పెడితే ఊరుకోను" అని స్పష్టం చేశారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. యువత కోరిక మేరకు తక్షణమే స్టడీ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని.. ప్రతి ఇల్లూ.. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని కోరారు.

**ప్రజల వద్దకే పాలన**

అధికారులు కార్యాలయాల్లో కాకుండా క్షేత్రస్థాయిలో తిరిగినప్పుడే ప్రజల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం కొత్త పింఛన్లు వస్తాయని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు రేషన్ కార్డులు అందుతాయని.. గత ప్రభుత్వం పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుందే తప్ప పేదలకు ఏమీ చేయలేదని విమర్శించారు.

# గ్యాస్ బుకింగ్ పేరిట సైబర్ మోసాలు.. తస్మాత్ జాగ్రత్త!

**నకిలీ లింకులతో బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు**

**హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరిక**

**సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 కి కాల్ చేయాలి**




**హైదరాబాద్, మార్చి 11 (మనసులో మాట)**

వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రజలను అప్రమత్తం చేశారు. గ్యాస్ బుకింగ్ కోసం ఆన్లైన్ లో వెతికే వారిని లక్ష్యంగా చేసుకుని కొత్త తరహా మోసాలకు తెరతీశారని తెలిపారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ.. అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారని పేర్కొన్నారు.

**ఫేక్ వెబ్సైట్లతో మోసం**

వాట్సాప్.. ఎస్ఎంఎస్ ల ద్వారా నకిలీ వెబ్సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని సీపీ తెలిపారు. ఆన్లైన్ లో ముందుగా డబ్బులు చెల్లిస్తే అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని గ్రహించాలన్నారు. ఇటువంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని సూచించారు.

**అధికారిక వెబ్సైట్లనే వాడాలి**

సిలిండర్ బుకింగ్ లేదా ఆన్లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్సైట్లను.. అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలని సజ్జనార్ పేర్కొన్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు చూసి గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు.. ఓటీపీ.. యూపీఐ పిన్ వంటివి పంచుకోకూడదని హెచ్చరించారు. నకిలీ వెబ్సైట్లలో వివరాలు నమోదు చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే తక్షణమే 1930 నెంబర్ కు కాల్ చేయాలని లేదా అధికారిక పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు.





# 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- పారదర్శకంగా.. బాధ్యతతో పనిచేయాలని ప్రజాప్రతినిధులకు పిలుపు
- పెద్దపల్లిలో 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' శిక్షణ కార్యక్రమం

**పెద్దపల్లి, మార్చి 11 (మనసులో మాట):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు.. అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం రంగాపూర్ లోని రాధాకృష్ణ ఏసీ కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ కొనసాగుతుందని తెలిపారు. సర్పంచ్ నుండి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కారం.. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## సంక్షేమ పథకాలే ప్రాధాన్యత

రైతు రుణమాఫీ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం.. ఇందిరమ్మ ఇళ్లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ లో ఎస్ సీ.. ఎస్ టీ.. బీ సీ సంక్షేమ రంగానికి.. పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. 2027లో వచ్చే గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేయడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి నిధులు ఇస్తామని వెల్లడించారు.

## అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై అవగాహన పెంచుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని.. అభివృద్ధి పనుల్లో రోడ్లు.. డ్రైనేజీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి.. పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య.. సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ.. మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్.. సర్పంచులు.. అధికారులు పాల్గొన్నారు.

# చదువును మించిన ఆస్తి మరొకటి లేదు

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- గుల్లకోటలో 10 లక్షల వ్యయంతో కిచెన్ షెడ్ల ప్రారంభం
- విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం





**గొల్లపెల్లి, మార్చి 11 (మనసులో మాట):**

ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామంలోని మండల ప్రజా పరిషత్.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కిచెన్ షెడ్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.

## ఉపాధ్యాయులదే ప్రధాన బాధ్యత

సమాజంలో చదువును మించిన ఆస్తి లేదని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని ఎంతో మంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు.

## మౌలిక వసతుల కల్పన

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పాఠశాలల్లో జరుగుతున్న అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా గుల్లకోట గ్రామంలో రోడ్లు.. ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# ఆసుపత్రిలో డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు

**కొల్చారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య శిబిరం**

**215 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు**

**వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా అధికారి శ్రీరామ్**



**కొల్చారం, మార్చి 11 (మనసులో మాట):**

కొల్చారం ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వివిధ రకాల నిపుణులతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని.. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రోగులకు నాణ్యమైన వైద్యం

ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ శ్రేయ.. పిల్లల వైద్య నిపుణురాలు వైష్ణవి.. కంటి నిపుణురాలు రవళి.. ఆర్థోపెడిక్ వర్ష.. జనరల్ ఫిజీషియన్ రాఘవేందర్.. డెంటల్ సిబ్బంది రాజశేఖర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 215 మంది రోగులను పరీక్షించి.. వారికి అవసరమైన ల్యాబ్ పరీక్షలు చేశారు. తీవ్రమైన సమస్యలు ఉన్నవారిని మెదక్ జీ జీ హెచ్ కు రిఫర్ చేశారు. మండల కేంద్రం పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ శిబిరానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రమేష్.. ఎం పీ హెచ్ ఈ ఓ ఎస్ మదన్మోహన్.. సూపర్వైజర్లు మార్తా.. యేసుమని.. శాంతి కుమార్.. ఆసుపత్రి సిబ్బంది.. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకే స్వయంపాలన దినోత్సవం

**డీఈఓగా భానుప్రకాష్.. ఎంఈఓగా నరేష్ బాధ్యతలు**

**ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పిన చిన్నారులు**

**రాయలాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సందడి**

**రామాయంపేట, మార్చి 11 (మనసులో మాట):**

మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలాపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల పరిపాలన బాధ్యతలను చేపట్టి వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఐదో తరగతి విద్యార్థి జె భానుప్రకాష్ డీఈఓగా.. ఎస్ నరేష్ ఎంఈఓగా.. కుమారస్వామి కాంప్లెక్స్ హెచ్ ఎం గా.. టీ రాకేష్ హెడ్ మాస్టర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఇతర విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పాఠశాల నిర్వహణపై అవగాహన పెంచుకున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి వేడుకలు ఎంతో అవసరమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్వయంపాలన దినోత్సవం వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల సిబ్బంది తెలిపారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వర్తించిన విద్యార్థులను అభినందించి వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు విఠల్ దాస్.. ఉపాధ్యాయులు ఎస్ ప్రభాకర్.. బి రవి.. కె కనకరాజు.. ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు ఆర్ పూజ.. హేమలత పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి

**కట్ట మైసమ్మ ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ పనులు ప్రారంభం**

**70 వేల రూపాయల విరాళం అందించిన బాకం ఓం ప్రకాష్ దంపతులు**

**మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య చేతుల మీదుగా పనులు శ్రీకారం**



**పెద్దపల్లి, మార్చి 11 (మనసులో మాట):**

పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ చివరన ఉన్న కట్ట మైసమ్మ ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణానికి చెందిన బాకం ఓం ప్రకాష్.. సుమలత దంపతులు సుమారు 70 వేల రూపాయల వ్యయంతో ఈ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ కట్ట మైసమ్మ తల్లి ఆశీస్సులు బాకం ఓం ప్రకాష్.. సుమలత దంపతులకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయం చుట్టూ స్టీల్ రైలింగ్ ఏర్పాటు చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో.. ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దొడ్డుపల్లి జగదీష్.. మంతెన నర్సింగ్.. కమల్.. నల్లల సురేష్ పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్.. బొడ్డుపల్లి రామ్మూర్తి.. బాకం వర్షిని.. ఆలయ కమిటీ నిర్వాహకులు బొడ్డుపల్లి శ్రీనివాస్.. గందు రంగయ్య.. బొడ్డుపల్లి నవీన్.. బొడ్డుపల్లి అశోక్.. ముక్కెర రాజేశం.. బొడ్డుపల్లి సంపత్.. మోహన్.. ఎలా పోతారం మొగిలి.. మంద భాస్కర్ యాదవ్.. తిర్రి శ్రీనివాస్ గౌడ్.. తిరుపతి యాదవ్.. రాచమల్ల సతీష్.. అంజయ్య.. నరసయ్య.. గుడి కందుల మల్లయ్య పాల్గొన్నారు.

# రాజకీయాలకతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

**పైతరను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా: రవితేజ రెడ్డి**

**మహిళా సమైక్య భవనం.. ఇతర పనులకు ప్రాధాన్యత**

**తాగునీరు.. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా కృషి**

**కొల్చారం, మార్చి 11 (మనసులో మాట):**



రాజకీయాలకు అతీతంగా పైతర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవితేజ రెడ్డి తెలిపారు. గ్రామంలో మహిళా సమైక్య భవనంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ప్రజల భాగస్వామ్యంతో పూర్తి చేసి.. గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. వారి కష్టసుఖాల్లో తోడుంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రధానంగా తాగునీరు.. వీధి దీపాలు.. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రవితేజ రెడ్డి వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని వెల్లడించారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావులేకుండా.. అందరినీ కలుపుకుని గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు.

# చిన్నారులే మాస్టార్లు..

**రాంపూర్ యూపీఎస్ లో స్వయంపాలన దినోత్సవం**

**విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యాబోధన**

**తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి: హెచ్ ఎం రవీందర్ రెడ్డి**

**నాయకత్వ లక్షణాలను పెంపొందించిన వేడుక**



**కొల్చారం, మార్చి 11 (మనసులో మాట):**

కొల్చారం మండలం రాంపూర్ యూపీఎస్ పాఠశాలలో బుధవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు ఉన్న విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒక్కో విద్యార్థి ఒక్కో సబ్జెక్టుకు ఉపాధ్యాయునిగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుల వేషధారణలో వచ్చిన చిన్నారులు క్రమశిక్షణతో పాఠాలు బోధించడంతో పాఠశాల ప్రాంగణమంతా సందడిగా మారింది.

## కలలను నిజం చేయాలి

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. "తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేసేందుకు ప్రతి విద్యార్థి చదువుపై మక్కువ చూపాలి. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలి" అని సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను.. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాఠాలు చెప్పడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి.. ఉపాధ్యాయ బృందం.. గ్రామస్తులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



# సూర్య నమస్కారాలు చేస్తే ఇన్ని లాభాలా..

చాలా మంది ఉదయం వ్యాయామం కోసం జిమ్‌కి వెళ్ళతారు. అయితే, ఇంట్లో సూర్య నమస్కారం చేయడం వల్ల జిమ్‌కి వెళ్లడం కంటే ఎక్కువ ప్రయోజనాలు పొందవచ్చని మీకు తెలుసా? అంతేకాకుండా, సమయం కూడా ఆదా అవుతుంది అని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ సూర్య నమస్కారం చేయడం శారీరక, మానసిక ఆరోగ్యానికి అద్భుతమైన వ్యాయామంగా చెప్పవచ్చు. అయితే, ప్రతిరోజూ సూర్య నమస్కారం చేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

## బరువు తగ్గడం

నిపుణుల ప్రకారం, సూర్య నమస్కారాలను వేగంగా చేస్తే ఎక్కువ శక్తి అవసరం అవుతుంది. ఇది కేలరీలు బర్న్ చేయడంలో సహాయ పడుతుంది. జీవక్రియను మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా సూర్య నమస్కారం చేయ డం వల్ల అదనపు కొవ్వు తగ్గిపోతుంది.

## రక్త ప్రసరణ

ఈ ఆసనాలు శరీరమంతా రక్తప్రసరణను మెరుగుపరుస్తాయని నిపుణులు అంటున్నారు.



ఇది అవయవాల పనితీరును మెరుగుపరు-స్తుంది. మెరుగైన రక్తప్రసరణ, ఆక్సిజన్ ను పుష్కలంగా అందిస్తుంది, దీనివల్ల చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ముఖం మెరు-స్తుంది.

## రోగనిరోధక శక్తి

సూర్య నమస్కారాన్ని క్రమంగా చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది సాధారణ వ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కలిగిస్తుంది.

## మానసిక ప్రశాంతత

శ్వాస నియంత్రణ సూర్య నమస్కారంలో కీలకపాత్ర పోషిస్తుంది. నియంత్రిత శ్వాస మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా సూర్య నమస్కారం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని, అది ఏకాగ్రత, దృష్టిని మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది ఊపిరితిత్తుల పనితీరు, శ్వాసకోశ ఒత్తిడి, హృదయనాళ పరామితులను మెరుగుపరు-స్తుంది.

## ఆధ్యాత్మిక ప్రయోజనాలు

సాంప్రదాయకంగా సూర్యుడిని శక్తి, ఆరోగ్యానికి మూలంగా భావిస్తారు. సూర్య నమస్కారం అనేది సూర్యుడికి కృతజ్ఞత తెలుపుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను పొందడానికి చేసే భక్తి యోగం. ఇది శరీరాన్ని బలోపేతం చేస్తుంది. మనస్సును ప్రశాంతపరుస్తుంది. ప్రతిరోజూ కొంత సమయం కేటాయించడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# ఈ సమస్యలు ఉన్నవారు బాదం తినకపోవడం మంచిది.!

బాదం ఆరోగ్యానికి మంచిదని చాలామంది భావిస్తారు. ముఖ్యంగా శీతాకాలంలో బాదం తినడానికి ఎక్కువగా ఇష్టపడతారు. బాదంలో ఫైబర్, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్-ఇ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కడుపు ఆరోగ్యానికి, ఎముకలకు, జుట్టుకు ఉపయోగపడతాయని చెబుతారు. కానీ, బాదం అందరికీ సరిపోదు. ముఖ్యంగా ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బాదం తినకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

నిపుణుల ప్రకారం, మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్నవారు, జీర్ణ సమస్యలు ఉన్నవారు, అధిక రక్తపోటుకు మందులు వాడుతున్నవారు బాదం తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఎక్కువగా తినడం వల్ల ఆరోగ్యానికి హాని కలగవచ్చు. చాలామందికి బాదం శరీరానికి వేడి ఇవ్వడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఉపయోగపడుతుంది. కానీ, బాదం తిన్న తర్వాత కడుపు నొప్పి, గ్యాస్ లేదా మొటిమలు వస్తే వెంటనే జాగ్రత్త పడాలి.



## ఎందుకు తినకూడదు?

కిడ్నీ సమస్యలు ఉన్నవారు బాదం తినకూడదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే బాదంలో ఫాస్ఫరస్, ఆక్సలేట్ ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారికి బాదం తినడం వల్ల గ్యాస్, పొట్ట ఉబ్బరం, మలబద్ధకం రావచ్చు. అలాగే, బాదం అంటే అలెర్జీ ఉన్నవారు బాదం తింటే తీవ్రమైన అలెర్జీ సమస్యలు రావచ్చు.

## తినకూడదు లేదా తగ్గించాలి?

బాదం తిన్న తర్వాత తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, కడుపు నొప్పి వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. కొన్ని యాంటీబయాటిక్ మందులు వాడుతున్నవారు కూడా బాదం తినకపోవడం మంచిది. ఆరోగ్య సమస్యలు లేని వారు కూడా బాదాన్ని మితంగా మాత్రమే తినాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు 4ఉ5 బాదం తింటే చాలని చెబుతున్నారు. రాత్రంతా నీటిలో నానబెట్టి, ఉదయం తొక్క తీసి తినడం మరింత మంచిదని అంటున్నారు.

# దగ్గు, జలుబుతో బాధపడుతున్నారా? ఈ ఆయుర్వేద చిట్కాలు ట్రై చేయండి.!

శీతాకాలంలో పిల్లలకు జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి ఆరోగ్య సమస్యలు రావడం సాధారణం. వాతావరణ మార్పులు అలర్జీలకు కారణమవుతాయి. గొంతు నొప్పి సమస్య ఆహారం తినడానికి, నీరు తాగడానికి కూడా ఇబ్బందిని కలిగిస్తుంది, కొన్ని సందర్భాల్లో ఇది మాట్లాడటానికి కూడా కష్టతరం చేస్తుంది. చాలా సందర్భాలలో, గొంతు నొప్పి బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. చికిత్సగా యాంటీబయాటిక్స్ ఉపయోగించవచ్చు. అయితే, ప్రతి చిన్న సమస్యకు మందులు తీసుకోవడం మంచిది కాదు. వీటి నుండి త్వరగా ఉపశమనం పొందాలనుకుంటే, ప్రభావవంతమైన ఈ ఇంటి నివారణలను ట్రై చేయవచ్చని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

**జీలకర్ర, ఉప్పు నీటితో నోటిని పుక్కిలించడం:**

జీలకర్ర, ఉప్పు నీటితో నోటిని పుక్కిలించడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని కోసం, 250 ఎక్రీ నీటిలో 1 టీస్పూన్ జీలకర్ర, అర టీస్పూన్ ఉప్పు వేసి 5 నిమిషాలు మరిగించండి. ఈ నీటితో నోరు శుభ్రం చేసుకోవడం ద్వారా గొంతు సమస్యలు తగ్గుతాయని అంటున్నారు.



**తేనె ఉత్తమ పరిష్కారం:**

తేనెను క్రమం తప్పకుండా తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. మీకు గొంతు నొప్పి ఉంటే, దాల్చిన చెక్కతో కలిపి తినవచ్చు. ఇది గొంతు ఇన్ఫెక్షన్‌కు మంచి పరిష్కారాన్ని అందిస్తుంది. తేనెను తీసుకోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి త్వరగా ఉపశమనం లభిస్తుంది. మంటను వెంటనే తగ్గించడంలో సహాయపడుతుంది. అనేక రకాల ఆయుర్వేద వైద్యంలో తేనె మరింత ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు.

**తులసి కషాయం:**

తులసి కషాయం గొంతు ఇన్ఫెక్షన్లకు సమర్థవంతమైన చికిత్స. శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తీవ్రమైన గొంతు నొప్పి, శరీర నొప్పులను నయం చేయడంలో ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఆయుర్వేదంలో తులసికి గొప్ప ప్రాముఖ్యత ఉంది. తులసి కషాయం శరీర ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద నిపుణులు వివరిస్తున్నారు.



# అతిగా ఆహారం.. ఆరోగ్యానికి చేటు

## ఆలస్యంగా తింటే మరింత ముప్పు

## స్పైసీ ఫుడ్‌తో సమస్యలు ఎన్నో..

కాస్త సమయం దొరికితే చాలు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అనుకుంటాం. ఏదైనా మంచి హోటల్‌కు వెళ్లి స్పైసీ ఫుడ్, నాన్ వెజ్ బిర్యానీ ఆరగిద్దామని ప్లాన్ చేసుకుంటాం. అంతేనా.. దాంతో పాటు కేక్‌లు, స్వీట్లు, కూల్‌డ్రింక్‌లు ఇలా పలు రకాల ఆహార పదార్థాలను లాగించేస్తాం. అయితే ఆహారం అతిగా తీసుకుంటే ప్రమాదమేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తీసుకునే ఆహారం ఆరోగ్యానికి చేటు చేస్తుందని హెచ్చరిస్తున్నారు.

## జబ్బులు ఇలా..

ఆహారం ఎక్కువగా తీసుకుంటే జీర్ణకోశానికి సంబంధించిన గ్యాస్ట్రో ఎంటరైటీస్, నాన్ గ్యాస్ట్రోఎంటరైటిస్ ఇబ్బందులు ఎక్కువగా వస్తాయి. ఆహారం కలుషితమైతే అక్యుట్ గ్యాస్ట్రో ఎంటరైటిస్ కు దారితీస్తుంది. దీని వల్ల వాంతులు, విరోచనాలు రావడమే కాక కాలేయం పనితీరు దెబ్బతింటుంది. దీంతో హైపటైటిస్-ఎ, హైపటైటిస్-సి, వైరల్ ఫీవర్ వంటివి దరిచేరుతాయి. అలాగే దీర్ఘకాలిక సమస్యలు వేధిస్తాయి. అంతేకాక ఫ్యాటీ లివర్, అధిక బరువు సమస్యలు దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతాయి.

## తీసుకున్న ఆహారం ఖర్చు కావాలి

మనం ఎన్ని కేలరీల ఆహారం తీసుకున్నప్పటికీ ఆ మొత్తం ఖర్చు కావాలి. అప్పుడే బరువు పెరగకుండా ఉంటుంది. చాలామంది వ్యాయామం చేయకపోవడం వల్ల తీసుకున్న ఆహారం కేలరీల రూపంలో ఖర్చు కావడం లేదు. ఒక వ్యక్తికి సాధారణంగా రోజుకు 2వేల నుంచి 2,500 కేలరీల ఆహారం తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు.

## మిత ఆహారంతోనే మేలు

మిత ఆహారమే మనిషిని ఆరోగ్యంగా ఉంచుతుంది. కొత్త సంవత్సరం కదా.. అని ఎక్కువగా ఆహారం, అల్కాహాల్ తీసుకోవద్దు. ఆయిల్ తక్కువ ఉన్న ఆహారమే తీసుకోవాలి. సరిగ్గా ఉడకని ఆహారం తీసుకోవద్దు. అల్కాహాల్, స్పైసీ ఆహారం తీసుకుంటే మంచినీళ్లు, కొబ్బరినీళ్లు తప్పని సరిగా తీసుకోవాలి. చలికాలంలో ముక్కు నుంచి నీరు కారుతుందో లేదో గమనించాలి. దీని వల్ల బ్యాక్టీరియా వెనకకు వెళ్లి మెదడుకు ఇన్‌ఫెక్షన్ వచ్చే ప్రమాదముంది. గుండె, మధుమేహం, శ్వాసకోశసంబంధిత వ్యాధులున్న వారు జాగ్రత్తగా ఉండాలి. బయటకు వస్తే స్వెటర్లు, తల, ముఖం కవర్ అయ్యేలా మాస్కులు ధరించాలి.



## మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదు!

### అర్ష్‌దీప్ సింగ్‌ను వెనకేసుకొచ్చిన గంభీర్..

**ఢిల్లీ:** అర్ష్‌దీప్ సింగ్ మరియు మిచెల్ మధ్య జరిగిన వాగ్వాదంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అర్ష్‌దీప్ సింగ్.. మిచెల్‌కు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని గంభీర్ స్పష్టం చేశారు. కాగా, ఈ ఘటన టీ20 వరల్డ్‌కప్ 2026 ఫైనల్ సందర్భంగా అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగింది. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సమయంలో మిచెల్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టాడు. ఆ తర్వాత క్రీజ్ బయటకు వచ్చిన మిచెల్‌ను రనౌట్ చేయడానికి అర్ష్‌దీప్ ప్రయత్నించాడు. అయితే బంతి స్టంప్స్‌ను తాకకుండా మిచెల్ తొడను తాకింది. దీంతో ఇద్దరి మధ్య మైదానంలో స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. మ్యాచ్ అనంతరం తాను విసిరిన త్రో ఉద్దేశపూర్వకంగా కాదని అర్ష్‌దీప్ సింగ్ స్పష్టం చేస్తూ మిచెల్‌కు క్షమాపణలు చెప్పాడు.

### గంభీర్ వ్యాఖ్యలు..

ఈ విషయంపై టీమిండియా హెడ్ కోడ్ గౌతమ్ గంభీర్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆడేటప్పుడు ఆటగాళ్లు దూకుడుగా ఉండటం సహజమని అన్నారు. వరుసగా రెండు సిక్సర్లు కొట్టినప్పుడు బౌలర్ నుంచి ప్రతిస్పందన రావడం సాధారణమని చెప్పారు. క్షమాపణ చెప్పకపోయినా ఎలాంటి సమస్య ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగేవని, అయితే ఇప్పుడు సోషల్ మీడియా కారణంగా ప్రతి చిన్న విషయం కూడా పెద్దగా మారుతోందని గంభీర్ వ్యాఖ్యానించారు.

### ఐసీసీ జరిమానా

ఈ ఘటన తర్వాత ఇంటర్నేషనల్‌క్రికెట్‌కౌన్సిల్‌అర్ష్‌దీప్ సింగ్‌పై మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధించింది. అదేవిధంగా ఒక డీమెరిట్ పాయింట్ కూడా ఇచ్చింది. అయితే గత 24 నెలల్లో ఇది మొదటి తప్పు కావడంతో అతనిపై పెద్ద శిక్ష విధించలేదు.



# ఐపీఎల్2026 షెడ్యూల్ రిలీజ్

## మార్చి 28 నుంచి ప్రారంభం

- తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్ హెచ్ హై వోల్టేజ్ పోరు
- హైదరాబాద్‌లో ఒక్క మ్యాచ్ మాత్రమే
- ముంబై, చెన్నై, గువహటి వేదికగా కీలక మ్యాచ్‌లు

**ఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సందడికి సమయం ఆసన్నమైంది. క్రికెట్ ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన ఈ మెగా టోర్నీకి సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన చేసింది. టోర్నీలో భాగంగా మొదటి దశ షెడ్యూల్‌ను అధికారికంగా విడుదల చేసింది. మార్చి 28 నుంచి ప్రారంభం కానున్న ఈ సీజన్‌లో తొలి పోరులోనే అగ్రశ్రేణి జట్లు తలపడనుండటంతో అభిమానుల్లో అప్పుడే ఉత్కంఠ మొదలైంది. ఈ ఏడాది ఐపీఎల్ వేట బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. మార్చి 28న రాత్రి 7:30 గంటలకు జరిగే ప్రారంభ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్ హెచ్) జట్లు తలపడనున్నాయి. గత సీజన్‌లో భారీ స్కోర్లతో సంచలనం సృష్టించిన సన్‌రైజర్స్, ఈసారి తొలి మ్యాచ్‌లోనే ఆర్సీబీతో డిఫెండింగ్ ఛాంపియన్ తో తలపడనుండటం గమనార్హం. కేవలం తొలి 20 మ్యాచ్‌లకు సంబంధించి మాత్రమే షెడ్యూల్‌ను ప్రకటించిన బీసీసీఐ, మిగిలిన దశల వివరాలను త్వరలోనే వెల్లడించనుంది.



TATA IPL 2026 SCHEDULE

| MATCH | DATE | DAY | TIME | VENUE |
|---|---|---|---|---|
| RCB vs SRH | 28-Mar-26 | Sat | Evening | Bengaluru |
| MI vs KKR | 29-Mar-26 | Sun | Evening | Mumbai |
| RR vs CSK | 30-Mar-26 | Mon | Evening | Guwahati |
| PBKS vs GT | 31-Mar-26 | Tue | Evening | Mullanpur |
| LSG vs DC | 1-Apr-26 | Wed | Evening | Lucknow |
| KKR vs SRH | 2-Apr-26 | Thu | Evening | Kolkata |
| CSK vs PBKS | 3-Apr-26 | Fri | Evening | Chennai |
| DC vs MI | 4-Apr-26 | Sat | Afternoon | Delhi |
| GT vs RR | 4-Apr-26 | Sat | Evening | Ahmedabad |
| SRH vs LSG | 5-Apr-26 | Sun | Afternoon | Hyderabad |
| RCB vs CSK | 5-Apr-26 | Sun | Evening | Bengaluru |
| KKR vs PBKS | 6-Apr-26 | Mon | Evening | Kolkata |
| RR vs MI | 7-Apr-26 | Tue | Evening | Guwahati |
| DC vs GT | 8-Apr-26 | Wed | Evening | Delhi |
| KKR vs LSG | 9-Apr-26 | Thu | Evening | Kolkata |
| RR vs RCB | 10-Apr-26 | Fri | Evening | Guwahati |
| PBKS vs SRH | 11-Apr-26 | Sat | Afternoon | Mullanpur |
| CSK vs DC | 11-Apr-26 | Sat | Evening | Chennai |
| LSG vs GT | 12-Apr-26 | Sun | Afternoon | Lucknow |
| MI vs RCB | 12-Apr-26 | Sun | Evening | Mumbai |

సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉన్నప్పటికీ, తాజా షెడ్యూల్ భాగ్యనగర వాసులను కొంత నిరాశకు గురిచేసింది. విడుదలైన మొదటి దశ షెడ్యూల్ ప్రకారం, హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం (ఆర్జీఐఎస్) కేవలం ఒక్క మ్యాచ్‌కు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఏప్రిల్ 5వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు సన్‌రైజర్స్ హైదరాబాద్, లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్జీ) మధ్య ఈ మ్యాచ్ జరగనుంది. హోమ్ గ్రౌండ్‌లో తమ జట్టు ఆటను చూడాలని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది మింగుడుపడని విషయమే అయినప్పటికీ, రెండవ దశ షెడ్యూల్‌లో ఉప్పల్ స్టేడియానికి మరిన్ని మ్యాచ్‌లు కేటాయించే అవకాశం ఉంది.

షెడ్యూల్ ప్రకారం మార్చి 29న ముంబైలోని వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడతాయి. అలాగే మార్చి 30న గువాహటి వేదికగా రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ జరగనుంది. ఏప్రిల్ 5వ తేదీ క్రికెట్ ప్రియులకు డబుల్ ధమాకా అందనుంది. మధ్యాహ్నం హైదరాబాద్‌లో ఎస్ఆర్‌హెచ్ జం ఎల్ఎస్జీ మ్యాచ్ జరుగుతుండగా, అదే రోజు రాత్రి బెంగళూరులో ఆర్సీబీ, చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) జట్ల మధ్య హై-వోల్టేజ్ పోరు జరగనుంది. మొత్తంగా ఏప్రిల్ 12వ తేదీ వరకు జరిగే ఈ మొదటి దశలో అన్ని ప్రధాన జట్లు తమ బలాబలాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నాయి.

# దూబే సాహసం

### మాస్క్ ధరించి.. థర్డ్ ఏసీలో సామాన్యుడిలా ప్రయాణం!



**ఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్‌ను ముచ్చటగా మూడోసారి ముద్దాడి చరిత్ర సృష్టించిన వేళ, టీమ్ ఇండియా స్టార్ ఆల్ రౌండర్ శివమ్ దూబేకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆఖరి ఓవర్లో 24 పరుగులు పిండుకుని, భారత్‌ను విజేతగా నిలిపిన శివమ్ దూబే.. అహ్మదాబాద్ నుంచి ముంబైకి రైలులో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రపంచకప్ గెలిచిన ఉత్సాహంలో దేశమంతా సంబరాలు చేసుకుంటుండగా, ఈ 'వరల్డ్ కప్ హీరో' మాత్రం తన కుటుంబాన్ని చేరుకోవడానికి పడ్డ తపన ఇప్పుడు చర్చనీయాంశమైంది.

### విమానంలో టిక్కెట్లు లేక.. రైలు ప్రయాణం

మ్యాచ్ ముగిసిన తర్వాత తన నాలుగేళ్ల కుమారుడు అయాన్, రెండేళ్ల కుమార్తె మహవిష్‌లను చూడటానికి దూబే ముంబై వెళ్లేందుకు విమాన టిక్కెట్లు ప్రయత్నించగా సీట్లు దొరకలేదు. రోడ్డు మార్గంలో వెళ్లడం కంటే రైలు ప్రయాణం వేగంగా ఉంటుందని భావించి, తన భార్య అంజుమ్‌తో కలిసి సయాజీ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించాలని నిర్ణయించుకున్నారు.

### గుర్తుపట్టకుండా జాగ్రత్తలు:

ప్రపంచకప్ గెలిచిన స్టార్‌ను రైలులో చూస్తే జనం ఎగబడతారని తెలుసు. అందుకే దూబే ఒక పక్కా ప్లాన్ వేశారు. ముఖానికి మాస్క్, తలపై టోపీ, ఫుల్ హ్యాండ్స్ టీ-షర్ట్ ధరించి గుర్తుపట్టకుండా జాగ్రత్త పడ్డారు. స్టేషన్‌లో రద్దీని తట్టుకోవడానికి, రైలు బయలుదేరడానికి సరిగ్గా ఐదు నిమిషాల ముందు కారు దిగి వేగంగా లోపలికి వెళ్లారు. ఆయనకు థర్డ్ ఏసీలో అప్పర్ బెర్త్ దొరికింది. ప్రయాణమంతా ఎవరికీ కనిపించకుండా అక్కడే ఉండిపోయారు. ప్రయాణంలో టికెట్ చెకర్ వచ్చినప్పుడు ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. టికెట్‌పై పేరు చూసి.. "శివమ్ దూబేనా? అంటే ఆ క్రికెటరా?" అని టిటిఈ ఆశ్చర్యంగా అడిగారు. వెంటనే దూబే భార్య అంజుమ్ సమయస్ఫూర్తితో స్పందిస్తూ.. "కాదు కాదు.. ఆయన ఇక్కడికి ఎందుకు వస్తారు?" అని బదులిచ్చి విషయాన్ని దాటవేశారు. అలా ఆ స్టార్ క్రికెటర్ తన గుర్తింపు బయటపడకుండా సురక్షితంగా ముంబై చేరుకున్నారు. "నా స్నేహితులు, కుటుంబ సభ్యులు అంతా ఆందోళన చెందారు. కానీ నా పిల్లలను చూడాలనే ఆత్రుతతో ఈ రిస్క్ తీసుకున్నాను. థర్డ్ ఏసీలో ప్రయాణం ఒక కొత్త అనుభూతిని ఇచ్చింది" అని శివమ్ దూబే తన ప్రయాణం గురించి పంచుకున్నారు.

# పాకిస్తాన్ 114కే పరిమితం



### తొలి వన్డేలో ఆతిథ్య జట్టు చేతిలో ఓటమి

### 8 వికెట్ల తేడాతో ఓడించిన బంగ్లాదేశ్

**మీర్‌పూర్:** మీర్‌పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా స్టేడియంలో జరిగిన సిరీస్‌లోని మొదటి వన్డేలో బంగ్లాదేశ్ 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. టాస్ గెలిచిన ఆతిథ్య జట్టు షాహీన్ షా అఫ్రిది జట్టును ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్యాటింగ్ చేస్తున్నప్పుడు పాకిస్తాన్ మంచి ఆరంభం ఇవ్వడానికి ప్రయత్నించింది, కానీ మొదటి వికెట్ 41 పరుగుల వద్ద సాహిబ్జాదా ఫర్హాన్ (27) రూపంలో పడిపోయింది. జట్టు కోలుకోకముందే, షమిల్ హుస్సేన్ కూడా 4 పరుగులు చేసి పెవిలియన్‌కు తిరిగి వచ్చాడు. దీని తర్వాత, బంగ్లాదేశ్ బౌలర్లు విధ్వంసం సృష్టించడం ప్రారంభించారు. పర్యాటక జట్టు వికెట్లు క్రమం తప్పకుండా పడిపోయాయి. మువాజ్ సదాకత్ 18, మహ్మద్ రిజ్వాన్ 10, సల్మాన్ అలీ ఆఘా 5, హుస్సేన్ తలాత్ 4, అబ్దుల్ సమద్ 0, ఫహీమ్ అష్రఫ్ 37, షహీన్ అఫ్రిది 4, మహ్మద్ వసీం 0, అబ్రార్ అహ్మద్ 0 పరుగులు చేశారు. అందువలన, మొత్తం జట్టు 30.4 ఓవర్లలో 114 పరుగులు మాత్రమే చేయగలిగింది. బంగ్లాదేశ్ బౌలర్ నహిద్ రాణా పాకిస్తాన్‌ను వణికించాడు. 7 ఓవర్లలో 3.42 ఎకానమీ రేటుతో 24 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. మెహదీ హసన్ మీర్జా షహీన్ షా అఫ్రిది జట్టులోని ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లను అవుట్ చేయడం ద్వారా మిగిలిన పనిని పూర్తి చేశాడు. తస్కిన్ అహ్మద్, ముస్తాఫిజుర్ రెహమాన్ తలా ఒక వికెట్ తీశారు. 115 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ పెద్దగా ఇబ్బంది పడలేదు. ఓపెనర్ సైఫ్ హసన్ కేవలం 4 పరుగులకే ఔటైనా, తంజిద్ హసన్ 42 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 67 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. నజ్ముల్ హసన్ శాంటో 27 పరుగులు సాధించాడు. 15.1 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి టార్గెట్ పూర్తి చేశారు.

## టీ20 ర్యాంకింగ్స్‌లోనూ భారత్ డామినేషన్..

### అభిషేక్, ఇషాన్ కిషన్ అరాచకం!

భారత్ టీ20 వరల్డ్ కప్‌లో ఘన విజయం సాధించి మూడోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. మూడోసారి ఐసీసీ టీ20 వరల్డ్ కప్పును కైవసం చేసుకున్న ఏకైక టీమ్‌గా భారత జట్టు నిలిచింది. అంతేకాదు.. ఐసీసీ తాజాగా రిలీజ్ చేసిన అంతర్జాతీయ టీ20 ర్యాంకుల్లోనూ టీమిండియా ప్లేయర్లు చోటు సాధించారు. ఈ మెగా టోర్నీలో మన ఆటగాళ్ల వీరోచిత ప్రదర్శన తాజాగా విడుదలైన టీ20 ర్యాంకింగ్స్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగంలో టాప్-2 స్థానాలను టీమిండియానే కైవసం చేసుకుంది. ఈ సీజన్‌లో తన ఫామ్‌పై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న అభిషేక్ టాప్ 1 స్థానంలోనే కొనసాగుతున్నాడు. ఈ టోర్నీలో 317 పరుగులతో చెలరేగిన ఇషాన్ కిషన్ రెండు స్థానాలు ఎగబాకి సెకండ్ స్థానంలోకి చేరాడు. వీరిద్దరి మధ్య కేవలం నాలుగు రేటింగ్ పాయింట్ల తేడా మాత్రమే ఉంది. ఇక ఈ సీజన్‌లో ఎంతో ప్రతిభ కనబరిచిన సంజు శామ్సన్ 22వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. శివమ్ దూబే 27వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# ది ప్యారడైజ్ ఆయా షేర్ సాంగ్ పాపులర్



## మూవీలో నాని నేపథ్యంపై కాసర్ల ఫీలర్

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రస్తుతానికి 'ది పారడైజ్' అనే సినిమా రూపొందుతోంది. ఈ సినిమాను ఒక పూర్తిస్థాయి రా అండ్ రస్టిక్ సినిమాగా రూపొందిస్తున్నారు మేకర్స్. నాని కెరీర్‌లోనే మొట్టమొదటిసారిగా, ఎప్పుడూ ఊహించని విధంగా ఈ సినిమాలో ఒక రా అండ్ రస్టిక్ పాత్రలో కనిపిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన ప్రతి ప్రమోషనల్ కంటెంట్ బాగా వర్కవుట్ అయింది, ప్రేక్షకులలో అంచనాలు రేకెత్తించింది. ఇక తాజాగా రిలీజ్ అయిన 'ఆయా షేర్' సాంగ్ బాగా ప్రేక్షకులలోకి వెళ్ళింది. ముఖ్యంగా సాంగ్ భిన్నంగా ఉండడంతో, ఈ సాంగ్ వినేందుకు శ్రోతలు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ సాంగ్ రాసిన లిరిక్ రైటర్ కాసర్ల శ్యామ్ మీడియాతో ఈ సాంగ్ విశేషాలు పంచుకున్నారు. అయితే ఈ విశేషాలు పంచుకుంటున్న క్రమంలో ఆయన ఈ సినిమాలో నాని నేపథ్యం గురించి చెప్పుకొచ్చారు. నిజానికి ఈ సినిమాలో నాని ఒక వేశ్యా వాటికలో ఉంటాడని ముందు నుంచి ప్రచారం జరుగుతూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు నాని తెగ పేరును పొరపాటున కాసర్ల శ్యామ్ సంబోధించారు. ఈ తెగ 'సవారి తెగ' అని కాసర్ల శ్యామ్ చెప్పుకొచ్చారు. ఈ సాంగ్ చేయడం తనకు చాలా అదృష్టమని, 'దసరా' తర్వాత తనకు ఈ సినిమా కూడా అంత పేరు తెచ్చే సినిమా అవుతుందని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చారు.



# ప్రభాస్‌తో ఎకో డైరెక్టర్ ఫోటో

## కొత్త మూవీ చర్చలంటూ హల్‌చల్

ప్రస్తుతం సోషల్ మీడియాలో రెబల్ స్టార్ ప్రభాస్ మరియు మలయాళ సెన్సేషనల్ డైరెక్టర్ దిన్‌జిత్ అయ్యతాన్ కలిసి ఉన్న ఒక ఫోటో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫోటో వీరిద్దరి కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కబోతుందనే వార్తలకు బలం చేకురుస్తుంది. ఇటీవల 'కిష్కింధ కాండం' మరియు 'ఏకో' వంటి విభిన్నమైన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన దిన్‌జిత్, స్వయంగా ప్రభాస్‌ను కలిసిన విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ప్రభాస్ ఆతిథ్యాన్ని, ముఖ్యంగా ఆయన వడ్డించిన రుచికరమైన 'ప్రాన్స్ బిర్యానీ'ని ప్రశంసిస్తూ దిన్‌జిత్ పెట్టిన ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది. ముఖ్యంగా ఈ సమావేశం వెనుక హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరగందూర్ ఉండటం గమనార్హం. గతంలోనే హోంబలే సంస్థ ప్రభాస్‌తో మూడు సినిమాల భారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో 'సలార్ 2' కాకుండా, మిగిలిన రెండు చిత్రాల్లో ఒకటి దిన్‌జిత్ దర్శకత్వంలో ఉండే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్ నడుస్తుంది. విలక్షణమైన థ్రిల్లర్లను తెరకెక్కించడంలో దిన్‌జిత్ సిద్ధహస్తుడు కావడంతో, ప్రభాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ఒక సరికొత్త తరహా కథను ఆయన సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రభాస్ 'ఫౌజీ', 'స్పిరిట్' మరియు 'కల్కి 2' వంటి భారీ ప్రాజెక్టులతో ఎంతో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబో ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ ఇద్దరి కలయికతో ఒక డిఫరెంట్ సినిమాను చూడవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు.





# జునైద్ ఖాన్‌తో సాయిపల్లవి జోడీ

## ఏక్ దిన్ ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్, సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందంవిడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.



# పొరపాటు కామెంట్స్

## మహేశ్ అభిమానులకు హరీష్ క్షమాపణలు

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులకు దర్శకుడు హరీష్ శంకర్ క్షమాపణలు చెప్పాడు. 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రమోషన్స్ సమయంలో జరిగిన ఒక చిన్న పొరపాటు ఈ వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ అభిమాని ఒకరు ఎక్స్ వేదికగా ఈ సినిమా మహేష్ బాబు రికార్డులను బద్దలు కొట్టాలనే అర్థం వచ్చేలా ఒక పోస్ట్ చేశారు. దీనికి హరీష్ శంకర్ రిప్లై ఇవ్వడంతో మహేష్ బాబు అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఈ వివాదం ముదరడంతో హరీష్ శంకర్ వెంటనే స్పందిస్తూ వివరణ ఇచ్చారు. షూటింగ్ పనుల్లో మరియు సెన్సార్ కార్యక్రమాల్లో బిజీగా ఉండటం వల్ల ఆ ట్వీట్‌ను పూర్తిగా చదవకుండానే, కేవలం అభిమాని ఉత్సాహాన్ని చూసి పొరపాటున స్పందించానని ఆయన పేర్కొన్నారు. తనకు మహేష్ బాబు అంటే ఎంతో గౌరవమని, గతంలో ఆయన నటించిన 'పోకిరి' సినిమా గురించి కూడా తాను ఎంతో పాజిటివ్‌గా మాట్లాడానని గుర్తుచేశారు. అంతేకాకుండా, రాజమౌళి- మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా పెద్ద రికార్డులు సృష్టించాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. తన రిప్లై వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నానని హరీష్ శంకర్ ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న సమయంలో తాను కావాలని ఇలాంటి వివాదాలు చేసే వ్యక్తిని కాదని ఆయన స్పష్టం చేశారు.

# త్రిష, విజయ్‌లది వ్యక్తిగత వ్యవహారం

## నటి ఖుష్బూ కామెంట్



తమిళ స్టార్ నటుడు, తమిళ వెట్రీ కళగం అధినేత విజయ్ మరియు హీరోయిన్ త్రిషల వ్యక్తిగత జీవితంపై నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఇటీవల చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు విజయ్ త్రిష కలిసి ఒకే కారులో రావడం సోషల్ మీడియాలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విజయ్ భార్య సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారనే వార్తల మధ్య వీరిద్దరూ కలిసి కనిపించడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ వివాదంపై ఖుష్బూ స్పందిస్తూ.. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విషయమని, దానిని భూతద్దంలో చూడాల్సిన అవసరం లేదని పేర్కొంది. విజయ్, త్రిషల వ్యవహారంతో సామాన్య ప్రజలకు ఏం సంబంధం ఉంటుందో తనకు అర్థం కావడం లేదని.. అది వారి పర్సనల్ లైఫ్ అని, దానిని గౌరవించాలని సూచించింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లో చురుగ్గా ఉన్న నేపథ్యంలో ఈ వివాదం ఆయన ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందా? అని అడగ్గా.. ప్రజలు చాలా తెలివైన వారు. ఎవరికి ఓటు వేయాలో వారికి తెలుసు. వ్యక్తిగత జీవితాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదు అని తెలిపింది. నటులైనా, రాజకీయ నాయకులైనా వారు కూడా మనలాగే సాధారణ మనుషులని, వారి ప్రైవసీని దెబ్బతీయడం సరికాదని ఈ సందర్భంగా ఖుష్బూ చెప్పుకొచ్చింది.





CHIEF EDITOR BY KANCHARLA ATCHUTA RAO PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY CHAITANYAVARADHI PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861